

'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం వెల: ₹ 7.00

సంపుటి: 17
సంచిక: 43

ఆదివారం 5-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+32 పేజీల ఆదివారం అనుబంధం | వెల: ₹ 7.00 | సంపుటి: 17 | సంచిక: 43

ఆదివారం 5-5-2024

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

మీ భూమికి భద్రత

హిందూపురం ఎన్నికల ప్రచార సభలో ఏపీ సీఎం జగన్ హామీ

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం

చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటు

మీ భూములకు ప్రభుత్వం గ్యారంటీ.. రిజిస్ట్రేషన్ తర్వాత రైతులకే డాక్యుమెంట్లు

పేదలకు భూములిచ్చేది జగన్.. లాక్కునేది చంద్రబాబే..

7లో





వచ్చే ఐదేళ్లు అవినీతిపై యుద్ధమే

ఎన్డీయే సర్కారు అవినీతిపరుల ముసుగు తొలగించిందని, వచ్చే ఐదేళ్లలో అవినీతిపై యుద్ధం సాగిస్తామని ప్రధాని మోదీ అన్నారు.

- వివరాలు 6లో



కిడ్నాప్ కేసులో రేవణ్ణ అరెస్ట్!

మహిళను కిడ్నాప్ చేసినట్టుగా ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక ఎమ్మెల్యే రేవణ్ణను సిట్ పోలీసులు కస్టడీలోకి తీసుకున్నారు.

- వివరాలు 6లో



మంచిర్యాల బస్సు యాత్రలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

జైళ్లకు భయపడను.. ప్రాణాలైనా బలిపెడతా

తెలంగాణకు అన్యాయం చేస్తే మాత్రం ఊరుకోను

మోదీ నదులెత్తుకుపోతున్నా సీఎంకు కుయ్యి కుట్టు లేదు

మంచిర్యాల రోడ్ షోలో మాజీ సీఎం కేసీఆర్

వివరాలు 2లో

ఈ నెల 8లోగా రైతు భరోసా...

లేకుంటే ముక్కు నేలకు రాస్తా

అర్హులందరికీ అందితే కేసీఆర్ ముక్కు నేలకు రాస్తారా?.. సీఎం రేవంత్‌రెడ్డి సవాల్

ఆగస్టు 15కల్లా రైతుల రుణమాఫీ చేస్తా.. హరీశ్‌రావు రాజీనామా లేఖ రెడీగా ఉంచుకో.. కరెంటు కోతలంటూ కేసీఆర్ కోతల రాయుడిలా మాట్లాడుతున్నారు

తెలంగాణలో ఆయన పని అయిపోయినట్లే!

బీజేపీకి బీఆర్ఎస్ బీ టీమ్‌గా మారింది

కాంగ్రెస్ గెలవకూడదంటూ ఆ రెండు పార్టీల ఉమ్మడి కుట్ర

బీజేపీ గెలిస్తే రిజర్వేషన్ల రద్దు, రాజ్యాంగంలో మార్పులు

కొత్తగూడెం, వనపర్తి జిల్లా కొత్తకోటలో సీఎం ప్రసంగం

సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం/ సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ఈ నెల 8వ తేదీలోగా రైతులందరి ఖాతాల్లో రైతు భరోసా సొమ్ము జమ చేస్తామని.. లేకుంటే 9వ తేదీన అమరవీరుల స్తూపం దగ్గర క్షమాపణ చెప్పి, ముక్కు నేలకు రాస్తానని టీపీసీసీ చీఫ్, సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి చెప్పారు. మరి అర్హులందరికీ రైతు భరోసా

మిగతా 3వ పేజీలో ▶

> **మే 13న ఫైనల్స్**
>
> డిసెంబర్ 3న వచ్చిన ఫలితాలు సెమీ ఫైనల్స్ లాంటివి. ప్రజలు బీఆర్ఎస్‌ను మట్టికరిపించి కాంగ్రెస్‌ను ఆదరించారు. మే 13న తెలంగాణ వర్సెస్ గుజరాత్ టీమ్‌ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరుగుతుంది. ఆ మ్యాచ్‌లో గెలిచి తెలంగాణ చాంపియన్‌గా నిలవాలంటే కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థులను గెలిపించాలి.



కొత్తగూడెం సభలో అభివాదం చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి. చిత్రంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, ఖమ్మం ఎంపీ అభ్యర్థి రఘురాం రెడ్డి

చంద్రబాబు పచ్చి మోసగాడు..

రాజకీయ లబ్ధి కోసం యూటర్న్‌లు తీసుకోవడంలో సిద్ధహస్తుడు

3లో



రాజ్యాంగంలో మార్పు.. రిజర్వేషన్ల రద్దే మోదీ గ్యారంటీలు

'సాక్షి'తో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ



కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పోటీ.. రెండో స్థానం కోసమే!

తెలంగాణలో బీజేపీకే సానుకూల వాతావరణం

'సాక్షి' ఇంటర్వ్యూలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి


- హామీలు అమలు చేయలేకనే.. రేవంత్ దుష్ప్రచారాలు.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు, గాడిద గుడ్డు అంటూ మాట్లాడుతున్నారు
- ప్రధాని స్పష్టత ఇచ్చినా.. బీజేపీపై అవాస్తవాలు ప్రచారం చేస్తున్నారు
- దేవుడిపై ఒట్లు పెడుతూ దొంగ నాటకాలు ఆడుతున్నారు
- నోటికొచ్చిన హామీలివ్వడం కాదు.. రేవంత్‌కు ముందుంది ముసళ్ల పండుగ

కె.రాహుల్

తెలంగాణలో బీజేపీకి పోటీయే లేదని.. రెండో స్థానం కోసం అధికార కాంగ్రెస్, ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ తేల్చుకోవాలని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. రాష్ట్రంలోని 17 సీట్లలో చాలా వరకు బీజేపీ-కాంగ్రెస్ మధ్యే ప్రధాన పోటీ ఉంటుందని.. అక్కడక్కడా బీఆర్ఎస్ తమతో తలపడాల్సి రావచ్చునని వ్యాఖ్యానించారు. గ్యారంటీలను,

మిగతా 8వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వడదెబ్బతో 16 మంది మృతి

ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుగురు..

మృతుల్లో ఎంఈవో, ఒక ఉపాధ్యాయుడు

ఇద్దరు మహిళలు, ఓ శతాధిక వృద్ధుడు

వివరాలు 18లో

నెల ముందే గరిష్టానికి..!

మే నెలాఖరులో ఉండే స్థాయి ఉష్ణోగ్రతలు ఇప్పుడే నమోదు

రాష్ట్రవ్యాప్తంగా 26 ప్రాంతాల్లో 45 డిగ్రీలపైనే ఎండల మంటలు

పలుచోట్ల ఏకంగా 46.8 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు

అన్నిచోట్లా సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల మేర పెరుగుదల

9 జిల్లాల్లో తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం

మరో మూడు రోజులు ఇదే పరిస్థితి ఉంటుందన్న వాతావరణ శాఖ



18లో

షా డీప్‌ఫేక్ ప్రసంగం వీడియో సృష్టికర్త అరెస్టు

ఏఐసీసీ సోషల్ మీడియా జాతీయ సమన్వయకర్త అరుణ్‌రెడ్డిని సూత్రధారిగా తేల్చిన ఢిల్లీ పోలీసులు

5లో



శనివారం మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తాలో జరిగిన రోడ్‌షోలో అభివాదం చేస్తున్న కేసీఆర్‌ను తమ సెల్ ఫోన్లలో బంధిస్తున్న జనం

కౌశిక్‌రెడ్డి ఇంట్లో కేసీఆర్ బస

నేడు ప్రజలతో ఆత్మీయ సమ్మేళనం

వీణవంక (హుజూరాబాద్): మంచిర్యాల జిల్లాలో ఎన్నికల ప్రచారం తర్వాత కేసీఆర్ శనివారం రాత్రి కరీంనగర్ జిల్లా వీణవంకలోని ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి ఇంటికి చేరుకున్నారు. ఇక్కడే రాత్రి బస చేయనున్న మాజీ సీఎం ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు కార్యకర్తలు, ప్రజలతో జరిగే ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొననున్నారు. ఈ మేరకు కౌశిక్‌రెడ్డి ఇంటి పరిసరాల్లో భారీ ఏర్పాట్లు చేశారు. సుమారు 20 వేల మంది పాల్గొనేలా సమీకరణ జరుపుతున్నారు. ఆత్మీయ సమ్మేళనం తర్వాత కౌశిక్‌రెడ్డి ఇంటి నుంచి మెయిన్ రోడ్డు వరకు భారీ ర్యాలీ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. కేసీఆర్ వెంట బీఆర్‌ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినపల్లి వినోద్‌కుమార్ తదితర నేతలు ఉన్నారు.

జైళ్లకు భయపడను.. ప్రాణాలైనా బలి పెడతా

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల: జైళ్లకు భయపడనని, ప్రాణాలైనా బలిపెట్టి పోరాడుతా కానీ తెలంగాణకు అన్యాయం చేస్తే మాత్రం ఊరుకోనని బీఆర్‌ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ స్పష్టం చేశారు. తెలంగాణకు కొంగు బంగారమైన సింగరేణిని ప్రైవేటీకరించాలని కాంగ్రెస్, బీజేపీ చూస్తున్నాయని చెప్పారు. తెలంగాణ హక్కులు కాపాడుకునేందుకు పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ ఎంపీలను గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని చెప్పారు. శనివారం సాయంత్రం మంచిర్యాల పట్టణం ఐబీ చౌరస్తాలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన మాట్లాడారు.

మోదీ గోదావరిని ఎత్తుకపోతుండు

'గోదావరి నదిని ప్రధాని మోదీ ఎత్తుకొనిపోతున్నాడు. అన్యాయం చేస్తామంటున్నాడు. ఊకుందామా? కృష్ణానదిని అప్పగించినా ఈ ముఖ్యమంత్రికి కుయ్యి, కుట్కు లేదు. గోదావరిని తమిళనాడుకు అప్పగిస్తే నోరు తెరుస్తలేదు. అడ్డగోలుగా మాట్లాడుతూ గుడ్లు పీకుతా, పేగులు మెడలేసుకుంటా, లాగుల తొండలు జొర్రగొడుతా, జైల్లో వేస్తా అంటున్నాడు. చావు నోట్లో తలబెట్టి తెలంగాణ తెచ్చిన. ఈ జైళ్లకు నేను భయపడతానా? భయపడితే ఈ రాష్ట్రమొచ్చేదా?' అని కేసీఆర్ ప్రశ్నించారు.

శిఖలు పట్టుకుని కొట్టుకుంటున్నారు

'రాష్ట్రంలో కరెంట్ కోతలు మొదలయ్యాయి. కరెంట్ లేక లక్షల ఎకరాల్లో పంటలు ఎండిపోయాయి. కరెంటు ఎందుకు పోతోంది. పట్టణాల్లో ఒక రూపాయికే పరిశుభ్రమైన నీరు, రైతుబంధు, బీమా, కల్యాణలక్ష్మి ఎందుకు రావడం లేదు? విదేశీ విద్యా రుణం లేదు.. మెడికల్ కాలేజీల పరిక్షషన్లు లేవు. వసతిగృహాల్లో విద్యార్థులు కలుషితాహారంతో చనిపోతున్నారు. నాలుగు నెలల దాకా వచ్చినవన్నీ ఇప్పుడు యాడికి పోయినయి. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్లు, సీఎంఆర్‌ఎఫ్ ఏడపాయె. రైతులకు బోనస్ రూ.500, తులం బంగారం, మహిళలకు రూ.2,500 ఇవ్వలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఫ్రీ బస్సులు పెడితే ఆడవాళ్లు శిఖలు పట్టుకుని కొట్టుకుంటున్నారు. ఆటో కార్మికులు ఆగమయ్యారు. ఆత్మహత్యలు చేసుకుంటున్నారు.

తెలంగాణకు అన్యాయం చేస్తే మాత్రం ఊరుకోను

మంచిర్యాల రోడ్ షోలో మాజీ సీఎం కేసీఆర్

- సింగరేణి ప్రైవేటీకరణకు బీజేపీ, కాంగ్రెస్ యత్నం
- మోదీ నదులెత్తుకుపోతున్నా ముఖ్యమంత్రికి కుయ్యి కుట్కు లేదు
- అడ్డగోలుగా మాట్లాడుతూ గుడ్లు పీకుతా, జైల్లో వేస్తా అంటున్నడు
- చావు నోట్లో తలబెట్టి తెలంగాణ తెచ్చిన.. భయపడితే ఈ రాష్ట్రమొచ్చేదా?
- నాలుగు నెలల దాకా వచ్చినవన్నీ ఇప్పుడు యాడికి పోయినయి
- మోదీది ఉత్త 'గ్యాస్' కంపెనీ తప్ప మరేం లేదు
- మోసపోయి గోసపడొద్దు..బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష

ముఖ్యమంత్రి మాత్రం నోటికి ఏది వస్తే అది చెబుతున్నారు. ఏ ఊరికి పోతే ఆ ఊరి దేవుడిపై ఒట్లు పెడుతున్నారు. రుణమాఫీ చేయాలని అడిగితే డిసెంబర్ 9, వంద రోజులు, ఆగస్టు 15 అంటున్నారు..' అని మాజీ సీఎం ధ్వజమెత్తారు.

కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా చేస్తున్నారు

'మేం పల్లెలు, పట్టణాలను అభివృద్ధి చేసినం. ఇప్పుడు హరితహారాల్లో చెట్లు ఎండిపోతున్నాయి. క్రీడా ప్రాంగణాల్లో చెట్లు మొలుస్తున్నాయి. పంచాయతీలు, మున్సిపాలిటీల్లో చెత్త పేరుకుపోతోంది. బీఆర్‌ఎస్ పనులన్నీ నిలిపివేశారు. కేసీఆర్ ఆనవాళ్లు లేకుండా ముఖ్యమంత్రి చేస్తున్నారు. ఇప్పుడు పంటలను కొనే దిక్కులేదు. ఐదెకరాలకే రైతుబంధు అంటున్నారు. ఆరు, ఏడు ఎకరాలు ఉన్నవాళ్లు ఏం పాపం చేశారు?' అని కేసీఆర్ నిలదీశారు.

బీజేపీకి ఓటేస్తే గోదాట్లో వేసినట్లే..

'నరేంద్ర మోదీ నా మెడపై కత్తిపెట్టి ఆస్ట్రేలియా బొగ్గు కొనాలన్నా నేను కొనలే. కానీ ఈ ముఖ్యమంత్రి దావోస్, స్విట్జర్లాండ్ వెళ్లి మాట ముచ్చట చేసుకుని వచ్చాడు. మోదీ పదేళ్ల కిందట గెలిచినప్పుడు ఇంటికి పదిహేను లక్షలు ఇస్తానన్నాడు. ఇవ్వలేదు. బేటీ బచావో బేటీ పఢావో, సబ్ కా సాత్ సబ్ కా వికాస్.. ఏదీ జరగలేదు. మోదీది అంతా ఉత్త 'గ్యాస్' కంపెనీ తప్ప మరేం లేదు. కాంగ్రెస్ అన్నిట్లో వైఫల్యం చెందింది. బీజేపీతోటి ఒరిగిందేమీ లేదు. బీజేపీకి ఓటు వేస్తే గోదావరిలో వేసినట్లే. బీఆర్‌ఎస్‌తోనే తెలంగాణకు శ్రీరామరక్ష. మోసపోయి, గోసపడొద్దు..' అని బీఆర్‌ఎస్ అధినేత కోరారు.

మంచిర్యాల జిల్లా ఉండాలా? పోవాల్నా?

'పాత ఆదిలాబాద్‌లో కొత్తగా మంచిర్యాల, నిర్మల్, ఆసిఫాబాద్ జిల్లాలు ఏర్పాటు చేస్తే ఎలక్షన్ తెల్లారే ముఖ్యమంత్రి ఆ కొత్త జిల్లాలను రద్దు చేస్తామంటున్నారు. మంచిర్యాల జిల్లా ఉండాలా? పోవల్నా? ఇక్కడ ఆగర్భ శ్రీమంతుడు, భూగర్భ కార్మికుడు పోటీలో ఉన్నారు. కార్మికుడు గెలవాలా? శ్రీమంతుడు గెలవాల్నా? జిల్లా ఉండాలంటే ఎంపీగా కొప్పుల ఈశ్వర్ గెలవాలి. ఈశ్వర్ 26 ఏళ్లు కార్మికుడిగా పని చేశారు. బ్యాలెట్ యుద్ధంలో మంచిర్యాల గుండెను చీల్చి ఈశ్వర్‌ను గెలిపించాలి..' అని కేసీఆర్ విజ్ఞప్తి చేశారు. ఈ రోడ్ షోలో మాజీ ఎమ్మెల్యేలు బాల్క సుమన్, దుర్గం చిన్నయ్య, దివాకర్‌రావు, పుట్ట మధు, నాయకులు విజిత్‌రావు పాల్గొన్నారు.



గోదావరికి కేసీఆర్ పూజలు

చీరసారె సమర్పించి మొక్కులు

గోదావరిఖని: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ శనివారం రాత్రి పెద్దపల్లి జిల్లా గోదావరిఖని సమీపంలోని గోదావరి నదికి పూజలు నిర్వహించారు. బస్సుయాత్రలో పాల్గొనడానికి శుక్రవారం సాయంత్రం హెలికాప్టర్‌లో గోదావరిఖని చేరుకున్న కేసీఆర్.. స్థానిక ప్రధాన చౌరస్తాలో ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. అనంతరం సింగరేణి ఇల్లెందు అతిథి గృహంలో బస చేశారు. శనివారం సాయంత్రం వరకు అక్కడే సేదదీరిన కేసీఆర్.. బస్సుయాత్ర కోసం మంచిర్యాల బయల్దేరి వెళ్లారు. మార్గమధ్యలో గోదావరినది వంతెన వద్ద కాన్వాయ్ ఆపారు. గోదావరి నదిలో పూలు జల్లి పూజలు చేసి.. చీరసారె సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. కేసీఆర్ వెంట మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్ తదితరులున్నారు. మంచిర్యాలలో బస్సుయాత్ర ముగించుకున్న తర్వాత కేసీఆర్ గోదావరిఖనిలో కాసేపు ఆగారు. పోలీస్‌హౌసింగ్ బోర్డు మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ నివాసానికి చేరుకుని కాసేపు విశ్రాంతి తీసుకున్నారు. దామోదర్ కుటుంబ సభ్యులతో ముచ్చటించి తేనీటివిందు స్వీకరించారు. అనంతరం రోడ్డు మార్గం ద్వారా కరీంనగర్ బయలుదేరి వెళ్లారు.

చిల్లర మాటలు.. ఉద్దెర పనులు

సీఎం రేవంత్‌పై కేటీఆర్ ధ్వజం

- మోసపోతే గోస పడతామని కేసీఆర్ ముందే చెప్పారు
- రాష్ట్రంలో కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. రైతుబంధు లేదు
- రేవంత్‌రెడ్డి ఛోటే భాయ్.. మోదీ బడే భాయ్
- చెయ్యి విరగాలి.. పువ్వు వాడాలి.. కారు జోరు కొనసాగాలి
- సిరిసిల్ల, మల్కాజిగిరి, కంటోన్మెంట్‌లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రచారం



కుత్బుల్లాపూర్‌లోని షాపూర్‌లో ఎన్నికల ప్రచార సభలో ప్రజలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న కేటీఆర్

సిరిసిల్ల/సుభాష్‌నగర్, రసూల్‌పుర (హైదరాబాద్): సీఎం రేవంత్‌రెడ్డి పాలన చిల్లర మాటలు.. ఉద్దెర పనులు అన్నట్లుగా ఉందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కె.తారక రామారావు విమర్శించారు. 'మోసపోతే గోస పడతామని కేసీఆర్ ముందే చెప్పారు.. ఇప్పుడు కరెంట్ లేదు.. నీళ్లు లేవు.. బతుకమ్మ చీరలు లేవు.. రైతుబంధు లేదు. కాంగ్రెస్ ప్రభుత్వం రాకతో దరిద్రం అడుగుపెట్టినట్లు అయ్యింది..' అని ధ్వజమెత్తారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌కు 10 నుండి 12 సీట్లు ఇస్తే ఆరు నెలల నుండి సంవత్సరం లోపే కేసీఆర్ రాష్ట్ర రాజకీయాన్ని శాసించే రోజు వస్తుందని చెప్పారు. కేటీఆర్ శనివారం సిరిసిల్లలో, హైదరాబాద్ శివారు కుత్బుల్లాపూర్‌లోని షాపూర్, నగరంలోని కంటోన్మెంట్ ఏరియాలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

హామీలేమో కానీ లూటీలు షురూ

కేసీఆర్ ప్రభుత్వంలో కరెంటు కష్టాలు లేవని, ప్రస్తుతం హైదరాబాదులో కరెంటు కోతలు ప్రారంభమై ఎక్కడ చూసినా వాటర్ ట్యాంకర్లు, జనరేటర్లు కనపడుతున్నాయని కేటీఆర్ మండిపడ్డారు. ప్రతి మహిళకు రూ.2,500, పెన్షన్ రూ.4 వేలు ఇస్తామని, రూ.2 లక్షల వరకు రుణమాఫీ చేస్తానని మోసపు హామీలు ఇచ్చి రేవంత్‌రెడ్డి ఓట్లు వేయించుకున్నాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు రుణమాఫీకి తేదీలు మార్చుతున్నాడని, ఆరు గ్యారంటీల్లో ఐదు అమలు చేశామని తప్పుడు ప్రకటనలు ఇస్తున్నాడని విమర్శించారు. కల్యాణలక్ష్మి కింద రూ.లక్షతో పాటు తులం బంగారం ఇస్తామని హామీ ఇచ్చారని, నాలుగు నెలల్లో లక్ష పెళ్లిళ్లు అయ్యి లక్ష తులాల బంగారం రేవంత్ బాకీ పడ్డాడని అన్నారు. గ్యారంటీల అమలు పక్కన పెడితే కాంగ్రెసోళ్లు లూటీలు చేయడం చాలూ అయ్యిందని, లూటీ చేయడం కాంగ్రెస్ వాళ్లకు వెన్నతో పెట్టిన విద్య అని విమర్శించారు. కొత్త పరిశ్రమలు తేవడం ఏమో కానీ ఉన్న పరిశ్రమలు గుజరాత్, చెన్నై తరలిపోతున్నాయన్నారు. ప్రభుత్వ ఆర్డర్లు లేక నేతన్నలు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కొత్త జిల్లాలపై స్పష్టత ఇవ్వాలి

పరిపాలన సౌలభ్యం కోసం 10 జిల్లాలను 33 జిల్లాలుగా మార్చుకున్నామని, కొన్ని జిల్లాలకు జయశంకర్ (భూపాలపల్లి), కొమురంభీం (ఆసిఫాబాద్) లాంటి మహానుభావుల పేర్లు పెట్టుకున్నామని కేటీఆర్ గుర్తు చేశారు. కానీ కొత్త జిల్లాలు రద్దు చేయాలని ప్రభుత్వం భావిస్తోందని, 33 జిల్లాల్లో ఏ జిల్లాలను ఉంచుతారో, ఏ జిల్లాలను తొలగిస్తారో స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు.

బీజేపీని నమ్మి మోసపోవద్దు

కొందరు దేవుడి పేరిట రాజకీయాలు చేస్తున్నారని, తెలంగాణలో కేసీఆర్ ఆధునిక దేవాలయాలైన జలాశయాలను నిర్మించి వాటికి దేవుళ్ల పేర్లు పెట్టారని కేటీఆర్ చెప్పారు. యాదాద్రిని కట్టించిన కేసీఆర్ ఏనాడూ దేవుడి పేరును ఓట్లకు వాడుకోలేదని అన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఛోటే భాయ్.. ప్రధాని మోదీ బడే భాయ్ అని ఎద్దేవా చేశారు. రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ ఇంతవరకు ఏమీ చేయలేదన్నారు. పదేళ్లలో హైదరాబాద్‌కు రూపాయి ఇవ్వలేని బీజేపీకి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ప్రజల్లో మతం చిచ్చుపెట్టే బీజేపీని నమ్మి మోసపోవద్దని కోరారు. 'రాష్ట్రంలో చెయ్యి విరగాలి.. పువ్వు వాడాలి.. కారు జోరు కొనసాగాలి..' అని కేటీఆర్ కోరారు. పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, కంటోన్మెంట్‌లో ఐదుసార్లు దివంగత ఎమ్మెల్యే సాయన్నను ఆదరించినట్లుగానే ఈసారి జరిగే ఎన్నికల్లో సాయన్న బిడ్డ నివేదితను ఆదరించి గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఒకే ఏడాదిలో తండ్రిని, చెల్లిని కోల్పోయి పుట్టెడు దుఃఖంలో ఉన్న నివేదితను గుండెల్లో పెట్టుకోవాలని కోరారు. ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు, ఎమ్మెల్యేలు కేపీ వివేకానంద, మర్రి రాజశేఖర్ రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జెడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, మల్కాజిగిరి పార్లమెంట్ అభ్యర్థి రాగిడి లక్ష్మారెడ్డి, కంటోన్మెంట్ అసెంబ్లీ అభ్యర్థి నివేదిత తదితరులు ప్రచారంలో పాల్గొన్నారు.



సిరిసిల్ల పాత బస్టాండ్‌లో ప్రయాణికులతో కరచాలనం చేస్తున్న మాజీ మంత్రి కేటీఆర్.

మిమ్మల్ని ఎన్నిసార్లు చెప్పుతో కొట్టాలి

- 50 ఏళ్లలో వందసార్లు రాజ్యాంగాన్ని మార్చిన చరిత్ర కాంగ్రెస్‌ది..
- ఫోన్ ట్యాపింగ్ పైసలతో కార్పొరేటర్లను కాంగ్రెస్ కొంటోంది
- ఒక్కో కార్పొరేటర్ బ్యాంకు ఖాతాలో రూ.5 లక్షలు జమ
- కొత్తపల్లి బహిరంగ సభలో బండి సంజయ్ వ్యాఖ్యలు



రోడ్‌షోలో మాట్లాడుతున్న ఎంపీ అభ్యర్థి సంజయ్‌కుమార్

కరీంనగర్ టౌన్: 'సీఎం రేవంత్‌రెడ్డి గోబెల్స్ వారసుడు.. రిజర్వేషన్ల రద్దు చేయబోతోందంటూ బీజేపీపై విషప్రచారం చేస్తుండు.. లౌకిక పదాన్ని తొలగిస్తామన్నందుకు బీజేపీ నేతలను ఏ చెప్పుతో కొట్టాలంటున్నడు.. నేనడుగుతున్నా... 50 ఏళ్ల కాంగ్రెస్ పాలనలో వంద సార్లకుపైగా రాజ్యాంగాన్ని మార్చిన కాంగ్రెస్ నేతలను ఎన్నిసార్లు చెప్పుతో కొట్టాలి?' అని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంనగర్ అభ్యర్థి బండి సంజయ్‌కుమార్ ప్రశ్నించారు. కరీంనగర్ జిల్లా కొత్తపల్లిలో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్‌షోలో మాట్లాడారు. అధికారంలోకి వస్తే 'సెక్యులర్' పదాన్ని తొలగిస్తామని బీజేపీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్ అంటే... రేవంత్‌రెడ్డి ఇష్టమొచ్చినట్లు మాట్లాడుతున్నారని ధ్వజమెత్తారు. రేవంత్‌కి సవరణకు, పూర్తిగా మార్చేయడానికి తేడా కూడా తెల్వదని ఎద్దేవా చేశారు. 'రిజర్వేషన్లను రద్దు చేసే ప్రసక్తే లేదనీ, ఇకపై రిజర్వేషన్లను రద్దు చేస్తారని ఎవరైనా అంటే చీపురు, చెప్పులతో ఉరికించి కొట్టండని బండి సంజయ్ పిలుపునిచ్చారు.

కార్పొరేటర్లను పశువుల్లా కొంటున్నారు

ఫోన్ ట్యాపింగ్ సొమ్ముతో కరీంనగర్‌లో కార్పొరేటర్లను సంతలో పశువుల్లా కొంటున్నారని బండి ధ్వజమెత్తారు. ఒక్కో కార్పొరేటర్‌కు 20 లక్షలు ఇస్తే.. అందులో రూ.5లక్షలు బ్యాంకు ఖాతాలో జమచేసినట్లు చర్చ సాగుతోందని, వెంటనే బ్యాంక్ లావాదేవీలపై ఎన్నికల సంఘం విచారణ చేపట్టాలన్నారు. కరీంనగర్ అభివృద్ధికి రూ.12వేల కోట్లు తీసుకొచ్చానని, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ అభ్యర్థులు మీ కోసం ఏం చేశారని ప్రశ్నించారు. 'మీ కోసం కొట్లాడింది మేం. మీ కోసం జైలుకు పోయింది మేం. నాపైన 109 కేసులు పెట్టినా భయపడలే. మరీ కాంగ్రెస్‌కు ఓటేయడం ఎంత వరకు న్యాయం?' అని ప్రజలనుద్దేశించి ప్రశ్నించారు.

విజన్.. ఇజం లేని పార్టీ కాంగ్రెస్

కరీంనగర్‌లో ప్రజ్ఞాభారతి ఆధ్వర్యంలో నిర్వహించిన 'ప్రగతి పథంలో భారతదేశం' సదస్సులో బండి సంజయ్ మాట్లాడుతూ దేశ భవిష్యత్, భద్రత విషయంలో స్పష్టమైన విజన్ ఉన్న మహానేత మోదీ అని కొనియాడారు. విజన్‌తో పాటు ఇజం కూడా లేని పార్టీ కాంగ్రెస్సేనన్నారు. ప్రధాని అభ్యర్థి ఎవరో చెప్పలేని కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. మోదీ పదేళ్ల పాలనలో ఇప్పుడు దేశం ఏ విధంగా ఉందో.. కాంగ్రెస్ పాలనలో దేశం పరిస్థితి ఎట్లుండేదో విశ్లేషించి ప్రజల ముందుంచాలని మేధావి వర్గానికి విజ్ఞప్తి చేశారు.

రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం

- రివర్స్ గేర్ కాంగ్రెస్ నుంచి జనం మార్పు కోరుకుంటున్నారు
- రాష్ట్ర ప్రయోజనాల కోసం బీఆర్‌ఎస్ గెలవాలనుకుంటున్నారు
- మీట్ ది ప్రెస్‌లో మాజీ మంత్రి హరీశ్‌రావు
- చెరో 8 ఎంపీ సీట్లూ గెలుచుకునేలా కాంగ్రెస్, బీజేపీల మధ్య చీకటి ఒప్పందం
- రేవంత్‌కు ఆంధ్రా మూలాలు.. ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



మీట్ ది ప్రెస్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి హరీశ్‌రావు

సాక్షి, హైదరాబాద్: పార్లమెంటు ఎన్నికల సందర్భంగా రాష్ట్రంలో నిశ్శబ్ద విప్లవం వస్తోందని బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే, మాజీ మంత్రి టి.హరీశ్‌రావు చెప్పారు. రివర్స్ గేర్‌లో వెళ్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి ప్రజలు మార్పు కోరుకుంటున్నారని అన్నారు. తెలంగాణ ప్రయోజనాలు కాపాడుకునేందుకు బీఆర్‌ఎస్ గెలవాలని వారు భావిస్తున్నారని వివరించారు. రాష్ట్రంలో చెరో 8 లోక్‌సభ స్థానాలు గెలుచుకునేలా కాంగ్రెస్, బీజేపీ చీకటి ఒప్పందం చేసుకున్నాయని ఆరోపించారు. ఆంధ్రా మూలాలు కలిగిన సీఎం రేవంత్‌రెడ్డి విషయంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. శనివారం హైదరాబాద్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు పలు కీలక వ్యాఖ్యలు చేశారు.

ఢిల్లీకి మూటలు పంపడంపైనే శ్రద్ధ

'సీఎం రేవంత్ చెప్తున్న ప్రజాపాలన ఫార్స్‌గా మారింది. ఆరు గ్యారంటీలపై కాంగ్రెస్ ఇచ్చిన బాండ్ పేపర్లు బౌన్స్ అయ్యాయి. హామీల అమలుపై ప్రశ్నిస్తే ఓ వైపు దూషిస్తూ, మరోవైపు ఒట్లు పెడుతున్నారు. ప్రజలను నిరంతరం మోసగించడం సాధ్యం కాదనే విషయం గ్రహించి కేసీఆర్‌ను దుర్భాషలాడుతున్నారు. ఢిల్లీకి మూటలు పంపడంలో ఉన్న శ్రద్ధ హామీల అమలు, పరిపాలనపై లేదు. రాష్ట్రంలో పాలనకు బదులుగా పగలు, ప్రతీకారాలు నడుస్తున్నాయి. పాలన వికేంద్రీకరణ కోసం ఏర్పాటు చేసిన జిల్లాలను రద్దు చేయడం తిరోగమన ఆలోచన. ప్రజాపాలనలో వచ్చిన 3.50 లక్షల దరఖాస్తుల పరిష్కారంపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలి..' అని హరీశ్ డిమాండ్ చేశారు.

ఉమ్మడి రాజధానికి రేవంత్ సహకరించే చాన్స్

'హైదరాబాద్‌ను ఉమ్మడి రాజధానిగా కొనసాగించాలని సమైక్య వాదులు కోరుతున్నారు. ఆంధ్రా మూలాలు కలిగిన రేవంత్‌రెడ్డి దానికి సహకరించే అవకాశముంది. గతంలో ఏడు మండలాలను ఏపీలో విలీనం చేయడంలో బీజేపీ, కాంగ్రెస్‌దే ప్రధాన పాత్ర. తెలంగాణ ప్రయోజనాలను కాపాడటం బీఆర్‌ఎస్ పార్టీతోనే సాధ్యం. కేసీఆర్ బస్సు యాత్రకు ప్రజల్లో ఆదరణ లభిస్తోంది. ఎన్ని కుట్రలు చేసినా బీజేపీ, కాంగ్రెస్ కంటే బీఆర్‌ఎస్ పార్టీకే ఎక్కువ సీట్లు వస్తాయి. కేంద్రంలో సంకీర్ణ ప్రభుత్వం వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ సీట్లలో గెలిపిస్తే బీఆర్‌ఎస్ కీలకంగా మారుతుంది..' అని హరీశ్‌రావు చెప్పారు.

రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతీస్తున్న రేవంత్

'రాష్ట్రం దివాలా తీసిందంటూ సీఎం చేస్తున్న వ్యాఖ్యలతో రాష్ట్ర ప్రయోజనాలు దెబ్బతింటున్నాయి. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ లేకపోతే అభివృద్ధి, పెట్టుబడుల సాధన, ఉద్యోగాల కల్పన ఎలా సాధ్యం? రేవంత్ తీరుతో పెట్టుబడుదారులు పునరాలోచనలో పడుతున్నారు. ప్రతిపక్షాల గొంతు నొక్కడమే పనిగా పెట్టుకున్న రేవంత్ బీఆర్‌ఎస్ సోషల్ మీడియా కార్యకర్తలను వేధిస్తూ కేసులు పెడుతున్నారు..' అని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.

తెలంగాణకు బీజేపీ చేసిందేమీ లేదు

'దేవుడు పేరు చెప్పి ఓట్లు అడుగుతున్న బీజేపీ తెలంగాణకు చేసిందేమీ లేదు. మెడికల్, నర్సింగ్ కాలేజీలు, రైల్ కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు కర్మాగారం సహా ఏదీ ఇవ్వలేదు. బీజేపీ ఆదానీని మాత్రం ప్రపంచ కుబేరుల్లో అగ్రస్థానంలో నిలబెట్టింది. నల్ల చట్టాలతో రైతులపై దాడులు, ఎస్సీ వర్గీకరణ, పెట్రో ఉత్పత్తుల ధరల పెంపు వంటి అనేక అంశాలు బీజేపీ వైఫల్యాలకు అద్దం పడుతున్నాయి. యాదాద్రి ఆలయాన్ని అద్భుతంగా నిర్మించిన కేసీఆర్ ఆధ్యాత్మికలో బీజేపీ కంటే రెండు అడుగులు ముందే ఉన్నారు..' అని మాజీమంత్రి స్పష్టం చేశారు.

అబద్ధాలు ఆడటంలో రేవంత్‌కి ఆస్కార్ ఇవ్వొచ్చు: పొన్నాల



సాక్షి, హైదరాబాద్: ఓట్లే ధ్యేయంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు నాటకాలు ఆడుతున్నాయని మాజీ మంత్రి, బీఆర్‌ఎస్ నేత పొన్నాల లక్ష్మయ్య అన్నారు. శనివారం ఆయన తెలంగాణ భవన్‌లో విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ దేవుడు గుడులు అంటే... ఇచ్చిన హామీలు నెరవేర్చుతానని సీఎం రేవంత్‌రెడ్డి దేవుళ్ల మీద ఒట్లు వేసుకుంటున్నారని ధ్వజమెత్తారు. అబద్ధాలు ఆడటంలో ముందు వరసలో ఉన్న రేవంత్‌రెడ్డికి ఆస్కార్ అవార్డు వస్తుందని, 100 రోజుల్లో ఆరు గ్యారంటీల హామీల అమలులో ఒకటి, రెండు తప్ప మిగిలిన ఒక్క హామీ అమలు చేయడం లేదని పొన్నాల ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండానే మరోసారి ఓట్ల కోసం ప్రత్యేక మేనిఫెస్టోతో అబద్ధాలు ప్రచారం చేస్తోందని ఆరోపించారు. ఓట్ల కోసం రామమందిరాన్ని బీజేపీ అస్త్రంగా వాడుకుంటోందని పొన్నాల విమర్శించారు.

ఈ నెల 8లోగా రైతు భరోసా..

లేకుంటే ముక్కు నేలకు రాస్తా


కొత్తకోటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న రేవంత్‌రెడ్డి. చిత్రంలో వంశీచంద్‌రెడ్డి



▶ మొదటి పేజీ తరువాయి

సొమ్ము అందితే కేసీఆర్ ముక్కు నేలకు రాస్తారా అని సవాల్ చేశారు. ఆగస్టు 15 నాటికల్లా రైతుల రుణమాఫీ చేస్తామని.. హరీశ్‌రావు ఎమ్మెల్యే పదవికి రాజీనామా లేఖ రెడీ పెట్టుకోవాలన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే.. రాజ్యాంగాన్ని మార్చి, రిజర్వేషన్లను రద్దు చేస్తుందని ఆరోపించారు. ఈ నెల 13న తెలంగాణ వర్సెస్ గుజరాత్ టీమ్ మధ్య ఫైనల్స్ జరగనున్నాయని.. తెలంగాణ చాంపియన్‌గా నిలవాలంటే కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కొత్తగూడెంలో నిర్వహించిన బహిరంగ సభ, వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లలో రేవంత్ ప్రసంగించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

''మాజీ సీఎం కేసీఆర్ రాష్ట్ర ఖజానా మీద రూ.ఏడు లక్షల కోట్లు అప్పులు చేసి వెళ్లారు. ఈరోజు ఆయన రైతు భరోసా ఇవ్వలేదంటూ విమర్శలు చేస్తున్నారు. మేం రైతు భరోసా స్కీంను డిసెంబర్‌లోనే మొదలుపెట్టాం. రాష్ట్రంలో మొత్తం 69 లక్షల మంది రైతులు ఉండగా.. ఇప్పటికే 65 లక్షల మంది ఖాతాల్లో రైతు భరోసా జమ చేశాం. మిగతా 4 లక్షల మంది ఖాతాల్లో ఈనెల 8వ తేదీలోగా రైతుబంధు తప్పకుండా జమ చేస్తాం. ఏ ఒక్క రైతు ఖాతాలోనైనా రైతుబంధు జమ కాలేదని నిరూపిస్తే.. అమరవీరుల స్తూపం దగ్గర ముక్కు నేలకు రాసి తెలంగాణ సమాజానికి క్షమాపణ చెబుతా. అర్హులందరికీ రైతు బంధు అందితే కేసీఆర్ ముక్కు నేలకు రాసి క్షమాపణ చెప్పాలి. సిద్ధమా? రాష్ట్రంలో కరెంటు కోతలంటూ కేసీఆర్ కోతలరాయుడిలా మాట్లాడుతున్నాడు. తెలంగాణలో ఆయన పని అయిపోయింది. దింపుడు కల్లం ఆశలు పెట్టుకోవడం కూడా వృథా.

హరీశ్ రాజీనామాతో రెడీగా ఉండు..

బీఆర్ఎస్ పాలనలో 2014లో రుణమాఫీ చేస్తామని చెప్పి ఏడేళ్లయినా ఇవ్వలే. తునకలుగా ఇస్తే ఆ పైసలు మిత్తికి కూడా చాలలేదు. నేను అలా సోయి లేనోడిని కాదు. కురుమూర్తి స్వామి సాక్షిగా చెప్తున్నా.. ఆగస్టు 15 నాటికి రైతుల రుణమాఫీ చేస్తా. హరీశ్.. ఎమ్మెల్యే పద వికి రాజీనామా లేఖ జేబులో పెట్టుకుని సిద్ధంగా ఉండు. రైతులకు బాకీల నుంచి, బ్యాంకుల నుంచి స్వాతంత్ర్యం ఇప్పిస్తా.. సిద్దిపేటకు నీ నుంచి విముక్తి కల్పిస్తా.

బీజేపీకి వాత పెట్టాలి

రాష్ట్ర విభజనపై ప్రధాని హోదాలో మోదీ మాట్లాడుతూ.. తల్లిని చంపి బిడ్డను బతికించారంటూ తెలంగాణను అవమానించారు. విభజన చట్టంలో పేర్కొన్న ఐటీఐఆర్, రైల్వే కోచ్ ఫ్యాక్టరీ, బయ్యారం ఉక్కు పరిశ్రమ, ట్రిపుల్ ఐటీ, గిరిజన వర్సిటీ.. ఇలా ఏమీ ఇవ్వకుండా గాడిద గుడ్డు చేతిలో పెట్టిన బీజేపీ ఓటేద్దామా..? లేక కర్రు కాల్చి వాత పెడదామా ప్రజలే చెప్పాలి. బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేళ్లుగా బీజేపీకి బీ టీమ్‌గా పనిచేస్తూనే ఉంది. అందుకే కాంగ్రెస్ గెలవొద్దని బీఆర్ఎస్, బీజేపీ కలసి కుట్రలు చేస్తున్నాయి.

ఎవరిని చెప్పుతో కొట్టాలి?

రాజ్యాంగాన్ని మారుస్తామన్న వాళ్లని చెప్పుతో కొట్టాలని బీజేపీ నేతలు అంటున్నారు. నిన్ననే బీజేపీ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ కుమార్ గౌతమ్ ఓ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. మాకు నాలుగు వందల సీట్లు వస్తే రాజ్యాంగం ప్రియాంబుల్ (ప్రవేశిక)ను మార్చేస్తామన్నారు. మరి ఇప్పుడు దుష్యంత్ కుమార్‌ను చెప్పుతో కొట్టాలా? అబద్ధాలు చెప్తున్న నేతలను చెప్పుతో కొట్టాలా? ఎవర్ని కొట్టాలో బీజేపీ నేతలే చెప్పాలి. బీజేపీకి ఓటేస్తే రిజర్వేషన్లను రద్దు చేస్తుంది. ఆ పార్టీ దేశ ప్రజల నెత్తిపై వేలాడుతున్న కత్తి లాంటిది.

పాలమూరు బిడ్డపై కుట్ర..

''రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి, పాలమూరు బిడ్డను సీఎంగా ఎన్నుకుని 150 రోజులు కాలేదు. అప్పుడే దిగిపొమ్మని అంటున్నారు. ఢిల్లీ నుంచి పడగొడతామని బయలుదేరుతున్నారు. రేవంత్‌రెడ్డి నా మీద పగబట్టిండని డీకే అరుణమ్మ అంటోంది. నీకు, నాకు గెట్టు పంచాయతీ ఏముంది? ప్రజల దీవెన, సోనియమ్మ ఆశీర్వాదంతో నాకు సీఎం పదవి వచ్చింది. కానీ నన్ను దించేందుకు, అరెస్ట్ చేసేందుకు అమిత్ షాతో మాట్లాడి స్కెచ్ వేస్తోంది. నేనేం తప్పు చేశా? బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీల రిజర్వేషన్లను రద్దు చేస్తానన్నదని చెప్పిన. ఆ దొంగలకు సద్దులు మోస్తూ.. నన్ను లోపలేసి అయినా సరే రిజర్వేషన్లు రద్దు చేస్తాం అంటున్నారు.''

హైదరాబాద్‌కు బీజేపీ, బీఆర్ఎస్ దగా..

సికింద్రాబాద్/ముషీరాబాద్ (హైదరాబాద్): హైదరాబాద్ మహా నగరానికి పదేళ్లుగా బీజేపీ, బీఆర్ఎస్ ప్రభుత్వాలు తీరని అన్యాయం చేశాయని సీఎం రేవంత్‌రెడ్డి ఆరోపించారు. హైదరాబాద్ ప్రజల దాహార్తిని తీర్చడంతోపాటు వివిధ అభివృద్ధి పనులు చేపట్టిన ఘనత నాటి కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని చెప్పారు. ఔటర్ రింగ్‌రోడ్డు, శంషాబాద్ విమానాశ్రయం, మెట్రోరైలు తదితర అభివృద్ధి పనులన్నీ వైఎస్సార్ హయంలోనే జరిగాయన్నారు. శనివారం రాత్రి సికింద్రాబాద్ లోక్‌సభ స్థానం పరిధిలో నిర్వహించిన రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లలో రేవంత్ మాట్లాడారు.

''నగరం వరదల్లో మునిగితే.. ఇక్కడ ఎంపీగా గెలిచి కేంద్ర మంత్రిగా ఉన్న కిషన్‌రెడ్డి కనీసం బాధితులను కూడా పరామర్శించలేదు. మాజీ మంత్రి కేటీఆర్ వల్ల నగరానికి ఒక్క పరిశ్రమ కూడా రాలేదు. ఆయన సెల్ఫీలు దిగి ట్విట్టర్‌లో పెట్టుకుంటున్న శిల్పారామం వంటివి అభివృద్ధి చేసినది కాంగ్రెస్ ప్రభుత్వమే. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో ఏమీ చేయలేదని కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారు. ఆయన చీర కట్టుకొని ఆర్టీసీ బస్సు ఎక్కి తెలంగాణలో ఎటు తిరిగినా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి తెలుస్తుంది..'' అని రేవంత్ వ్యాఖ్యానించారు.

ఢిల్లీ సుల్తానులకు బెదిరేది లేదు

కొత్తగూడెం సభలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు ప్రసంగించారు.

- బ్రిటిషర్లకు ఎదురు నిలిచిన చరిత్ర కాంగ్రెస్‌కు ఉందని, తెలంగాణ సీఎంపై బెదిరింపులకు పాల్పడుతున్న ఢిల్లీ సుల్తానులకు బెదిరేది లేదని భట్టి విక్రమార్క అన్నారు. కేసీఆర్ హయాంలో సింగరేణికి తీరని నష్టం వాటిల్లిందన్నారు.
- బీజేపీ రాముడిని రాజకీయాల్లోకి తెచ్చి నాలుగు అక్షింతలు చల్లి ఊరుకుందే తప్ప చేసిందేమీ లేదని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి విమర్శించారు. సీఎంగా ఏనాడూ ఖమ్మం జిల్లాకు రాని కేసీఆర్.. ఇప్పుడు ఎన్నికల కోసం వచ్చి కల్లిబొల్లి కబుర్లు చెప్తున్నారని విమర్శించారు.
- రాష్ట్ర ప్రభుత్వం కూలిపోతుందని చెప్తున్నవారికి ఈ ఎన్నికలు ఓ రెఫరెండం అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. దమ్ముంటే యోధుడైన రేవంత్‌ను టచ్ చేసి చూడాలని ప్రత్యర్థి పార్టీలకు సవాల్ విసిరారు.
- పాలమూరు ఆత్మగౌరవానికి ప్రతీకగా ఎన్నికలు జరగబోతున్నాయని కొత్తకోట కార్నర్ మీటింగ్‌లో మహబూబ్‌నగర్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి చల్లా వంశీచంద్‌రెడ్డి అన్నారు.

కరోనా కట్టడిలో ఏపీ ప్రభుత్వం భేష్

మరణాల రేటు తక్కువగా నమోదైంది: నీతిఆయోగ్ ప్రశంసలు

సాక్షి, అమరావతి: కరోనా మహమ్మారిని ఎదుర్కోవడంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకుందని నీతి ఆయోగ్ ప్రశంసించింది. విక సిత్ భారత్ నేపథ్యంలో వివిధ రాష్ట్రాలు అనుసరించిన ఉత్తమ ఆచరణలను నీతి ఆయోగ్ వెల్లడించింది. ఏపీ ప్రభుత్వం కరోనాను ఎదుర్కోవడానికి చాలా వేగంగా ఆక్సిజన్ పడకలను పెంచడంతో పాటు ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన వైద్య సేవలందించడానికి కృషి చేసిందని అభినందించింది. 2020 మార్చిలో కరోనా వ్యాప్తిని అరికట్టడానికి అంటువ్యాధుల చట్టాన్ని వేగంగా అమల్లోకి తెచ్చిన టాప్ రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ ఒకటిని తెలిపింది. రాజకీయ నిబద్ధత, విభాగాల మధ్య సమన్వయం, టెలీమెడిసిన్ వంటి డిజిటల్ సాంకేతిక సాధనాల వినియోగం, ఫ్రంట్‌లైన్ సిబ్బందికి ముందస్తు శిక్షణ, అవగాహన కోసం కమ్యూనిటీ ఎంగేజ్‌మెంట్, విస్తృత ప్రచారం, ముందస్తు స్క్రీనింగ్, ట్రేసింగ్, టెస్టింగ్, ఐసోలేటింగ్ తదితర ఉత్తమ విధానాలను అమలు చేసిందని నీతి ఆయోగ్ పేర్కొంది. దీని వల్ల ఆంధ్రప్రదేశ్‌లో మరణాలు రేటు తక్కువగా నమోదైందని వెల్లడించింది. అంతేకాకుండా ఆరోగ్య సంరక్షణ వ్యవస్థను బలోపేతం చేయడానికి చర్యలు చేపట్టిందని పేర్కొంది. క్షేత్రస్థాయి పరిస్థితిని పర్యవేక్షించడానికి జిల్లా స్థాయి కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయడం, ఫ్రంట్‌లైన్ ఆరోగ్య కార్యకర్తలను అవసరమైన సాధనాలతో సన్నద్ధం చేయడం, ప్రజల అవసరాలను పరిష్కరించడంతో పాటు ఆరోగ్య సేవల ద్వారా కరోనాను నియంత్రించిదని నీతి ఆయోగ్ పేర్కొంది. దేశంలోనే అత్యధిక కోవిడ్ పరీక్షలు ఏపీలోనే జరిగాయని వెల్లడించింది.

కాంగ్రెస్ నేత హత్య

- కత్తితో దాడి చేసిన మజ్లిస్ నాయకుడు
- మరొకరికి తీవ్ర గాయాలు
- ఇంద్రారెడ్డి నగర్‌లో ఘటన


మక్బూల్

రాజేంద్రనగర్: కాంగ్రెస్ పార్టీ నేతలపై మజ్లిస్ పార్టీకి చెందిన నాయకుడు కత్తితో దాడి ఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరు తీవ్ర గాయాల పాలయ్యారు. ఈ ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో శని వారం రాత్రి చోటు చేసుకుంది. వివరాలిలా.. సులేమాన్ నగర్ డివిజన్ ఇంద్రారెడ్డి నగర్‌కు చెందిన మక్బూల్ (55), మనోజ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వీరు హసన్‌నగర్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి నగర్ ప్రాంతంలో ఇంటింటి ప్రచారానికి అనుమతి తీసుకున్నారు. ఈ మేరకు శనివారం ఇంద్రారెడ్డి నగర్ చౌరస్తాలో ర్యాలీని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో కార్యాలయం ముందు మక్బూల్, మనోజ్ తదితరులు కూర్చొని ఉండగా, ఇదే సమయంలో స్థానిక మజ్లిస్ పార్టీ నాయకుడు అంజద్ వీరితో గొడవకు దిగాడు. ఇంతలోనే తన వద్ద ఉన్న కత్తితో మక్బూల్‌పై తీవ్రంగా దాడి చేశాడు. అడ్డుకునేందుకు వెళ్లిన మనోజ్‌పై దాడికి పాల్పడి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన మక్బూల్, మనోజ్‌ను ఆసుపత్రికి తరలిస్తుండగా మక్బూల్ మృతి చెందాడు. విషయం తెలుసుకున్న అత్తాపూర్, రాజేంద్రనగర్, మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు ఘటనాస్థలానికి చేరుకున్నారు. పరిస్థితిని అదుపుచేసి.. దర్యాప్తు చేపట్టారు.

నేడు రాష్ట్రానికి అమిత్ షా

- కాగజ్‌నగర్, నిజామాబాద్, హైదరాబాద్‌లలో ప్రచారం
- మూడుచోట్ల బహిరంగ సభల్లో పాల్గొననున్న కేంద్ర హోంమంత్రి
- ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారు



సాక్షి, హైదరాబాద్: లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా కేంద్ర హోంమంత్రి అమిత్ షా ఆదివారం తెలంగాణలో పర్యటించనున్నారు. కాగజ్‌నగర్, నిజామాబాద్, హైదరాబాద్‌లలో పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేపట్టనున్నారు. మూడు చోట్ల జరిగే బహిరంగ సభల్లో ప్రసంగించనున్నారు. ఈ మేరకు ఆయన పర్యటన షెడ్యూల్ ఖరారైంది.

అమిత్ షా షెడ్యూల్ ఇలా..

ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంటకు ఏపీలోని శ్రీసత్యసాయి ఎయిర్‌పోర్ట్ నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1:55 గంటలకు బేగంపేటకు అమిత్ షా చేరుకోనున్నారు. అక్కడి నుంచి హెలికాప్టర్‌లో ఆదిలాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ వెళ్లనున్నారు. అక్కడి ఎస్పీఎం క్రికెట్ గ్రౌండ్‌లో మధ్యాహ్నం 3:20 నుంచి సాయంత్రం 4 గంటల దాకా బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. సాయంత్రం 4:15 గంటలకు కాగజ్‌నగర్ నుంచి హెలికాప్టర్‌లో బయలుదేరి 5 గంటలకు నిజామాబాద్ చేరుకోనున్నారు. సాయంత్రం 5:10 గంటల నుంచి 5:50 గంటల వరకు అక్కడి గిరిరాజ్ కాలేజీలో బహిరంగ సభలో పాల్గొననున్నారు. సాయంత్రం 6 గంటలకు నిజామాబాద్ నుంచి బయలుదేరి 6:30 గంటలకు బేగంపేట ఎయిర్‌పోర్టుకు చేరుకోనున్నారు. సాయంత్రం 6:45 గంటలనుంచి రాత్రి 7:30 గంటల దాకా సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగే బహిరంగ సభలో ప్రసంగించనున్నారు. రాత్రి 7:55 నిమిషాలకు బేగంపేట నుంచి పశ్చిమ బెంగాల్‌లోని దుర్గాపూర్‌కు బయలుదేరనున్నారు.

నేడు తెలంగాణకు రాహుల్..
రెండు సభలకు హాజరు

లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆదివారం తెలంగాణలో పర్యటించనున్నారు. నాందేడ్ నుంచి నేరుగా నిర్మల్‌కు రానున్న రాహుల్.. అక్కడ జరిగే ఎన్నికల ప్రచార సభలో పాల్గొంటారు. అక్కడి నుంచి నేరుగా అలంపూర్ వెళ్లి అక్కడ సభలో ప్రసంగిస్తారు. ఆ తర్వాత అలంపూర్ నుంచి హైదరాబాద్ చేరుకొని పార్టీ నేతలతో కాసేపు భేటీ కానున్నారు. అనంతరం ఆయన ఢిల్లీ వెళ్తారని గాంధీ భవన్ వర్గాలు వెల్లడించాయి.

మీకు రహస్య ఎజెండా లేదని చెప్పగలరా?

రిజర్వేషన్ల రద్దుపై కిషన్‌రెడ్డి, బండికి పొన్నం బహిరంగ లేఖ



సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్ల రద్దు విషయంలో బీజేపీకి రహస్య ఎజెండా లేదని ఆ పార్టీ తెలంగాణ నేతలు చెప్పగలరా అని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ప్రశ్నించారు. మండల్ కమిషన్‌కు వ్యతిరేకంగా కమండల యాత్ర పెట్టింది వాస్తవం కాదా అని నిలదీశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్‌లకు శనివారం ఆయన బహిరంగ లేఖ రాశారు. రిజర్వేషన్ల వ్యతిరేక వైఖరి ఉన్న బీజేపీ నేతలు ఇప్పుడు మొసలి కన్నీరు కారుస్తున్నారని, కుల గణనకు వ్యతిరేకంగా సుప్రీంకోర్టులో కేంద్ర ప్రభుత్వం అఫిడవిట్ ఇచ్చిన మాట వాస్తవం కాదా? రిజర్వేషన్ రహిత దేశం చేస్తామని అనేక సందర్భాల్లో ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భగవత్ చెప్పింది నిజం కాదా? సివిల్ సర్వీసుల్లో గత ఐదేళ్లుగా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు అన్యాయం జరుగుతున్న మాట వాస్తవం కాదా? ఇప్పుడు 400 ఎంపీ స్థానాలు అడుగుతున్నారంటే, 2/3 మెజార్టీతో రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లు ఎత్తివేయాలన్న రహస్య ఎజెండా మీకు లేదా అని ఆ లేఖలో పొన్నం ప్రశ్నించారు. తమ ప్రశ్నలకు జవాబు చెప్పిన తర్వాతే లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణ ప్రజలను ఓట్లడగాలని కోరారు.


ఒకరోజు కస్టడీకి బీఆర్ఎస్ నేత క్రిషాంక్

లాలాపేట(హైదరాబాద్): ఉస్మానియా వర్సిటీ క్యాంపస్‌లోని మెస్‌ల మూసివేతపై విద్యుత్, తాగునీటి కొరత ఉందంటూ సామాజిక మాధ్యమాల ద్వారా దుష్ప్రచారం చేసిన ఉదంతంలో అరెస్టైన బీఆర్ఎస్ నేత మన్నె క్రిషాంక్ ప్రస్తుతం చంచల్‌గూడ జైలులో రిమాండ్‌లో ఉన్నారు. కేసు విచారణలో భాగంగా మరిన్ని వివరాలను రాబట్టేందుకు అతడిని రెండు రోజుల కస్టడీకి ఇవ్వాలని నాంపల్లి కోర్టులో శుక్రవారం ఉస్మానియా యూనివర్సిటీ పోలీసులు పిటిషన్ వేశారు. దీనిపై శనివారం విచారణ చేపట్టిన కోర్టు క్రిషాంక్‌ను ఒక రోజు కస్టడీకి అనుమతించింది. ఈ కస్టడీ ఆదివారం నుంచి సోమవారం ఉదయం వరకు 24 గంటల పాటు ఉంటుందని ఓయూ పోలీసులు తెలిపారు.

చంద్రబాబు పచ్చి మోసగాడు..

- రాజకీయ లబ్ధికోసం యూటర్న్‌లు తీసుకోవడంలో సిద్ధహస్తుడు
- ముస్లిం రిజర్వేషన్లపై చిత్తశుద్ధి ఉంటే.. మోదీ అమిత్ షాతో చెప్పించగలడా?
- మళ్లీ జగన్ అధికారంలో వస్తేనే అవి కొనసాగింపు
- రాజ్యాంగంలో మార్పు.. రిజర్వేషన్ల రద్దే మోదీ గ్యారంటీలు

'సాక్షి'తో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ



సాక్షి, హైదరాబాద్: 'తెలుగుదేశం అధినేత చంద్రబాబు పచ్చి మోసగాడు.. రాజకీయ లబ్ధికోసం యూటర్న్ తీసుకోవడంలో మొనగాడు. 1994లో నేను ఎమ్మెల్యేగా పనిచేసినప్పటి నుంచి చూస్తున్నా.. స్థిరత్వంలేని ఆయన పదవి కోసం ఎంతకైనా బరితెగిస్తాడు. అప్పట్లో ఎన్టీఆర్‌ను వెన్నుపోటు పొడిచి ఎలా మోసం చేశాడో చూశా. అతనికి పదవులే ముఖ్యం. అభివృద్ధి, ప్రజల సంక్షేమం చంద్రబాబుకు అస్సలు పట్టదు'.. అని ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ విరుచుకుపడ్డారు. 'సాక్షి'తో శనివారం ఆయన ప్రత్యేకంగా మాట్లాడారు. ఆయన ఏమన్నారంటే..

అధికారమే బాబు లక్ష్యం..

చంద్రబాబు కేవలం అధికారం చేపట్టడమే లక్ష్యంగా పనిచేస్తాడు. రాజకీయ లబ్ధికోసం 1996లో వాజ్‌పేయితో జతకట్టాడు. ఆ తర్వాత బయటకొచ్చాడు. 2014లో మోదీతో కలిసి పనిచేశాడు. మళ్లీ విడిపోయాడు. మోదీని అనరాని మాటలు అన్నాడు. ఇది అందరికీ తెలుసు.. మళ్లీ మోదీతో కలిసి పనిచేస్తున్నాడు. కానీ, ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అలా కాదు. ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం నిరంతరం తపిస్తుంటాడు. దివంగత నేత వైఎస్సార్ ముస్లింలకు కల్పించిన రిజర్వేషన్లను జగన్ అమలుచేస్తున్నారు. తిరిగి అధికారంలోకొచ్చి వాటిని కొనసాగించడం ఖాయం. జగన్ అంటే ఒక విశ్వాసం. అదే చంద్రబాబు ముస్లిం రిజర్వేషన్ల విషయంలో ఎలాంటి హామీ ఇవ్వగలడు? ముస్లిం రిజరేషన్లపై చిత్తశుద్ధి ఉంటే.. మోదీ, అమిత్ షాతో చెప్పించగలడా? అతను మోదీ చేతిలో కీలుబొమ్మ. చంద్రబాబును నమ్మలేం. కాబట్టి భవిష్యత్తులో ముస్లిం రిజర్వేషన్లకు ముప్పు కలగకుండా చంద్రబాబు, ఆయన కూటమికి ఆంధ్రప్రదేశ్ ప్రజలు గట్టిగా బుద్ధిచెప్పాలి. మరోవైపు.. ప్రధాని మోదీ గ్యారంటీలంటే రాజ్యాంగంలో మార్పులు చేయడం, రిజర్వేషన్లను రద్దుచేయడం, మైనారిటీలకు వ్యతిరేకంగా విషం చిమ్మడమే. బీజేపీది హిందూత్వమే ఏకైక ఎజెండా. భారత్‌ను హిందూత్వ దేశంగా మార్చేందుకు ఆ పార్టీ ప్రయత్నిస్తోంది.

వెనుకబాటుతనంపైనే ముస్లింలకు రిజర్వేషన్లు..

అసలు ముస్లింలకు రిజర్వేషన్లను కల్పించింది మతప్రాతిపదికన కాదు. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఈ రిజర్వేషన్లను సామాజిక, విద్యాపరమైన వెనుకబాటు కారణంగా అందిస్తున్నారు. ముస్లింలలో అనేక వెనుకబడిన కులాలున్నాయి. వారికి ప్రభుత్వ మద్దతు అవసరం. కానీ, బీజేపీకి వీరి అభివృద్ధి గిట్టడంలేదు. అందుకే.. ముస్లిం రిజర్వేషన్ల రద్దుచేస్తామంటున్నారు.

అభివృద్ధికి సహకరిస్తాం

తెలంగాణలో అభివృద్ధికి సహకారం అందిస్తామని అసద్ పునరుద్ఘాటించారు. ఎన్నికల వరకే రాజకీయాలని, ఎన్నికల తర్వాత ప్రజా సంక్షేమం, అభివృద్ధే తమ లక్ష్యమన్నారు. తమ పనితీరే తమకు గుర్తింపని చెప్పారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఐదేళ్లు కొనసాగుతుందన్నారు. రాష్ట్రంలో గవర్నర్‌గా రాజ్యాంగబద్ధ బాధ్యతలు నిర్వహించి రాజీనామా చేసిన తమిళిసై తిరిగి ఎన్నికల ప్రచారానికి రావడం రాజకీయంగా అనైతికమన్నారు.



నేను మొదటివాడను కడపటివాడను జీవించువాడను ; మృతుడనైతిని గాని ఇదిగో యుగయుగములు సజీవుడనై యున్నాను. మరియు మరణము యొక్కయు పాతాళ లోకము యొక్కయు తాళపుచెవులు నా స్వాధీనములో ఉన్నవి.

– క్రైస్తవ ధర్మం

గ్రహం అనుగ్రహం

శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, చైత్ర మాసం, తిథి: బ.ద్వాదశి ప.3.35 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: ఉత్తరాభాద్ర సా.6.14 వరకు, తదుపరి రేవతి, వర్జ్యం: తె.5.27 నుండి 6.57 వరకు (తెల్లవారితే సోమవారం), దుర్ముహూర్తం: సా.4.33 నుండి 5.24 వరకు, అమృతఘడియలు: ఉ.10.48 నుండి 11.45 వరకు.

సూర్యోదయం : 5.36
సూర్యాస్తమయం : 6.16
రాహుకాలం : సా.4.30 నుంచి 6.00 వరకు
యమగండం : ప.12.00 నుంచి 1.30 వరకు

కిశోరీలాల్ శర్మ (అమేథీ అభ్యర్థి) రాయని డైరీ

మాధవ్ శింగరాజు


"శర్మాజీ! అమేథీ నుంచి పోటీ చేయటానికి మీకు అభ్యంతరం లేదు కదా?" అనే మాట – నిజానికైతే – "శర్మాజీ! ఎగిరి గంతేయటానికి మీకేమీ అభ్యంతరం లేదు కదా?" అనే మాట లాంటిది!

కానీ రాహుల్ బాబు నన్ను అదాటుగా ఆ మాట అడిగే సమయానికి... అమేథీలో కనుక రాహుల్ బాబు తిరిగి నిలబడితే ఆయన్ని గెలిపించటానికి ఉన్న అవకాశాల గురించి నేను తీవ్రంగా ఆలోచిస్తూ ఉన్నాను.

అందుకే – "ఈసారి అమేథీ మీదే రాహుల్ బాబూ!" అన్నాను... నా ఆలోచనల తీవ్రత లోంచి వెంటనే బయటికి రాలేక.

ఆ మాటకు రాహుల్ బాబుతో పాటు... సోనియాజీ, ఖర్గేజీ, ప్రియాంకాజీ ఒక్కపెట్టున నవ్వారు.

"శర్మాజీ! నలభై ఏళ్లుగా మీరు గాంధీల కుటుంబంలో ఒకరిగా ఉంటూ వస్తున్నారు. అందుకే గాంధీల నియోజకవర్గాలుగా ఉంటూ వస్తున్న రాయ్ బరేలీ, అమేథీలలో అమేథీ నుంచి మిమ్మల్ని పోటీ చేయమని అడుగుతున్నారు. రాహుల్ బాబు రాయ్



బరేలీలో నిలబడతారు..." అన్నారు ఖర్గేజీ.

ఆ షాక్ నుంచి తేరుకోవటం కష్టమైంది నాకు! "నేనా?!!" అన్నాను వెంటనే.

"అవును మీరే శర్మాజీ!" అన్నారు సోనియాజీ.

ఆ 'అవును మీరే శర్మాజీ' అనే మాట నుంచి తేరుకోటానికి కూడా నాక్కొంత సమయం పట్టింది.

గాంధీల కుటుంబంతో అమేథీకి ప్రత్యేక అనుబంధం ఉంది. ఒక్క ఇందిరాజీ తప్ప ఆ కుటుంబంలోని సంజయ్‌జీ, రాజీవ్‌జీ, సోనియాజీ, రాహుల్‌జీ అందరూ అమేథీ నుండి పోటీ చేసినవారే!

అమేథీతో నాకూ ప్రత్యేక అనుబంధం ఉంది. సోనియాజీ రాజకీయాల్లోకి వచ్చాక తొలిసారిగా పోటీ చేసిన నియోజవర్గం అమేథీ. ఆ ఎన్నికల్లో సోనియాజీ గెలుపు కోసం నేను, ప్రియాంకాజీ కలిసి అమేథీ నియోజక వర్గం లోని ప్రతి గ్రామం, ప్రతి ఇల్లూ తిరిగాం.

అమేథీతో నాకు ప్రత్యేక అనుబంధం మాత్రమే కాదు, ఒక ప్రత్యేకమైన అనుభవం కూడా ఉంది. 2014 ఎన్నికలకు రాహుల్ బాబు తన సొంత ఎన్నికల టీమ్‌ని ఏర్పాటు చేసుకుని అందులోంచి నన్ను తొలగించి, నన్ను పూర్తిగా రాయ్‌బరేలీ చూసుకొమ్మన్నారు! అమేథీ నుంచి నన్ను వెళ్లగొట్టినంతగా నేను విలవిల్లాడిపోయాను. ఇప్పుడు రాహుల్ బాబే నన్ను అమేథీకి నిలబెడుతూ, తను రాయ్ బరేలీలో నిలబడుతున్నారు!

"అమేథీలో నేనే ఎందుకు రాహుల్ బాబూ... మీరు రాయ్ బరేలీలో నిలబడు తున్నారు కనుక, ప్రియాంకాజీ అమేథీలో నిలబడితే అప్పుడు గాంధీల కుటుంబంలో అంతా అమేథీలో నిలబడినట్లు అవుతుంది కదా..." అన్నాను.

ఖర్గేజీ పెద్దగా నవ్వారు. "మీ ప్రశ్నకు సోనియాజీనే సమాధానం చెప్పాలి. ఒకే ఇంట్లో ముగ్గురు ఎంపీలు – తల్లి రాజ్యసభలో, అన్నా చెల్లెళ్లు లోక్‌సభలో– అనే విమర్శకు మేడమ్ అవకాశం ఇవ్వకూడదు అనుకున్నారు..." అన్నారు.

"కానీ నాకున్న అర్హతలు ఏంటని..?!" అన్నాను ఖర్గేజీ వైపు అయోమయంగా చూస్తూ.

"శర్మాజీ! మీ ట్వంటీస్‌లో రాజీవ్‌జీ మిమ్మల్ని ఏరి కోరి లూథియానా నుంచి అమేథీ తెప్పించుకున్నారు. అప్పట్నుంచీ మీరే అమేథీలో, రాయ్‌బరేలీలో గాంధీల కుటుంబాన్ని గెలిపిస్తూ వస్తున్నారు. ఇంతకంటే అర్హతలు ఏముంటాయో మీకు తెలిస్తే మాకూ కాస్త చెప్పండి..." అన్నారు ఖర్గేజీ నవ్వుతూ.

"అర్హతలు ఉండేవి ఉంటాయి శర్మాజీ! అనుబంధాలైతే లేకుండా పోవు కదా..." అన్నారు సోనియాజీ.

ఆ మాట నాకు... స్మృతీ ఇరానీ నుంచి అమేథీని మళ్లీ గాంధీల కుటుంబం దక్కించుకున్నంతగా సంతోషాన్నిచ్చింది. అమేథీలో నన్ను నిలిపారన్న సంతోషమైనా ఆ తర్వాతే..!

తోడేళ్లను తరిమే రోజు!

జనతంత్రం



వర్ధెల్లి మురళి

ఒక్కసారి మనం డెబ్బయ్యేళ్లు వెనక్కు వెళ్లాలి. వర్తమాన ఆంధ్రప్రదేశ్ రాజకీయాలు మనల్ని ఆ జ్ఞాపకం వైపు బలవం తంగా నెడుతున్నాయి. ఉమ్మడి మద్రాసు రాష్ట్రం నుంచి 1953లో ఆంధ్ర రాష్ట్రం విడిపోయింది. తెలంగాణతో కలిసి ఇంకా ఆంధ్ర ప్రదేశ్‌గా అవతరించకముందు 1955లో శాసనసభకు మధ్యం తర ఎన్నికలు జరిగాయి. నాటి ఆంధ్ర రాష్ట్రం, నేటి ఆంధ్ర ప్రదేశ్‌ల భౌగోళిక స్వరూపం ఒక్కటే!

ఆ ఎన్నికలకు ముందు రాష్ట్రంలో కమ్యూనిస్టుల ప్రభం జనం కనిపించింది. అప్పటిదాకా ప్రపంచంలో ఎక్కడా కూడా కమ్యూనిస్టులు బ్యాలెట్ ద్వారా అధికారంలోకి వచ్చిన ఉదం తాలు లేవు. ఆ విషయంలో ఆంధ్ర రాష్ట్రం రికార్డు సృష్టించ బోతున్నదనే అంచనాలు వెలువడ్డాయి. ముఖ్యమంత్రిగా సుందరయ్య, హోంమంత్రిగా చండ్ర రాజేశ్వరరావు, ఆర్థిక మంత్రిగా మాకినేని బసవపున్నయ్య వగైరా పేర్లతో కేబినెట్ కూర్పుపై కూడా ప్రచారం జరిగింది. సరిగ్గా ఈ దశలోనే పెత్తం దారీ ముఠా, వారి అజమాయిషీలోని మీడియా రంగప్రవేశం చేశాయి.

అప్పట్లో దున్నేవానికే భూమి అనేది కమ్యూనిస్టుల నినాదం. ఆ మేరకు భూసంస్కరణలు అమలు చేస్తామని వారు వాగ్దానం చేశారు. ఇది చాలు పెత్తందార్లకు! వారి చేతుల్లో వున్న 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రప్రభ' వంటి ఆనాటి ప్రముఖ పత్రికలు ఆయుధాలు బయటకు తీశాయి. కమ్యూనిస్టులు గెలిస్తే రైతుల భూములను లాక్కుంటారు. కమ్యూనిస్టులు గెలిస్తే ప్రజల ఇళ్లలో ఉన్న డబ్బును, బంగారాన్ని ఎత్తుకుపోతారు. వృద్ధులు పని చేయలేరు కనుక వారిని ప్రత్యేక క్యాంపుల్లో పెడతారు లేదా చంపేస్తారు. రష్యాలో, చైనాలో ఇలాగే చేస్తున్నారు. చివరికి మీ భార్యల్ని కూడా జాతీయం చేస్తారు. కుటుంబ వ్యవస్థ విచ్ఛిన్న మవుతుంది... ఈ రకమైన అభాండాలను అచ్చేసి అడ్డగోలుగా ప్రచారంలో పెట్టారు.

ఈ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టేంత పబ్లిసిటీ దన్ను ఆనాడు కమ్యూనిస్టులకు లేదు. వాళ్లకున్నది 'విశాలాంధ్ర' ఒక్కటే. పార్టీ ముద్ర కారణంగా దానికీ పరిమితులున్నాయి. ఇటువంటి నిస్సహాయ స్థితిలోనే మహాకవి శ్రీశ్రీ గుండెలోంచి తన్నుకొచ్చిన ఆక్రోశం చాలామందికి గుర్తున్నది. 'పెట్టుబడికీ కట్టుకథకూ పుట్టిన విషపుత్రిక ఆంధ్రపత్రిక' అని ఈసడించుకున్నారు. నాటి 'ఆంధ్రపత్రిక', 'ఆంధ్రప్రభ'ల అరాచకాన్ని ఒక లక్షతో హెచ్చ వేస్తే నేటి 'ఈనాడు', 'ఆంధ్రజ్యోతి', 'టీవీ5', 'ఏబీఎన్', 'ఈటీవీ'ల అరాచకం విలువెంతో తెలుస్తుంది. ఆ ప్రత్యేక సందర్భం తర్వాత నాటి పత్రికలు మళ్లీ తటస్థ స్థితికి చేరు కున్నాయి. కానీ మన యెల్లో మీడియా మాత్రం గత పదేళ్లుగా ఆదే యజ్ఞంలో తలమునకలై ఉన్నది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోని పెత్తందారీ వర్గాల ప్రతినిధిగా, ప్రయోక్తగా, ప్రవక్తగా గడిచిన మూడు దశాబ్దాల్లో చంద్రబాబు ఇంతింతై అన్నట్టుగా ఇనుమడించడం మనకు తెలిసిన సంగతే. ఇదే కాలంలో మన యెల్లో మీడియా చంద్రబాబు తరఫున గ్రామ సింహాల పాత్రను పోషిస్తే, బదులుగా ఆయన వారికి సెక్యూరిటీ గార్డు పాత్రను పోషిస్తూ వస్తున్నారు. ఈ ముప్ప య్యేళ్లలో పధ్నాలుగేళ్లపాటు బాబు ముఖ్యమంత్రి పాత్రను పోషించారు. ఆయనకు వాలతుల్యుడనదగ్గ కిరణ్‌కుమార్ రెడ్డి కాంగ్రెస్ తరఫున నాలుగేళ్లు గద్దె మీద కూర్చున్నారు. రాష్ట్రంలోని పేదల అభ్యున్నతి కోసం, సాధికారత కోసం అమలైన కార్య క్రమాలన్నీ వీరి కాలం మినహా మిగిలిన సమయంలోనే జరగడం ఎవరైనా గమనించవచ్చు.

ప్రజలందరికీ విద్య, వైద్యసేవలు అందజేయడం ప్రభుత్వ బాధ్యతగా నాగరిక సమాజం గుర్తిస్తున్నది. ఆ రంగాల్లో సేవలు ప్రభుత్వం బాధ్యత కాదని బాహాటంగా ప్రకటించి, వాటిని ప్రైవేట్ కార్పొరేట్ శక్తులకు నర్తనశాలగా మార్చిన అనాగరిక రాజకీయవేత్త చంద్రబాబు. ఫలితంగా ప్రభుత్వ బడులు కునారిల్లిపోయాయి. పేదలు, మధ్యతరగతి ప్రజలు తమ పిల్లల్ని ప్రైవేట్ బడులకు పంపి అప్పులపాలయ్యారు. నిరు పేదల బిడ్డలు చదువుకు దూరమయ్యారు. ఒక తరం పేద, మధ్యతరగతి వర్గాల కలలను కాటేసిన చరిత్ర చంద్రబాబుది. అలాగే ప్రైవేట్ వైద్యసేవల బలిపీఠాన్నెక్కి లక్షలాది కుటుంబాలు కృశించి, నశించిపోయాయి.

వ్యవసాయం దండగనేది ఆయన చేసిన ఒక క్రూర పరిహాసం. ఫలితంగా రైతులు పిట్టల్లా రాలిపోవడం బాబు జమానాలోనే ప్రారంభమైంది. కల్తీ ఎరువులు, కల్తీ విత్తనాలు, నకిలీ మందులకు వ్యవసాయం వేదికైంది. రైతులను భూముల నుంచి వెళ్లగొట్టి వేల ఎకరాల భూములను కార్పొరేట్ శక్తులకు కైంకర్యం చేసే విధానాలను బాబు అవలంబించారు. ఈ క్రమం లోనే ఫిలిం సిటీ పేరుతో రామోజీ దాదాపు మూడువేల ఎకరాలు పోగేశారు. అన్నిరకాల భూచట్టాలూ రామోజీ భూదాహం ముందు చట్టుబండలయ్యాయి. వేలాది ఎకరాల్లో వ్యవసా యాన్ని అటకెక్కించి కార్పొరేట్ సంస్థలు కంచెలు వేసు కున్నాయి. పేదల జీవితాలను కాల్చుకుతింటున్న చంద్ర బాబులో పచ్చమీడియాకు ఓ విజనరీ కనిపించాడు.



ఈ అయిదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వంపై యెల్లో మీడియా సాగించిన దుష్ప్రచారం అన్ని రికార్డులనూ బద్దలు కొట్టింది. గోబెల్స్ బతికి వుంటే సిగ్గుపడి ఉండేవాడు. శ్రీశ్రీ బతికి ఉంటే ఏమని కామెంట్ చేసే వాడో ఊహించుకోవలసిందే. తిమ్మిని బమ్మిగా, బమ్మిని తిమ్మిగా ప్రచారం చేయని రోజు ఈ అయిదేళ్లలో ఒక్కటీ లేదు. అయినా ప్రజాభిప్రాయాన్ని యెల్లో మీడియా పెద్దగా ప్రభావితం చేయలేకపోతున్నది. దీంతో వారిలో నిస్పృహ ఆవరించింది. అన్ని విలువల్నీ వదిలేశారు. వస్త్రవిసర్జన చేసి దిగంబర వీధి నర్తనం మొదలుపెట్టారు. పోలింగ్ పది రోజులుండగా తయారుచేసిన రెండు వింత కథల మీద ప్రాణం పెట్టుకుని పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టారు.

ఇందులో మొదటిది ఏమాత్రం క్రియేటివిటీ లేకుండా అల్లిన ఓ కట్టుకథ. 'మీ భూమి మీది కాదు' అనే పేరుతో ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ 'బాధితుల' కథనాలను 'ఈనాడు' అచ్చేసింది. చట్టం పేరులోనే దాని ప్రాముఖ్యత ఉన్నది. భూమిపై రైతుకున్న యాజమాన్య హక్కును గుర్తిస్తూ ప్రభుత్వం హామీ పడి ధ్రువీకరించే చట్టం. ఒకసారి ఈ చట్టం అమలులోకి వస్తే భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి.

ఐదేళ్ల కింద ఆంధ్రప్రదేశ్‌లో ఒక తేడా వచ్చింది. చంద్రబాబుకూ, యెల్లో మీడియాకూ అది చిన్న తేడా ఏమీ కాదు. యెల్లో 'విజనరీ' విధానాలను కొత్త ముఖ్య మంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తలకిందులు చేశారు. ప్రజలిచ్చిన అధికారం గుప్పెడుమంది పెత్తందార్ల కోసం కాదు, పురోగ మనం కోసం పోరాడుతున్న విశాల ప్రజానీకం కోసం అనేది ఆయన విధానం. జగన్‌మోహన్‌రెడ్డి విధానాలకు, మన పెత్తం దారీ ఏజెంట్ల విధానాలకు ఘర్షణ ఏర్పడింది. పెత్తందార్ల కూటమి జగన్ ప్రభుత్వంపై యుద్ధాన్ని ప్రకటించింది. జగన్ ప్రభుత్వ విధానాల వల్ల ఊపిరి పీల్చుకున్న పేదవర్గాల ప్రజలు ఆయన వెనుక సైన్యంగా మోహరించారు. పేదలు – పెత్తందార్ల మధ్య మహాయుద్ధానికి ముహూర్తం ఖాయమైంది.

ఈ అయిదేళ్ల కాలంలో జగన్ ప్రభుత్వంపై యెల్లో మీడియా సాగించిన దుష్ప్రచారం అన్ని రికార్డులనూ బద్దలు కొట్టింది. గోబెల్స్ బతికి వుంటే సిగ్గుపడి ఉండేవాడు. శ్రీశ్రీ బతికి ఉంటే ఏమని కామెంట్ చేసేవాడో ఊహించుకోవలసిందే. తిమ్మిని బమ్మిగా, బమ్మిని తిమ్మిగా ప్రచారం చేయని రోజు ఈ అయిదే ళ్లలో ఒక్కటీ లేదు. అయినా ప్రజాభిప్రాయాన్ని యెల్లో మీడియా పెద్దగా ప్రభావితం చేయలేకపోతున్నది. దీంతో వారిలో నిస్పృహ ఆవరించింది. అన్ని విలువల్నీ వదిలేశారు. వస్త్రవిసర్జన చేసి దిగంబర వీధినర్తనం మొదలుపెట్టారు. పోలింగ్ పది రోజులుండగా తయారుచేసిన రెండు వింత కథల మీద ప్రాణం పెట్టుకుని పెద్ద ఎత్తున ప్రచారం మొదలుపెట్టారు.

ఇందులో మొదటిది ఏమాత్రం క్రియేటివిటీ లేకుండా అల్లిన ఓ కట్టుకథ. 'మీ భూమి మీది కాదు' అనే పేరుతో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ 'బాధితుల' కథనాలను 'ఈనాడు' అచ్చేసింది. చట్టం పేరులోనే దాని ప్రాముఖ్యత ఉన్నది. భూమిపై రైతుకున్న యాజమాన్య హక్కును గుర్తిస్తూ ప్రభుత్వం హామీ పడి ధ్రువీకరించే చట్టం. ఒకసారి ఈ చట్టం అమలులోకి వస్తే భూ వివాదాలు శాశ్వతంగా పరిష్కారమవుతాయి. దొంగ కాగితాలు సృష్టించి రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లిస్తే చార్మినార్‌కు కూడా సేల్ డీడ్ ఇచ్చే అధ్వాన్నమైన పరిస్థితులు ఎన్నిసార్లు ఎదురు కావడం లేదు? నకిలీ డాక్యుమెంట్లతో బ్యాంకులను కొల్లగొట్టే దళారీల వృత్తాంతాలు ఎన్ని బయటకు రావడంలేదు? ఎన్ని వేల భూతగాదాలు కోర్టు వ్యాజ్యాల్లో దశాబ్దాల తరబడి నలిగి పోవడం లేదు? గొడవలతో ఎంత రక్తం పారి ఉంటుంది? ఎన్ని హత్యలు జరిగి ఉంటాయి?

ఇదిగో ఇటువంటి వివాదాలను పరిష్కరించే సమగ్ర హక్కులను యజమానికి కల్పించి, అందుకు ప్రభుత్వం గ్యారంటీ ఇచ్చేదే ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్. ఇందులో భాగంగా మొదట భూముల సమగ్ర సర్వే జరుగుతోంది. గ్రామ ప్రజల సమక్షంలో సరిహద్దులను నిర్ధారించి రైతుకు పాస్‌బుక్ ఇవ్వడం జరుగుతుంది. వందేళ్ల తర్వాత సర్వే జరిపి యాజమాన్య హక్కును గుర్తిస్తూ ప్రభుత్వం ఇస్తున్న పాస్‌బుక్ ఇది. ఆ హక్కుకు ప్రభుత్వం ఇస్తున్న గ్యారంటీకి గుర్తుగా సర్వే జరిగిన కాలపు ప్రభుత్వాధినేతగా ముఖ్యమంత్రి ఫోటోను కూడా పాస్‌బుక్‌పై ముద్రిస్తున్నారు. దీన్ని కూడా టీడీపీ – యెల్లో మీడియా వివాదం చేయడం చూస్తున్నాము.

అన్ని గ్రామాల్లో సర్వే పూర్తిగా జరిగిన తర్వాత చట్టం అమలుకు సంబంధించిన మార్గదర్శకాలు జారీ చేసి, వాటిపై గ్రామసభల్లో చర్చలు జరిగిన తర్వాత తుది మార్గదర్శకాలు జారీ అవుతాయి. ఆ తర్వాతనే చట్టం అమల్లోకి వస్తుంది. ఇదంతా జరగడానికి ఇంకో ఏడాది పట్టవచ్చు. రెండేళ్లు పట్టవచ్చు. కేంద్ర ప్రభుత్వంలోని 'నీతి ఆయోగ్' సూచనలకు అనుగుణంగా ఈ చట్టం రూపకల్పన జరుగుతున్నది. అన్ని రాష్ట్రాల్లోనూ భూయజమానికి మేలు చేసే ఈ చట్టం వచ్చి తీరుతుంది. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌ను ముందుకు కదిలించింది. దీన్ని వ్యతిరేకిస్తున్న యెల్లో కూటమి పార్టీ ఎన్డీఏలో భాగంగా ఉన్నది. కానీ ఇంత వరకు ఈ చట్టంపై తమ అభ్యంతరాలను కేంద్ర ప్రభుత్వంతో ప్రస్తావిం చకపోవడం తెలుగుదేశం అవకాశవాద వైఖరికి పరాకాష్ఠ. పచ్చమీడియా కూడా ఈ చట్టంపై ఒక్క మాటయినా కేంద్రం ప్రస్తావన చేయకపోవడం వెనకనున్న రహస్యమేమిటి?

ఇక శనివారం నాడు 'ఈనాడు' రాసిన 'మీ భూమి మీది కాదు' అనే కల్పిత కథ జర్నలిజం ప్రమాణాలను పాతాళంలోకి తొక్కేసింది. ఇందులో ముగ్గురు బాధితుల పేర్లు రాశారు. అందులో అమలాపురం సుబ్బారావు ఒకరు. ఆయన భూమి ఎక్కడో చెప్పలేదు. సర్వే నెంబర్ తెలియదు. ఆయన భూమి తనదంటూ ఎవరో అధికారులకు దరఖాస్తు చేసుకున్నారట! ఆయనెవరో చెప్పలేదు. ఎవరికి దరఖాస్తు చేశాడో చెప్పలేదు. రెండేళ్ల తర్వాత సుబ్బారావు స్పందించలేదంటూ దరఖాస్తు చేసుకున్న వారి పేరు మీద భూమిని రాసేశారట! ఇదంతా ల్యాండ్ టైట్లింగ్ చట్టం మహత్యమట. అమల్లోకే రాని చట్టం రెండేళ్ల కిందనే పనిచేయడం ప్రారంభించిందని 'ఈనాడు' ఉవాచ!

ఇక సాంబశివుడిది శ్రీకాకుళం జిల్లాలోని ఒక పల్లెనట! ఈ పల్లె పేరు చెబితే రామోజీ తల వెయ్యి ముక్కలవుతుంది కాబోలు. చెప్పలేదు! ఆయన భూమిని అమ్మడానికి వెళితే, 'కొత్త రిజిస్టర్‌లో నీ పేరు లేద'ని అధికారులు చెప్పారట. అసలటు వంటి కొత్త రిజిస్టరు తమ దగ్గర ఏదీ లేదని అధికారులు ప్రకటిం చారు. గోవిందరెడ్డిది కర్నూలు జిల్లా. ఏ ఊరో చెప్పలేదు. 'ఈనాడు' ఆంధ్రా ఎడిషన్‌లోనే ఆయన గోవిందరెడ్డి. తెలంగాణ ఎడిషన్‌లో మాత్రం గోవిందయ్య. అంటే తెలంగాణకు వెళ్లిన ప్పుడల్లా ఆయన కులం తోకను కత్తిరించుకుంటాడు కాబోలు. ఆయన తన భూమిని తనఖా పెట్టాలనుకున్నాడట! బ్యాంకులో ఉండే డిస్ప్యూట్ రిజిస్టర్‌లో ఆయన పేరు ఉన్నదట! టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ దగ్గర క్లియరెన్స్ సర్టిఫికెట్ తెమ్మని బ్యాంకు వారు చెప్పారట. దాంతో గోవిందరెడ్డి ఉరఫ్ గోవిందయ్య ఆంధ్రాలో ఒకసారి, తెలంగాణలో ఒకసారి గొల్లుమన్నాడట! అసలు టైటిల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ అనే పోస్ట్ అమల్లోకే రాలేదు.

పెన్షన్ల వ్యవహారంపై తెలుగుదేశం – యెల్లో మీడియాలు నడిపిస్తున్న వ్యవహారంలో మరో వింతకథ. వలంటీర్ వ్యవస్థకే ఈ పెత్తందార్లు వ్యతిరేకం. తమ వ్యతిరేకతను వాళ్లు దాచుకోనూ లేదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు గమనించారు. ఇంటి దగ్గరే ఒకటో తారీఖు పొద్దున్నే వలంటీర్లు గత ఐదేళ్లుగా పింఛన్లు అంద జేస్తున్నారు. దాంతో అవ్వాతాతలు, దివ్యాంగులు భరోసాతో బతుకుతున్నారు. వలంటీర్లు విధుల్లో పాల్గొనకుండా చూడాలని తెలుగుదేశం పార్టీ తరఫున వారి ఏజెంటు నిమ్మగడ్డ రమేశ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనికి యెల్లో మీడియా వంత పాడింది. దాంతో వలంటీర్లు పెన్షన్లు ఇవ్వకూడదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఈసీ సూచనల మేరకు ఏప్రిల్‌లో విలేజ్ సెక్రటే రియట్‌లలో పెన్షన్లు అందజేశారు. దీనిపై వృద్ధుల్లో వ్యతిరేకత వచ్చింది. గాభరాపడ్డ తెలుగుదేశం బృందం మళ్లీ నిమ్మగడ్డను పంపించి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించాలని ఈసీకి దరఖాస్తు పెట్టారు. ఈసీ సూచన లకు అనుగుణంగా మే నెలలో బ్యాంకు ఖాతాల్లో డిపా జిట్ చేశారు. ఇక వృద్ధుల బాధలు వర్ణనాతీతం. వారి శాపనార్థాలతో కంగారు పడిన యెల్లో ముఠా వృద్ధుల బాధలకు జగన్ ప్రభుత్వమే కారణమనే విష ప్రచారాన్ని మొదలుపెట్టింది. దొంగతనం చేసినవాడే 'దొంగా దొంగా' అని అరిచినట్టు! జగన్‌మోహన్‌రెడ్డి సభలకు మండుటెండల్లో కూడా వెల్లువెత్తుతున్న జనప్రవాహంతో కూటమి వణికిపోతున్నది. ఈ రెండు అంశాలపై అబద్ధాలను ప్రచారం చేసి గట్టెక్కాలన్న దింపుడు కల్లం ఆశ దానిలో కనిపిస్తున్నది.

డిస్ప్యూట్ రిజిస్టరూ లేదు. చదివేవాడు వెర్రి వాడయితే... రాసేవాడు రామోజీ!

పెన్షన్ల వ్యవహారంపై తెలుగుదేశం – యెల్లో మీడియాలు నడిపిస్తున్న వ్యవహారంలో మరో వింతకథ. వలంటీర్ వ్యవస్థకే ఈ పెత్తందార్లు వ్యతిరేకం. తమ వ్యతిరేకతను వాళ్లు దాచుకోనూ లేదు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు చేసిన అభ్యంతరకర వ్యాఖ్యలను రాష్ట్ర ప్రజలు గమనించారు. ఇంటి దగ్గరే ఒకటో తారీఖు పొద్దున్నే వలంటీర్లు గత ఐదేళ్లుగా పింఛన్లు అంద జేస్తున్నారు. దాంతో అవ్వాతాతలు, దివ్యాంగులు భరోసాతో బతుకుతున్నారు. వలంటీర్లు విధుల్లో పాల్గొనకుండా చూడాలని తెలుగుదేశం పార్టీ తరఫున వారి ఏజెంటు నిమ్మగడ్డ రమేశ్ ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేశారు. దీనికి యెల్లో మీడియా వంత పాడింది. దాంతో వలంటీర్లు పెన్షన్లు ఇవ్వకూడదని, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకోవాలని ఎన్నికల సంఘం సూచించింది.

ఈసీ సూచనల మేరకు ఏప్రిల్‌లో విలేజ్ సెక్రటేరియట్‌లలో పెన్షన్లు అందజేశారు. దీనిపై వృద్ధుల్లో వ్యతిరేకత వచ్చింది. గాభరాపడ్డ తెలుగుదేశం బృందం మళ్లీ నిమ్మగడ్డను పంపించి బ్యాంకు ఖాతాల్లో జమ చేయించాలని ఈసీకి దరఖాస్తు పెట్టారు. ఈసీ సూచనలకు అనుగుణంగా మే నెలలో బ్యాంకు ఖాతాల్లో డిపాజిట్ చేశారు. ఇక వృద్ధుల బాధలు వర్ణనాతీతం. వారి శాపనార్థాలతో కంగారు పడిన యెల్లో ముఠా వృద్ధుల బాధలకు జగన్ ప్రభుత్వమే కారణమనే విష ప్రచారాన్ని మొదలుపెట్టింది. దొంగతనం చేసినవాడే 'దొంగా దొంగా' అని అరిచినట్టు! జగన్‌మోహన్‌రెడ్డి సభలకు మండుటెండల్లో కూడా వెల్లువెత్తుతున్న జనప్రవాహంతో కూటమి వణికిపోతున్నది. ఈ రెండు అంశాలపై అబద్ధాలను ప్రచారం చేసి గట్టెక్కాలన్న దింపుడు కల్లం ఆశ దానిలో కనిపిస్తున్నది.

ఇంకో వారం రోజుల్లో పోలింగ్ జరగబోతున్నది. ఇది పేద వర్గాలకు అందివచ్చిన అద్భుతమైన అవకాశం. పేద బిడ్డల ఇంగ్లిష్ మీడియంను వ్యతిరేకిస్తున్న, వారి నాణ్యమైన చదువు లను వ్యతిరేకిస్తున్న పెత్తందార్లను చావచితక్కొట్టడానికి ఇదో అవకాశం. పేదల సాధికారతను, మహిళల సాధికారతను సహిం చలేకపోతున్న పెత్తందార్లను పరుగెత్తించడానికి ఇంకో వారం రోజుల్లో అమూల్యమైన అవకాశం ఉన్నది. బలహీన వర్గాలకు ఉన్నత పదవులు ఇస్తే, ఎక్కువ సంఖ్యలో ఎమ్మెల్యే టిక్కెట్లు, ఎంపీ టిక్కెట్లు కేటాయిస్తే ఓర్వలేకపోతున్న పెత్తందార్లకు బుద్ధి చెప్పడానికి ఇదో గొప్ప అవకాశం. అబద్ధాలనూ, అభూత కల్పనలనూ, కట్టుకథలనూ ప్రచారంలో పెడుతూ ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించడమే గాక సమాజంలో అశాంతిని రేకెత్తి స్తున్న పెత్తందారీ తోడేళ్లను తరిమి తరిమి కొట్టడానికి ఇంతకంటే మంచి అవకాశం ఏముంటుంది?


vardhelli1959@gmail.com

శ్రామిక వర్గ మహోపాధ్యాయుడు

ప్రపంచాన్ని మలుపుతిప్పిన ఘటనల్లో ఒకటి కమ్యూ నిస్ట్ సిద్ధాంతకర్త కారల్ మార్క్స్ జననం. జర్మనీ (ప్రష్యా)లో పుట్టిన ఆయన విద్యాభ్యాసం అనంతరం పాత్రికేయ వృత్తిని ఎంచుకున్నారు. కొంతకాలం తర్వాత ఫ్రాన్స్ వెళ్ళారు. అక్కడే ఆయన జీవితకాల ఉద్యమ సిద్ధాంత మిత్రుడు ఫ్రెడరిక్ ఏంగిల్స్‌ను కలుసు కున్నారు. ఫ్రాన్స్ ఆయన్ని దేశం నుంచి బహిష్కరించడంతో ముందు బెల్జియం ఆ తర్వాత ఇంగ్లండ్ (లండన్) వెళ్లి మిగిలిన జీవితమంతా తన భార్యాబిడ్డలతో అక్కడే గడిపారు.

మార్క్స్ తన జీవిత కాల మిత్రుడు, సహచరుడు, సిద్ధాంతకర్త అయిన ఫ్రెడరిక్ ఏంగిల్స్‌తో కలిసి 'కమ్యూ నిస్టు లీగు' ఏర్పాటు చేసి 1848లో 'కమ్యూనిస్టు ప్రణా ళిక'ను ఏంగిల్స్‌తో కలిసి రాశారు. 1867లో 'దాస్ క్యాపి టల్' మొదటి వాల్యూమ్‌ను ప్రచురించారు.

మానవ సమాజ సమూహ సంబంధాలు అన్నిటినీ కార్ల్ మార్క్స్ 'ఫ్రెడరిక్ ఏంగిల్స్‌లు శాస్త్రీయంగా నిరూ పించారు. ఆదిమ కమ్యూనిస్టు సమాజం నుండి బానిస సమాజం, బానిస సమాజం నుండి ఫ్యూడల్ సమాజం, ఫ్యూడల్ భూస్వామ్య సమాజం నుండి పెట్టుబడిదారీ సమాజం, పెట్టుబడిదారీ సమాజం నుండి సోషలిస్టు సమాజానికి మానవ సమాజం ఎలా పరిణామం చెందు తుందో... సోషలిస్టు సమాజం నుండి అంతిమంగా కమ్యూనిస్టు సమాజం వైపు వర్గరహిత సమాజం వైపు ఎలా మానవ సమాజం ప్రయాణిస్తుందో శాస్త్రీయంగా



మార్క్స్–ఏంగెల్స్‌లు నిరూపించారు, సిద్ధాంతీకరిం చారు. మానవ సమాజ పరిణామ క్రమంలో శ్రమ పాత్రనూ, శ్రమ ఔన్నత్యాన్నీ, సర్వసంపదలకు శ్రమే మూలం అన్న విషయాన్నీ మొట్టమొదటిసారిగా ప్రపం చంలో సిద్ధాంతీకరించిన తత్వవేత్తలు కారల్ మార్క్స్, ఏంగెల్స్‌లు. కార్మికుని అదనపు శ్రమే 'పెట్టుబడి' అనే విషయాన్ని బహుముఖ కోణాల నుంచి పరిశోధన చేసి 'దాస్ క్యాపిటల్'ను ప్రపంచానికి అందించారు. గతి తర్కాన్ని, చారిత్రిక భౌతిక వాదాన్నీ, తలకిందులుగా ఉన్న హెగెల్ తత్వ శాస్త్రాన్నీ, అందులోని భావవాదాన్నీ సరిదిద్ది భౌతిక వాదం తన కాళ్ళ మీద తను నిలబడే టట్లుగా రూపొందించారు మార్క్స్.

అభివృద్ధి నిరోధకమైన పాత వ్యవస్థ, అభివృద్ధి కరమైనటువంటి కొత్త వ్యవస్థను అనుమతించదు. అందుచే బల ప్రయోగం ద్వారా పాత అభివృద్ధి నిరోధక వ్యవస్థను నెట్టివేయాలనీ, కూలదోయాలనీ మార్క్స్ శాస్త్రీయంగా వివరించారు.

మార్క్స్ తదనంతరం పెట్టుబడిదారీ వ్యవస్థ సామ్రాజ్యవాద రూపం తీసుకున్నది. పెట్టుబడిదారీ వ్యవస్థ ఉన్నత రూపమే సామ్రాజ్యవాదం అని లెనిన్ సిద్ధాంతీకరించారు. మార్క్సిజాన్ని రష్యా పరిస్థితులకు అన్వయించి కార్మిక వర్గ నాయకత్వాన, కర్షకవర్గం మైత్రితో లెనిన్ సోషలిస్ట్ విప్లవాన్ని విజయవంతం చేశారు.

– మన్నవ హరిప్రసాద్, సీపీఐ (ఎమ్ఎల్) రెడ్ స్టార్ పొలిట్ బ్యూరో సభ్యుడు

(నేడు కారల్ మార్క్స్ జయంతి)

ఎవరు శ్రేష్ఠులు?

ఈ ప్రపంచంలో కొందరు భగవంతుడి ఉనికినే గుర్తించరు. గుర్తించే వాళ్ళను అంధు లనీ, మూర్ఖులనీ దూషిస్తుంటారు. వీళ్ళు నాస్తికులు. అయితే, 'కలడు, కలండనెడివాడు కలడో, లేడో!' అని అప్పుడప్పుడు ఆస్తికులకు అనుమానం వచ్చినట్టు, 'లేడు, లేడు అనెడివాడు ఉన్నాడేమో?' అని నాస్తికులకూ సందేహం వస్తుంది కాబోలు. వయసు పెరిగిన తరువాత ఎందరో నాస్తికులు ఆస్తికులుగా మారడం కనిపిస్తుంది. ప్రపంచ జనాభాలో 95 శాతం భగవంతుడు ఒకడున్నాడని విశ్వసించేవాళ్ళే అని గూగుల్ సమాచారం. వీళ్ళలో చాలామంది, ఆయనను ప్రార్థిస్తే, తమ కోరికలు తీరుస్తాడని కూడా నమ్ముతారు.

జ్యోతిర్మయం

'దేవుడా! ఆపద వచ్చింది. దీన్నెలాగైనా తొలగించు!' అని ప్రార్థించేవాళ్ళు కొందరు. ఎప్పటికప్పుడు ఇప్పుడు వచ్చిన కష్టం పోగొట్టమంటారు. 'ఆర్తులు'. 'స్వామీ! ధనం ఇప్పించు, ఇల్లు ఇప్పించు, సంతానం ఇప్పించు...' అని ప్రార్థించేవాళ్ళు కొందరు. 'అర్థార్థులు'. ఒక కోరిక తీరితే సంతోషిస్తారు, కానీ మరి కాసేపటికి, 'స్వామీ! ఇంకొంచెం ధనం, ఇంకాస్త బంగారం, మరో ఇల్లు...' అంటారు.

ఐహికమైన సుఖదుఃఖాలు రెండూ తాత్కాలికాలే అని అనుభవం వల్ల గ్రహించే వాళ్ళు కొందరు. భౌతిక సుఖదుఃఖాలకూ, శరీరానికీ అతీతమైన, శాశ్వతమైన ఉనికి తమకు ఉందని నమ్ముతూ, వీళ్ళు పరమాత్మ తత్వం దిశగా పఠన, శ్రవణ చింతనలు చేస్తుంటారు. వీళ్ళు 'జిజ్ఞాసువు'లు. వీళ్ళలో ఎన్నో స్థాయులు.

చాలాచాలా అరుదుగా 'జ్ఞాని'లుంటారు. బ్రహ్మమొక్కటేనని, దానిలో తమ ఐక్యత అనుభూతి చేసుకొని, సర్వ సమబుద్ధితో, సంతత చిదానందానుభవంతో ఆత్మారాము లుగా ఉండేవాళ్ళు. 'భక్తులందరూ నాకు ఇష్టులే. కానీ వాళ్ళలో జ్ఞాని శ్రేష్ఠుడు. ఆయనే నేను గనుక!' అంటాడు గీతాచార్యుడు శ్రీకృష్ణ పరమాత్మ.

– ఎం. మారుతి శాస్త్రి

'సాక్షి' మాక్ ఈఏపీసెట్‌కు విశేష స్పందన

క్వశ్చన్ పేపర్– 'కీ' సాక్షి ఎడ్యుకేషన్.కామ్‌లో

సాక్షి ఎడ్యుకేషన్: సాక్షి మీడియా గ్రూప్, ఐసీఎఫ్ఏఐ విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఏప్రిల్ 27, 28వ తేదీల్లో నిర్వహించిన సాక్షి మాక్ ఈఏపీసెట్–2024కు విద్యార్థుల నుంచి విశేష స్పందన లభించింది. ప్రముఖ సబ్జెక్ట్ నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ మాక్ టెస్టు వల్ల తాము ఎంతవరకు సిద్ధమయ్యాం?.. ఏఏ విభాగాల నుంచి ప్రశ్నలు వస్తాయి? ఏ ప్రశ్నలకు ముందుగా జవాబు రాయాలి? పరీక్షను ఎదుర్కొనే విధానం.. సమయ పాలన వంటి ముఖ్యమైన అంశాలపై అవగాహన కలిగిందని విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే సాక్షి మాక్ ఈఏపీసెట్–2024 క్వశ్చన్ పేపర్, 'కీ'ని సాక్షి ఎడ్యుకేషన్.కామ్ (www.sakshieducation.com)లో చూడొచ్చు. ప్రతి ఏడాది ఎంసెట్, నీట్ విద్యార్థుల కోసం అత్యున్నత ప్రమాణాలతో ఇలాంటి మాక్ టెస్టులు నిర్వహిస్తూ.. సాక్షి ఎడ్యుకేషన్.కామ్ విద్యార్థుల విజయానికి తోడ్పాటు అందిస్తున్న విషయం తెల్సిందే. ఈ ఏడాది తెలుగు రాష్ట్రాల్లో ఈఏపీసెట్, నీట్ పరీక్షలు రాస్తున్న విద్యార్థులకు సాక్షి ఎడ్యుకేషన్.కామ్ ఆల్ ది బెస్ట్ చెబుతోంది.

క్లుప్తంగా...

జొన్న రైతులు తక్కువ రేటుకు అమ్ముకోవద్దు

- ప్రభుత్వమే మద్దతు ధరకు కొనుగోలు చేస్తుంది: మంత్రి తుమ్మల



సాక్షి, హైదరాబాద్: జొన్న రైతులెవరూ తక్కువ ధరకు పంటను అమ్ముకోవద్దని, మార్క్‌ఫెడ్ రైతుల దగ్గరకు వచ్చి కొనుగోలు చేస్తుందని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులందరూ సద్వినియోగం చేసుకోవాలని శనివారం ఆయన ఒక ప్రకటనలో కోరారు. దీనికి తగిన చర్యలు తీసుకోవాలని మార్క్‌ఫెడ్ అధికారులను ఆదేశించారు. మార్క్‌ఫెడ్ ఇప్పటికే క్వింటాల్‌కు రూ. 3,180 చెల్లించి రైతుల వద్ద నుంచి పంట కొనుగోలు చేస్తోందని వెల్లడించారు. ఆదిలాబాద్, నిజామాబాద్ జిల్లాల్లో జొన్న పండించిన రైతుల విజ్ఞప్తి మేరకు, కొనుగోళ్లపై ఆ 2 జిల్లాలలో ఎకరాకు ఇంతకు ముందు ఉన్న 8.85 క్వింటాళ్ల పరిమితిని 12 క్వింటాళ్లకు పెంచుతున్నామని, ఆ పంట కొనుగోలుకు మార్క్‌ఫెడ్ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

బీజేపీపై రిజర్వేషన్ల రద్దు మరకను తొలగించుకోండి

- ప్రధాని మోదీకి ఆర్.కృష్ణయ్య లేఖ



సాక్షి, హైదరాబాద్: భారతీయ జనతా పార్టీ రిజర్వేషన్ల రద్దు మరకను తొలగించుకోవాలని, అందుకు చట్ట సభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించాలని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈసారి ఎన్నికల్లో బీజేపీకి 400 సీట్లు వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు తొలగిస్తారనే ప్రచారం జరుగుతోందన్నారు. ఇది తీవ్రమైన అంశంగా దేశ ప్రజలు భావిస్తున్నారని, దీనిపై స్పష్టత ఇవ్వాల్సిన అవసరం బీజేపీకి ఉందని అన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ప్రధాని మోదీకి లేఖ రాశారు. గత పదేళ్లలో బీసీలకు బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కనీసం ఈ ఎన్నికల్లో గెలిస్తే ఏం చేస్తారో చెప్పాలన్నారు. బీసీలకు చట్టసభల్లో 50 శాతం రిజర్వేషన్లు, కేంద్రంలో బీసీ మంత్రిత్వ శాఖ, కులగణన, బీసీ ఉద్యోగులకు పదోన్నతుల్లో రిజర్వేషన్లు, ఉన్నత చదువులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, కుల వృత్తిదారులకు రూ.20 లక్షల రాయితీ రుణాలు ఇస్తామని ప్రధాని మోదీతో బీజేపీ ప్రకటన చేయించాలని డిమాండ్ చేశారు. స్వాతంత్య్రం వచ్చి 75 ఏళ్లు గడిచినా బీసీలకు ఇంకా అన్ని రంగాల్లో సరైన వాటా దక్కలేదన్నారు. దేశవ్యాప్తంగా 2,652 బీసీ కులాలు ఉండగా.. అందులో 1,849 కులాల్లో అక్షరాస్యత లేదన్నారు.

షా డీప్‌ఫేక్ ప్రసంగం వీడియో సృష్టికర్త అరెస్టు

ఏఐసీసీ సోషల్ మీడియా జాతీయ సమన్వయకర్త అరుణ్‌రెడ్డిని సూత్రధారిగా తేల్చిన ఢిల్లీ పోలీసులు

దీని వెనక కాంగ్రెస్ ప్రముఖుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ



సాక్షి, న్యూఢిల్లీ: కేంద్ర హోంమంత్రి అమిత్ షా ప్రసంగ వీడియోను డీప్‌ఫేక్‌గా సృష్టించిన వ్యక్తిని ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి అరెస్టు చేశారు. అమిత్ షా వీడియోను ఏఐసీసీ సోషల్ మీడియా విభాగం జాతీయ సమన్వయకర్త అరుణ్‌రెడ్డి డీప్‌ఫేక్ చేశారని పోలీసులు నిర్ధారించారు. దీని వెనక కాంగ్రెస్ ప్రముఖుల హస్తం ఏమైనా ఉందా అనే కోణంలో విచారణ చేపట్టారు.

సృష్టించి.. సర్క్యులేట్ చేసి..

మెదక్‌లో ఏప్రిల్ 23న నిర్వహించిన సభలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా మాట్లాడుతూ మళ్లీ అధికారంలోకి వస్తే మతప్రాతిపదికన అమలవుతున్న ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని ప్రకటించారు. కానీ ఆ వ్యాఖ్యలకు సంబంధించిన వీడియోను అరుణ్‌రెడ్డి ఎడిట్ చేసి తాము అధికారంలోకి వస్తే ఎస్సీ, ఎస్టీ, బీసీ రిజర్వేషన్లు ఎత్తేస్తామని షా అన్నట్లుగా యాడ్ చేశారని ఢిల్లీ పోలీసులు చెప్పారు. అనంతరం ఆ వీడియోను ఏఐసీసీ, ఎన్ఎస్‌యూఐ, కాంగ్రెస్ పార్టీకి సంబంధించిన అన్ని వాట్సాప్ గ్రూపుల్లో అరుణ్‌రెడ్డి పోస్ట్ చేశారని పేర్కొన్నారు.

కేంద్ర హోంశాఖ ఫిర్యాదుతో..

షా డీప్‌ఫేక్ వీడియోను వీక్షించిన నెటిజన్లు బీజేపీపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. అలాగే దీనిపై ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ, తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి సహా మరికొందరు పార్టీ నేతలు స్పందించారు. బీజేపీ అధికారంలోకి వస్తే కచ్చితంగా ఎస్సీ, ఎస్టీలకు అన్యాయం జరుగుతుందని వారు బహిరంగ సభల్లో చెప్పుకొచ్చారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన కేంద్ర హోంశాఖ ఇండియన్ సైబర్ క్రైం కోఆర్డినేషన్ సెంటర్ (ఐ4సీ) ద్వారా ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీనిపై గత నెల 28న ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

నేడు మరో అరెస్టుకు అవకాశం..

వీడియో సృష్టికర్త అరుణ్‌రెడ్డి కాగా దాన్ని వైరల్ చేసింది మాత్రం తెలంగాణకు చెందిన వ్యక్తేనంటూ సోషల్ మీడియా ప్లాట్‌ఫాం 'ఎక్స్' ఇప్పటికే ఢిల్లీ స్పెషల్ సెల్ పోలీసులకు నివేదించింది. దీంతో ఇందుకు సంబంధించిన ఆధారాలను ఆదివారంలోగా తమకు సమర్పించాలని 'ఎక్స్'తోపాటు 'ఫేస్‌బుక్'ను పోలీసులు కోరారు. ఆదివారంలోగా ఆ డీప్‌ఫేక్ వీడియోను సోషల్ మీడియాలో తొలిసారి పోస్ట్ చేసిన వ్యక్తిని గుర్తించి అరెస్టు చేయనున్నారు.

7న మేడిగడ్డకు జస్టిస్ చంద్రఘోష్!

- ఈ నెల 6–12 తేదీల మధ్య రాష్ట్రంలో పర్యటించనున్న ఎంక్వైరీ కమిషన్
- వీలైతే 8న అన్నారం బ్యారేజీకి వెళ్లే అవకాశం
- 9న అధికారులతో సమావేశాలు
- 12న తిరిగి కోల్‌కతాకు జస్టిస్ చంద్రఘోష్



సాక్షి, హైదరాబాద్: జస్టిస్ పీసీ చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 7న మేడిగడ్డ బ్యారేజీని సందర్శించనుంది. గతేడాది అక్టోబర్ 21న కాళేశ్వరం ప్రాజెక్టులో భాగమైన మేడిగడ్డ బ్యారేజీలోని ఏడో బ్లాక్ కుంగిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టులోని లోపాలపై విచారణకోసం ఏర్పాటైన జస్టిస్ చంద్రఘోష్ కమిషన్ ఈ నెల 6 నుంచి 12 వరకు రాష్ట్రంలో రెండో విడత పర్యటన నిర్వహించనుంది. 6న హైదరాబాద్‌కు చేరుకుని సాయంత్రం 5 గంటలకు బీఆర్‌కేఆర్ భవన్‌లోని తన కార్యాలయంలో జస్టిస్ చంద్రఘోష్, నీటిపారుదల శాఖ కార్యదర్శితో సమావేశం కానున్నారు. మరుసటి రోజు ఉదయం మేడిగడ్డ బ్యారేజీ సందర్శనకు బయలుదేరనున్నారు. బ్యారేజీని పరిశీలించిన అనంతరం ఆయన రాత్రి రామగుండంలో బస చేస్తారు. మేడిగడ్డ బ్యారేజీకి మాత్రమే భారీ నష్టం జరగడంతో ప్రస్తుతానికి ఈ బ్యారేజీని మాత్రమే సందర్శించాలని జస్టిస్ చంద్రఘోష్ నిర్ణయించారు. 8న ఉదయం ఆయన రామగుండం నుంచి బయలుదేరి హైదరాబాద్‌కు చేరుకుంటారు. వీలైతే దగ్గరల్లో ఉన్న అన్నారం బ్యారేజీని తొలుత సందర్శించి తర్వాత హైదరాబాద్‌కు చేరుకునే అవకాశాలున్నాయి. 9న ఉదయం 10.30 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు నీటిపారుదల శాఖ అధికారులతో సమావేశమై న్యాయవిచారణలో తదుపరి తీసుకోవాల్సిన చర్యలను చర్చిస్తారు. బ్యారేజీల నిర్మాణానికి సంబంధించిన నిర్ణయాల్లో భాగస్వాములైన అధికారులు, ప్రజాప్రతినిధులను గుర్తించి వారికి నోటీసులు జారీ చేసే అంశంపై ఈ సమావేశంలో నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఈ నెల 10, 11 తేదీలను జస్టిస్ పీసీ చంద్రఘోష్ రిజర్వ్ చేశారు. 12న ఆయన తిరిగి కోల్‌కతాకు బయలుదేరి వెళ్లనున్నారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల ప్లానింగ్, డిజైనింగ్, నిర్మాణంలో చోటుచేసుకున్న నిర్లక్ష్యం, అక్రమాలు, లోపాలు, అవినీతి, ప్రజాధనం దుర్వినియోగంపై న్యాయ విచారణ జరపడానికి సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ చంద్రఘోష్‌ను కమిషన్ ఆఫ్ ఎంక్వైరీగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన విషయం తెలిసిందే.

రాష్ట్రానికి కేంద్ర నిధులపై చర్చిద్దామా?

సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సవాల్

- కొడంగల్ సహా ఎక్కడైనా, ఎప్పుడైనా చర్చకు నేను రెడీ
- యూపీఏ, ఎన్డీఏ పాలనలో తెలంగాణకు వచ్చిన నిధులపై చర్చకు రావాలని పిలుపు
- ఆధారాలతో సహా ప్రజల ముందు చర్చిద్దామంటూ బహిరంగ లేఖ
- మంచి సంప్రదాయాన్ని నెలకొల్పుదామని సూచన.. సీఎం సానుకూలంగా స్పందిస్తారని ఆశాభావం



సాక్షి, హైదరాబాద్

తెలంగాణకు ఎవరి హయాంలో ఎక్కువ నిధులొచ్చాయో చర్చకు రావాలని సీఎం రేవంత్‌రెడ్డికి కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి సవాల్ విసిరారు. ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ ప్రాంతానికి 2004–14 మధ్య యూపీఏ సర్కార్ ఇచ్చిన నిధులు, 2014–24 మధ్య తమ ఎన్డీయే పాలనలో తెలంగాణ రాష్ట్రానికి అందించిన నిధులపై అర్థవంతమైన చర్చ చేపడదామన్నారు. ఎవరి పాలనలో ఎక్కువ నిధులొచ్చాయో ఆధారాలతో ప్రజల ముందు చర్చిద్దామని సూచించారు. మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో తెలంగాణకు రూ. 9 లక్షల కోట్లకుపైగా నిధులు అందించిందని పునరుద్ఘాటించారు. ఈ ప్రకటనతో విభేదిస్తే తనతో సీఎం చర్చకు రావాలన్నారు. ఈ మేరకు సీఎం రేవంత్‌కు కిషన్‌రెడ్డి శనివారం బహిరంగ లేఖ రాశారు. 'కొడంగల్ లేదా అమరవీరుల స్తూపం లేదా కృష్ణా, గోదావరి ఒడ్డునైనా సరే తాను చర్చకు సిద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారు. స్థలం, సమయం, తేదీ నిర్ణయించాలని రేవంత్‌ను లేఖలో కోరారు. అయితే చర్చ సందర్భంగా ఉపయోగించే భాష హుందాగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. తన సవాల్‌ను స్వీకరించి అర్థవంతమైన చర్చలో పాల్గొనేందుకు సీఎం సానుకూలంగా స్పందిస్తారని ఆశిస్తున్నట్లు తెలిపారు. తద్వారా ఒక మంచి సంప్రదాయానికి శ్రీకారం చుడదామన్నారు.

'గాడిద గుడ్డు'ను ఖండిస్తున్నాం..

'2014–24 కాలంలో కేంద్రంలోని మోదీ ప్రభుత్వం తెలంగాణకు ఇచ్చింది గాడిద గుడ్డు అంటూ మీరు, కాంగ్రెస్ నేతలు వ్యాఖ్యానించడం తీవ్ర అభ్యంతరకరం. దీనిని బీజేపీ తీవ్రంగా ఖండిస్తోంది. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా, మోదీ కేబినెట్‌లో భాగస్వామిగా వ్యక్తిగతంగానూ ఈ ప్రచారాన్ని తీవ్రంగా ఖండిస్తున్నా'అని కిషన్‌రెడ్డి లేఖలో స్పష్టంచేశారు. ఇలా దుష్ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదోవ పట్టించడం ముఖ్యమంత్రి పదవినే దిగజారుస్తుందని మండిపడ్డారు.

అబద్ధాల ప్రచారం సరికాదు..

'పీసీసీ అధ్యక్షుడిగా, కాంగ్రెస్ పార్టీకి చెందిన ముఖ్యమంత్రిగా గతంలో యూపీఏ సాధించిన ఘనతలు, విజయాలను మీరు ప్రచారం చేసుకోవచ్చు. ఎన్డీయే ప్రభుత్వ పాలనా వైఫల్యాలను కూడా మీరు విమర్శించవచ్చు. కానీ మీరు, మంత్రులు, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో అబద్ధాలను ఆశ్రయించడం చాలా దురదృష్టకరం. ఇది ప్రజలను తప్పుదోవ పట్టించడమే'అవుతుంది అని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు.

యూపీఏ హయాంలో తెలంగాణకు వచ్చింది రూ. 45 వేల కోట్లే

'మోదీ ప్రభుత్వం గత పదేళ్లలో తెలంగాణకు రూ. 9 లక్షల కోట్లకుపైగా నిధులిచ్చింది. కేవలం కేంద్ర పన్నుల్లో రాష్ట్ర వాటా, జీఎస్టీ పరిహారం కిందనే ఏకంగా రూ. 2 లక్షల కోట్లు తెలంగాణకు విడుదల చేసింది. యూపీఏ ప్రభుత్వం ఉమ్మడి ఏపీకి రూ. 1.32 లక్షల కోట్లు ఇచ్చింది. అందులో తెలంగాణ వాటా రూ. 45,000 కోట్లు మించదు. అంటే యూపీఏ హయాంలోకన్నా మోదీ ప్రభుత్వం తెలంగాణ కు 4 రెట్లు ఎక్కువ నిధులిచ్చింది. 1947 నుంచి 20 14 వరకు 67 ఏళ్లలో తెలంగాణలో 2,500 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం జరిగితే మోదీ ప్రభుత్వం రూ. 1.09 లక్షల కోట్లకుపైగా వెచ్చించి కొత్తగా మరో 2,500 కి.మీ జాతీయ రహదారులు నిర్మించింది. నిర్మాణానికి 100%, భూసేకరణకు 50% కేంద్ర నిధులతో నిర్మిస్తున్న రీజినల్ రింగ్ రోడ్డు సహా మరో 2,500 కి.మీ జాతీయ రహదారుల నిర్మాణం పూర్తి చేయాల్సి ఉంది. రూ.6,338 కోట్లతో రామగుండం ఎరువుల కర్మాగారం పునరుద్ధరించాం. 1,600 మెగావాట్ల ఎన్టీపీసీ విద్యుత్ ప్లాంట్ అందుబాటులోకి తెచ్చాం'అని కిషన్‌రెడ్డి తెలిపారు.

తుది ఉత్తర్వులకు లోబడి పోస్టులు

- గ్రూప్–1లో ఎస్టీ రిజర్వేషన్లపై హైకోర్టు
- రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ
- తదుపరి విచారణ జూన్ 28కి వాయిదా

సాక్షి, హైదరాబాద్: గ్రూప్–1లో ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి పోస్టుల కేటాయింపు తాము ఇచ్చే తుది ఉత్తర్వులకు లోబడి ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. ఎస్టీ రిజర్వేషన్ల పెంపుపై వివరణ ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. 'ఏదైనా ఒక రాష్ట్రంలో ఒక వర్గానికి రిజర్వేషన్ పెంపు అమలు చేయాలంటే సంబంధిత సామాజిక వర్గం వెనుకబాటుతనాన్ని అధ్యయనం చేయడంతోపాటు సరైన గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి నివేదించాలి. ఆ నివేదికను ఆధారం చేసుకొని రాజ్యాంగ సవరణ ద్వారా రాష్ట్రపతి ఆమోదం పొందాకే రిజర్వేషన్ పెంపు జరగాలి. కానీ రాష్ట్రంలో ఎస్టీ రిజర్వేషన్ పెంపు విషయంలో ఇలాంటి కసరత్తు ఏదీ చేయకుండానే 6 నుంచి 10 శాతానికి పెంచుతూ ప్రభుత్వం 2022 సెప్టెంబర్‌లో జీవో నంబర్ 33 జారీ చేసింది. ఈ జీవో సహేతుకం కాదు. జీవోను కొట్టేస్తూ ఆదేశాలు జారీ చేయాలి' అని హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలైంది. దీనిపై జస్టిస్ అభినంద్‌కుమార్ షావిలీ, జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది.

రిజర్వేషన్లు 50 శాతం దాటకూడదు..


పిటిషనర్ తరపు న్యాయవాది వాదిస్తూ 'తెలంగాణలో ఎస్టీ రిజర్వేషన్లను 6 నుంచి 10 శాతానికి పెంచడంతో సామాజిక రిజర్వేషన్లు (ఎస్సీ, ఎస్టీ, బీసీ) రిజర్వేషన్లు 54 శాతానికి పెరిగాయి. గతంలో సుప్రీంకోర్టు ఇంద్రసాహ్నీ కేసులో సామాజిక రిజర్వేషన్ల కోటా 50 శాతానికి మించకూడదంటూ తీర్పు ఇచ్చింది. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో రాజ్యాంగ విరుద్ధం. అలాగే ఇది రాజ్యాంగంలోని ఆర్టికల్ 14, 15, 16 ఉల్లంఘన కిందకు వస్తుంది' అని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. సీఎస్‌తోపాటు న్యాయ శాఖ, జీఏడీ, ఎస్టీ సంక్షేమ ముఖ్యకార్యదర్శి, టీఎస్‌పీఎస్సీకి నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను జూన్ 28కి వాయిదా వేసింది. ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశించింది.

'రాజ్యాంగం నుంచి సెక్యులర్ పదాన్ని తొలగిస్తారా?'

సాక్షి, హైదరాబాద్: బీజేపీ అసలు బండారం బయటపడిందని టీపీసీసీ సీనియర్ ఉపాధ్యక్షుడు గోపిశెట్టి నిరంజన్ వ్యాఖ్యానించారు. మళ్లీ అధికారంలోకి వస్తే రాజ్యాంగంలోని సెక్యులర్ అనే పదాన్ని తొలగిస్తామని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్‌కుమార్ చేసిన వ్యాఖ్యలే ఆ పార్టీ వైఖరిని తేటతెల్లం చేశాయని చెప్పారు. శనివారం గాంధీభవన్‌లో నిరంజన్ విలేకరులతో మాట్లాడుతూ బీజేపీ అధికారంలోకి వస్తే రాజ్యాంగం నుంచి సెక్యులర్ అనే పదాన్ని తొలగిస్తారో లేదో ప్రధాని మోదీ, బీజేపీ అగ్రనేత అమిత్‌షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.

'నీట్' మాల్ ప్రాక్టీస్‌కు చెక్!

- కొత్త రూల్స్ ప్రవేశపెట్టిన ఎన్టీఏ
- పరీక్ష మొదలైన గంట... ముగియడానికి అరగంట ముందు వాష్ రూమ్‌కు వెళ్లకూడదు
- నేడు తెలంగాణలో నీట్ పరీక్షకు 80 వేల మంది హాజరు!



సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్, బీఏఎంఎస్ తదితర యూజీ మెడికల్ కోర్సుల్లో ప్రవేశానికి ఆదివారం నిర్వహించే నీట్ పరీక్షకు జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్టీఏ) కఠిన నిబంధనలు విధించింది. మాల్ ప్రాక్టీస్ జరగకుండా కొత్త రూల్స్ ప్రవేశపెట్టింది. ఎగ్జామ్ ప్రారంభమైన మొదటి గంట, అదే విధంగా ఎగ్జామ్ ముగియడానికి చివరి అర్ధగంట కనీసం వాష్ రూమ్‌కు కూడా అనుమతించొద్దని నిర్ణయం తీసుకుంది. ఎగ్జామ్ రాస్తున్న విద్యార్థులు సరికొత్త టెక్నాలజీ, గాడ్జెట్స్ ఉపయోగించి మాల్ ప్రాక్టీస్ చేయకుండా అడ్డుకునేందుకు ఈ రూల్స్ తీసుకొచ్చినట్టు తెలిసింది.

నిబంధనలు ఏంటంటే..: నీట్ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు నియమ నిబంధనలు పక్కాగా పాటించాల్సిందే. విద్యార్థులు అడ్మిట్ కార్డుతోపాటు ఒక పాస్ పోర్ట్ సైజ్ ఫొటో తీసుకెళ్లాలి. నీట్ పరీక్షకు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా పాటించాలి. పొడవాటి దుస్తులు, షూస్ లాంటివాటిని అనుమతించరు. కేవలం స్లిప్పర్స్, శాండిల్స్ లాంటివి మాత్రమే ధరించాలి. పేపర్లు, ప్లాస్టిక్ వాచీలు, పెన్ డ్రైవ్స్, వాలెట్లు, హ్యాండ్ బ్యాగ్, బ్లూటూత్, మొబైల్, స్మార్ట్ వాచ్ లాంటి వాటికి అనుమతి లేదు. ఎలక్ట్రానిక్ కమ్యూనికేషన్ లాంటి వస్తువులను కూడా అనుమతించరు. పరీక్ష రాసే విద్యార్థులకు హాలులోనే బాల్ పాయింట్ పెన్నును అందిస్తారు.

రాష్ట్రం నుంచి 80 వేల మంది విద్యార్థులు...

తెలంగాణ నుంచి 80 వేల మంది విద్యార్థులు నీట్ పరీక్షను రాస్తున్నట్టు తెలుస్తోంది. గత ఏడాది 70 వేల మంది ఈ పరీక్ష రాయగా, ఈసారి మరో 10 వేల మంది అదనంగా నీట్ పరీక్ష రాస్తున్నట్టు అధికార వర్గాలు వెల్లడించాయి. పరీక్షకు దేశం నలుమూలల నుంచి 18 లక్షల మందికి పైగా విద్యార్థులు హాజరు కానున్నట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. దేశవ్యాప్తంగా 499 పట్టణాలలో పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు.

గంట ముందే చేరుకోవాలి: పెన్ను, పేపర్ ద్వారానే నీట్ పరీక్ష రాయాల్సి ఉంటుంది. మధ్యాహ్నం 2 గంటల నుంచి 5.20 గంటల వరకు జరగబోయే ఈ పరీక్షకు విద్యార్థులు అన్ని నియమాలు పాటిస్తూ, పరీక్షా కేంద్రానికి ఒక గంట ముందే రావాలని అధికారులు సూచిస్తున్నారు. కొన్ని పట్టణాలలో ఒకే పేరు మీద డిగ్రీ, పీజీ లాంటి కాలేజీలు చాలా ఉంటాయి. దీంతో ఒకటికి రెండుసార్లు పరీక్షా కేంద్రాన్ని చెక్ చేసుకోవాలి. మధ్యాహ్నం 1.15 కల్లా పరీక్షా కేంద్రం దగ్గరకు చేరుకోవాలి. 1.30 గంటల తర్వాత విద్యార్థులను హాల్‌లోకి అనుమతించరు. 1.45కి బుక్ లెట్ పేపర్లు ఇస్తారు. 1.50 నుంచి 2 గంటల వరకు విద్యార్థులు తమ వివరాలను బుక్ లెట్లో నింపాల్సి ఉంటుంది. 2 గంటలకి ప్రశ్నపత్రాన్ని ఇవ్వడంతో పరీక్ష మొదలవుతుంది. నీట్ ఫలితాలు జూన్ 14న వెలువడనున్నాయి. అదే నెలలో రెండో వారం తర్వాత నుంచి కౌన్సెలింగ్ ప్రారంభం అవుతుందని అధికారులు చెబుతున్నారు.

వచ్చే ఐదేళ్లు అవినీతిపై యుద్ధమే

అవినీతిపరులపై చట్టపరంగా కఠినచర్యలు తప్పవు

- 25 ఏళ్లుగా పదవుల్లో ఉన్న నాపై అవినీతి ఆరోపణల్లేవు
- నాకు సొంత ఇల్లు, సొంత సైకిలు కూడా లేదు
- ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టీకరణ
- జార్ఖండ్, బిహార్, ఉత్తరప్రదేశ్‌లలో ఎన్నికల ప్రచారం



జార్ఖండ్‌లోని లోహర్‌దాగాలో మాట్లాడుతున్న ప్రధాని మోదీ

సిసాయ్/దర్భంగా: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే అవినీతిపరుల ముసుగు తొలగించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. రాబోయే ఐదేళ్లలో అవినీతిపై యుద్ధం సాగిస్తామని, అవినీతి తిమింగలాలపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవడం తథ్యమని స్పష్టం చేశారు. అవినీతి, అక్రమాలకు పాల్పడినవారు ఇక తప్పించుకోలేరని తేల్చిచెప్పారు. శనివారం జార్ఖండ్‌లోని సిసాయ్, పాలాము, బిహార్‌లోని దర్భంగాలో లోక్‌సభ ఎన్నికల ప్రచార సభల్లో ప్రధాని మోదీ ప్రసంగించారు. ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అవినీతిలో కూరుకుపోయిన కాంగ్రెస్‌తోపాటు విపక్ష 'ఇండియా' కూటమి నేతలు అవినీతిపరులకు మద్దతుగా రాంచీలో, ఢిల్లీలో ర్యాలీలు నిర్వహించారని మండిపడ్డారు. జనం సొమ్ము దోచుకున్నవారికి మద్దతుగా మాట్లాడారని, వారి అసలు రంగు బయటపడిందని పేర్కొన్నారు. తప్పుడు పనులు చేసినందుకే జార్ఖండ్ మాజీ ముఖ్యమంత్రి(హేమంత్ సోరెన్) ఇప్పుడు జైలులో ఊచలు లెక్కిస్తున్నాడని చెప్పారు. అవినీతి భూతాన్ని భూస్థాపితం చేయడానికి తాను కట్టుబడి ఉన్నానని తెలిపారు. ఎన్నికల సభల్లో నరేంద్ర మోదీ ఇంకా ఏం చెప్పారంటే..

యూపీఏ పాలనలో ఆకలి చావులు

''అభివృద్ధిలో గిరిజన ప్రాంతాలు వెనుకంజలోనే ఉండిపోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వాలే కారణం. 2004 నుంచి 2014 దాకా యూపీఏ ప్రభుత్వ పాలనలో ఆహార ధాన్యాలు గోదాముల్లో పందికొక్కుల పాలయ్యాయి. అప్పట్లో ఎంతోమంది గిరిజనుల బిడ్డలు తగిన ఆహారం లేక ఆకలితో మాడిపోయారు. సోనియా గాంధీ–మన్మోహన్‌సింగ్ నాయకత్వంలోని కాంగ్రెస్ రాచరిక పాలనలో గిరిజనులు ప్రాణాలు కోల్పోయారు. మేము అధికారంలోకి వచ్చాక పరిస్థితి మారిపోయింది. పేదలకు ఉచితంగా రేషన్ సరుకులు ఇవ్వకుండా ప్రపంచంలోని ఏ శక్తి కూడా అడ్డుకోలేదు. ఇది మోదీ గ్యారంటీ. కాంగ్రెస్ హయాంలో పేదలకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించడాన్ని అప్పటి పాలకులు వ్యతిరేకించారు. కేవలం సంపన్నులకే ఆ సదుపాయం ఉండేది. మేమొచ్చాక మారుమూల ప్రాంతాల్లోనూ అందరికీ ఇంటర్నెట్ అందుతోంది. డేటాను చౌకగా అందుబాటులోకి తీసుకొచ్చాం. నేడు సోషల్ మీడియాలో యువత హీరోలుగా గుర్తింపు పొందుతున్నారు.

గోద్రా ఘటనపై బోగస్ నివేదిక

20 ఏళ్ల క్రితం గుజరాత్‌లో గోద్రా రైలు దహనం ఘటనకు బాధ్యులైన వారిని కాపాడేందుకు ఆర్జేడీ అధ్యక్షుడు(లాలూ ప్రసాద్ యాదవ్) ప్రయత్నించారు. కరసేవలకుపైనే నింద మోపారు. అప్పట్లో అధికారంలో ఉన్న కాంగ్రెస్‌తో ఆయన సహవాసం చేశారు. సోనియా మేడమ్ హయాంలోనే గోద్రా రైలు దహనం జరిగింది. 60 మందికిపైగా కరసేవకులు మరణించారు. ఈ ఘటనపై దర్యాప్తు చేయడానికి నియమించిన బెనర్జీ కమిషన్‌పై విపరీతమైన ఒత్తిడి తెచ్చారు. బోగస్ నివేదిక సమర్పించేలా జాగ్రత్తపడ్డారు. అసలు దోషులను కాపాడుతూ కరసేవకులనే బాధ్యులుగా చిత్రీకరించారు. ఆ నివేదికను న్యాయస్థానం చెత్తబుట్టలో పడేసింది. అసలు దోషులను గుర్తించి శిక్ష విధించింది. కొందరికి మరణశిక్ష పడింది'' అని ప్రధాని మోదీ వివరించారు.

సాధారణ జీవితం గడుపుతున్నా..

''కాంగ్రెస్ రాజకుమారుడు నోట్లో వెండి చెంచాతో పుట్టాడు. పేదల ఇళ్లను సందర్శిస్తూ కెమెరాలకు పోజులిస్తున్నాడు. నేను సాధారణ జీవితమే గడుపుతున్నా. పేదల కష్టాలు నాకు తెలుసు కాబట్టి వారి సంక్షేమం, అభివృద్ధి కోసం ఎన్నో పథకాలు ప్రారంభించా. దేశంలో సమూల మార్పులు తీసుకొచ్చి ప్రజల జీవితాల్లో వెలుగులు తీసుకురావాలన్నదే నా లక్ష్యం. నేను గత 25 ఏళ్లుగా ముఖ్యమంత్రిగా, ప్రధానమంత్రిగా పదవుల్లో ఉన్నప్పటికీ నాపై ఎలాంటి అవినీతి ఆరోపణలు లేవు. నాకు సొంత ఇల్లు, సొంత సైకిలు కూడా లేదు. జార్ఖండ్‌లో కాంగ్రెస్, జేఎంఎం నాయకులు అవినీతికి పాల్పడుతూ తరతరాలకు సరిపడా ఆస్తులు కూడబెట్టుకుంటున్నారు''

గిరిజనులపై అకృత్యాలు సహించం

''మావోయిస్టులపై కాంగ్రెస్ ప్రభుత్వాలు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఓటు బ్యాంక్‌ను కాపాడుకోవడానికి మావోయిస్టుల జోలికి వెళ్లలేదు. నిషేధిత తీవ్రవాద సంస్థలు గిరిజన మహిళలపై అత్యాచారాలకు, అరాచకాలకు పాల్పడుతున్నాయి. గిరిజనుల భూములను లూటీ చేస్తున్నాయి. ఇలాంటి అకృత్యాలు సహించే ప్రసక్తే లేదు''



ఎన్నికల విచిత్రం

పశ్చిమ బెంగాల్‌లోని నాదియా జిల్లా రాణాఘాట్‌లో శనివారం జరిగిన ఎన్నికల ప్రచార కార్యక్రమంలో కళాకారులతో కలిసి అడుగు వేస్తున్న టీఎంసీ అధినేత్రి, ముఖ్యమంత్రి మమతా బెనర్జీ

ఉగ్ర ఘాతుకం



- కశ్మీర్‌లో వాయుసేన జవాన్ల కాన్వాయ్‌పై కాల్పులు
- ఒక జవాను వీరమరణం
- నలుగురికి గాయాలు

జమ్మూ: జమ్మూకశ్మీర్‌లోని పూంఛ్ జిల్లాలో భారత వాయుసేన జవాన్ల వాహనశ్రేణిపై ఉగ్రవాదులు జరిపిన మెరుపుదాడిలో ఒక జవాను ప్రాణాలు కోల్పోయారు. నలుగురు గాయపడ్డారు. బలగాలు సనాయ్‌టోప్‌లోని శిబిరానికి తిరిగొస్తుండగా సురాన్‌కోటె పరిధిలోని షాసితార్ ప్రాంతంలో శనివారం సాయంత్రం 6.15 గంటలకు ఉగ్రవాదులు కాల్పులతో తెగబడ్డారు. ఒక వాహనం విండ్ స్క్రీన్‌పై డజనుకుపైగా బుల్లెట్ల దాడి ఆనవాళ్లు కనిపిస్తున్నాయి. ఏకే రకం రైఫిళ్లతో దాడి చేసిన ఉగ్రవాదులు తర్వాత సమీప అడవిలోకి పారిపోయారు. గాయపడిన జవాన్లకు ఉధమ్‌పూర్‌లోని కమాండ్ ఆస్పత్రిలో చికిత్సచేస్తున్నారు. దాడి విషయం తెల్సి అప్రమత్తమైన సైన్యం, పోలీసులు వెంటనే గాలింపు చర్యలు చేపట్టారు. రాష్ట్రీయ రైఫిల్స్ బృందాలు అణువణువునా గాలిస్తున్నాయి. కాన్వాయ్ సురక్షితంగా ఉందని, దర్యాప్తు కొనసాగుతోందని వాయుసేన 'ఎక్స్'లో పోస్ట్‌చేసింది. గత ఏడాది డిసెంబర్ 21న ఇక్కడి దగ్గర్లోని బఫ్లియాజ్‌లో సైన్యంపై మెరుపుదాడి చేసి నలుగురిని పొట్టనబెట్టుకున్న ఉగ్రముఠాయే ఈ దాడికి పాల్పడి ఉంటుందని అనుమానిస్తున్నారు. పూంఛ్‌లో గత రెండేళ్లుగా ఉగ్రదాడులు జరుగుతున్నాయి.

కిడ్నాప్ కేసులో రేవణ్ణ అరెస్ట్

కస్టడీలోకి తీసుకుని ప్రశ్నిస్తున్న సిట్ అధికారులు



రేవణ్ణను అరెస్ట్ చేసి తీసుకెళ్తున్న సిట్ అధికారులు

సాక్షి, బెంగళూరు: మహిళ కిడ్నాపింగ్ కేసులో ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక జేడీ(ఎస్) సీనియర్ నేత, పార్టీ ఎమ్మెల్యే హెచ్‌డీ రేవణ్ణను సిట్ పోలీసులు శనివారం అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసులో అరెస్ట్ నుంచి రక్షణ కోరుతూ ఆయన పెట్టుకున్న ముందస్తు బెయిల్‌ను ప్రజాప్రతినిధుల న్యాయస్థానం నిరాకరించిన వెంటనే సిట్ రేవణ్ణను అదుపులోకి తీసుకోవడం గమనార్హం. గతంలో రేవణ్ణ ఇంట్లో పనిచేసిన బాధితురాలిని రేవణ్ణ అనుచరుడు సతీశ్ బాబన్న కిడ్నాప్ చేశాడని బాధితురాలి కుమారుడు గురువారం రాత్రి మైసూరులో ఫిర్యాదుచేయదంతో పోలీసులు రంగంలోకి దిగారు. శనివారం బెంగళూరులోని పద్మనాభనగర్‌లోని మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడ నివాసంలో ఉన్న రేవణ్ణను అక్కడే అరెస్ట్‌చేశారు. తర్వాత ఆయనను బౌరింగ్ ఆస్పత్రికి వైద్యపరీక్షల కోసం తీసుకెళ్లారు. ఈ కేసులో రేవణ్ణ సహచరుడు సతీశ్‌ను ఇప్పటికే అరెస్ట్‌చేశారు. ఈ కేసులో నిర్బంధంలో ఉన్న మహిళను మైసూరు జిల్లాలోని కలెనహళ్లి గ్రామంలోని ఫామ్ హౌజ్‌లో పోలీసులు శనివారం కాపాడారు.

ప్రజ్వల్‌పై బ్లూ కార్నర్ నోటీస్!: లైంగిక దౌర్జన్యం ఆరోపణలు ఎదుర్కొంటున్న కర్ణాటక హసన్ సిట్టింగ్ ఎంపీ ప్రజ్వల్‌పై నమోదైన కేసులో విచారణను సిట్ వేగవంతంచేసింది. ఇందులోభాగంగా ప్రజ్వల్‌కు సీబీఐ బ్లూ కార్నల్ నోటీసును జారీచేసే వీలుందని తెలుస్తోంది. ఈ మేరకు కర్ణాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సిట్ అధికారులతో ముఖ్యమైన సమావేశం ఏర్పాటుచేశారు. ప్రజ్వల్‌ను వీలైనంత త్వరగా అదుపులోకి తీసుకునేలా కేసు దర్యాప్తును ముమ్మరం చేయాలని ఆదేశించారు.

25 కిలోల బంగారం స్మగ్లింగ్.. అఫ్గాన్ రాయబారి జకియా రాజీనామా

న్యూఢిల్లీ: రూ.18.6 కోట్ల విలువైన 25 కిలోల బంగారాన్ని దుబాయ్ నుంచి అక్రమ రవాణా చేస్తూ ముంబై ఎయిర్‌పోర్టులో దొరికిపోయిన అఫ్గానిస్తాన్ సీనియర్ దౌత్యవేత్త జకియా వార్దక్ తన పదవికి రాజీనామా చేశారు. ఆమె తొలుత ముంబైలో అఫ్గాన్ కాన్సూల్ జనరల్‌గా రెండేళ్ల పని చేశారు. గత ఏడాది ఇండియాలో అఫ్గాన్ రాయబారిగా బాధ్యతలు చేపట్టారు. గత నెల 25వ తేదీన ముంబై ఎయిర్‌పోర్టులో డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్(డీఆర్ఐ) అధికారులు జకియా వార్దక్ నుంచి 25 కిలోల బంగారం స్వాధీనం చేసుకున్నారు. ఆమె బంగారాన్ని దుబాయి నుంచి చట్టవిరుద్ధంగా తరలిస్తూ దొరికిపోయినట్లు వార్తలొచ్చాయి. దౌత్యవేత్త కావడంతో ఈ కేసులో అరెస్టు కాకుండా ఆమె మినహాయింపు పొందారు. అయితే, తన పదవికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నట్లు జకియా వార్దక్ తాజాగా 'ఎక్స్'లో పోస్టు చేశారు. తనపై వ్యక్తిగతంగా విమర్శల దాడి జరుగుతోందని, దీనివల్ల విధులు సక్రమంగా నిర్వర్తించలేకపోతున్నానని, అందుకే రాజీనామా చేస్తున్నానని పేర్కొన్నారు.

నిజ్జర్ హత్య కేసులో ముగ్గురు అరెస్ట్

మరిన్ని అరెస్టులుంటాయన్న కెనడా పోలీసులు

ఒట్టావా: ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్ నిజ్జర్ హత్య కేసులో ముగ్గురిని అరెస్ట్ చేసినట్లు కెనడా పోలీసులు తెలిపారు. మరిన్ని అరెస్టులుంటాయని స్పష్టం చేశారు. ఎడ్మంటన్‌లో ఉంటున్న భారత పౌరులు కరణ్ బ్రార్(22), కమల్‌ప్రీత్ సింగ్(22), కరణ్‌ప్రీత్ సింగ్(28)లపై హత్య, హత్యకు కుట్ర కేసులు నమోదు చేశామన్నారు. కెనడా పౌరుడైన నిజ్జర్ హత్యలో భారత ప్రభుత్వ ప్రమేయం కోణంలోనూ విచారణ సాగుతోందని రాయల్ కెనడియన్ మౌంటెడ్ పోలీస్ (ఆర్‌సీఎంపీ) విభాగం శుక్రవారం తెలిపింది. 2023 జూన్ 18వ తేదీన బ్రిటిష్ కొలంబియా ప్రావిన్స్ సర్రేలోని గురుద్వారా వెలుపల ఉన్న నిజ్జర్‌ను గుర్తు తెలియని దండగులు కాల్చి చంపారు. భారత ప్రభుత్వం హస్తం ఉందంటూ కెనడా ప్రధాని ట్రూడో చేసిన తీవ్ర ఆరోపణలతో రెండు దేశాల మధ్య సంబంధాలు దెబ్బతిన్న విషయం తెలిసిందే.



లండన్ మేయర్‌గా మూడోసారి సాదిక్ ఖాన్

లండన్: పాక్ సంతతికి చెందిన లేబర్ పార్టీ నేత సాదిక్ ఖాన్(53) లండన్ మేయర్‌గా భారీ మెజారిటీతో వరుసగా మూడోసారి గెలుపొందారు. మొత్తం ఓట్లలో 43.8 శాతం అంటే 10,88,225 ఓట్లు సాదిక్ ఖాన్‌కు పడగా కన్జర్వేటివ్ పార్టీకి చెందిన ప్రధాన ప్రత్యర్థి సుసాన్ హిల్‌కు 8,11,518 ఓట్లు పడ్డాయి. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగిన ఢిల్లీలో జన్మించిన వ్యాపారవేత్త తరుణ్ గులాటి ఓట్ల వేటలో విఫలమయ్యారు. మేయర్ పదవికి మొత్తం 13 మంది పోటీ పడ్డారు. లండన్ మేయర్ 89 లక్షల మంది జనాభాకు ప్రాతినిధ్యం వహిస్తారు. 2000వ సంవత్సరంలో పదవి ఏర్పాటయ్యాక వరుసగా మూడు పర్యాయాలు మేయర్‌గా ఎన్నికైన నేతగా సాదిక్ ఖాన్ రికార్డు సృష్టించారు. నాలుగేళ్ల పదవీ కాలానికిగాను 2016, 2020 ఎన్నికల్లో ఆయన మేయర్‌గా ఎన్నికయ్యారు.

నిధులివ్వకుంటే నెగ్గేదెలా?

- పార్టీ ఫండ్ ఇవ్వనందుకు నిరసనగా ఎంపీ టికెట్ తిరిగిచ్చేసిన కాంగ్రెస్ నాయకురాలు సుచరిత
- ఒడిశాలో వింత




భువనేశ్వర్: పార్టీ టికెట్ ఇస్తే చాలు కోట్లు ఖర్చుపెట్టయినాసరే సొంతంగా నెగ్గుకొస్తామనే నేతలు మన రాజకీయభారతంలో కోకొల్లలు. అయితే ఒడిశాలో ఇందుకు పూర్తిభిన్నమైన ఘటన ఒకటి చోటుచేసుకుంది. ''నా దగ్గర అస్సలు డబ్బుల్లేవ్. పార్టీ నిధులు ఇస్తేనే ప్రచారం చేసుకుంటా. పార్టీ ఫండ్ లేకుండా నియోజకవర్గంలో ప్రచారం చేయడం చాలా కష్టంగా ఉంది. నిధుల కటకటతో కొట్టుమిట్టాడుతున్న నేను ఇక ఈ ప్రచారం భారం మోయలేను. పార్టీ టికెట్ మీరే ఉంచుకోండి' అంటూ ఒడిశాకు చెందిన పూరీ నియోజకవర్గ కాంగ్రెస్ మహిళా అభ్యర్థి సుచిత్రా మొహంతీ తేల్చిచెప్పారు. ఈ మేరకు ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి (వ్యవస్థాగతం) కేసీ వేణుగోపాల్‌కు శుక్రవారం ఆమె మెయిల్‌లో లేఖ పంపించారు. కాంగ్రెస్ మాజీ ఎంపీ బ్రజ్‌మోహన్ మొహంతీ కూతురైన సుచరిత పదేళ్ల క్రితం రాజకీయాల్లోకి ప్రవేశించారు. పూరీ లోక్‌సభ స్థానానికి మే 25న పోలింగ్ జరగనుంది.

''రాజకీయాల్లోకి రాకమునుపు సాధారణ పాత్రికేయ వృత్తిలో కొనసాగా. పూరీ నియోజకవర్గంలో ఇంకో 20 రోజుల్లో పోలింగ్ ఉంది. ప్రచారం కోసం నా పొదుపు మొత్తాలన్నీ ఖర్చయిపోయాయి. నిధుల కోసం ఇప్పటికే ప్రజల నుంచి విరాళాలు సైతం సేకరించా. ఉన్నదాంట్లో ఖర్చు పెట్టే స్తోమత లేక ప్రచారాన్ని తగ్గించుకున్నా. పరిచయం ఉన్న సీనియర్ నేతలనూ డబ్బులు అడిగా. పార్టీ నిధుల కోసం ఆశగా ఎదురుచూశా. నిధుల్లేవు, సొంతంగా ఖర్చుపెట్టుకో అని ఏఐసీసీ ఒడిశా ఇన్‌చార్జ్ అజయ్ తెగేసి చెప్పారు. పార్టీ ఫండ్ ఇవ్వకుండా ప్రచారంచేయడం అసంభవం. అందుకే పార్టీ టికెట్ వెనక్కి ఇచ్చేస్తున్నా'' అని మెయిల్‌లో సుచరిత పేర్కొన్నారు. ''పూరీ పార్లమెంట్ స్థానం పరిధిలోని అన్ని అసెంబ్లీ సెగ్మెంట్లలో బలహీనమైన నేతలకు టికెట్లు ఇచ్చారు. బీజేపీ, బీజేడీ నేతలు అపార నిధులతో తులతూగుతున్నారు. బ్యాంక్ ఖాతాలను స్తంభింపజేయడంతో ఎమ్మెల్యే అభ్యర్థులూ ఖర్చులను తగ్గించుకోవాల్సిన పరిస్థితి తలెత్తింది'' అని సుచరిత అన్నారు.

సునీత 'స్టార్ ట్రెక్'!

మూడోసారి అంతరిక్ష కేంద్రానికి • 6న బోయింగ్ స్పేస్ కేప్సూల్ తొలి యాత్ర



బుచ్ విల్మోర్ | సునీతా విలియమ్స్



స్టార్‌లైనర్

ముప్పై ఏళ్లు సాగిన అమెరికన్ స్పేస్ షటిల్స్ శకం 2011లో ముగిసింది. ఇక 1960ల నాటి సోవియట్ సోయజ్ కేప్సూల్ ఓ పాతబడ్డ డొక్కు వ్యోమనౌక. కొద్దిపాటి మార్పులతో 'ఐదో తరం సోయజ్'తో నెట్టుకొస్తున్నా అదీ నిష్క్రమించే వేళయింది. సొంత నౌకల్లో వ్యోమగాముల్ని అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి పంపడానికి అమెరికా ఆర్థికంగా వెనకడుగు వేసింది. రష్యా సైతం స్పేస్ టూరిస్టులకు టికెట్లమ్మి ఆ సొమ్ముతో 'ఐఎస్ఎస్ బండి' నడుపుతోంది. ఈ నేపథ్యంలో మున్ముందు అంతరిక్ష కేంద్రానికి మానవసహిత యాత్రలు, పెట్టుబడులు, పరిశోధన, చంద్ర–అంగారక యాత్రలు... అన్నింట్లోనూ ప్రైవేటైజేషన్‌దే హవా కానుంది! ప్రైవేటు రంగమే రోదసిని ఏలబోతోంది. ప్రభుత్వరంగ పాత్ర క్రమంగా కేవలం ప్రోత్సాహం, సహకారం, కాస్తో కూస్తో నిధులకే పరిమితమవుతోంది. రెండు అధునాతన ప్రైవేటు వ్యోమనౌకలు (స్పేస్ కేప్సూల్స్) అంతరిక్షాన్ని అందుకోవడానికి సిద్ధమయ్యాయి. భూమికి 400 కిలోమీటర్ల ఎత్తున కక్ష్యలో పరిభ్రమిస్తున్న అంతరిక్ష కేంద్రానికి రాకెట్ల సాయంతో వ్యోమగాముల్ని తీసుకెళ్లనున్నాయి. 'ఎక్స్' బాస్ ఇలాన్ మస్క్ కంపెనీ 'స్పేస్ ఎక్స్' రూపొందించిన 'క్రూ డ్రాగన్' కేప్సూల్ ఇప్పటికే ఫాల్కన్ రాకెట్లతో అంతరిక్ష కేంద్రానికి రాకపోకలు సాగిస్తోంది. సరుకులతో పాటు వ్యోమగాములనూ చేరవేస్తోంది. ప్రపంచ అతి పెద్ద ఏరో స్పేస్ కంపెనీల్లో ఒకటైన 'బోయింగ్' కూడా తాజాగా 'సీఎస్టీ–100 స్టార్‌లైనర్' వ్యోమనౌకతో మే 6న తొలి మానవసహిత రోదసీ యాత్రతో రంగప్రవేశం చేస్తోంది. భారతీయ మూలాలున్న అమెరికన్ వ్యోమగామి సునీతా విలియమ్స్ ముచ్చటగా మూడోసారి అంతరిక్ష కేంద్రానికి పయనమవడం ఈ యాత్రలో మరో విశేషం...

మన సునీత హ్యాట్రిక్!

సునీతా విలియమ్స్. ఇండియన్ అమెరికన్ ఆస్ట్రోనాట్. ముద్దుపేరు సునీ. 11 ఏళ్ల విరామం అనంతరం 58 ఏళ్ల వయసులో మూడోసారి రోదసికి వెళ్లబోతున్నారు. అమెరికన్ నేవీ కెప్టెన్ (రిటైర్డ్) సునీతకు అనుభవమే మనోబలం. ఆమెను నాసా 1998లో వ్యోమగామిగా ఎంపిక చేసింది. సునీత తండ్రి ఇండియన్ అమెరికన్ దీపక్ పాండ్యాది ముంబై. తల్లి అర్సలిన్ బోనీ స్లోవేన్–అమెరికన్. సునీత 1965లో అమెరికాలో జన్మించారు. యునైటెడ్ లాంచ్ అలయెన్స్ రాకెట్ 'అట్లాస్–5' శీర్షభాగంలో అమర్చిన బోయింగ్ 'స్టార్‌లైనర్' వ్యోమనౌకలో ఈ నెల 6న రాత్రి 10:34కు (భారత కాలమానం ప్రకారం 7వ తేదీ ఉదయం 8:04కు) ఫ్లోరిడాలోని కేప్ కెనవరల్ నుంచి సునీత అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రానికి బయల్దేరనున్నారు. నాసా వ్యోమగామి బుచ్ విల్మోర్ కూడా ఈ యాత్రలో పాల్గొంటారు. వీరిద్దరూ ఐఎస్ఎస్‌లో వారం గడిపి తిరిగొస్తారు. సునీత 2006 డిసెంబరు 9న తొలిసారి ఐఎస్ఎస్ కు వెళ్లారు. 2007 జూన్ 22 దాకా రోదసిలో గడిపారు. నాలుగు సార్లు స్పేస్ వాక్ చేసిన మహిళా వ్యోమగామిగా రికార్డు నెలకొల్పారు. రెండోసారి 2012 జులై 14 నుంచి 127 రోజులపాటు ఐఎస్ఎస్‌లో గడిపారు. మూడుసార్లు స్పేస్ వాక్ చేశారు. రెండు మిషన్లలో మొత్తం 50 గంటల 40 నిమిషాలు స్పేస్ వాక్ చేశారు.

బోయింగ్... గోయింగ్!

అమెరికా స్పేస్ షటిల్స్ కనుమరుగయ్యాక అంతరిక్ష యాత్రల కోసం రష్యా సోయజ్ రాకెట్–వ్యోమనౌకల శ్రేణిపైనే నాసా ఆధారపడింది. కానీ ఒక్కో వ్యోమగామికి రష్యా ఏకంగా రూ.700 కోట్లు చొప్పున వసూలు చేస్తోంది. దాంతో వ్యోమనౌకల అభివృద్ధి కోసం నాసా 2014లో బోయింగ్‌కు 4.2 బిలియన్ డాలర్లు, (రూ.35 వేల కోట్లు), స్పేస్ ఎక్స్‌కు 2.6 బిలియన్ డాలర్ల (రూ.21,680 కోట్లు) కాంట్రాక్టులు కట్టబెట్టింది. స్పేస్ ఎక్స్ తన 'క్రూ డ్రాగన్' స్పేస్ కేప్సూల్‌లో 2020 నుంచే వ్యోమగాములను తీసుకెళ్తోంది. బోయింగ్ 'క్రూ స్పేస్ ట్రాన్స్‌పోర్టేషన్ (సీఎస్టీ)–100 స్టార్ లైనర్' మాత్రం వెనుకబడింది. ఎట్టకేలకు ఈ నెల 6న తొలి మానవసహిత ప్రయాణ పరీక్షకు సిద్ధమైంది. అంతరిక్ష కేంద్రంతో అనుసంధానం (డాకింగ్), భూమికి తిరుగు పయనం, స్టార్ లైనర్ వ్యవస్థల సామర్థ్యాన్ని ఈ పరీక్షలో పరిశీలిస్తారు. ఈ యాత్ర జయప్రదమైతే మానవసహిత అంతరిక్ష యాత్రలకు దానికి లైసెన్స్ లభిస్తుంది.

– జమ్ముల శ్రీకాంత్

ఎలక్షన్ బీట్

ప్రజాస్వామ్యాన్ని చెరసాలగా మార్చేశారు

మోదీ ప్రభుత్వంపై బెంగాల్ సీఎం మమతా బెనర్జీ ఆగ్రహం

బిర్‌నగర్: 'అచ్ఛే దిన్' తీసుకొస్తామంటూ హామీ ఇచ్చి కేంద్రంలో అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రజలకు చేసిందేమీ లేదని తృణమూల్ కాంగ్రెస్ పార్టీ అధినేత, పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ మండిపడ్డారు. బీజేపీ చెప్పిన మంచి రోజులు ఇంకా రాలేదన్నారు. నరేంద్ర మోదీ ప్రభుత్వం దేశంలో ప్రజాస్వామ్యాన్ని చెరసాలగా మార్చేసిందని ధ్వజమెత్తారు. శనివారం బెంగాల్‌లోని నదియా జిల్లాలో ఎన్నికల ప్రచారంలో మమతా బెనర్జీ పాల్గొన్నారు. ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. 'ఒకే దేశం, ఒకే పార్టీ, ఒకే ప్రభుత్వం, ఒకే నాయకుడు' విధానం తీసుకొచ్చి, మిగిలినవారిని జైలుకు పంపడానికి బీజేపీ కుట్ర పన్నిందని ఆరోపించారు.

మా తొలి నిర్ణయం.. రైతు రుణ మాఫీయే

సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్

బదౌన్(యూపీ): ఎన్నికల తర్వాత ఇండియా కూటమి ప్రభుత్వం ఏర్పాటైతే తీసుకునే తొలి నిర్ణయం రైతు రుణ మాఫీయేనని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ) చీఫ్ అఖిలేశ్ యాదవ్ ప్రకటించారు. శనివారం ఆయన యూపీలోని బదౌన్ జిల్లాలో ఎన్నికల ర్యాలీల్లో మాట్లాడుతూ 'కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం రైతులను మోసం చేసింది. రైతుల ఆదాయం రెట్టింపు కాలేదు. బడా పారిశ్రామికవేత్తల రూ.16 వేల కోట్ల రుణాలను రద్దు చేసింది కానీ, రైతు రుణాలను పట్టించుకోలేదు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే దేశవ్యాప్తంగా ఉన్న రైతు రుణాలను మాఫీ చేస్తూ తొలి నిర్ణయం తీసుకుంటుంది'అని పేర్కొన్నారు. యూపీలో లోక్‌సభ మూడో దశ పోలింగ్‌లోనూ బీజేపీ తుడిచిపెట్టుకుపోతుందన్నారు. 'అధికారమిస్తే పేదలకు ఉచితంగా డేటా, ఆటా(పిండి)ని అందిస్తాం. ఆటాతో పేదలు పోషకాహారం పొందటమే కాకుండా వారి పిల్లలు చదువుకుని జీవితంలో పైకెదుగుతారు'అని ఆయన అన్నారు.

బీజేపీలోకి ఢిల్లీ కాంగ్రెస్ మాజీ చీఫ్ లవ్లీ

న్యూఢిల్లీ: ఢిల్లీ కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు అర్విందర్ సింగ్ లవ్లీ మరికొందరు పార్టీ నేతలతో కలిసి శనివారం బీజేపీలో చేరారు. కేంద్ర మంత్రి హర్దీప్ పూరి, బీజేపీ ప్రధాన కార్యదర్శి వినోద్ తావ్డే సమక్షంలో లవ్లీతోపాటు ఢిల్లీ మాజీ మంత్రి రాజ్ చౌహాన్, మాజీ ఎమ్మెల్యేలు నీరజ్ బసోయా, నసీబ్ సింగ్‌లు కాషాయ కండువా కప్పుకున్నారు. ఢిల్లీలో ఆమ్ ఆద్మీ పార్టీతో కాంగ్రెస్ చేసుకున్న సీట్ల సర్దుబాటు ఒప్పందంపై లవ్లీ తదితరులు బహిరంగ విమర్శలు చేయడం తెల్సిందే. తమను కాదని కన్హయ్య కుమార్, ఉదిత్ రాజ్ లాంటి వారిని ఢిల్లీలో బరిలోకి దించటాన్ని కూడా వీరు తీవ్రంగా వ్యతిరేకించారు.

ఎన్నికల తీరును తిలకించేందుకు.. 23 దేశాల ప్రతినిధుల రాక

సాక్షి, న్యూఢిల్లీ: భారత్‌లో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల తీరును 23 దేశాల ప్రతినిధులు ప్రత్యక్షంగా గమనించనున్నారు. రష్యా, ఆస్ట్రేలియా, భూటాన్, మంగోలియా, మడగాస్కర్, ఫిజీ, మాల్దోవా, ట్యునీషియా, సీషెల్స్, కాంబోడియా, నేపాల్, ఫిలిప్పీన్స్, శ్రీలంక, జింబాబ్వే, బంగ్లాదేశ్, కిర్గిజిస్తాన్, కజకిస్తాన్, జార్జియా, ఉజ్బెకిస్తాన్, మాల్దీవులు, పపువా న్యూగినియా, చిలీ, నమీబియా దేశాలకు చెందిన 75 ప్రతినిధులు ఢిల్లీకి చేరుకున్నట్లు ఈసీ పేర్కొంది. ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఫర్ ఎలక్టోరల్ సిస్టమ్ ప్రతినిధులు, భూటాన్, ఇజ్రాయెల్ మీడియా పాల్గొననుంది. ఇంత పెద్ద సంఖ్యలో విదేశీ ప్రతినిధులు మన ఎన్నికల విధానాన్ని పరిశీలించడం ఇదే మొదటిసారని పేర్కొంది.

మోతీలాల్‌కు అన్ని ఆస్తులెక్కడివి: కంగన

సిమ్లా: బాలీవుడ్ నటి, హిమాచల్ ప్రదేశ్‌లోని మండీ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి కంగనా రనౌత్ మరో వివాదానికి తెరతీశారు. దివంగత ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ తండ్రి మోతీలాల్ నెహ్రూకు అన్ని ఆస్తులు ఎలా వచ్చాయని ప్రశ్నించారు. మోతీలాల్‌ను అప్పటి కాలపు 'అంబానీ'గా అభివర్ణించారు. శనివారం సర్కాఘాట్‌లో ఎన్నికల ప్రచారంలో కంగన మాట్లాడారు. మోతీలాల్ భారీగా ఆస్తులు సంపాదించారని, అవి ఆయనకు ఎలా వచ్చాయో ఎవరికీ తెలియదని అన్నారు. మోతీలాల్ బ్రిటిష్ పాలకులతో సన్నిహితంగా ఉండేవారని, వారి అండతో ఆస్తులు పోగేసుకొని ఉండొచ్చని అభిప్రాయపడ్డారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత అందరూ సర్దార్ వల్లభ్‌బాయి పటేల్ పట్ల సానుకూలంగా ఉన్నప్పటికీ జవహర్‌లాల్ నెహ్రూ ప్రధానమంత్రి అయ్యారని పేర్కొన్నారు. ఇందులోని రహస్యం ఏమిటో తెలియదని వ్యాఖ్యానించారు.

బీజేపీ వ్యతిరేక ఆందోళనలో రైతు మృతి

పటియాలా: పంజాబ్‌లో లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో పాల్గొంటున్న బీజేపీ అభ్యర్థులు, నేతలు రైతుల నిరసనలను ఎదుర్కొంటున్నారు. పటియాలాలోని సెహ్రా గ్రామంలో ప్రచారానికి వచ్చిన బీజేపీ అభ్యర్థిని ప్రణీత్ కౌర్ వాహనాన్ని రైతులు నల్ల జెండాలు చేబూని అడ్డుకున్నారు. ఈ ఆందోళనలో పాల్గొన్న 60 ఏళ్ల రైతు సురీందర్ పాల్ సింగ్ నేలపై పడిపోయి ప్రాణాలు కోల్పోయారు. పోలీసులు నెట్టివేయడం వల్లే సురీందర్ చనిపోయాడని రైతులు ఆరోపిస్తున్నారు. సురీందర్ మామూలుగానే పడిపోయినట్లు కనిపిస్తున్న వీడియోను బీజేపీ నేతలు విడుదల చేశారు.

ప్రధాని మోదీ ఒక షహెన్‌షా: ప్రియాంక

లఖానీ: ప్రధాని మోదీపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ తీవ్ర విమర్శలు చేశారు. రాజప్రాసాదంలో ఉంటూ ప్రజలతో సంబంధాలు తెంచేసుకున్న ప్రధాని మోదీ ఒక షహెన్ షా(చక్రవర్తి)అంటూ నిప్పులు చెరిగారు. అధికారం కోసం గుజరాత్ ప్రజలను వాడుకుని వదిలేశారన్నారు. తన సోదరుడు రాహుల్ గాంధీని యువరాజు అంటూ ప్రధాని చేసిన వ్యాఖ్యలపై ఈ మేరకు ప్రియాంక స్పందించారు.



మధ్యాహ్నం 12 గంటలకు.. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలో నిర్వహించిన సీఎం జగన్ ఎన్నికల ప్రచార సభకు మండుటెండను సైతం లెక్క చేయకుండా హాజరైన అశేష జనసందోహంలో ఓ భాగం



పలమనేరులో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన భారీ జనసందోహంలో ఓ భాగం



నెల్లూరు నగరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల బహిరంగ సభకు హాజరైన అశేష జనవాహినిలో ఓ భాగం

మీ భూమికి భద్రత

హిందూపురం ఎన్నికల ప్రచార సభలో సీఎం జగన్ హామీ

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై చంద్రబాబు దుష్ప్రచారం

- చట్టంపై అవగాహన లేకుండా మాట్లాడటం సిగ్గుచేటు
- మీ భూములకు ప్రభుత్వం గ్యారంటీ..
- రిజిస్ట్రేషన్ తర్వాత రైతులకే డాక్యుమెంట్లు
- అన్నదాతలు ఎవరి చుట్టూ తిరగాల్సిన పని ఉండదు
- భూ తగాదాలకు శాశ్వత పరిష్కారంగా వందేళ్ల తర్వాత రీసర్వే
- పేదలకు భూములిచ్చేది జగన్.. లాక్కునేది చంద్రబాబే

సాక్షి, పుట్టపర్తి: 'చంద్రబాబు నాయుడు అవగాహన రాహిత్యంతో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అబద్ధాలు వల్లించడం సిగ్గుచేటు. జగన్ భూములు లాక్కుంటున్నాడంటూ దుష్ప్రచారం చేయడం ఆయన దిగజారుడు రాజకీయాలకు నిదర్శనం. పేదలకు భూములిచ్చేది జగన్ అయితే.. లాక్కునేది చంద్రబాబు అనే విషయం అందరికీ తెలుసు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌తో రైతులు ఎవరి చుట్టూ తిరగాల్సిన పని ఉండదు. భూ తగాదాలకు శాశ్వత పరిష్కారం చూపేందుకు వందేళ్ల తర్వాత భూముల రీ సర్వే చేపట్టాం. రైతుల భూముల భద్రతకు ప్రభుత్వం బాధ్యత వహిస్తుంది. ఎలాంటి వివాదం లేని టైటిల్స్ ప్రతి ఒక్కరి దగ్గరా ఉండాలన్నదే మీ బిడ్డ లక్ష్యం. అందుకనే టైటిల్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నాం. రిజిస్ట్రేషన్ తర్వాత రైతులకే డాక్యుమెంట్లు అందజేస్తాం. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అవగాహన లేకుండా చంద్రబాబు మాట్లాడటం దుర్మార్గం' అని ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ధ్వజమెత్తారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో నిర్వహించిన బహిరంగ సభలో సీఎం జగన్ మాట్లాడుతూ ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ప్రచారంలో ఉన్న అపోహలను తొలగిస్తూ స్పష్టతనిచ్చారు.

పెద్ద సంస్కరణ అవుతుంది..

ఎన్నికల వేళ చంద్రబాబు యథేచ్ఛగా అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై అవగాహన లేకుండా నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారు. టీడీపీ నాయకులు ఐవీఆర్ఎస్ ద్వారా మీ ఇళ్లకు ఫోన్లు చేసి మీ భూములన్నీ జగన్ లాక్కుంటాడంటూ దుష్ప్రచారం చేస్తున్నారు. ఇంత దిక్కుమాలిన రాజకీయాలు చేస్తున్న చంద్రబాబు అసలు మనిషేనా? మీ జగన్ భూములిచ్చేవాడే కానీ భూములు లాక్కునే వాడు కాదు. నీకు ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అంటే తెలుసా చంద్రబాబూ? ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ అంటే భూముల మీద సంపూర్ణ హక్కులు ఎల్లవేళలా రైతన్నలకు ఉండేటట్లు చేయడమే. చంద్రబాబు అవగాహన లేకుండా మాట్లాడుతున్నట్లు స్పష్టంగా తెలుస్తోంది. ఈ యాక్ట్ రాబోయే రోజుల్లో పెద్ద సంస్కరణ అవుతుంది. ఈరోజు ఎక్కడ భూమి కొనుగోలు చేయాలన్నా వివాదాలు తలెత్తుతున్నాయి. విస్తీర్ణం తక్కువ ఉండటం, సబ్ డివిజన్, సర్వే జరగకపోవడం, రికార్డులు అప్‌డేట్ కాకపోవడం తదితర సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. వీటన్నింటి కారణంగా భూ వివాదాలు పెరిగి రైతన్నలు, ప్రజలు కోర్టులు, అధికారుల చుట్టూ తిరగాల్సి వస్తోంది.



హిందూపురం ఎంపీ అభ్యర్థి శాంత, ఎమ్మెల్యే అభ్యర్థి దీపికను గెలిపించాలని కోరుతున్న సీఎం జగన్

వివాదాలు లేకుండా.. టైటిల్ ఇన్సూరెన్స్

రాబోయే రోజుల్లో ఏ రైతూ, ఏ ఒక్కరూ వాళ్ల భూముల కోసం ఎవరి చుట్టూ తిరగాల్సిన పరిస్థితి ఉండకూడదు. భూ వివాదాలకు సంబంధించి ఏ కోర్టుకూ వెళ్లాల్సిన అవసరం రాకూడదు. ఆ భూముల మీద వారికి సంపూర్ణ హక్కులు కల్పిస్తూ వాటిపై ఏవైనా వివాదాలు ఉంటే ప్రభుత్వమే బాధ్యత వహిస్తుంది. ఆ భూముల మీద ఎలాంటి వివాదం లేదని గ్యారంటీ ఇస్తూ ఒక సంస్కరణ తేవాలన్నదే మీ జగన్ ఆలోచన. అందుకనే టైటిల్ ఇన్సూరెన్స్ కూడా చేస్తున్నాం. ఎలాంటి వివాదం లేని టైటిల్స్ ప్రతి ఒక్కరి దగ్గరా ఉండాలన్నదే మీ బిడ్డ లక్ష్యం. కానీ ఇది జరగాలంటే మొదట రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న సర్వే పూర్తి కావాలి. దేశంలో వందేళ్ల క్రితం ఆంగ్లేయుల హయాంలో భూముల సర్వే చేశారు. రైతుల కోసం ఈ రోజు మళ్లీ ప్రతి ఎకరా రీ సర్వే చేస్తున్నాం. 15 వేల మంది సర్వేయర్లను నియమించాం. ఉచితంగా సరిహద్దు రాళ్లను నాటి రికార్డులన్నీ అప్‌డేట్ చేస్తున్నాం. సబ్ డివిజన్ చేసి ఆ హక్కు పత్రాలను పదిలంగా రైతన్నలకు అందచేస్తున్నాం. రాష్ట్రంలో 17 వేలకు పైగా రెవెన్యూ గ్రామాలకుగానూ ఇప్పటివరకు 6 వేల రెవెన్యూ గ్రామాల్లో సర్వే పూర్తైంది. మిగతా చోట్ల ఒకటిన్నర రెండేళ్లలో సర్వే పూర్తవుతుంది.

రిజిస్ట్రేషన్లపైనా బాబు బురద

రిజిస్ట్రేషన్లకు సంబంధించి కూడా చంద్రబాబు అబద్ధాలు ప్రచారం చేస్తున్నారు. రిజిస్ట్రేషన్లు చేసేటప్పుడు ఫిజికల్ డాక్యుమెంట్లు ఇవ్వడం లేదని తప్పుడు ప్రచారం చేస్తున్నారు. అయ్యా చంద్రబాబూ..! ఇప్పటివరకు ఏకంగా 9 లక్షల రిజిస్ట్రేషన్లు జరిగాయి. దేశవ్యాప్తంగా అమలవుతున్న కార్డ్ 2 సాఫ్ట్‌వేర్ ద్వారా తొమ్మిది లక్షల రిజిస్ట్రేషన్లు చేయడమే కాకుండా ఆ తర్వాత డాక్యుమెంట్లు అన్నీ భూయజమానులకే ఇచ్చాం. దీన్ని మరింత సులభతరం చేస్తూ.. ఏ ఒక్కరికీ సమస్య ఉండకూడదని, పత్రాలు రాసుకునేటప్పుడు తప్పులు ఉండకూడదని ఆ ఫార్మాట్ కూడా ఆన్‌లైన్‌లో అందుబాటులో ఉంచాం. ఎవరైనా అమ్మాలనుకున్నా, కొనాలనుకున్నా ఆ ఫార్మాట్ డౌన్‌లోడ్ చేసుకుని వివరాలు నింపి డాక్యుమెంట్లతో వెళితే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో వేలి ముద్రలు లాంటి మిగతా ప్రక్రియ పూర్తి చేసుకోవచ్చు. రిజిస్ట్రేషన్ పూర్తి అయిన తర్వాత ఫిజికల్ డాక్యుమెంట్లు రైతులకే ఇచ్చే కార్యక్రమం కూడా జరుగుతోందని చంద్రబాబు తెలుసుకోవాలి.

ఐరాసలో జగన్ విజన్

అంతర్జాతీయ వేదికపై రాష్ట్ర ప్రభుత్వ పథకాలను వినిపించిన పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచ్

సాక్షి, అమరావతి/సాక్షి, న్యూఢిల్లీ: పక్షపాతం, పైరవీలకు, అవినీతికి తావులేకుండా ప్రజల ఇళ్ల వద్దకే ప్రభుత్వ సేవలను తీసుకెళ్లే విప్లవాత్మక పాలనా సంస్కరణలతో పాటు మహిళా సాధికారత లక్ష్యంగా గత ఐదేళ్లుగా రాష్ట్రంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అమలుచేస్తున్న సంక్షేమ కార్యక్రమాలు అమెరికాలోని ఐక్యరాజ్య సమితి వేదికపై మరోసారి ఆవిష్కృతమయ్యాయి. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో పురుషులతో సమానంగా మహిళలకు అవకాశాలు కల్పించడం.. మహిళా సాధికారిత కోసం ఆయా దేశాల్లో కొనసాగుతున్న కార్యక్రమాలపై ఐరాస ప్రధాన కార్యాలయంలో శుక్రవారం రాత్రి (భారత కాలమానం ప్రకారం) జరిగిన సదస్సుకు పశ్చిమ గోదావరి జిల్లా ఇరగవరం మండలం పేకేరు గ్రామ పంచాయతీ సర్పంచ్ కునుకు హేమకుమారి హాజరయ్యారు. ఈమెతోపాటు త్రిపురకు చెందిన జెడ్పీ చైర్‌పర్సన్ సుప్రియ దాస్ దత్తా, రాజస్థాన్‌కు చెందిన మరో సర్పంచ్ నీరూ యాదవ్‌లు 'లోకలైజింగ్ ది ఎస్‌డీజీ–'విమెన్ ఇన్ లోకల్ గవర్నెన్స్ ఇన్ ఇండియా లీడ్ ది వే' పేరుతో జరిగిన సదస్సులో మహిళా సాధికారిత కోసం భారత్‌లో జరుగుతున్న కార్యక్రమాలపై వీరు తమ ప్రజంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా కుసుమ హేమకుమారి ఏపీలో మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించే దిశగా సీఎం జగన్ అమలుచేసిన వైఎస్సార్ ఆసరా పథకాన్ని ప్రస్తావించారు. 2019 ఎన్నికల నాటికి రాష్ట్రవ్యాప్తంగా పొదుపు సంఘాల పేరిట బ్యాంకుల్లో ఉన్న మహిళల అప్పు మొత్తం రూ.25,570.79 కోట్లను నాలుగు విడతల్లో వైఎస్సార్ ఆసరా పథకం పేరుతో రాష్ట్ర ప్రభుత్వం నేరుగా ఆయా మహిళలకు అందజేసిందని చెప్పారు. దీంతోపాటు పొదుపు సంఘాల మహిళలు బ్యాంకు రుణాలను సకాలంలో చెల్లించే వారికి వారి వడ్డీ డబ్బులను ప్రభుత్వమే భరించే సున్నావడ్డీ పథకాన్ని కూడా ఆమె ఈ అంతర్జాతీయ వేదికపై ప్రస్తావించారు.



న్యూయార్క్‌లోని ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యాలయంలో పశ్చిమగోదావరి జిల్లా పేకేరు గ్రామ సర్పంచ్ కునుకు హేమకుమారి, ఇతర ప్రతినిధులు


పేద మహిళలకు ఆర్థిక స్వాతంత్ర్యం కల్పించేలా..

ఇక సొంతంగా వ్యాపార అవకాశాలు మెరుగుపరుచుకోవడం ద్వారా పేద మహిళలు తమ కలలను సాకారం చేసుకునేలా రాష్ట్ర ప్రభుత్వం వివిధ రకాల సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నట్లు ఆమె వివరించారు. మరోవైపు.. మహిళలు ఉన్నత చదువులు చదువుకునేందుకు వీలుగా విద్యాదీవెన వంటి కార్యక్రమాలు అమలుచేస్తున్నట్లు చెప్పారు. కేంద్ర ప్రభుత్వం సైతం లక్‌పతీ దీదీ లాంటి కార్యక్రమాలు చేపట్టిందని.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తోడ్పాటుతో తమ గ్రామంలో ఈ కార్యక్రమాలను సమర్థవంతంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు హేమకుమారి వివరించారు. అలాగే, పౌష్టికాహారంపై గర్భిణీలకు అవగాహన కలిగిస్తూ, ప్రభుత్వమే వారికి పోషకాహారం అందిస్తూ మాతా, శిశు మరణాల నివారణకు చేపట్టిన కార్యక్రమాలను ఆమె చెప్పారు. ఆర్నెల్ల క్రితం 2023 సెప్టెంబరులో ఇదే వేదికపై జరిగిన హైలెవల్ పొలిటికల్ ఫోరం (సదస్సు)లో మన రాష్ట్రానికి చెందిన వివిధ ప్రభుత్వ పాఠశాలల పేద పిల్లలు హాజరైన విషయం తెలిసిందే. వీరు కూడా రాష్ట్రంలో సీఎం జగన్ ప్రభుత్వ బడుల బలోపేతానికి చేపట్టిన కార్యక్రమాలను ప్రపంచం దృష్టికి తీసుకెళ్లారు.

'స్థానిక' ప్రభుత్వాల్లో 46 శాతం మంది మహిళలే..

ఇక ఈ కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర పంచాయితీ రాజ్ శాఖ కార్యదర్శి వివేక్ భరద్వాజ్ మాట్లాడుతూ.. భారత్‌లో స్థానిక ప్రభుత్వాల స్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధుల్లో 46 శాతం మంది మహిళలేనని తెలిపారు. అలాగే, దేశంలో బాల్య వివాహాలను నిరోధించడం, విద్యను ప్రోత్సహించడం, ఆర్థికంగా నిలదక్కుకోవడం.. జీవనోపాధి అవకాశాలు కల్పించడం.. పర్యావరణ సుస్థిరత.. క్రీడలు వంటి కార్యక్రమాల ద్వారా స్థానిక ప్రభుత్వాల స్థాయిలో కూడా మహిళలు, బాలికలకు సాధికారత కల్పించే కార్యక్రమాలను త్రిపుర, రాజస్థాన్ నుంచి హాజరైన ప్రతినిధులు వివరించారు.

ప్రజలను భయాందోళనలకు గురిచేయడం పెద్ద నేరం



- భూ టైట్లింగ్ చట్టంపై చంద్రబాబు, పవన్‌కు, పచ్చ మీడియాకు కడుపు మంట
- మా భూమి మాది కాకపోతే మరెవరిది రామోజీ?
- ప్రజాస్వామ్య వ్యవస్థలో ఎవరి ఆస్తిని ఎవరు లాక్కోగలరు?
- మంత్రి బొత్స సత్యనారాయణ

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ వస్తే బాబు భూ కుంభకోణాలన్నీ బట్టబయలు



- ఆ భయంతోనే ఈ చట్టంపై దుష్ప్రచారం.. ఈ చట్టం భూ పరిపాలనలో గొప్ప సంస్కరణ
- భూకుంభకోణాలు, కబ్జాలు, అక్రమాలకు చెక్ పెడుతుంది
- అందుకే బాబుకు నచ్చడంలేదు..
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి, ప్రభుత్వ సలహాదారు సజ్జల

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ స్కాన్ చేయండి

ఆరునూరైనా ముస్లిం రిజర్వేషన్లు..

మోదీ సభలో నోరెత్తగలవా?

- ముస్లిం రిజర్వేషన్లపై చంద్రబాబుకు వైఎస్ జగన్ సవాల్
- నేను ధైర్యంగా, బహిరంగంగా 4 శాతం ఉండాలని చెబుతున్నా..

సాక్షి ప్రతినిధి నెల్లూరు, సాక్షి, తిరుపతి, సాక్షి, పుట్టపర్తి: ''నేను ఈరోజు.. ధైర్యంగా చెబుతున్నా. ఆరునూరైనా నూరు ఆరైనా కూడా 4 శాతం రిజర్వేషన్లు మైనార్టీలకు ఉండి తీరాల్సిందేనని మీబిడ్డ ఈరోజు తలెత్తుకుని చెబుతున్నాడు. ఇది మీ జగన్ మాట. ఇది మీ వైఎస్సార్ బిడ్డ మాట. దీనికోసం ఎందాకైనా పోరాడతా. మరి చంద్రబాబు ప్రధాని మోదీ సభలో ఇలా చెప్పగలడా? ఎన్డీఏ నుంచి బయటకు రాగలడా? ఎందుకీ దొంగ ప్రేమ? ఒక వైపు ఎన్డీఏలో కొనసాగుతూ.. మరోవైపు వాళ్లు 4 శాతం రిజర్వేషన్లకు వ్యతిరేకంగా ఉన్నా కూడా.. వారితోనే జతకట్టి ఎందుకు ఎన్డీఏలో ఉన్నావు? సమాధానం చెప్పు చంద్రబాబూ..!''అని ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూటిగా నిలదీశారు. 'మైనార్టీలకు ఇచ్చిన నాలుగు శాతం రిజర్వేషన్లు మత ప్రాతిపదికగా ఇచ్చినవి కాదు. అవి కేవలం వెనుకబాటు ప్రాతిపదికగా మాత్రమే ఇచ్చినవి..'అని స్పష్టం చేశారు. శనివారం హిందూపురం, పలమనేరు, నెల్లూరు గాంధీబొమ్మ సెంటర్‌లో జరిగిన ఎన్నికల బహిరంగ సభల్లో సీఎం జగన్ ప్రసంగించారు.

రాజ్యాంగానికి లోబడి ఇచ్చిన రిజర్వేషన్లు..


మైనార్టీ సోదరులకు ఇచ్చిన 4 శాతం రిజర్వేషన్లు మతం ప్రాతిపదికగా ఇచ్చినవి కావు. ఇవి కేవలం వెనుకబాటు ప్రాతిపదికగా మాత్రమే ఇచ్చిన రిజర్వేషన్లు. రాజ్యాంగానికి లోబడి వెనుకబాటు ప్రాతిపదికగా ఇచ్చిన రిజర్వేషన్లు. మరి ఇలాంటి వెనుకబాటుకి గురైన వారికి ఇచ్చిన రిజర్వేషన్లపై రాజకీయం చేస్తూ వారి జీవితాలతో చెలగాటం ఆడటం ధర్మమేనా? నేను ఇవాళ ప్రతి మైనార్టీ సోదరుడు, అక్కచెల్లెమ్మకు భరోసా ఇస్తూ చెబుతున్నా. మీకు 4 శాతం రిజర్వేషన్ల విషయం అయినా, ఎన్ఆర్సీ అయినా, సీఏఏ అయినా ఇంకా ఏ మైనార్టీ అంశమైనా.. మీ మనోభావాలకు, ఇజ్జత్ ఔర్ ఇమాన్‌కు మీ బిడ్డ జగన్ ఎప్పటికీ అండగా ఉంటాడు.

ల్యాండ్ టైట్లింగ్ చట్టంపై దుష్ప్రచారం..

టీడీపీపై ఈసీ కొరడా

తప్పుడు సమాచారంతో ఎల్లోగ్యాంగ్ ఐవీఆర్ఎస్ కాల్స్

- ప్రజలను భయాందోళనలకు గురిచేస్తున్న చంద్రబాబు ముఠా
- ఎన్నికల నిబంధనలకు పాతర
- టీడీపీ అరాచకంపై ఎన్నికల కమిషన్‌కు వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు
- తక్షణం దీనిపై దర్యాప్తుచేసి చర్యలు తీసుకుని నివేదిక ఇవ్వాలి
- సీఐడీకి ఎన్నికల సంఘం ఆదేశం



సాక్షి, అమరావతి: ప్రజలను భయాందోళనకు గురిచేస్తూ తప్పుడు సమాచారంతో ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై తెలుగుదేశం పార్టీ చేస్తున్న దుష్ప్రచారం మీద ఎన్నికల సంఘం (ఈసీ) ఘాటుగా స్పందించింది. విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే మల్లాది విష్ణు ఏప్రిల్ 29న ఇచ్చిన ఫిర్యాదును పరిశీలించిన ఈసీ టీడీపీ దుష్ప్రచారంపై దర్యాప్తు చేసి తీసుకున్న చర్యలతో తక్షణం నివేదిక ఇవ్వాలంటూ మంగళగిరి సీఐడీ (సైబర్ సెల్) అడిషనల్ డీజీకి అడిషనల్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ ఎంఎన్ హరీంధర ప్రసాద్ ఆదేశించారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి వ్యతిరేకంగా తప్పుడు సమాచారంతో దురుద్దేశ్యపూర్వకంగా లాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై ఐవీఆర్ కాల్స్‌తో పాటు సామాజిక మాధ్యమాల్లో టీడీపీ ప్రచారం చేస్తోందంటూ ఆధారసహితంగా వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు చేసింది. వివిధ ప్రాంతాల నుంచి వేర్వేరు నెంబర్ల ఐవీఆర్ కాల్స్ వస్తున్నాయని.. వాటిని లిఫ్ట్ చేయగానే.. 'వైఎస్ జగన్ అధికారంలోకొస్తే మీ భూములు మీ పేరు మీద ఉండవు, జగన్ కాజేస్తాడు, ఒరిజినల్స్ ఆయన దగ్గర ఉంచుకుంటాడు, మీకు జిరాక్స్ కాపీలు వస్తాయి, కాబట్టి జగన్‌కు ఓటు వేయకుండా తెలుగుదేశంకు ఓటు వేయండి'.. అంటూ రికార్డ్ మెసేజ్‌లు వస్తున్నట్లు ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. వీటికి సంబంధించిన వాయిస్ రికార్డులను వైఎస్సార్‌సీపీ ఈసీకి ఆధారాలుగా సమర్పించింది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఎన్నికల సంఘం ఆమోదంలేకుండా ఎలాంటి ప్రచారం చేయడానికి వీల్లేదని.. కానీ ఎటువంటి అనుమతుల్లేకుండా వివిధ చోట్ల నుంచి కాల్స్‌చేస్తూ ఇలా ప్రచారం చేయడం ఉల్లంఘన కిందకే వస్తుందని.. ఈ విషయంలో తెలుగుదేశం పార్టీపై తక్షణం చర్యలు తీసుకోవాలని ఉత్తర్వులు జారీచేసింది. ఎన్నికల సమరంలో అన్ని రాజకీయ పార్టీలకు సమాన అవకాశాలు ఉండేలా చూడాల్సిన బాధ్యత ఎన్నికల సంఘంపై ఉంటుందని, ఈ విధంగా చట్టాలపై తప్పుడు సమాచారంతో దుష్ప్రచారం చేస్తూ ప్రజల్లో భయాందోళనలను రేకెత్తిస్తున్న టీడీపీపై తక్షణం చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ తన ఫిర్యాదులో కోరింది.

తారస్థాయికి చంద్రబాబు ఫ్రస్ట్రేషన్

ఎన్నికల ప్రచార సభలు ఘోరంగా విఫలమవడంతోనే నిరాశానిస్పృహలు / వచ్చే ఎన్నికల్లోనూ ఓటమి ఖాయమని తేలడంతో సీఎంపై దూషణల పర్వం

నూజివీడు/దర్శి: ప్రతిపక్ష నేత చంద్రబాబు రోజు రోజుకు తన స్థాయిని మర్చిపోయి రెచ్చిపోతున్నారు. ఆయన, దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ నిర్వహిస్తున్న సభలకు ప్రజాస్పందన లేకపోవడం, వచ్చే ఎన్నికల్లోనూ ఘోర ఓటమి తప్పదని స్పష్టం కావడంతో ఆయన ఫ్రస్ట్రేషన్ తారాస్థాయికి చేరుతోంది. దీంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌పై దారుణమైన పదజాలంతో విరుచుకుపడుతున్నారు. కొద్దిరోజుల క్రితం జగన్‌ను చంపేస్తే ఏమవుతుందంటూ వ్యాఖ్యానించిన చంద్రబాబు శనివారం నూజివీడు, దర్శిలో నిర్వహించిన ఎన్నికల ప్రచార సభల్లో మరింత రెచ్చిపోయారు. ముఖ్యమంత్రిని ఉద్దేశించి ఆయనకు ప్రజలు ఉరేయాలని పిలుపునిచ్చారు. సీఎంపై తిట్ల దండకం ఎత్తుకున్నారు. దూషణలపర్వానికి దిగారు. చంద్రబాబుకు ఓటమి ఖాయమని తేలడంతోనే ఇలా దిగజారి మాట్లాడుతున్నారని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

ఐదేళ్ల అరాచకానికి ఫుల్‌స్టాప్ పెట్టాలి..

రాబోయే ఎన్నికల్లో జగన్ ఐదేళ్ల అరాచకానికి ప్రజలు ఫుల్‌స్టాప్ పెట్టాలని ప్రతిపక్ష నేత చంద్రబాబు కోరారు. ఏలూరు జిల్లా నూజివీడు, ప్రకాశం జిల్లా దర్శిలో శనివారం ఆయన ఎన్నికల ప్రచార సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రబాబు మాట్లాడుతూ ఈ సీఎం లుచ్చా ముఖ్యమంత్రి, మోసగాడు, అహంకారి, సైకో, విధ్వంసకారుడు, దోపిడీదారుడు, బందిపోటు దొంగ,నియంత అంటూ ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రజల సంపద అంతా తన దగ్గరే ఉండాలనుకుంటారని మండిపడ్డారు. ఈ నెల 13న జరిగే పోలింగ్‌లో వైఎస్సార్‌సీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రజలకు పిలుపునిచ్చారు. 'భూమి మీదా.. జగన్‌దా.. జగనన్న భూహక్కు చట్టం అంటా తమ్ముళ్లా.. మీ భూమి మీద జగన్ కన్నుపడింది' అని ఆరోపించారు. భవిష్యత్‌లో భూముల రికార్డ్స్ ఏమీ ఉండవని, జిరాక్స్ కాపీలే ఇస్తారని, వాటితో ముడ్డి తుడుచుకోవడమేనని చెప్పారు. అమెరికాలో ఉన్న జగన్ బినామీ కంపెనీకి జిరాక్స్ కాపీలను స్టోర్ చేసే అవకాశం ఇచ్చారని ఆరోపించారు. ల్యాండ్‌టైట్లింగ్ చట్టం నల్ల చట్టమని, మీ భూమిని కాజేసే చట్టమని, దొంగోడు, బూచోడు మనందరి భూమిపై కన్నేశాడని తీవ్ర విమర్శలు చేశారు.

దుర్మార్గుడు సర్వనాశనం చేశాడు..

జగన్ మెడకు ఉరేసే అవకాశం ఉందని.. మే 13న జగన్ పార్టీకి, ఫ్యాన్‌కు ఉరివేయాలని చంద్రబాబు ప్రజలకు పిలుపునిచ్చారు. రాజధాని అమరావతిని దేశంలోనే నంబర్‌వన్ చేయాలనుకున్నానన్నారు. అయితే దుర్మార్గుడు వచ్చి మూడు ముక్కలు ఆడి సర్వనాశనం చేశాడని మండిపడ్డారు. అమరావతి వచ్చి ఉంటే నూజివీడు పక్కనే ఔటర్ రింగ్ రోడ్డు వెళ్లేదన్నారు. టీడీపీని గెలిపిస్తే నూజివీడును కృష్ణా జిల్లాలో కలుపుతానన్నారు. వలంటీర్లను ప్రజలకు సేవ చేసేందుకు పెట్టండి కానీ రాజకీయాలకు కాదని తానే చెప్పానని చంద్రబాబు తెలిపారు. వలంటీర్లను ఎన్నికల విధుల్లో పెట్టవద్దంటే పింఛన్లు ఇవ్వకుండా చేశారని ఆరోపించారు. పేదలపై కక్ష కట్టి ఏప్రిల్‌లో 33 ప్రభుత్వ హత్యలు చేసిన వ్యక్తి ఈ జలగ సైకో అని ధ్వజమెత్తారు. కాగా నూజివీడుకు వచ్చిన చంద్రబాబు జనం లేక 40 నిమిషాలపాటు బస్సులోనే వేచి చూడాల్సిన పరిస్థితి ఎదురైంది.



దర్శి సభలో సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ చంద్రబాబు ఎదుటే ఫ్లెక్సీలు ప్రదర్శిస్తున్న అభిమానులు

సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ అభిమానుల ఫ్లెక్సీలు

దర్శి సభలో సీఎం జూనియర్ ఎన్టీఆర్ అంటూ టీడీపీ కార్యకర్తలు ఫ్లెక్సీలు, ప్లకార్డులను ప్రదర్శించారు. 'జై జూనియర్ ఎన్టీఆర్.. సీఎం కావాలి జూనియర్ ఎన్టీఆర్' అంటూ చంద్రబాబు ముందే నినాదాలు చేశారు. దీంతో చంద్రబాబు పక్కన ఉన్న నేతలు ఫ్లెక్సీ దించి పక్కకు పోవాలని హెచ్చరించినా అభిమానులు నినాదాలు చేశారు. దీంతో కింద ఉన్న కేడర్ వారిని బలవంతంగా అక్కడ నుంచి పంపేశారు.

రిజర్వేషన్లు ఎత్తేసేందుకు కుట్ర

- ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాలి
- టీపీసీసీ ఎస్సీసెల్ రాజ్యాంగ పరిరక్షణ దీక్షలో మాజీ ఎంపీ మధుయాష్కీ
- హాజరైన వీహెచ్, మహేశ్‌గౌడ్, ఎ.చంద్రశేఖర్, ప్రీతమ్, గజ్జెల కాంతం


దీక్షలో మాట్లాడుతున్న మహేశ్‌కుమార్ గౌడ్

సాక్షి, హైదరాబాద్: రిజర్వేషన్లు తీసేసేందుకు జరుగుతున్న కుట్రను అడ్డుకునేందుకు దేశ వ్యాప్తంగా ఎస్సీ, ఎస్టీ, బీసీలు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీగౌడ్ పిలుపునిచ్చారు. టీపీసీసీ ఎస్సీ విభాగం ఆధ్వర్యంలో శనివారం గాంధీభవన్‌లో రాజ్యాంగ పరిరక్షణ దీక్ష చేపట్టారు. ఎస్సీ సెల్ చైర్మన్ నాగరిగారి ప్రీతం, మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్, ఆ పార్టీ నేతలు గజ్జెల కాంతం, సతీశ్‌మాదిగ, ఊట్ల వరప్రసాద్, మానవతారాయ్ తదితరులు దీక్ష చేపట్టారు. ఈ దీక్షకు హాజరైన యాష్కీ మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చి రిజర్వేషన్లను రద్దు చేసేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని ఆరోపించారు. కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు మాట్లాడుతూ ఈసారి బీజేపీకి 400 సీట్లు వస్తే తన ఇష్టానుసారంగా రాజ్యాంగాన్ని మార్చివేస్తుందన్నారు. టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్, ఎమ్మెల్సీ మహేశ్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ దేశంలో రిజర్వేషన్లు అమలు కావాలంటే బీజేపీని తరిమికొట్టి కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తేవాలని, అలా తెచ్చే బాధ్యత దళితులపైనే ఉందన్నారు.

రిజర్వేషన్లతోనే సమానత్వం

ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బల్మూరి వెంకట్రావు మాట్లాడుతూ సమానత్వం ఉండాలంటే రిజర్వేషన్లు ఉండాల్సిందేనని స్పష్టం చేశారు. మాజీ మంత్రి ఎ.చంద్రశేఖర్ మాట్లాడుతూ గతంలో బీజేపీతో దోస్తీ కారణంగానే కేసీఆర్ కూడా రాజ్యాంగాన్ని మారుస్తానని అంటున్నారనీ, రాజ్యాంగాన్ని కాపాడుకునేందుకు బీజేపీతో పాటు బీఆర్ఎస్‌కు కూడా బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల పోటీ..
రెండో స్థానం కోసమే!

▶ మొదటి పేజీ తరువాయి
హామీలను అమలు చేయలేని పరిస్థితుల్లో చెప్పుకోవడానికి రేవంత్‌రెడ్డికి, కాంగ్రెస్ పార్టీకి ఏమీ లేకనే.. రాజ్యాంగం మార్పు, రిజర్వేషన్ల రద్దు, గాడిద గుడ్డు అంటూ ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. దేవుడిపై ఒట్లు పెడుతూ దొంగ నాటకాలు ఆడుతున్నారని విమర్శించారు. ఈ నెల 13న రాష్ట్రంలో లోక్‌సభ ఎన్నికల పోలింగ్ ఉన్న నేపథ్యంలో కిషన్‌రెడ్డి 'సాక్షి'కి ప్రత్యేక ఇంటర్వ్యూ ఇచ్చారు. రాష్ట్రంలో ఎన్నికల వాతావరణం, ప్రచార పర్వం, రాజకీయ అంశాలపై తన అభిప్రాయాలను వెల్లడించారు. ఇంటర్వ్యూలోని కీలక అంశాలు ఆయన మాటల్లోనే..

బీజేపీకే అనుకూల వాతావరణం

తెలంగాణలో డబుల్ డిజిట్ సీట్లు వస్తాయన్న నమ్మకం ఉంది. తెలంగాణలో బీజేపీకి అనుకూల వాతావరణం ఉంది. అసెంబ్లీ ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోవడంతో అధికార కాంగ్రెస్‌పై తీవ్ర వ్యతిరేకత ఉంది. పదేళ్ల పాలనలో వైఫల్యాలు, అవినీతి, అక్రమాలు బీఆర్ఎస్‌ను వెన్నాడుతున్నాయి. దీంతో మోదీని గెలిపించాలని ప్రజలు నిర్ణయించుకున్నారు. రాష్ట్రంలో 12 స్థానాలకు మించి వచ్చినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదు. మేం కచ్చితమైన ఎన్నికల కార్యాచరణతో ముందుకెళుతున్నాం. రాష్ట్రంలోని ఒక్కో ఎంపీ సీటు పరిధిలోని ఏడు అసెంబ్లీ సెగ్మెంట్ల వారీగా కమిటీలు, టీమ్‌లు ఏర్పాటు చేశాం. నాయకులంతా సమన్వయంతో పనిచేస్తున్నారు. రాష్ట్ర స్థాయి నాయకులను ఒక్కో అసెంబ్లీకి పంపించాం. ఇవి లోక్‌సభ ఎన్నికలు కాబట్టి ఇంకా ఏ పార్టీ, ఎంపీ అభ్యర్థులు కూడా పోలింగ్‌బూత్ స్థాయి వరకు చేరుకోలేదు. మేం మాత్రం కచ్చితమైన ప్రణాళికతో బూత్ స్థాయి వరకు ఓటర్లను చేరుకున్నాం.

బీజేపీ బలాన్ని పెంచుకుంటున్నాం..

హైదరాబాద్ నుంచి బరిలో ఉన్న మాధవీలత, ఖమ్మం నుంచి పోటీచేస్తున్న వినోద్‌రావు బీజేపీలో ఉన్నవారే, ప్రజాసంఘాల్లో పనిచేస్తున్నవారే. రాష్ట్రంలో బీజేపీ బలాన్ని పెంచుకునేందుకు కొన్ని సీట్లలో ఇతర పార్టీల వారికి, బలమైన అభ్యర్థులకు టికెట్లు ఇచ్చాం. తెలంగాణలో బీజేపీ ఇంకా చిన్న పార్టీ. పెరగాల్సిన అవసరం ఉంది.

సంకీర్ణమైతే దేశం భ్రష్టుపడుతుంది

రాబోయేది సంకీర్ణ యుగమంటూ మాట్లాడుతున్న మాజీ సీఎం కేసీఆర్.. కాంగ్రెస్ సంకీర్ణంలో చేరుతారా? సమాధానం చెప్పాలి. మేం మాత్రం ఆయనను చేర్చుకునే ప్రసక్తే లేదు. సంకీర్ణమంటే దేశమైనా, రాష్ట్రమైనా భ్రష్టుపడతాయన్న విషయాన్ని అందరూ గ్రహించాలి. ఎవరికి వారు బ్లాక్ మెయిల్ చేస్తారు. ఆ పరిస్థితి పట్ల ప్రజలు విసిగి వేసారాకే.. 2014లో, 2019లో బీజేపీకి మెజారిటీ కట్టబెట్టారు. ఎన్డీయేను అందలం ఎక్కించారు.

ఈసారి గెలిచాక జమిలి ఎన్నికలే..

మోదీ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టాక.. వన్ నేషన్.. వన్ ఎలక్షన్ (జమిలి ఎన్నికలు) విధానంతో ముందుకెళతాం. వచ్చే ఎన్నికలు కలిసే జరుగుతాయి. దేశంలో జనగణనతోపాటు నియోజకవర్గాల పునర్విభజన జరగాల్సి ఉంది. ఇందులో దక్షిణాదిలో సీట్లు తగ్గుతాయంటూ దుష్ప్రచారం చేయడం ఎంతమాత్రం సరికాదు.

సీఎం, మాజీ సీఎం స్థాయివాళ్లు దిగజారి మాట్లాడుతున్నారు!

ప్రస్తుతం రాజకీయ వాతావరణమంతా కలుషితమైపోయింది. గతంలో ఎన్నికలంటే గ్రామాల్లో పండుగ వాతావరణం ఉండేది. ఇప్పుడు అసహ్యించుకునే పరిస్థితి తీసుకొచ్చారు. ఏ మాత్రం సంబంధం లేని విషయాలు ప్రస్తావించడం, అబద్ధాలు మాట్లాడటం, ఉపయోగించే భాషపై నియంత్రణ లేకపోవడం పెరిగింది. కొడతా, తిడుతా, చంపుతా, పాదాల కింద నలిపేస్తా అంటూ సీఎం, మాజీ సీఎం స్థాయిల వ్యక్తులు మాట్లాడుతున్నారు. ప్రచారంలో, మాట్లాడే మాటల్లో నైతికత లేకుండా పోయింది. హైదరాబాద్ లోక్‌సభ స్థానం సహా అన్నిచోట్లా డబ్బులే కీలకపాత్ర పోషించే పరిస్థితి ఏర్పడింది.

రాముడి పేరిట కాదు.. అభివృద్ధిని చూపి వస్తున్నాం

బీజేపీ ఎన్నికల ప్రచారంలో ఎక్కడైనా రాముడి ప్రస్తావన ఉందా? మీడియా, వార్తాపత్రికల్లో దీని ప్రాతిపదికన ఎక్కడైనా ఓట్లు అడిగామా? పదేళ్లలో మేం ఎంత అభివృద్ధి చేశాం, ఏయే రంగానికి ఎన్నెన్ని నిధులిచ్చామో స్పష్టంగా చెప్పి ఓట్లు అడుగుతున్నాం. ఎంత మందికి బియ్యం ఇస్తున్నాం, రైతులకు ఏం చేశామనేది చెప్తున్నాం. మేం రాముడి పేరిట ఓట్లు అడుగుతున్నామని విమర్శిస్తున్న వారు దీనికి సమాధానం చెప్పాలి.

బీజేపీతోనే తెలంగాణ అభివృద్ధి

దేశంలో సుస్థిర ప్రభుత్వం రావడం ద్వారా అవినీతి, అక్రమాలకు చెక్‌పెట్టవచ్చు. ఉగ్రవాదాన్ని అరికట్టవచ్చు. అందుకే బీజేపీకి మద్దతు ఇవ్వాలని ప్రజలను కోరుతున్నాం. పదేళ్ల మోదీ పాలనలో తెలంగాణకు ఎంతో మేలు జరిగింది. ఇక ముందు మరింత అభివృద్ధి జరగాలంటే బీజేపీని అత్యధిక సీట్లలో గెలిపించాలని కోరుతున్నాను.

రేవంత్‌కు ముందుంది ముసళ్ల పండుగ

అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా వంద రోజుల్లో ఆరు గ్యారంటీలు అమలు చేస్తామని చెప్పారు. అమలు చేయలేదు. అందుకే కాంగ్రెస్‌కు, రేవంత్‌రెడ్డికి ఓట్లు అడిగే నైతికహక్కు లేదంటున్నాం. మా ఇంటింటి ప్రచారంలో ఈ విషయాన్ని ప్రజలకు చెప్తుంటే మంచి స్పందన వస్తోంది. రేవంత్‌రెడ్డికి ముందుంది ముసళ్ల పండుగ. ఆరు గ్యారంటీలు, 420 వాగ్దానాల అమలు ఎలా చేస్తారు? ఇప్పుడు తొందరపడి ఎగిరెగిరి పడితే సరిపోతుందా? భూములు అమ్మి ఎన్ని లక్షల కోట్లు సంపాదిస్తారు? ఏం చేస్తారనేది ప్రజల ముందు ఉంది. కాంగ్రెస్ పార్టీ 2019 లోక్‌సభ ఎన్నికలతో పోల్చితే ఈ ఎన్నికల్లో మరీ దారుణంగా వ్యవహరిస్తోంది.

రిజర్వేషన్లపై మోదీ స్పష్టత ఇచ్చినా.. రేవంత్ గోబెల్స్ ప్రచారం

ముస్లిం రిజర్వేషన్లను రద్దు చేస్తామని మేం 20 ఏళ్లుగా చెబుతూనే ఉన్నాం. అది మా పార్టీ విధానమని స్పష్టంగా చెప్తున్నాం. మోదీ ప్రధాని అయ్యాక కొత్తగా ఏమీ దీనిని లేవనెత్తలేదు. మతపరమైన రిజర్వేషన్లు రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టులు కూడా తీర్పులిచ్చాయి. కానీ విపక్షాలు కావాలని బురద చల్లుతున్నాయి. బీజేపీ మళ్లీ అధికారంలోకి వస్తే రిజర్వేషన్లు రద్దు చేస్తుందంటూ కాంగ్రెస్ పార్టీ, సీఎం రేవంత్‌రెడ్డి పెద్ద ఎత్తున గోబెల్స్ ప్రచారానికి దిగాయి. దీనిపై ప్రధాని మోదీ చాలా స్పష్టమైన ప్రకటన చేశారు. తన కంఠంలో ప్రాణం ఉండగా రిజర్వేషన్ల రద్దు ఉండదని, రాజ్యాంగాన్ని మరింత పటిష్టం చేస్తామని చెప్పారు. అయినా బీజేపీపై దుష్ప్రచారాన్ని కొనసాగిస్తూ.. దాన్ని ఎన్నికల ఎజెండాగా తయారుచేసి పెట్టారు. ప్రజలకు నిజాలు చెప్పాల్సిన బాధ్యత మాపై ఉంది. అందుకే మేం పదే పదే వివరణ ఇవ్వక తప్పని పరిస్థితి ఏర్పడింది. ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు బీజేపీ, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా ఉన్నాయి. ఇది మాదిగలకు అనుకూలం, మాలలకు వ్యతిరేకమనే ఆలోచన తప్పు. జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్ల ఫలాలు అందాలని కోరుకుంటున్నాం.

ఆదాయం రూ.6 వేలు.. ఖర్చు 2 లక్షలు!

ఆదరణ కరువైన సిద్దిపేట-సికింద్రాబాద్ రైలు

- రోజుకు సగటున 250 మంది మాత్రమే ప్రయాణం
- ప్రస్తుతం కేవలం 40 కి.మీ వేగంతో నడుస్తున్న రైలు
- మూడుచోట్ల కొనసాగుతున్న వంతెనల పనులే కారణం
- బస్సు కన్నా గంటకు పైగా ఎక్కువ ప్రయాణ సమయంతో ఆసక్తి చూపించని ప్రజలు

సాక్షి, హైదరాబాద్: ఆ రైలు రోజుకు రెండు ట్రిప్పులు తిరుగుతోంది. ఆ రెండు ట్రిప్పుల్లోనూ అందులో ప్రయాణించే వారి సంఖ్య సగటున 250 మంది మాత్రమే. కాగా టికెట్ల రూపంలో రైల్వేకు రోజుకు వస్తున్న ఆదాయం కేవలం సుమారు రూ.6 వేలు. కానీ ఈ రెండు ట్రిప్పులకు అయ్యే నిర్వహణ వ్యయం ఎంతో తెలుసా? ఏకంగా రూ.2 లక్షలు! సికింద్రాబాద్ – సిద్దిపేట మధ్య తిరుగుతున్న డెమూ రైలు కథ ఇది. పరుగులు పెట్టాల్సిన ఈ రైలు షెడ్యూల్ ప్రకారం గానే అయినా దాదాపు నడుస్తున్నట్టు వెళ్లడమే ఈ పరిస్థితికి కారణం. నగరంలోని జూబ్లీ బస్‌స్టేషన్ నుంచి బయలుదేరే బస్సు 2.15 గంటల్లో సిద్దిపేటకు చేరుకుంటుంటే, ఈ రైల్లో మాత్రం ఇందుకోసం కనీసం 3 గంటల నుంచి మూడున్నర గంటల సేపు ప్రయాణించాల్సి వస్తోంది. ప్రస్తుతం ఈ రైలు సగటు వేగాన్ని అధికారులు గంటకు కేవలం 40 కిలోమీటర్లకే పరిమితం చేశారు. అందుకనే 116 కి.మీ (రైలు రూట్ కి.మీ. ప్రకారం) ప్రయాణానికి 3 గంటలకు పైగా సమయం పడుతోంది. మరోవైపు స్టేషన్ సిద్దిపేటకు దూరంగా ఉంది. దీంతో సిద్దిపేట నుంచి స్టేషన్‌కు రావాలన్నా, స్టేషన్ నుంచి సిద్దిపేటకు వెళ్లాలన్నా ప్రత్యేకంగా ఆటోలో ప్రయాణించాల్సి వస్తోంది. ఇవన్నీ దృష్టిలో ఉంచుకుని ప్రయాణికులు రైలు ఎక్కడం కంటే బస్సు బెటరని అటు మళ్లుతున్నారు.

తప్పనిసరి పరిస్థితుల్లో కొనసాగింపు

రెండు ట్రిప్పుల్లో సగటున నాలుగైదు వేల మంది ప్రయాణించాల్సి ఉండగా 250 కూడా మించటం లేదు. సిద్దిపేటలో 30 మందికి మించి రైలు ఎక్కడం లేదు. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి సిద్దిపేట చేరుకునే సరికి అంతే సంఖ్యలో ప్రయాణికులు మిగులుతున్నారు. మధ్యలో ఉండే స్టేషన్లలో ఐదారుగురు చొప్పున ఎక్కి దిగుతున్నారు. కొన్ని సందర్భాల్లో రైల్లో 50–60 మంది ప్రయాణికులు కూడా ఉండటం లేదని సిబ్బంది చెప్పడటం ఈ రైలుకున్న ఆదరణను స్పష్టం చేస్తోంది. ఇలాంటప్పుడు రైల్వే దీనిని డిమాండ్ లేని సర్వీసుగా పరిగణించి రద్దు చేస్తుంది. కానీ భవిష్యత్తులో ఇది కరీంనగర్ (పెద్దపల్లి) వరకు సేవలు అందించాల్సిన సర్వీసు కావటంతో, ఇప్పుడు రద్దు చేస్తే మళ్లీ పునరుద్ధరించేందుకు రైల్వే సేఫ్టీ కమిషనర్ తనిఖీ, తదనంతర అనుమతులు రావడం లాంటి తతంగం ఉన్నందున తప్పనిసరి పరిస్థితుల్లో ఈ రైలును కొనసాగిస్తోంది.

ఎందుకింత మెల్లగా..

మనోహరాబాద్ నుంచి సిద్దిపేట వరకు మార్గం సిద్ధం కావటంతో రైలు ప్రారంభించారు. కానీ మధ్యలో మూడు నాలుగు చోట్ల ఆర్‌ఓబీ, ఆర్‌యూబీల నిర్మాణంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. సిద్దిపేట–జనగామ రోడ్డులో రంగధాంపల్లి వద్ద ఆర్‌ఓబీ నిర్మాణం జరుగుతోంది. కొమురవెల్లి స్టేషన్ సమీపంలో ఆర్‌యూబీ నిర్మాణం కొనసాగుతోంది. కుకునూరుపల్లి వద్ద ఆర్‌ఓబీ ఇటీవలే పూర్తయింది. ఈ మూడు కీలక నిర్మాణాల కారణంగానే వేగాన్ని బాగా తగ్గించి రైలు నడుపుతున్నారు.

రోజుకు 1,800 లీటర్ల డీజిల్ ఖర్చు

ఇది ఎనిమిది కోచ్‌లుగా ఉండే రేక్. దీనికి రెండు పవర్ కార్‌లుంటాయి. ఒక్కో పవర్ కార్‌కు నాలుగు కోచ్‌లు అటాచ్ అయి ఉంటాయి. ఒక ట్రిప్పునకు (వెళ్లి రావడానికి) 900 లీటర్ల డీజిల్ ఖర్చవుతోంది. రెండు ట్రిప్పులకు 1800 లీటర్లు ఖర్చవుతున్నాయి. ఇక ఈ సర్వీసు సిబ్బందికి ఒకరోజు జీతం రూ.20 వేలుగా ఉంటోంది. ఈ మొత్తం కలిపితే రోజుకు రూ.2 లక్షల ఖర్చవుతోంది.

ఆ దారి బాగు చేయండి

సిద్దిపేట, రైల్వేస్టేషన్‌కు మధ్య (ప్రధాన రహదారి) దాదాపు నాలుగు కి.మీ.దూరం ఉండటం ప్రయాణికులకు ఇబ్బందిగా ఉంది. గుండ్ల చెరువు మీదుగా వెళ్తే ఒకటిన్నర కి.మీ.దూరమే ఉంటుందని, కానీ ఆ దారి మధ్యలో ధ్వంసం కావటంతో వాహనాల రాకపోకలు కుదరటం లేదని స్థానికులు చెబుతున్నారు. ఈ దారి బాగు చేస్తే తమకు కొంతవరకు సౌకర్యవంతంగా ఉంటుందని అంటున్నారు.

75 కిలోమీటర్లకు పెరగనున్న వేగం

ఆర్‌ఓబీ, ఆర్‌యూబీ పనులను త్వరగా పూర్తి చేసి రైలు వేగాన్ని పెంచాలని ఇటీవల రైల్వే ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో రైలు గరిష్ట వేగాన్ని 75 కి.మీ.కు పెంచాలని నిర్ణయించారు. అదే జరిగితే ప్రయాణ సమయం దాదాపు 45 నిమిషాలు తగ్గుతుంది. అప్పుడు రెండున్నర గంటల్లోనే రైలు గమ్యం చేరుతుందని, ప్రయాణికుల ఆదరణ పెరుగుతుందని అధికారులు భావిస్తున్నారు.

రైలు వేళలు ఇలా..

- ➜ సిద్దిపేటలో ఉదయం 6.45 గంటలకు బయలుదేరి 10.15కు సికింద్రాబాద్ చేరుకుంటుంది. ➜ సికింద్రాబాద్‌లో ఉదయం 10.35కు బయలుదేరి మధ్యాహ్నం 1.45కు సిద్దిపేట చేరుకుంటుంది.
- ➜ సిద్దిపేటలో 2.05కు బయలుదేరి సికింద్రాబాద్‌కు సాయంత్రం 5.20కు చేరుకుంటుంది.
- ➜ సికింద్రాబాద్‌లో 5.45కు బయలుదేరి రాత్రి 8.45కు సిద్దిపేటకు చేరుకుంటుంది.
- ➜ మల్కాజిగిరి, కెవలరీ బ్యారక్స్, బొల్లారం, గుండ్లపోచంపల్లి, మేడ్చల్, మనోహరాబాద్, నాచారం, బేగంపేట, గజ్వేల్, కొడకండ్ల, లకుడారం, దుద్దెడల్లో ఆగుతుంది.

నగర వార్తలు

ఓయూ డిగ్రీ పరీక్షల టైం టేబుల్ విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ డిగ్రీ పరీక్షల టైం టేబుల్‌ను విడుదల చేసినట్లు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామ్స్ ప్రొ.రాములు శనివారం తెలిపారు. డిగ్రీ పూర్వవిద్యార్థుల వన్‌టైం ఛాన్స్ పరీక్షలు ఈ నెల 16 నుంచి, రెగ్యులర్, బ్యాక్‌లాగ్ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు జూన్ 6 నుంచి ప్రారంభంకానున్నట్లు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు ఉస్మానియా వెబ్‌సైట్ చూడవచ్చన్నారు.

హోటల్ లిఫ్ట్‌లో యువతి పట్ల అసభ్యకర ప్రవర్తన

బంజారాహిల్స్: బంజారాహిల్స్ రోడ్డు నెంబర్–12లోని కమాన్ సమీపంలో ఉన్న ఓ హోటల్‌లో నేపాలీ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసులు దర్యాప్తు చేపట్టారు. వివరాలివీ... నేపాల్‌కు చెందిన యువతి (26) కొంతకాలంగా ఈ హోటల్‌లో వెయిటర్‌గా పనిచేస్తుంది. మధ్యాహ్నం లంచ్ చేసేందుకు స్టాఫ్ లిఫ్ట్‌లో పైకి వెళ్తుండగా అదే సమయంలో సూపర్‌వైజర్ షాకీర్‌ఖాన్ లిఫ్ట్ ఎక్కాడు. లిఫ్ట్ మూవ్ అవుతుండగా షాకీర్‌ఖాన్ ఆ యువతి పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడు. ఆమెను గట్టిగా పట్టుకొని నోరు మూసి ఇబ్బందులకు గురిచేస్తుండగా విడిపించుకునేందుకు యత్నించినా ఉపయోగం లేకుండాపోయింది. లిఫ్ట్ నాలుగో అంతస్తుకు వెళ్లేవరకు ఆ యువకుడి బారి నుంచి తప్పించుకునే మార్గం లేక విలవిల్లాడింది. లిఫ్ట్ దిగి భయంతో చెఫ్ వద్దకు పరుగులు తీసి జరిగిన విషయాన్ని చెప్పింది. ఈ మేరకు బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో తన పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన యువకుడిపై చర్యలు తీసుకోవాల్సిందిగా ఫిర్యాదు చేసింది. అయితే బాధిత యువతికి న్యాయం జరక్కపోగా హోటల్ యాజమాన్యం ఆమెను ఉద్యోగంలో నుంచి తొలగించింది. అసభ్యకరంగా ప్రవర్తించిన నిందితుడిని కూడా ఉద్యోగం నుంచి తొలగించి చేతులు దులుపేసుకుంది. తనకు జరిగిన అన్యాయంపై చర్యలు తీసుకోవాల్సిందిగా నేపాల్‌కు చెందిన ప్రతినిధి రవితాపాతో కలిసి శనివారం పోలీసులకు మొరపెట్టుకుంది. బంజారాహిల్స్ పోలీసులు ఘటనపై విచారణ చేపట్టారు.

డయాబెటిస్ సవాళ్లపై విస్తృత పరిశోధనలు జరగాలి

- సుప్రీంకోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ

సనత్‌నగర్: భారతదేశంలో డయాబెటిస్ ఆందోళనకర స్థాయిలో ఉందని, దీనిని నియంత్రించే దిశగా విస్తృత పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని సుప్రీం కోర్టు మాజీ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణ అన్నారు. వంశపారంపర్య లక్షణాలతో పాటు మారిన జీవన శైలి, ఆహారపు అలవాట్లతో డయాబెటిస్ వ్యాధి బారిన పడుతున్నారని, దీనిపై వైద్య నిపుణులు విస్తృత అవగాహన కల్పించాలన్నారు. తెలంగాణ రాష్ట్ర రీసెర్చ్ సొసైటీ ఆఫ్ డయాబెటిస్ ఇన్ ఇండియా (టీఎస్ఆర్ఎస్ఎస్‌డీఐ) ఆధ్వర్యంలో అమీర్‌పేటలోని హోటల్ మ్యారీగోల్డ్‌లో డయాబెటిస్ అంశంపై రెండు రోజుల సదస్సు శనివారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా హాజరైన ఎన్వీ రమణ మాట్లాడుతూ వ్యాధి వచ్చిన తరువాత తగ్గించుకోవడం కంటే వ్యాధి రాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై దృష్టిసారించడం ఉత్తమ మార్గమన్నారు. ఇందు కోసం వైద్యులు అవగాహన కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకురావాలన్నారు. డయాబెటిస్‌ను తగ్గించడంలో డైటీషియన్ల పాత్ర కూడా చాలా ఉంటుందన్నారు. పాశ్చాత్య దేశాల ఆహారపు



సదస్సులో మాట్లాడుతున్న జస్టిస్ ఎన్వీ రమణ

అలవాట్లు మన ఆరోగ్యాన్ని దెబ్బతీస్తున్నాయన్నారు. గతంలో వయసు పైబడిన వారు మాత్రమే డయాబెటిస్ బారిన పడేవారని, కానీ ప్రస్తుత పరిస్థితుల్లో చిన్న పిల్లల నుంచి యువకులు కూడా డయాబెటిస్ బారిన పడుతున్నారన్నారు. ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ అనేది ఇంకా ప్రాథమిక దశలోనే ఉందని, కానీ దానిని నమ్ముకొని ఉండలేమని, హ్యూమన్ ఇంటెలిజెన్స్‌ను మించింది అయి ఉంటుందని తాను భావించడం లేదన్నారు. ఆహారపు అలవాట్లను మార్చుకోవడం ద్వారా డయాబెటిస్‌ను తగ్గించుకోవచ్చన్నారు. లాయర్ల కంటే కూడా డాక్టర్లు ఎంతో ప్రాక్టికల్‌గా ఉంటారని చమత్కరించారు. వైద్యులకు ఎన్నో కష్టాలు ఉంటాయని, 13 ఏళ్ల పాటు వివిధ కోర్సులు చదివితే గానీ మంచి అవకాశాలు రావన్నారు. తాను హైకోర్టులో ప్రాక్టీస్ చేసే సమయంలో సమీపంలో ఉన్న మెటర్నిటీ హాస్పిటల్ వైద్యుల కష్టాలను దగ్గర నుంచి చూశానన్నారు. ఈ సందర్భంగా డయాబెటిస్‌లో ప్రస్తుతం అందుబాటులో ఉన్న వైద్యం, నూతన విధానాలు, పద్ధతులు, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ అంశాలపై సదస్సులో పాల్గొన్న ప్రముఖ వైద్యులతో పాటు రీసెర్చ్ వైద్యులు మాట్లాడారు. డయాబెటిస్‌లో వస్తున్న సవాళ్లను, వాటిని పరిష్కరించే విధానాలను ప్రముఖంగా చర్చించారు. కార్యక్రమంలో ఆర్ఎస్ఎస్‌డీఐ చైర్‌పర్సన్ డాక్టర్ లిల్లీరోడ్రిగస్, సెక్రటరీ డాక్టర్ నవల్ చంద్ర, సైంటిఫిక్ చైర్మన్ ఎంఎన్ శ్యాంసుందర్, డాక్టర్ ఉదయ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

'పీక్'లో విద్యుత్ డిమాండ్

- శుక్రవారం రికార్డు స్థాయిలో 89.71 ఎంయూల నమోదు..
- అప్రమత్తంగా ఉండాలి: ఇంజనీర్లకు డిస్కం సీఎండీ ఆదేశం

సాక్షి, సిటీబ్యూరో: రోజురోజుకు పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌ను చూసి డిస్కం ఇంజనీర్లకు ముచ్చెమటలు పడుతున్నాయి. కంపెనీ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రికార్డు స్థాయిలో విద్యుత్ డిమాండ్ నమోదవుతోంది. ఇప్పటికే పీక్ అవర్స్‌లో అత్యధిక డిమాండ్ నమోదవుతున్న సబ్‌స్టేషన్లను పర్యవేక్షిస్తున్న డిస్కం..తాజాగా 11 కేవీ ఫీడర్ల వారీగా ఇన్‌చార్జిలను కేటాయించింది. ఫీడర్‌కు ఒక ఇన్‌చార్జి చొప్పున నియమించింది. సంస్థ ప్రధాన కార్యాలయం, జోనల్ ఆఫీసుల్లో పనిచేస్తున్న 300 మంది ఇంజనీర్లతో పాటు అకౌంటింగ్ సిబ్బందికి కూడా ఈ బాధ్యతలు అప్పగించింది. ఈ మేరకు శనివారం సంస్థ ప్రధాన కార్యా లయంలో డైరెక్టర్లు, సీజీఎంలు, ఎస్ఈలు, డీఈలతో డిస్కం సీఎండీ ముషారఫ్ ఫారూఖీ విద్యుత్ పంపిణీ తీరును సమీక్షించారు. వేసవి ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని ఆదేశాలు జారీ చేశారు. గ్రేటర్‌లో ప్రస్తుతం విద్యుత్ వినియోగం రికార్డు స్థాయిలో నమోదవుతుంది. ఏప్రిల్ 30న 4214 మెగావాట్లు రికార్డు కాగా, తాజాగా శుక్రవారం 89.71 ఎంయూ కరెంట్ వాడకం నమోదైంది. గత ఏడాది ఇదే రోజున 58.34 ఎంయూ వినియోగంతో పోల్చితే..53.7 శాతం అధికం. శనివారం సైతం 4209 మెగావాట్ల డిమాండ్ నమోదైంది. వినియోగం సైతం 90 ఎంయూకు మించే అవకాశం ఉంది. మే నెలాఖరు వరకు డిమాండ్ అనూహ్యంగా పెరిగే అవకాశం లేకపోలేదు. అంతేకాదు వేసవి డిమాండ్ నేపథ్యంలో ఇప్ప టికే 4353 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు అదనంగా ఏర్పాటు చేయడం జరిగింది. వీటికి అదనంగా మరో 250 డిస్ట్రిబ్యూషన్ ట్రాన్స్ ఫార్మర్లు క్షేత్ర స్థాయి అందుబాటులో ఉంచింది. అవసరమైన చోట విద్యుత్ సిబ్బంది వాటిని యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేసేలా చూడాలని సీఎండీ ఆదేశించారు.

ఓటు హక్కును బాధ్యతగా వినియోగించుకోవాలి

పంజగుట్ట: దేశంలో అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం భారతదేశమని, ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చెయ్యాలంటే ప్రతి ఒక్కరూ ఓటు వేయాలని పలువురు వక్తలు అన్నారు. శనివారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో వర్కింగ్ జర్నలిస్ట్ ఆఫ్ ఇండియా (డబ్ల్యూజేఐ) తెలంగాణ శాఖ, పతంజలి.. స్వాభిమాన్ ట్రస్ట్ తెలంగాణ సంయుక్త ఆధ్వర్యంలో ఓటరు చైతన్య కార్యక్రమం


ఓటు హక్కు వినియోగంపై ప్రచారం చేస్తున్న దృశ్యం

రౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించారు. కృపాకర్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో డబ్ల్యూజేఐ జాతీయ అధ్యక్షుడు సంజయ్ ఉపాధ్యాయ, స్వాభిమాన్ ట్రస్ట్ అధ్యక్షుడు శ్రీధర్‌రావు, ప్రొఫెసర్ మనోహర్‌రావు, ప్రొఫెసర్ గోపాల్‌రెడ్డి, ఆచార్య కసిరెడ్డి, వీహెచ్‌పీ నాయకుడు వెంకటేశ్వర రాజు, సీనియర్ పాత్రికేయులు వల్లీశ్వర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విచక్షణ కోల్పోయి ఉచితాలకు ఆశపడి ఓటువేస్తే సమాజం నష్టపోతుందన్నారు. ఈ ఏడాది ఎండలకు భయపడి ఇంటికి దూరంగా ఉండేవారు ఓటు వేసేందుకు భయపడుతున్నారని కానీ దేశం పెద్దను ఎన్నుకునే అవకాశం వచ్చినప్పుడు ఏదో ఒక మార్గంతో ఓటు వేయాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణారెడ్డి, గోపాలకృష్ణ, లీల తదితరులు పాల్గొన్నారు.

లైక్‌లు, సబ్‌స్క్రైబ్‌ల పేరిట మోసం

గృహిణి వద్ద నుంచి రూ.24 లక్షలు కాజేసిన కేటుగాళ్లు

హిమాయత్‌నగర్: పార్ట్‌టైమ్ జాబ్ చేస్తూ యూట్యూబ్ వీడియోలు లైకులు, సబ్‌స్క్రైబ్ చేస్తూ ఇంటి వద్దే ఉంటూ డబ్బులు సంపాదించవచ్చిన నమ్మించి ఓ గృహిణిని సైబర్ నేరగాళ్లు మోసం చేశారు. నగర సైబర్ క్రైమ్ ఏసీపీ శివమారుతి తెలిపిన వివరాల ప్రకారం..నగరానికి చెందిన 35 ఏళ్ల గృహిణికి టెలిగ్రామ్ ద్వారా పార్ట్ టైమ్ ఉద్యోగం పేరుతో మెసేజ్ వచ్చింది. యూట్యూబ్ ఇతర సోషల్ మీడియా వేదికలో లైక్‌లు, సబ్‌స్క్రైబ్ చేస్తూ డబ్బు సంపాదించవచ్చని నమ్మించారు. సైబర్ నేరగాళ్లు చెప్పిన విధంగా టాస్క్‌లు పూర్తి చేసిన అనంతరం బాధితురాలికి కొంత డబ్బు పంపించారు. ఈ విధంగా నమ్మిస్తూ ఆమె నుంచి భారీ లాభాలు వస్తాయని, పెట్టుబడులు పెట్టాలని విడతల వారిగా మొత్తం రూ.24,33,000 కాజేశారు. డబ్బు తిరిగి రాకపోవడంతో మోసపోయానని బాధితురాలు సైబర్ క్రైమ్ పోలీసులను ఆశ్రయించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

స్వలాభం కోసమే బీజేపీకి మద్దతు

మంద కృష్ణ మాదిగపై దళిత సంఘాల నేతల ఆరోపణ

హిమాయత్‌నగర్: వ్యక్తిగత స్వార్థంతో మంద కృష్ణ మాదిగ బీజేపీకి మద్దతుగా ప్రచారం చేస్తున్నారని అంబేడ్కర్ సంఘాల సమైఖ్య, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం, మహా ఎమ్మార్పీఎస్, తెలంగాణ దళిత బహుజన సమితి, దళిత దండు సంఘాల నేతలు ఆరోపించారు. 100 రోజుల్లో ఏబీసీడీ వర్గీకరణ చేస్తానని హామీ ఇచ్చిన బీజేపీ ఇప్పుడు మళ్లీ కమిషన్ వేయడం మాదిగలను మభ్యపెట్టడమే అని విమర్శించారు. శనివారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అంబేడ్కర్ సంఘాల సమైఖ్య అధ్యక్షులు చైర్మన్ రాపోలు రాములు, తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం అధ్యక్షులు గడ్డ యాదయ్య మాట్లాడుతూ... పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తమ సంపూర్ణ మద్దతు ప్రకటించారు. గత బీఆర్ఎస్


మాట్లాడుతున్న దళిత సంఘాల నేతలు

ప్రభుత్వం దళితులకు అనేక హామీలు ఇచ్చి మోసం చేసిందన్నారు. ఏబీసీడీ వర్గీకరణకు కాంగ్రెస్ పార్టీ సుప్రీంకోర్టులో అఫిడవిట్ వేయడంతో స్పష్టత వచ్చిందని, పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేయాలని మాదిగ సోదరులకు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో మహా ఎంఆర్పీఎస్ అధ్యక్షులు పాగ నర్సింహారావు మాదిగ, తెలంగాణ దళిత బహుజన సమితి అధ్యక్షులు మల్లికార్జున్, తెలంగాణ దళిత దండు అధ్యక్షులు బచ్చలకూర బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ గడ్డపై కాషాయ జెండా ఎగురవేయాలి

కాచిగూడలో జరిగిన రోడ్ షోలో పాల్గొన్న కిషన్‌రెడ్డి, సురేష్ గోపి



కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

కాచిగూడ: పార్లమెంట్ ఎన్నికల్లో తెలంగాణ గడ్డపైన కాషాయ జెండా ఎగురవేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్ర మంత్రి, సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి జి.కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం రాత్రి అంబర్‌పేట నియోజకవర్గంలో మళయాల సినీ నటుడు సురేష్ గోపీతో కలిసి ఆయన రోడ్ షో నిర్వహించారు. తిలక్‌నగర్ బతుకమ్మకుంట నుంచి కాచిగూడ లింగంపల్లి చౌరస్తా వరకు రోడ్‌షో సాగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పలు అవినీతి అక్రమాల్లో కూరుకుపోయిన బీఆర్ఎస్ ప్రభుత్వం కూలిపోవడానికి పదేళ్లు పట్టిందని, అన్ని రంగాల్లో వైఫల్యం చెందిన కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడానికి ఎంతో సమయం పట్టదని అన్నారు. అంబర్‌పేట బిడ్డను మరోసారి ఆదరించి ఢిల్లీకి పంపాలని నియోజకవర్గ ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. మోదీ పాలనలో తెలంగాణకు ఎంతో మేలు జరిగిందన్నారు. ఈ నెల 10వ తేదీన ఎల్‌బీ స్టేడియంలో ప్రధాని మోదీ బహిరంగ సభ ఉందని, లక్షలాదిగా ప్రజలు తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు. బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతంరావు పాల్గొన్నారు.

'తెలంగాణకు అరుదైన ఛాయాచిత్రం దేవకీదేవి'



పంజగుట్ట: కవిత్వంలో మనల్ని మనం రంజిప చేసుకునే గొప్ప బలం ఉంటుందని పలువురు వక్తలు అన్నారు. శనివారం ప్రముఖ రచయిత్రి, కవి తిరునగరి దేవకీదేవి రచించిన అరుదైన ఛాయాచిత్రం కవితా సంపుటిని టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఆచార్య ఘంటా చక్రపాణి, తెలంగాణ మీడియా అకాడమీ మాజీ అధ్యక్షుడు అల్లం నారాయణ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... మానవ సంబంధాల్లో అంతఃసూత్రాలు ఆవిష్కరించేలా కవిత్వం ఉందన్నారు. తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ కార్యదర్శి ఏనుగు నరసింహారెడ్డి, ప్రముఖ రచయిత్రి గోగు శ్యామల, ప్రముఖ కవి నాళేశ్వరం శంకరం, రచయిత్రి కె.నీరజ పాల్గొన్నారు.



కుత్బుల్లాపూర్ నియోజకవర్గం షాపూర్‌నగర్, కంటోన్మెంట్‌లో శనివారం రాత్రి నిర్వహించిన రోడ్ షోల్లో బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పాల్గొని పార్టీ అభ్యర్థుల తరఫున ప్రచారం చేశారు.



శనివారం రాత్రి సీఎం రేవంత్‌రెడ్డి ముషీరాబాద్, సీతాఫల్‌మండి ప్రాంతాల్లో జరిగిన రోడ్ షోల్లో పాల్గొని సికింద్రాబాద్ లోక్‌సభ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ తరఫున ప్రచారం చేశారు

బస్సు ఖాళీ: ప్రయాణికులెవరూ లేక కొత్తపేటలో ఖాళీగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు



9

సాక్షి హైదరాబాద్

ఆదివారం । 5 । మే । 2024

ప్రజల మనిషిని.. విజయం నాదే

కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు

- దానంకు నిలకడ లేదు
- ఇష్టంతోనే లోక్‌సభ బరిలోకి
- లష్కర్ పెద్దన్నగా సమస్యలు పరిష్కరిస్తా
- సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్

వివరాలు 10లో



'సాక్షి' ఇంటర్వ్యూ

సూరీడు @ 43.8

సాక్షి, సిటీబ్యూరో: మహానగరంలో ఎండలు నిప్పులు కురిపిస్తున్నాయి. శనివారం సగటు ఉష్ణోగ్రత 43.8 డిగ్రీలు దాటగా, అత్యధికంగా శివారులోని దూలపల్లిలో 45.1 డిగ్రీల సెల్సియస్ నమోదైంది. చిలుకూరులో 44.7, కుత్బుల్లాపూర్‌లో 44.5 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. మిగతా ప్రాంతాల్లో 42 డిగ్రీల నుంచి 43.8 డిగ్రీల వరకు రికార్డు అయింది. మరో మూడు రోజుల పాటు ఇదే స్థాయిలో ఎండలు ఉంటాయని హైదరాబాద్ వాతావరణ శాఖ వెల్లడించింది.



ఎండకు టోపీ: బీఎన్ రెడ్డి నగర్‌లో కౌబాయ్ టోపీ పెట్టుకుని బైక్‌పై వెళ్తున్న వ్యక్తి

ఆర్టీఏలో అల్లు అర్జున్



సాక్షి, సిటీబ్యూరో: సినీనటుడు అల్లు అర్జున్ శనివారం ఖైరతాబాద్ ఆర్టీఏ కార్యాలయానికి వచ్చారు. ఆయన కొత్తగా కొనుగోలు చేసిన బీఎండబ్ల్యూ కారు రిజిస్ట్రేషన్ కోసం స్వయంగా వచ్చి ఫొటో దిగి, డిజిటల్ సంతకం చేశారు. ఖైరతాబాద్ ప్రాంతీయ రవాణా అధికారి పురుషోత్తమ్‌రెడ్డి ఆర్టీఏ నిబంధనల మేరకు వాహనం రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేశారు. కొత్త వాహనానికి టీజీ 09 –6664 నంబర్‌ను కేటాయించారు. అల్లు అర్జున్ రూ.5000 ఫీజు చెల్లించి ఈ నంబర్‌ను సొంతం చేసుకున్నారు.

పోలింగ్ రోజు అన్ని సదుపాయాలు: రోనాల్డ్‌రాస్

సాక్షి, సిటీబ్యూరో: పోలింగ్ రోజున ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి ఎలాంటి ఇబ్బందులు ఎదురవకుండా అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్‌ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ ఆదేశించారు. రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ, ఎండలు తీవ్రంగా ఉన్నందున పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ల కోసం షామియానాలు, తాగునీరు, పోలింగ్‌సిబ్బందికి జ్యూస్, మజ్జిగ వంటి సదుపాయాలు కల్పించాలన్నారు. వీటికోసం ఒక ఇన్‌చార్జిని ఏర్పాటు చేసి అతని పేరు, హోదా వివరాలు తెలియజేయాల్సిందిగా సూచించారు. పోలింగ్ కేంద్రాల్లో లైటింగ్, ఫ్యాన్ తప్పనిసరిగా ఉండాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్ అసిస్టెన్స్ బూత్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

చర్లపల్లికి నయా లుక్



సాక్షి, సిటీబ్యూరో: నగరంలో నాలుగో రైల్వే టెర్మినల్‌గా త్వరలో అందుబాటులోకి రానున్న చర్లపల్లి రైల్వేస్టేషన్ నయా లుక్‌తో ఆకట్టుకుంటోంది. రూ.434 కోట్లతో చేపట్టిన చర్లపల్లి టెర్మినల్ అభివృద్ధిలో భాగంగా 19 లైన్‌లతో విస్తరించారు. రైళ్లను నిలిపి ఉంచేందుకు పిట్‌లైన్‌లు కూడా ఉంటాయి. 9 ప్లాట్‌ఫామ్‌ల నుంచి రైళ్ల రాకపోకలు సాగిస్తాయి. ప్రస్తుతం 30 రైళ్ల రాకపోకలు సాగించేందుకు అధికారులు ప్రణాళికలను సిద్ధం చేశారు. దశలవారీగా 50 రైళ్లను ఇక్కడి నుంచి నడపనున్నారు. చర్లపల్లి టెర్మినల్ నుంచి ప్రయాణికులు వివిధ ప్రాంతాలకు వెళ్లేందుకు ఎంఎంటీఎస్ సర్వీసులు అందుబాటులో ఉంటాయి. ప్రయాణికులు ఎలాంటి ఇబ్బంది లేకుండా 9 ప్లాట్‌ఫామ్‌లకు వెళ్లేందుకు వీలుగా 7 లిఫ్టులను, 6 ఎస్కలేటర్లను ఏర్పాటు చేశారు. సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ తరువాత నాలుగో టెర్మినల్‌గా చర్లపల్లి వినియోగంలోకి రానుంది.

పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీగా జియావుద్దీన్



సాక్షి, సిటీబ్యూరో: జీహెచ్‌ఎంసీలో ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా విధులు నిర్వర్తిస్తున్న మహమ్మద్ జియావుద్దీన్.. పబ్లిక్‌హెల్త్ ఇంజినీరింగ్ విభాగం రాష్ట్ర ఈఎన్‌సీగా బాధ్యతలు స్వీకరించారు. ఆ విభాగం ఈఎన్‌సీ ఆర్.శ్రీధర్ పదవీ విరమణ చేశారు. ఈ పోస్టు ఖాళీ కావడంతో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు బాధ్యతలు స్వీకరించారు. జీహెచ్‌ఎంసీలో ఇంజినీరింగ్ మెయింటనెన్స్ విభాగం ఈఎన్‌సీగా కొనసాగుతూనే పబ్లిక్‌హెల్త్ ఈఎన్‌సీగా కూడా బాధ్యతలు స్వీకరించాల్సిందిగా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

సివిల్ సర్వీసెస్‌తో దేశ సేవ

మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సివిల్స్ ర్యాంకర్లతో వెంకయ్య నాయుడు తదితరులు

బంజారాహిల్స్: భరతమాతకు సేవ చేసే అరుదైన అవకాశం సివిల్ సర్వీస్ ర్యాంకర్లకు మాత్రమే లభిస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. కృష్ణప్రదీప్ ట్వంటీ ఫస్ట్ సెంచరీ ఐఏఎస్ అకాడమీ శిక్షణతో సివిల్స్‌లో ర్యాంకులు సాధించిన 35 మందిని వెంకయ్యనాయుడు చేతుల మీదుగా ఘనంగా సన్మానించారు. జూబ్లీహిల్స్‌లోని దసపల్లా హోటల్‌లో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి మరో గౌరవ అతిథిగా దూరదర్శన్ మాజీ అదనపు డీజీ డాక్టర్ ఆర్‌పి పద్మనాభరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు మాట్లాడుతూ.. 'మీ ఈ పయనం మీ జీవితాల్నే కాదు.. దేశాన్నే మారుస్తుంది. సమాజం, ప్రజలు, దేశం అన్నింటిలో పరివర్తన తీసుకొస్తుంది. అవకాశాలు ఎప్పుడూ చెప్పిరావు. వచ్చినప్పుడు వాటిని అందిపుచ్చుకుని వీలైనంత ఎక్కువ సేవ చేయాలి' అని పేర్కొన్నారు. పద్మనాభరావు మాట్లాడుతూ.. యూపీఎస్సీ పరీక్షల్లో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ అనే మూడు దశలూ దేనికదే ప్రత్యేకమని, వీటన్నింటిలో వరుసగా విజయాలు సాధించి సివిల్స్ ర్యాంకు పొందడం అంటే చిన్న విషయం కాదన్నారు.



'అసెంబ్లీ' ఎన్నికల్లో 'గ్రేటర్' గులాబీ హవా..

అప్పటి భారీ మెజార్టీలు తిరిగి పొందాల్సిందే

లక్ష్యం దిశగా పనిచేస్తున్న పార్టీ నేతలు

కేటీఆర్‌కు సవాల్‌గా మారిన లోక్‌సభ పోల్స్

చెరుపల్లి వెంకటేశ్

విశ్వనగరం.. ఐటీ.. కేటీఆర్.. పెట్టుబడులు.. ఇవి ఒకదానితో ఒకటి విడదీయరానంతగా గత బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో చెలామణీ అయ్యాయి. కేటీఆర్ విజన్‌తోనే హైదరాబాద్ అంతర్జాతీయంగానూ వినుతికెక్కిందని, నగరంలో పెట్టుబడులు పెరిగాయని మారుమోగింది. అందుకు తగ్గట్టుగానే గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో పార్టీ ఓడినా.. గ్రేటర్ పరిధిలో మాత్రం గెలిచింది. ఒకటో.. రెండో కాదు.. జీహెచ్‌ఎంసీలో కలగలిసి ఉన్న మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని తొమ్మిదింటికి తొమ్మిది అసెంబ్లీ సెగ్మెంట్లలో గులాబీ గుబాళించింది. కోర్‌సిటీగా ఉన్న హైదరాబాద్ జిల్లా పరిధిలోనూ ఎంఐఎం ప్రాబల్యమున్న ఏడు స్థానాలు, రాజాసింగ్ పేరుతో బీజేపీ ఒక చోట గెలిచినప్పటికీ, మిగతా ఏడింట కారు పరుగులు తీసింది. వెరసి.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని 24 అసెంబ్లీ సెగ్మెంట్లకుగాను 16 చోట్ల ప్రజలు బీఆర్‌ఎస్‌కు పట్టం కట్టారు.

కాంగ్రెస్‌ను కట్టడి చేయాలంటే..

అయిదు నెలల అనంతరం జరుగుతున్న లోక్‌సభ ఎన్నికల్లోనూ బీఆర్‌ఎస్‌ను గెలిపిస్తేనే నగర ప్రజల కోసం గొంతు వినిపించగలుగుతామని, బూటకపు మాటల కాంగ్రెస్, బీజేపీలకు తగిన బుద్ధి చెబుతామని పార్టీ అగ్రనేతలు కేసీఆర్, కేటీఆర్‌లు నగర ప్రజలకు పిలుపునిస్తున్నారు. బీజేపీ నుంచి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉన్నప్పటికీ నగరానికి చేసింది సున్నా అని ఎండగడుతున్నారు. కాంగ్రెస్ గ్యారంటీలు భ్రమలు అని తేలిపోయాయని ప్రజలను నమ్మించే పనిలో పడ్డారు. మరోవైపు, ఈ ఎన్నికలు తమ పాలనకు రిఫరెండమేనని సీఎం రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు తమవెంటే ఉన్నారని చాటేందుకు, తమనే నమ్ముతున్నారని చెప్పేందుకు, కాంగ్రెస్‌ను కట్టడి చేసేందుకు గతంలో కంటే భారీ మెజార్టీతో నెగ్గాల్సిందేననే లక్ష్యంతో పార్టీ నేతలు పని చేస్తున్నారు.

అవి మామూలు విజయాలా?

గత అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ గెలిచిన సెగ్మెంట్లన్నీ కూడా అరకొర మెజార్టీతో గెలిచినవి కావు. కుత్బుల్లాపూర్‌లో 85 వేలకు పైగా, కూకట్‌పల్లిలో 70వేలకు పైగా మెజార్టీలతో గెలిచినవి. కేవలం రెండు సెగ్మెంట్లలో మాత్రమే 20వేల లోపు మెజార్టీతో గెలిచినవి కాగా, మిగతావన్నీ అంతకంటే భారీ మెజార్టీలతో గెలిచినవి. పోలైన ఓట్ల శాతం సైతం రెండు సెగ్మెంట్లలో మాత్రమే 40 శాతానికి లోపున ఉంది. మిగతావన్నీ అంతకంటే ఎక్కువ శాతంతో గెలుచుకున్నవే. రాష్ట్రంలో బీఆర్‌ఎస్ గెలిచింది 39 స్థానాల్లో. ఇందులో 16 గ్రేటర్ పరిధిలోవే.

చెమటోడుస్తున్న కేటీఆర్

అసెంబ్లీ ఎన్నికల్లోనూ రోడ్‌షోలతో నగరాన్ని చుట్టేసిన కేటీఆర్.. మళ్లీ అదే తరహాలో రోడ్‌షోలు ప్రారంభించారు. ఇప్పటికే జూబ్లీహిల్స్, సనత్‌నగర్, నాంపల్లి, మేడ్చల్, మల్కాజిగిరి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్, కంటోన్మెంట్‌లలో రోడ్‌షోలు నిర్వహించారు. మిగతా సెగ్మెంట్లలోనూ షెడ్యూలు ఖరారు చేశారు. పార్టీ ఎమ్మెల్యేలూ ఆయనతో కలిసి నడుస్తున్నారు. కాంగ్రెస్, బీజేపీలకు తగిన గుణపాఠం చెప్పాలంటే.. స్థానికంగా తమకు బలం ఉండాలంటే పార్టీ గెలవాల్సిందేనని కృషి చేస్తున్నారు.

స్వల్ప ఓట్లతోనే అధికారం దూరం

రాష్ట్రవ్యాప్తంగా ఓట్ షేరింగ్‌లో పెద్ద వ్యత్యాసం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచిన కాంగ్రెస్ పార్టీకి 39.40 శాతం ఓట్లు రాగా, ఓడిన బీఆర్‌ఎస్‌కు 37.39 శాతం ఓట్లు లభించాయి. అంటే కేవలం 2 శాతం మాత్రమే. అదే గ్రేటర్, శివారు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్‌కు 38.97 శాతం ఓట్లు, కాంగ్రెస్‌కు 25.53 శాతం, బీజేపీకి 20.92 శాతం ఓట్లు వచ్చినట్లు అంచనా.

వారికి గుణపాఠం అవుతుందా?

బీఆర్‌ఎస్ నుంచి గెలిచి కాంగ్రెస్‌లోకి దూకిన దానం నాగేందర్‌ను ఓడించడం ద్వారా తగిన బుద్ధి చెప్పాలని భావిస్తున్నారు. లోక్‌సభ ఎన్నికలకు ముందు మేయర్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత, శోభన్‌రెడ్డి దంపతులు, మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, శ్రీలత దంపతులు, డిప్యూటీ మేయర్ బాబా ఫసియుద్దీన్, కొందరు కార్పొరేటర్లు వెళ్లిపోయినప్పటికీ మిగతా బలగమంతా తమ వెంటే ఉండటం కలిసి వస్తున్న అంశం. ఇంకా చాలామంది కార్పొరేటర్లు, శివార్లలోని కౌన్సిలర్లు పార్టీ మారతారనే ప్రచారం జోరుగా కొనసాగుతున్నప్పటికీ కేటీఆర్ రోడ్‌షోల్లో పార్టీ నేతలు, శ్రేణులు ఉత్సాహంగా పాల్గొంటుండటం కలిసి వచ్చే అంశంగా ఉంది. నగరాభివృద్ధి కుంటుపడకుండా కొనసాగాలంటే.. ఎప్పటికప్పుడు ప్రశ్నించేలా పార్టీ అభ్యర్థుల్ని గెలిపించుకోవడం తప్పనిసరిగా భావిస్తున్నారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలో ఇలా..

నియోజకవర్గం	విజేత	ఓట్లు	శాతం	మెజార్టీ
మేడ్చల్	సి.మల్లారెడ్డి	1,86,017	46.44	33,419
మల్కాజిగిరి	ఎం.రాజశేఖర్‌రెడ్డి	1,25,049	47.12	49,530
కుత్బుల్లాపూర్	కేపీ వివేకానంద్	1,87,999	46.80	85,576
కూకట్‌పల్లి	ఎం.కృష్ణారావు	1,35,636	54.08	70,387
ఉప్పల్	బండారు లక్ష్మారెడ్డి	1,32,927	48.33	49,030
ఎల్బీనగర్	డి.సుధీర్‌రెడ్డి	1,11,380	37.74	22,305
మహేశ్వరం	సబితాఇంద్రారెడ్డి	1,25,578	40.99	26,187
రాజేంద్రనగర్	టి.ప్రకాశ్‌గౌడ్	1,21,734	37.09	32,096
శేరిలింగంపల్లి	ఎ.గాంధీ	1,57,332	43.97	46,552
ముషీరాబాద్	ముఠాగోపాల్	75,207	49.07	37,797
అంబర్‌పేట	కాలేరు వెంకటేశ్	74,416	50.80	24,537
ఖైరతాబాద్	దానం నాగేందర్	67,368	43.48	22,010
జూబ్లీహిల్స్	ఎం.గోపీనాథ్	80,549	43.94	16,337
సనత్‌నగర్	టి.శ్రీనివాస్‌యాదవ్	72,557	56.57	41,827
సికింద్రాబాద్	టి.పద్మారావుగౌడ్	78,223	55.42	45,240
కంటోన్మెంట్	జి.లాస్యనందిత	59,057	47.43	17,169

అసెంబ్లీకి పోటీ చేసిన కాంగ్రెస్ అభ్యర్థులు కనుమరుగు

- లోక్‌సభ ఎన్నికల ప్రచారానికి దూరం.. దూరం
- అధికారంలో ఉన్నా.. మౌనముద్రలోనే నేతలు
- లోక్‌సభ అభ్యర్థులు సైతం పట్టించుకొని వైనం
- పార్లమెంట్ ఎన్నికల్లో గెలుపోటములపై ప్రభావం
- అసెంబ్లీ ఓట్ల శాతం దక్కించుకోవడంపై అనుమానాలు



మహమ్మద్ హమీద్ ఖాన్

లోక్‌సభ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ గడ్డు పరిస్థితిని ఎదుర్కొంటోంది. గ్రేటర్ పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల్లో గత ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు ముఖం చాటేశారు. పార్టీ అధికారంలో ఉన్నా.. మౌన ముద్ర పాటిస్తున్నారు. వాస్తవంగా అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అనుకూల పవనాలు వీచినా.. అవి మహా నగరానికి మాత్రం తాకలేదు. పార్టీ అభ్యర్థులకు మెజార్టీ శాతం డిపాజిట్ దక్కక పోగా.. మిగిలిన కొందరు మూడో స్థానానికే పరిమితమయ్యారు. అప్పట్లో టికెట్ కోసం ఆశావహులు దరఖాస్తు చేసుకున్నప్పటికీ గెలుపు గుర్రాల పేరుతో కొత్తగా వచ్చిన నేతలను ఎన్నికల బరిలో దింపడం కొంప ముంచినట్లయింది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులను నియోజకవర్గ ఇన్‌చార్జులుగా అధిష్టానం నియమించినా.. పెద్దగా ఆసక్తి కనబర్చడం లేదు. అగ్రనేతల సమక్షంలో జరిగిన తొలి సమావేశం, నియోజకవర్గ స్థాయి సమావేశాలకు హాజరైన ఇన్‌చార్జులు ఆ తర్వాత ఎన్నికల ప్రచారానికి ముఖం చాటేశారు. కొందరైతే ఇతర నియోజకవర్గాల్లో ప్రచారంలో పాల్గొంటూ తమ నియోజకవర్గాలను మాత్రం గాలికి వదిలేశారు.

గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల ఓట్ల శాతం

అంబర్‌పేట	12.29
ఎల్బీనగర్	28.22
సనత్ నగర్	17 54
కంటోన్మెంట్	16.72
మహేశ్వరం	23.7
గోషామహల్	4.23
మల్కాజిగిరి	28.45
మేడ్చల్	38.1
కుత్బుల్లాపూర్	25.28
కూకట్‌పల్లి	26.02
ఉప్పల్	30.5
రాజేంద్రనగర్	25.0
ముషీరాబాద్	24.41
మలక్‌పేట	22.5
ఖైరతాబాద్	29.28
జూబ్లీహిల్స్	35.03
నాంపల్లి	39.49
కార్వాన్	16.6
చార్మినార్	11.1
చాంద్రాయణగుట్ట	9.49
యాకుత్‌పురా	4.95
బహదూర్‌పురా	10.05
సికింద్రాబాద్	23.37
శేరిలింగంపల్లి	30.46

ఇన్‌చార్జులేరీ?

అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు నియోజకవర్గాల ప్రచారంలో కనిపించడం లేదు. మొత్తం 24 మంది అభ్యర్థుల్లో 20 మంది వరకు ప్రచారానికి దూరం పాటిస్తున్నట్లు కనిపిస్తోంది.

- ఖైరతాబాద్ నుంచి పోటీ చేసిన విజయారెడ్డి ఎన్నికల ప్రచారంలో కనిపించడం లేదు. అసెంబ్లీ ఎన్నికల్లో తనపై పోటీచేసిన దానం నాగేందర్ లోక్‌సభ అభ్యర్థిగా బరిలో దిగడం, గతంలో ఖైరతాబాద్ టికెట్ ఆశించి అంబర్‌పేట నుంచి పోటీ చేసిన ఓటమి పాలైన రోహిణ్ రెడ్డి తిరిగి నియోజకవర్గంలో అన్నీ తానై వ్యవహరిస్తుండటంతో మింగుడు పడని అంశంగా తయారైంది.
- సనత్‌నగర్‌లో పోటీ చేసిన కోట నీలిమ అక్కడి నుంచి టికెట్ కోసం తీవ్రంగా ప్రయత్నించి విఫలమైన మర్రి ఆదిత్య రెడ్డితో పాటు రవీందర్ గౌడ్‌లు లోక్‌సభ ప్రచారంలో కనిపించడం లేదు. కేవలం అప్పుడప్పుడు ప్రచారంలో మెరుస్తున్నారు.
- కంటోన్మెంట్ నుంచి పోటీ చేసిన దివంగత గద్దర్ కూతురు వెన్నెల సైతం ఎన్నికల ప్రచారానికి దూరం పాటిస్తున్నారు. ఉప ఎన్నికల్లో టికెట్ ఆశించగా అక్కడి నుంచి శ్రీగణేష్ అభ్యర్థిత్వం ఖరారు కావడంతో అసంతృప్తిగా ఉన్నట్లు తెలుస్తోంది.
- అంబర్‌పేట నుంచి పోటీ చేసిన రోహిణ్ రెడ్డి మాత్రం ఖైరతాబాద్ నియోజకవర్గానికి పరిమితమయ్యారు. సీఎం రేవంత్ రెడ్డి కోటరీలో తిరుగుతూ సికింద్రాబాద్ లోక్‌సభ అభ్యర్థి దానం నాగేందర్ ప్రచార పర్వంలో పాల్గొంటున్నా.. పోటీ చేసిన అంబర్‌పేట అసెంబ్లీ స్థానాన్ని మాత్రం గాలికొదిలేశారు.
- గోషామహల్‌లో పోటీ చేసిన రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీత హైదరాబాద్ లోక్‌సభ అభ్యర్థి వెంట ప్రచారం పర్వంలో పాల్గొంటున్నారు. వాస్తవంగా ఖైరతాబాద్ నుంచి టికెట్ ఆశించగా పార్టీ గోషామహల్ నుంచి బరిలో దిగి అతి తక్కువ ఓట్ల శాతం అభాసుపాలై ముఖం చాటేశారు.
- మహేశ్వరంలో పోటీ చేసిన కేఎల్ఆర్ లోక్‌సభ ఎన్నికల ప్రచార పర్వంలో కనిపించడం లేదు. వాస్తవంగా ఆయన పరిగి స్థానం నుంచి టికెట్ ఆశించగా.. మహేశ్వరం నుంచి అధిష్టానం బరిలో దింపింది. ఓటమి పాలు కావడంతో నియోజవర్గానికి దూరం పాటిస్తున్నారు.
- మల్కాజిగిరి నుంచి పోటీ చేసిన మైనంపల్లి హన్మంతరావు సైతం ఎన్నికల ప్రచారంలో పెద్దగా కనిపించడం లేదు. నియోజకవర్గానికి దూరం పాటించడమే కాకుండా అభ్యర్థుల వెంట కూడా ప్రచారంలో పాల్గొనడం లేదు.

జీఎస్టీ రిఫండ్ పేరుతో రూ.45.81 కోట్లు స్వాహా

వేర్వేరు కేసులు నమోదు చేసిన హైదరాబాద్ సీసీఎస్

- గతంలో నలుగురి అరెస్టు
- తాజాగా ఐదుగురు జీఎస్టీ అధికారులు కటకటాల్లోకి

సాక్షి, సిటీబ్యూరో: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) రీఫండ్ పేరుతో రూ.45.81 కోట్లు స్వాహా చేసిన కేసులో అరెస్టుల పర్వం కొనసాగుతోంది. ఎలక్ట్రిక్ బైక్స్ తయారీ, విడిభాగాల సరఫరా పేరుతో భారీ మోసానికి పాల్పడిన నిందితులకు జీఎస్టీ, రాష్ట్ర పన్నుల అధికారులు సైతం వత్తాసు పలకడం గమనార్హం. ఇప్పటికే ఈ కేసులో హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్), డిటెక్టివ్ డిపార్ట్‌మెంట్ (డీడీ) పోలీసులు నలుగుర్ని అరెస్టు చేశారు. తాజా వివరాల ప్రకారం..వినర్డ్ ఆటోమొబైల్స్ ప్రతినిధి వేమిరెడ్డి రాజా రమేష్ రెడ్డి, యోకో ఎలక్ట్రిక్ బైక్ ప్రతినిధి నీరజ్ సఖుజా, క్రోక్స్ ఎలక్ట్రిక్ బైక్స్ ప్రతినిధి ఇందర్ కుమార్, అపెక్స్ ఎలక్ట్రిక్ బైక్ ప్రతినిధి ఎం.గిరిధర్ రెడ్డి, వినీల్ చౌదరి, సుప్రియ ఎలక్ట్రిక్ బైక్ ప్రతినిధి సుప్రియా పాండే, మాగ్నమ్ ఎలక్ట్రిక్ బైక్స్ గౌరవ్‌లు ముఠాగా ఏర్పడి హైదరాబాద్‌లోని వివిధ ప్రాంతాలలో స్థల యజమానుల నుంచి విద్యుత్ బిల్లులు వసూలు చేసి వివిధ సంస్థల పేర్లతో బోగస్ ఎలక్ట్రిక్ బైక్స్ తయారీ యూనిట్లను ప్రారంభించారు. నకిలీ అద్దె ఒప్పందాలను సమర్పించి ఆయా సంస్థల పేర్లను జీఎస్టీ వెబ్‌సైట్‌లో నమోదు చేశారు. న్యూఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మతో నకిలీ, కల్పిత ఇన్‌వాయిస్‌లను, ఈ–వే బిల్లులు పార్ట్–ఏ, పార్ట్–బీ, ఇన్‌వర్డ్ సప్లయి బిల్లులను బోగస్ సంస్థల పేరుతో మాదాపూర్‌లోని జీఎస్టీ కార్యాలయంలో పలు దఫాలుగా దాఖలు చేశారు. జీఎస్టీ అధికారుల తనిఖీలలో ఈ వ్యవహారం బయటపడకుండా..సంబంధిత అధికారులకు లంచాలు సమర్పించి జీఎస్టీ రిటర్న్‌లను దాఖలు చేశారు. దీంతో తమ క్లయింట్లే కావడంతో అధికారులూ చూసీ చూడనట్లు వ్యవహరించడంతో నిందితులు క్లెయిమ్ పొందారు. ఈ–బైక్‌ల తయారీ లేకుండా ప్రభుత్వ ఖజానాకు నష్టం కలిగించారు. ఈ వ్యవహారంపై గతంలోనే హైదరాబాద్ సీసీఎస్ పోలీసులు న్యూఢిల్లీకి చెందిన ట్యాక్స్ కన్సల్టెంట్ చిరాగ్ శర్మ, కడపకు చెందిన వేమిరెడ్డి రాజా రమేష్ రెడ్డి, ముమ్మగారి గిరిధర్ రెడ్డి అలియాస్ గిరి, పల్నాడుకు చెందిన కొంద్రగంటు వినీల్ చౌదరిలను అరెస్టు చేశారు. కేసు దర్యాప్తులో నిందితులతో చేతులు కలిపిన అధికారులను తాజాగా పోలీసులు అరెస్టు చేశారు. నల్లగొండ డివిజన్ జీఎస్టీ డిప్యూటీ కమిషనర్ పీతల స్వర్ణకుమార్, అబిడ్స్‌లోని రాష్ట్ర పన్నుల అసిస్టెంట్ కమిషనర్ కేలం వేణుగోపాల్, మాదాపూర్–1 సర్కిల్ అసిస్టెంట్ కమిషనర్ పాదిలి విశ్వకిరణ్, మాదాపూర్–2 సర్కిల్ జీఎస్టీ, డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్ వేమవరపు వెంకటరమణ, మాదాపూర్–3 సర్కిల్ సీనియర్ అసిస్టెంట్ మర్రి మహితలను అరెస్టు చేశారు.

ప్రజల మనిషిని.. విజయం నాదే

కిషన్‌రెడ్డికి చిత్తశుద్ధి లేదు..దానంకు నిలకడ లేదు

- ఇష్టంతోనే పార్లమెంట్ ఎన్నికల బరిలోకి..
- లష్కర్ పెద్దన్నగా ఉండి సమస్యలు పరిష్కరిస్తా
- 'సాక్షి' ఇంటర్వ్యూలో సికింద్రాబాద్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్



Interview

సికింద్రాబాద్: 'లోక్‌సభ ఎన్నికల్లో లష్కర్ ప్రజలు నన్నే గెలిపిస్తారు. 2004లో తొలిసారి ఎమ్మెల్యేగా అప్పటి రాష్ట్ర కేబినెట్ మంత్రిపై పోటీచేసే అవకాశం వచ్చింది. విజయం నన్నే వరించింది. 2024లో ఇప్పుడు తొలిసారి కేంద్ర కేబినెట్ మంత్రిపై పోటీ చేసే అవకాశం వచ్చింది. ఈమారు కూడా విజయం నాదే' అని సికింద్రాబాద్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. ఇష్టం లేకపోయినా పార్లమెంట్ ఎన్నికల బరిలో దిగానని చేస్తున్న ప్రచారంలో ఏమాత్రం నిజం లేదని, తాను కేసీఆర్ ఆదేశాలను తప్పక పాటిస్తానని 'సాక్షి'కి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పేర్కొన్నారు. మరిన్ని వివరాలు ఆయన మాటల్లోనే...

- సికింద్రాబాద్‌లో పుట్టిపెరిగిన నేను 40 ఏళ్లుగా రాజకీయాల్లో ఉన్నా. ప్రజలకు అందుబాటులో ఉండే నాయకుడిగా పేరుతెచ్చుకున్న. లష్కర్ ప్రజలు పక్కాగా ఎంపీగా గెలిపించి తీరుతారు. రెండు పర్యాయాలు కార్పొరేటర్‌గా, నాలుగు సార్లు ఎమ్మెల్యేగా, రాష్ట్ర మంత్రిగా, డిప్యూటీ స్పీకర్‌గా నగర ప్రజలకు అందుబాటులో ఉండి ఎన్నో సమస్యలకు పరిష్కారం చూపాను. ప్రజల సమస్యల పట్ల చిత్తశుద్ధి లేని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజకీయ స్థిరత్వం లేని..అధికారం కోసం పార్టీలు మార్చే కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌లను ప్రజలు ఈ ఎన్నికల్లో తిరస్కరించడం ఖాయం. నన్ను ఎంపీగా గెలిపిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్‌కు పెద్దన్న మాదిరిగా ఉండి..ప్రజల సమస్యలకు పరిష్కారం చూపుతా.

అన్ని విధాలా అవకాశాలు నావే..

సికింద్రాబాద్ ఎమ్మెల్యేగా హ్యాట్రిక్ రికార్డు నెలకొల్పాను. పార్లమెంట్ సెగ్మెంట్ పరిధిలో ఐదుగురం సమర్థవంతమైన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలం ఉన్నాం. మేమంతా కొన్ని నెలల క్రితమే భారీ మెజారిటీలతో గెలుపొందాం. మా పార్టీకి సమర్థవంతమైన కేడర్ ఉంది. నియోజకవర్గంలో ఓటర్లుగా ఉన్న మెజారిటీ తెలంగాణ ప్రజలు, ముస్లిం మైనారిటీలు ఎన్నికల ప్రచారంలో బ్రహ్మరథం పట్టి ఆశీర్వదిస్తున్నారు. అదీ కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం పనితీరుపై అప్పుడే ప్రజల్లో వ్యతిరేకత వ్యక్తం అవుతుంది. కాబట్టి అన్నివిధాలు గెలుపు అవకాశాలు నాకే ఉన్నాయి.

లష్కర్‌ను ఎంతో అభివృద్ధి చేశా..

తెలంగాణ ఉద్యమ కారుడిగా రాష్ట్ర సాధన వరకు అంకితభావం, చిత్తశుద్ధితో పనిచేశాను. సికింద్రాబాద్ అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.300 కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టాను. రహదారులు, తాగునీరు, మురుగునీరు, ముంపు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపించాను. జూనియర్, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేసి ఈ ప్రాంత ప్రజల 50 ఏళ్ల కలను కార్యరూపంలోకి తెచ్చా. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్‌కు ఇక్కడి ప్రజలను ఓట్లు అడిగే అర్హత లేదు. వీరు చేసిన అభివృద్ధి ఏమీ లేదు. బీజేపీ అభ్యర్థి కిషన్‌రెడ్డి కేంద్ర మంత్రిగా ఉండి కూడా సికింద్రాబాద్‌లో ఒక్క భారీ అభివృద్ధి పనిని చేపట్టలేదు.

ఎంపీగా గెలిస్తే...

నన్ను ఎంపీగా గెలిపిస్తే సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధిలోని ప్రజల సమస్యలకు ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తా. ఏడు నియోజకవర్గాల ప్రజల సంక్షేమం కోసం పార్లమెంట్‌లో గళం వినిపిస్తా. విద్య, వైద్య సదుపాయాలు మెరుగుపరుస్తా. ముఖ్యంగా నాలా పరివాహక ప్రాంతాల ప్రజలకు ఆరోగ్యకర వాతావరణాన్ని ఏర్పాటు చేయడం కోసం కేంద్రం నిధులు తెప్పించేందుకు కృషి చేస్తా.

ఇటు హోం.. అటు పోస్టల్

- కట్టుదిట్టమైన ఏర్పాట్ల మధ్య ఓటింగ్ ప్రక్రియ
- ఓటింగ్ ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్ శశాంక



సీనియర్ సిటిజన్ ఇంటికి వెళ్లి ఓటు సేకరిస్తున్న కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఓటు ఫ్రం హోంప్రక్రియ శనివారం ప్రారంభమైంది. రాజేంద్రనగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని హైదర్‌గూడ, అత్తాపూర్ వాసుదేవ్నగర్‌లో సీనియర్ సిటిజన్లు, దివ్యాంగులు రిటర్నింగ్ అధికారి శశాంక సమక్షంలో ఇంటి నుంచే ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ ప్రక్రియ 6వ తేదీ వరకు కొనసాగుతుంది. మొదటి రోజు చేవెళ్ల లోక్‌సభ సెగ్మెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 54 ఎన్నికల బృందాలు ఆయా రూట్ల వారీగా తమకు నిర్దేశించిన ఓటర్ల ఇళ్ల వద్దకు వెళ్లి వారి ఓటును సేకరించారు. పోలింగ్ కేంద్రాలకు వెళ్లే అవసరం లేకుండా, ఇంటి నుంచే ఓటు వేసేలా ఎన్నికల సంఘం హోం ఓటింగ్ సదుపాయాన్ని అందుబాటులోకి తేవడంతో సీనియర్ సిటిజన్లు, దివ్యంగులకు వెసులుబాటు లభించింది. మొత్తం 1,115 మంది ఓట్ ఫ్రమ్ హోం సదుపాయాన్ని వినియోగించుకోనుండగా, వీరిలో 85 ఏళ్లకు పైబడిన సీనియర్ సిటిజన్లు 695 మంది, దివ్యాంగ ఓటర్లు 420 మంది ఉన్నట్లు కలెక్టర్ శశాంక తెలిపారు. తప్పిదాలకు తావులే కుండా, నూటికి నూరు శాతం గోప్యతను పాటిస్తూ పూర్తి పారదర్శకంగా హోం ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు.



పోస్టల్ ఓటు వేస్తున్న మహిళా ఉద్యోగి

రెండోరోజుకు చేరిన పోస్టల్ బ్యాలెట్

పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ రెండో రోజు ప్రశాంతంగా కొనసాగింది. ఈ నెల 8 వరకు ఈ ప్రక్రియ కొనసాగుతుంది. ఎన్నికల విధుల్లో పాల్గొనే 23 వేల మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌ను వినియోగించుకోనున్నారు. రాజేంద్రనగర్ ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఓటర్ ఫెసిలిటేషన్ సెంటర్‌ను రిటర్నింగ్ అధికారి శశాంక పరిశీలించారు. ఓటింగ్ సరళి గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఉద్యో గులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ పారదర్శకంగా, ప్రశాంతగా జరిగేలా చూడాలని కలెక్టర్ అధికారులకు సూచించారు.

ఓటింగ్ బాక్స్‌కు సీల్

ఎన్నికల సాధారణ పరిశీలకుడు రాజేందర్ కుమార్ కటారియా శనివారం రాజకీయ నాయకుల సమక్షంలో రిటర్నింగ్ అధికారి కలెక్టర్ శశాంక ఇటీపీబీఎస్ ఓటింగ్ బాక్స్‌కు సీల్ వేశారు. ఓటర్లు వారి ప్రస్తుత నివాస స్థలం నుంచి వారి ఓటు హక్కును వినియోగించుకునేలా చేయడంపై ఎన్నికల సంఘం తన దృష్టిని కేంద్రీకరించిందని, ఈసీఐ బృందం అన్ని సామాజిక-ఆర్థిక వర్గాల్లో వలస దారుల ఎన్నికల భాగస్వామ్యాన్ని సులభతరం చేయడానికి సమగ్ర పరిష్కారాలను కనుగొనడానికి సుదీర్ఘంగా చర్చించిందని తెలిపారు.

విధులపై అవగాహన ఉండాలి

పోలింగ్ విధులపై పీఓ, ఏపీఓ, ఓపీఓలు పూర్తి అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ శశాంక అన్నారు. ఈ మేరకు శనివారం పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బందికి నిర్వహించిన శిక్షణ తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఎలాంటి సందేహాలున్నా మాస్టర్ ట్రైనర్లతో నివృత్తి చేసుకోవాలని సూచించారు. పొరపాట్లకు తావు లేకుండా పక్కాగా విధులు నిర్వర్తించాలన్నారు. డిస్ట్రిబ్యూషన్ రోజు ఈవీఎంలు తీసుకెళ్లి..పోలింగ్ డే పూర్తయిన తర్వాత సాయంత్రం కాగానే తిరిగి ఇవ్వాల్సిన బాధ్యత పీఓ, ఏపీఓలదేనని చెప్పారు. పోలింగ్ డే రోజున పోల్ తర్వాత రిపోర్ట్ తయారు చేయాలన్నారు. ఎన్నికల ప్రవర్తన నియమావళిని సమర్థవంతంగా అమలు చేయాలని సూచించారు.

ఠాణా నుంచి నిందితుడి పరార్

బంజారాహిల్స్: క్షుద్ర పూజలు చేసి ఆరోగ్య, ఆర్థిక సమస్యలను పరిష్కరిస్తానని నమ్మించి ఓ మహిళను మోసగించిన ఘటనలో బంజారాహిల్స్ పోలీసులు అరెస్టు చేసి స్టేషన్‌లో ఉంచిన కొద్దిసేపట్లోనే పోలీసుల కళ్లుగప్పి నిందితుడు పరారయ్యాడు. నిందితుడి పరారీపై బంజారాహిల్స్ పోలీసులు మరో కేసు నమోదు చేసి గాలింపు చేపట్టారు. వివరాల్లోకి వెళితే..కర్నూలుకు చెందిన జగ్గుల రాజు తాను క్షుద్ర పూజలు చేస్తానని బంజారాహిల్స్ రోడ్డు నెంబర్-14లోని నందినగర్‌లో నివసించే ఓ మహిళకు టోకరా వేశాడు. ఆరోగ్య, ఆర్థిక సమస్యలను దూరం చేసి కుటుంబాన్ని రక్షిస్తానని చెప్పాడు. దీంతో ఆ మహిళ సదరు వ్యక్తి చెప్పిన మాయమాటలు నమ్మి పెద్ద ఎత్తున డబ్బులు సమర్పించుకుంది. అయితే ఆ వ్యక్తి మళ్లీ మళ్లీ ఆమెను డబ్బుల కోసం వేధించసాగాడు. ఆర్థికంగా బాగుపడక పోగా తాంత్రిక స్వామి జగ్గుల రాజు మాటలతో మోసపోయి న్యాయం చేయాలంటూ గత నెల 18న పోలీసులకు ఫిర్యాదు చేసింది. నిందితుడిపై పోలీసులు ఐపీసీ సెక్షన్ 406, 420, 384, 506 కింద కేసు నమోదు చేసి ఈ నెల 2న అరెస్టు చేసి ఠాణాకు తీసుకువచ్చారు. హెడ్ కానిస్టేబుల్‌కు నిందితుడిని అప్పగించారు. అయితే రాత్రి 11 గంటల సమయంలో నిందితుడు సెక్షన్ ఇన్‌చార్జి కళ్లుగప్పి పరారయ్యాడు. వెంటనే దర్యాప్తు అధికారికి ఫిర్యాదు చేయగా ఎస్ఐ రాంబాబు హుటాహుటిన వచ్చి నిందితుడి కోసం గాలించినా ఫలితం లేకుండాపోయింది. దీంతో స్టేషన్ నుంచి నిందితుడు జగ్గుల రాజు పరారయ్యాడని ఎస్ఐ ఫిర్యాదు చేయగా ఐపీసీ సెక్షన్ 224 కింద మరో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టి గాలిస్తున్నారు.

పర్యావరణ హితమే లక్ష్యంగా...

మెరీడియన్ స్కూల్‌తో గూడీబ్యాగ్ ఒప్పందం

సాక్షి, సిటీబ్యూరో: వ్యర్థాల నిర్వహణకు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి పేరొందిన స్టార్టప్ కంపెనీ గూడీ బ్యాగ్ నగరానికి చెందిన మెరీడియన్ స్కూల్‌తో చేతులు కలిపింది. పర్యావరణ పరిరక్షణ, వ్యర్థాల నిర్వహణపై విద్యార్థులకు అవగాహన పెంచి, వారిని సైతం భాగస్వాములుగా మార్చేందుకు ఉద్దేశించిన కార్యక్రమం కోసం బంజారాహిల్స్‌లోని మెరీడియన్ పాఠశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఇరు సంస్థల ప్రతినిధులు ఒప్పందం కుదుర్చుకున్నారు. ప్లాస్టిక్ వ్యర్థాలు తదితర పర్యావరణ హానికారకాలను తగ్గించేందుకు కృషి చేసే దిశగా కుదుర్చుకున్న ఈ ఒప్పందంపై స్కూల్ ప్రిన్సిపాల్ నిషిరానా, గూడీబ్యాగ్ సిఇఒ అభిషేక్ అగర్వాల్‌లు ఒప్పందంపై సంతకాలు చేశారు. ఈ సందర్భంగా తొలి గూడీ బ్యాగ్ పురస్కారాలను కూడా అందజేశారు. ఉత్తమ ప్లాస్టిక్ సేకర్త, వైల్డ్ లైఫ్ హీరోస్, లేక్ గార్డియన్ పేరిట వీటిని ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో భారత స్టార్టప్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు జెఎ చౌదరి, రాష్ట్ర ప్రభుత్వ ఐటీశాఖ ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, రెడ్ క్రాస్‌సొసైటీ ఛైర్ పర్సన్ అజయ్ మిశ్రా, టీ హబ్ సిఇఒ మహంకాళి శ్రీనివాసరావు, సెరెండిపిటీ సంస్థ ఫౌండర్, కర్మ వీర్ చక్ర గ్రహీత రుమానా సిన్హా సెహగల్ తదితరులు పాల్గొన్నారు.

150 మంది.. ఇంటి వద్దే ఓటేశారు






ఓటు హక్కు వినియోగించుకున్న వయోవృద్ధులు



ఇంటి వద్దనే ఓటు వేస్తున్న మాజీ డీజీపీ ప్రభాకర్‌రావు

- హోం ఓటింగ్‌కు విశేష స్పందన
- ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు తెలిపిన ఓటర్లు

బంజారాహిల్స్: ఓటింగ్ శాతాన్ని పెంచేందుకు ఎన్నికల సంఘం తీసుకున్న వినూత్న చర్యల్లో భాగంగా సికింద్రాబాద్ పార్లమెంట్ పరిధి కిందికి వచ్చే ఖైరతాబాద్ నియోజకవర్గంలో శనివారం హోం ఓటింగ్ ప్రారంభమైంది. 85 ఏళ్ల పైబడిన వృద్ధులు, 40 శాతం అంగవైకల్యం ఉన్న దివ్యాంగులు ముందుగా దరఖాస్తు చేసుకున్న ప్రకారం శనివారం ఉదయం నుంచి సాయంత్రం దాకా నియోజకవర్గ పరిధిలో ఇంటి వద్దనే ఓటింగ్ చేపట్టారు. ఖైరతాబాద్ నియోజకవర్గం పోస్టల్ బ్యాలెట్, హోం ఓటింగ్ నోడల్ అధికారి, సహాయ రిటరి్నంగ్ అధికారి అనితారెడ్డి నేతృత్వంలో 12 బృందాలు హోం ఓటింగ్‌ను చేపట్టాయి. నియోజకవర్గంలో ఇంటి వద్దే ఓటు వేసేందుకు 156 మంది దరఖాస్తు చేసుకోగా మొదటి రోజే 150 మంది ఓటు వేశారు. మిగతా ఆరు మందిలో ఇద్దరు మృతి చెందగా ఒకరు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారని, మరొకరు ఇక్కడి నుంచి మరో చోటకు షిఫ్ట్ అయ్యారని అధికారులు తెలిపారు. మొత్తం 12 టీమ్‌లు 12 రూట్లలో ప్రణాళికాబద్ధంగా ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు హోం ఓటింగ్‌ను విజయవంతంగా చేపట్టాయి. ప్రతి ఓటరు వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పోలీసు బందోబస్తు మధ్య ఈ పోలింగ్ కొనసాగింది. ఇంటి వద్దనే ఓటు వేసిన వృద్ధులు, దివ్యాంగులు తాము ఓటు వేసినందుకు ఆనందం వ్యక్తంచేస్తూ ఈ అవకాశం కల్పించినందుకు ఎన్నికల సంఘానికి కృతజ్ఞతలు తెలిపారు. నడవలేని పరిస్థితిలో మంచంపై ఉన్న తాము ఓటు వేస్తామో లేదో అన్న బెంగ ఉండేదని, ఇలా హోం ఓటింగ్‌కు అవకాశం కల్పించడం వల్ల తాము కూడా పోలింగ్‌లో భాగస్వాములమయ్యామని వారు వెల్లడించారు.



ఓటు వేసిన ప్రొఫెసర్ సీవీఎన్ రావు



ప్రశాసన్‌నగర్‌లో ఓటింగ్‌ను పరిశీలిస్తున్న సహాయ ఆర్‌ఓ హేమంత్ బోర్కాడే

రాజీవ్‌నగర్‌కాలనీలో...

శ్రీనగర్‌కాలనీ: రాజీవ్‌నగర్‌కాలనీలో కాలనీ మాజీ అధ్యక్షుడు కృష్ణశర్మ తన ఓటు హక్కును ఇంటి వద్దే వినియోగించుకున్నారు.



రాజీవ్‌నగర్‌కాలనీలో ఇంటి వద్దే ఓటు వేస్తున్న కృష్ణశర్మ

ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు



ఈ పార్లమెంట్ ఎన్నికల్లో నడవలేని పరిస్థితిలో ఉన్న నేను ఓటు హక్కు ఎలా వినియోగించుకుంటానన్న బెంగ ఉండేది. ఓటు వేస్తానని కలలో కూడా అనుకోలేదు. కానీ ఉదయమే మా ఇంటికి ఎన్నికల అధికారులు, పోలీసులు వచ్చి చక్కని ఏర్పాటుచేసి తనను ఏమాత్రం ఇబ్బంది పెట్టకుండా రహస్యంగా నా ఓటు వినియోగించుకునేలా అవకాశం కల్పించారు. ఎన్నికల సంఘానికి ధన్యవాదాలు.

– ఈశ్వర్‌రెడ్డి, 91 సంవత్సరాలు, నాగార్జున హిల్స్

ప్రజాస్వామ్యం పటిష్టంగా ఉండేలా



పోలింగ్ బూత్ వరకు వచ్చి ఓటు వేసేందుకు వయోధికులు రావాలంటే చాలా ఇబ్బందులు పడాల్సి వస్తుంది. అసలే ఎండాకాలం కావడంతో బయటకు రాలేని పరిస్థితులు ఉన్నాయి. ఈ క్రమంలో ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ తీసుకున్న హోం ఓటింగ్ కార్యక్రమం మా లాంటి వాళ్లకు ఎంతో ఉపయోగకరం. ఓటు హక్కు వినియోగించుకున్నామన్న సంతృప్తిని ఎన్నికల అధికారులు కల్పించారు.

– వెంకయ్య, ప్రశాసన్‌నగర్

చాలా మంచి నిర్ణయం

ఎన్నికల సంఘం తీసుకున్న ఈ నిర్ణయం వయోధికులకు ఎంతో మేలు. వారు బయటకు వెళ్లి ఓటు వేయడం అనేది చాలా కష్టమైన పని. ఎన్నికల అధికారులు తీసుకున్న నిర్ణయం మాలాంటి వాళ్లకు ఎంతో ఉపయోగకరం. వృద్ధాప్యంలో చాలామందికి అనారోగ్య సమస్యలు వెంటాడుతుంటాయి. వాళ్లు కూడా ఓటు హక్కు వినియోగించుకునేలా ఎన్నికల కమిషన్ చేయడం మంచి పరిణామం.

– ప్రభాకర్‌రావు, రిటైర్డ్ డీజీపీ

అవినీతి మచ్చలేని కిషన్‌రెడ్డిని గెలిపించండి

శ్రీనగర్‌కాలనీ: అవినీతి మచ్చలేని సికింద్రాబాద్ బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి కిషన్‌రెడ్డిని భారీ మెజారిటీతో గెలిపించాలని మాజీ కార్పొరేటర్ కిలారి మనోహర్ విజ్ఞప్తి చేశారు. శనివారం నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో కార్నర్ మీటింగ్‌లు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మట్లాడుతూ... కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అందించిన పథకాలు, చేసిన అభివృద్ధిని ప్రతిఇంటికీ చేరవేయాలని కార్యకర్తలకు సూచించారు. అవినీతి, ఆరోపణలు, మోసపూరిత హామీలతో మభ్యపెట్టే కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మవద్దని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. దేశ, రాష్ట్ర ప్రగతిని కోరే బీజేపీకి ఓటువేయాలని కోరారు. నేతలు నగర ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ రాహుల్‌చంద్ర, నేలు విజయ్‌కుమార్, విజిత్, నవీన్, రూప, సుప్రియ గౌడ్ పాల్గొన్నారు.

ముదిరాజ్‌లను బీసీ-ఏలో కలిపితే సహించం

హిమాయత్‌నగర్: ముదిరాజ్ కులస్తులను బీసీ-ఏ గ్రూపులో కలిపితే సహించమని తెలంగాణ రజక సంఘం అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శి పూసల సంపత్, ముత్యాల నర్సింహులు అన్నారు. నారాయణపేట, సిద్దిపేట ఎన్నికల బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి బీసీ-డీ గ్రూపులో ఉన్న ముదిరాజ్‌లను బీసీ-ఏ గ్రూపులోకి కలుపుతామని ప్రకటించడంపై వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

కార్యకర్తల అండే బీఆర్‌ఎస్‌కు కొండంత బలం

బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

బంజారాహిల్స్: బీఆర్‌ఎస్ పార్టీ గుర్తుపై గెలిచిన నేతలు పార్టీలు మారారేమో కానీ క్షేత్ర స్థాయిలో ఇంకా కార్యకర్తలు నేతలు బీఆర్‌ఎస్‌లోనే ఉన్నారని వారే మా బలమని బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. శనివారం బంజారాహిల్స్, వెంకటేశ్వరకాలనీ డివిజన్ పార్టీ బూత్ స్థాయి నేతలు, కార్యకర్తల సమావేశం సీనియర్ నేత మన్నె గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన బీఆర్‌ఎస్ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా మాగంటి మాట్లాడుతూ... కాంగ్రెస్ పార్టీ అబద్ధపు హామీలు ఇచ్చినా కూడా హైదరాబాద్‌వాసులు ఎవరూ నమ్మలేదని అదే విధంగా ఈ సారి సికింద్రాబాద్ పార్లమెంటు ఎన్నికల్లో సైతం బీఆర్‌ఎస్ అభ్యర్థి పద్మారావు గౌడ్‌ను గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జిలు ఎం.ఎన్.శ్రీనివాస్, కె.విప్లవ్‌కుమార్, కార్పొరేటర్ కవితారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్

లిటిల్‌స్టార్ స్కూల్‌లో టెన్త్ విద్యార్థుల సందడి

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ రోడ్డు నెంబర్–10లోని గాయత్రీహిల్స్‌లో ఉన్న లిటిల్ స్టార్ హైస్కూల్‌లో శనివారం పదో తరగతి పాసైన విద్యార్థులు సందడి చేశారు. పాఠశాలలో 54 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాయగా ఇటీవల వెలువడ్డ ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించడం పట్ల స్కూల్ ప్రిన్సిపాల్ డాక్టర్ అస్మతున్నీసా వారందరినీ స్కూల్‌కు రప్పించి అభినందన సభ ఏర్పాటుచేశారు. ఒక్కొక్కరినీ ప్రత్యేకంగా అభినందించారు. అవినాష్, మనోజ్‌కుమార్, చైతన్య అనే విద్యార్థులు 9.7 జీపీఏ సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచారని తెలిపారు. పరీక్షలు జరుగుతున్నన్ని రోజులు తమను స్కూల్‌కు పిలిపించి సబ్జెక్టు టీచర్లు పరీక్షలకు బాగా సన్నద్ధం చేశారని, స్పెషల్ క్లాస్‌లు కూడా దోహదపడ్డాయని, అందుకే తాము మంచి మార్కులు సాధించామని విద్యార్థులు తెలిపారు. ప్రతిరోజూ ప్రిన్సిపాల్ తమను పరీక్షా కేంద్రం వద్ద దింపి ధైర్యం చెప్పేవారని, అందుకే ఎలాంటి భయం లేకుండా పరీక్షలు రాసామని గుర్తుచేసుకున్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించడంలో ఉపాధ్యాయులు ఎంతో కష్టపడ్డారని ఆమె తెలిపారు.



విద్యార్థులతో హైస్కూల్ ప్రిన్సిపాల్ అస్మతున్నీసా

మోదీ నాయకత్వంవైపే ప్రజల మొగ్గు

బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి

శ్రీనగర్‌కాలనీ: దేశాన్ని అన్నిరంగాల్లో అభివృద్ధి పథంలో నడిపించిన ప్రధాని నరేంద్రమోదీ నాయకత్వాన్ని ప్రజలు విశ్వసిస్తున్నారని హైదరాబాద్ సెంట్రల్ జిల్లా ఉపాధ్యక్షురాలు కీర్తిరెడ్డి జూటూరు అన్నారు. శనివారం ఆమె కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కీర్తిరెడ్డి మాట్లాడుతూ... సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో కిషన్‌రెడ్డి చేసిన సంక్షేమాభివృద్ధే ఆయన అత్యధిక మెజారిటీతో మరోసారి విజయదుందుభి మోగించడం ఖాయమని అన్నారు. తెలంగాణలో 10కిపైగా లోక్‌సభ స్థానాల్లో పార్టీ విజయం సాధిస్తుందన్నారు. రాష్ట్రంలో రూ. 1.60 లక్షల కోట్ల నిధులను కేంద్రం నుంచి కిషన్‌రెడ్డి తీసుకొచ్చి అభివృద్ధి పనులను చేపట్టారని అన్నారు. కేంద్ర నిధులను సైతం అప్పటి బీఆర్‌ఎస్ తమఖాతాలో వేసుకుందని ఎద్దేవా చేశారు. టూరిజం మినిస్టర్‌గా తెలంగాణలో చాలా చరిత్రాత్మక ప్రాంతాలను అభివృద్ధి చేశారని, ఆర్భాటాలకు దూరంగా ఉండే కిషన్‌రెడ్డి అభివృద్ధిని చేతల్లో చూపించారని అన్నారు. ప్రజలు అన్ని గమనిస్తున్నారని, బీజేపీ చేసిన అభివృద్ధిని చూసి బీజేపీ పట్టం కట్టబోతున్నారని కీర్తిరెడ్డి జోస్యం చెప్పారు. మోసకారి కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీలను నమ్మవద్దని ప్రజాసంక్షేమాన్ని కోరే బీజేపీ కమలం గుర్తుకు ఓటు వేయాలని ఆమె ప్రజలకు విజ్ఞప్తి చేశారు.



పద్మారావుగౌడ్‌కు ఎమ్మార్పీఎస్ మద్దతు

హిమాయత్‌నగర్: లోక్‌సభ ఎన్నికల్లో సికింద్రాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి తీగుళ్ల పద్మారావుగౌడ్‌కు మాదిగ రిజర్వేషన్ పోరాట సంఘం (ఎమ్మార్పీఎస్) మద్దతు ప్రకటించింది. శనివారం బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారక భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యకుడు జిల్లా వెంకటేష్ మాట్లాడుతూ... తెలంగాణలో దాదాపు 80 లక్షల మంది మాదిగలను రాజకీయంగా సీట్ల విషయంలో మోసం చేస్తున్న కాంగ్రెస్, రాజ్యాంగాన్ని మారుస్తామంటున్న బీజేపీలకు తెలంగాణ ప్రజలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెప్పాలని పిలుపునిచ్చారు. మాదిగ స్టూడెంట్స్ జేఏసీ చైర్మన్ బుపిపాక గణేష్ మాదిగ, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కో ఆర్డినేటర్ మీసాల మాదిగ, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ చేకూరి గణేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పుట్టల సందీప్, రాష్ట్ర ఉపాధ్యకులు అందుగుల ఆనంద్, నాయకులు వెంకటేశ్వర్లు, అంజి, నక్క రమేష్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజల కోసం పనిచేస్తా.. ఆశీర్వదించండి: దానం

వెంకటేశ్వరకాలనీ: తాను మాటలు చెప్పేవాడిని కాదని, అభివృద్ధి అంటే చేసి చూపించేవాడినని సికింద్రాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్ నియోజకవర్గం వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని వెంకటేశ్వరనగర్‌లో మాజీ కార్పొరేటర్ భారతినాయక్‌తో కలిసి ఆయన ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా దానం మాట్లాడుతూ... తాను నిరంతరం ప్రజల మధ్యనే ఉండేవాడినని, వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటుండడం వల్లే తనను ప్రతి ఎన్నికలోనూ ఆశీర్వదించి ఆదరిస్తున్నారన్నారు. అదే రీతిన సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గంలో అభివృద్ధి చేసేందుకు హస్తం గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.



వెంకటేశ్వరకాలనీలో ప్రచారం నిర్వహిస్తున్న దానం

జెనెటిక్ సమస్యలకు అత్యాధునిక చికిత్స

నిమ్స్ డైరెక్టర్ నగరి బీరప్ప

లక్డీకాపూల్: జెనెటిక్ డిసీజెస్‌తో బాధపడేవారికి సైతం నిమ్స్ ఆస్పత్రిలో అత్యాధునిక చికిత్సలను అందించనున్నట్లు డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్ప తెలిపారు. తలసేమియా, హిమోగ్లోబినోపతిస్ సమస్యల నివారణలో బాధితులు ఆందోళన అవసరం లేదన్నారు. అవగాహనతో వ్యాధి తీవ్రతను తగ్గించుకోవడమే కాకుండా పూర్తిగా ఉపశమనం పొందడానికి ఆధునిక వైద్య విధానం అందుబాటులోకి వచ్చిందన్నారు. శనివారం నిమ్స్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ మెడికల్ జెనెటిక్స్, నిజాం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్, సెంటర్ ఫర్ డీఎన్‌ఏ ఫింగర్‌ప్రింటింగ్, దయాగ్నోస్టిక్స్, తలసేమియా, సికిల్ సెల్ సొసైటీ, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్ డిసీజెస్ సంయుక్తంగా తలసేమియా, హిమోగ్లోబినోపతీస్‌పై అవగాహన కార్యక్రమం జరిగింది. వైద్య నిపుణులు, శాస్త్రవేత్తలు అలాగే 45 మంది తలసేమియా యోధులతో పాటుగా వారి కుటుంబాలతో సహా ఆన్‌సైట్, ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు. నిమ్స్‌ డాక్టర్ లిజా రాజశేఖర్, జెనెటిక్స్ విభాగం అధిపతి డాక్టర్ షగున్ అగర్వాల్, అడిషనల్ ప్రొఫెసర్ డాక్టర్ ప్రజ్ఞ రంగనాథ్, టీఎస్‌సీఎస్ ప్రెసిడెంట్ డాక్టర్ చంద్రకాంత్ అగర్వాల్, ఇనిస్టిట్యూట్ ఆఫ్ జెనెటిక్స డైరెక్టర్ డాక్టర్ విజయలక్ష్మి, దలాల్ దయాగ్నోస్టిక్స్ విభాగం డాక్టర్ అశ్విని తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ సంక్షేమమే గెలిపిస్తుంది: కవితారెడ్డి

వెంకటేశ్వరకాలనీ: కేసీఆర్ ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు, ఆయన చేసిన అభివృద్ధే బీఆర్‌ఎస్ సికింద్రాబాద్ అభ్యర్థి పద్మారావుగౌడ్‌ను గెలిపిస్తాయని వెంకటేశ్వరకాలనీ డివిజన్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి అన్నారు. శనివారం ఆమె వెంకటేశ్వరకాలనీ డివిజన్ పరిధిలోని సింగాడికుంట, దేవరకొండ బస్తీ ప్రాంతాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె ఇంటింటికీ తిరుగుతూ బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాల్సిందిగా అభ్యర్థించారు. నేతలు పార్టీలు మారినా క్షేత్ర స్థాయిలో బీఆర్‌ఎస్ కార్యకర్తలెవరూ ఇతర పార్టీల్లోకి మారలేదని అన్నారు.

అత్యధిక మెజార్టీ ఇస్తాం: భారతీనాయక్

వెంకటేశ్వరకాలనీ: సికింద్రాబాద్ ఎంపీగా దానం నాగేందర్ ఘన విజయం సాధిస్తారని మాజీ కార్పొరేటర్ భారతి నాయక్ అన్నారు. శనివారం బంజారాహిల్స్ రోడ్ నెం.14లోని వెంకటేశ్వరనగర్ బస్తీలో ఆమె నేతలు, కార్యకర్తలతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... ఖైరతాబాద్ నియోజకవర్గంలో దానం నాగేందర్‌కు ఘన మెజార్టీ ఇస్తామని ఏ ఇంటికి వెళ్లినా ఓటర్లు సానుకూలంగా స్పందిస్తున్నారని తెలిపారు. సీనియర్ నేతలు బాబా నాయక్, రాములు చౌహాన్, డివిజన్ అధ్యక్షుడు బి. శ్రీనివాస్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

బుల్లెట్ కంటే బ్యాలెట్ గొప్పది

బంజారాహిల్స్: బుల్లెట్ కంటే బ్యాలెట్ శక్తివంతమైనదని, ప్రతిఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలంటూ సైఫాబాద్ సైన్స్ కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు శనివారం నెక్లెస్ రోడ్డులో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ర్యాలీకి హాజరైన డాక్టర్ పల్లాటి నరేష్ మాట్లాడుతూ... 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలన్నారు. హైదరాబాద్‌లో పోలింగ్ శాతం పెంచాల్సిన బాధ్యత నగర పౌరులపై ఎంతైనా ఉందని విజ్ఞప్తి చేశారు. సామాజిక బాధ్యతతో కార్యక్రమాన్ని నిర్వహించిన ఎన్‌సీసీ ఆఫీసర్, క్యాడేట్లను ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ లక్ష్మణ్‌నాయక్ అభినందించారు.




నెక్లెస్ రోడ్డులో ఓటు హక్కుపై అవగాహన కలిగిస్తున్న కళాశాల ఎన్‌సీసీ క్యాడెట్లు

మూడు పార్టీలకూ... 'కంటోన్మెంట్' కీలకం



సిట్టింగ్ స్థానం నిలుపుకోవాలని బీఆర్ఎస్	నగరంలో బోణీ కొట్టాలని కాంగ్రెస్	పట్టు పెంచుకోవాలని బీజేపీ	సర్వశక్తులు ఒడ్డుతున్న అభ్యర్థులు

కంటోన్మెంట్: సికింద్రాబాద్ కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గ ఉపఎన్నికను కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. మొత్తంగా 15 మంది అభ్యర్థులు బరిలో నిలిచినా, మూడు ప్రధాన పార్టీల మధ్యే పోటీ ఉంది. గత అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినా, హైదరాబాద్ సిటీ పరిధిలో ఒక్క స్థానం కూడా గెలవలేకపోయిన కాంగ్రెస్ కంటోన్మెంట్‌తో బోణీ కొట్టాలన్న కసితో ఉంది. ప్రత్యర్థులకంటే తామే ఇక్కడ బలంగా ఉన్నామని భావిస్తున్న బీఆర్ఎస్, సిట్టింగ్ స్థానాన్ని నిలుపుకో



వాలన్న పట్టుదలతో ఉంది. గత ఎన్నికల్లో కంటోన్మెంట్‌లో తొలిసారిగా రెండో స్థానాన్ని దక్కించుకున్న బీజేపీ ఈసారి ఎలాగైనా గెలవాలని ప్రయత్నిస్తోంది. మొత్తానికి మూడు పార్టీలూ ఉపఎన్నిక విజయమే లక్ష్యంగా సర్వశక్తులూ ఒడ్డుతున్నాయి. సిట్టింగ్ ఎమ్మెల్యే లాస్య నందిత మరణంతో వచ్చిన ఉపఎన్నికలో ఆమె అక్క నివేదిత బీఆర్ఎస్ నుంచి బరిలో నిలిచారు. గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీ చేసి రెండోస్థానంలో నిలిచిన శ్రీగణేశ్, అధికార కాంగ్రెస్ పార్టీలో చేరి మరోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకోబోతున్నారు. బీజేపీ ఈసారి కొత్త అభ్యర్థి అయిన డాక్టర్ టీఎన్ వంశ తిలక్‌కు పార్టీ టికెట్ కేటాయించింది.

బీఆర్ఎస్.. నివేదిత



దివంగత ఎమ్మెల్యే సాయన్న 2014లో టీడీపీ నుంచి గెలిచి రెండేళ్లలోనే బీఆర్ఎస్‌లో చేరారు. అప్పటికే నాలుగుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందిన ఆయన 2018లో తొలిసారిగా బీఆర్ఎస్ అభ్యర్థిగా విజయం సాధించారు. గతేడాది ఫిబ్రవరిలో అనారోగ్యంతో మరణించారు. దీంతో ఆయన స్థానంలో చిన్న కుమార్తె లాస్య నందిత 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి విజయం సాధించారు. అయితే ఈ ఏడాది ఫిబ్రవరిలో ఔటర్‌పై జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతి చెందారు. దీంతో ఉపఎన్నిక అనివార్యం కాగా, బీఆర్ఎస్ మళ్లీ సాయన్న రెండో కుమార్తె నివేదితకు టికెట్ కేటాయించింది. అయితే రాష్ట్ర స్థాయి కార్పొరేషన్‌ల మాజీ చైర్మన్లు మన్నె కృషాంక్, గజ్జెల నాగేశ్, డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్‌లు బీఆర్ఎస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. దీంతో ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ తరఫున ప్రచారానికి వారు దూరంగా ఉన్నారు. లాస్య నందిత గెలిచిన తర్వాత తమను పట్టించుకోవడం లేదంటూ పెద్దసంఖ్యలో బీఆర్ఎస్ నేతలు, ముఖ్యంగా ఒకనాటి సాయన్న అనుచరులు పార్టీని వీడి కాంగ్రెస్‌లో చేరారు. బోర్డు మాజీ సభ్యులు మాత్రం అండగా నిలవగా, సాయన్న, సోదరి లాస్య సెంటిమెంట్‌పై ఆశలతో నివేదిత తన ప్రచారం కొనసాగిస్తున్నారు. క్షేత్రస్థాయిలో పటిష్టంగా ఉన్న బీఆర్ఎస్ కేడర్, తండ్రి, సోదరి సెంటిమెంట్‌తో తన గెలుపు ఖాయం అన్న ధీమాలో ఉన్నారు.

అనుకూలతలు
- దివంగత ఎమ్మెల్యే సాయన్న కుమార్తె కావడం
- ఏడాదిలోనే ఎమ్మెల్యే హోదాలోనే తండ్రి, సోదరిని కోల్పోయిన సానుభూతి
- పటిష్టమైన పార్టీ కేడర్

ప్రతికూలతలు
- పెద్ద సంఖ్యలో నేతలు పార్టీని వీడటం
- ప్రజలు, కార్యకర్తలకు అందుబాటులో ఉండరనే గతానుభవాలు
- కీలకనేతలు ప్రచారానికి దూరంగా ఉండటం

కాంగ్రెస్.. శ్రీగణేశ్



నారాయణ్ శ్రీగణేశ్ పదిహేనేళ్ల క్రితమే కాంగ్రెస్ యువ నాయకుడిగా కంటోన్మెంట్ రాజకీయాల్లోకి వచ్చారు. 2014, 2018లో కాంగ్రెస్ టికెట్ ఆశించి భంగపడ్డారు. అయితే 2018లో ఆఖరి నిమిషంలో బీజేపీలో చేరి ఎమ్మెల్యేగా పోటీ చేశారు. అనంతరం పార్లమెంట్ ఎన్నికల సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. పార్టీలకతీతంగా శ్రీగణేశ్ ఫౌండేషన్ ద్వారా ప్రజాసేవతో కంటోన్మెంట్ ఓటర్లకు దగ్గరయ్యారు. ఈ క్రమంలో 2023లో బీఆర్ఎస్ టికెట్ రాకపోవడంతో మరోసారి బీజేపీ అభ్యర్థిగానే బరిలోకి దిగారు. బీఆర్ఎస్ అభ్యర్థి లాస్య నందితకు గట్టి పోటీ ఇచ్చి రెండో స్థానంలో నిలిచారు. తాజా ఉపఎన్నికలో ఎలాగైనా గెలవాలన్న తలంపుతో అధికార కాంగ్రెస్ శ్రీగణేశ్‌ను పార్టీలోకి ఆహ్వానించింది. శ్రీగణేశ్ వ్యక్తిగత బలం, అధికార పార్టీ అండతో గెలుపు ఖాయం అన్న ధీమాలో కాంగ్రెస్ నేతలు ఉన్నారు. చేరికల జోరుతో కాంగ్రెస్ శ్రేణులు సరికొత్త ఉత్సాహంతో పనిచేస్తున్నాయి.

అనుకూలతలు
- అధికార పార్టీ అభ్యర్థి కావడం
- ఓడిపోయినా ప్రజల్లోనే ఉండటం
- పార్టీలకతీతంగా సొంత కేడర్

ప్రతికూలతలు
- తరచూ పార్టీలు మారతాడన్న అపవాదు
- పాతనేతలు, కొత్తగా చేరుతున్న వారిమధ్య సమన్వయలేమి
- కొన్ని వార్డుల్లో పార్టీ బలహీనంగా ఉండటం

బీజేపీ.. టీఎన్ వంశ తిలక్



ఉత్తరాది ప్రాంతాలకు చెందిన ఓటర్లు అధికంగా ఉండే కంటోన్మెంట్‌లో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. గత ఎంపీ ఎన్నికల్లో రేవంత్‌రెడ్డి ఎంపీగా గెలిచినా, కంటోన్మెంట్‌లో మాత్రం బీజేపీ కాంగ్రెస్‌ను దాటి రెండో స్థానంలో నిలిచింది. తాజాగా 2023 అసెంబ్లీ ఎన్నికల్లోనూ బీజేపీ రెండో స్థానం దక్కించుకుంది. అయితే ఆ పార్టీ తరఫున పోటీచేసిన అభ్యర్థి శ్రీగణేశ్ కాంగ్రెస్‌లోకి చేరడంతో మాజీ మంత్రి టీఎన్ సదాలక్ష్మి కుమారుడైన డాక్టర్ టీఎన్ వంశ తిలక్‌కు టికెట్ కేటాయించింది. కంటోన్మెంట్ నియోజకవర్గానికి కొత్త వ్యక్తి కావడంతో సీనియర్ నేతలపైనే ఆధారపడాల్సి వస్తోంది. బీజేపీలోని అంతర్గత కుమ్ములాటల నేపథ్యంలో ఇప్పటికీ క్షేత్రస్థాయిలో ప్రచారం చేపట్టలేకపోయారు. అయితే మాదిగ అభ్యర్థికి టికెట్ ఇవ్వాలన్న తమ డిమాండ్‌కు తలొగ్గిన బీజేపీకి ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు ప్రకటించి ప్రచారం చేస్తోంది. పార్లమెంట్ ఎన్నికలతో కలిసి రావడంతో మోదీ చరిష్మాతో బీజేపీ ఈ స్థానంలో గెలుపుపై ఆశలు పెట్టుకుంది.

అనుకూలతలు
- పటిష్టమైన పార్టీ కేడర్
- ఎమ్మార్పీఎస్ సంపూర్ణ మద్దతు
- మోదీ చరిష్మాతో ఉత్తరాది ఓట్లపై ఆశలు

ప్రతికూలతలు
- కంటోన్మెంట్‌కు పరిచయం లేని వ్యక్తి
- పార్టీ నేతల మధ్య సమన్వయలేమి
- ప్రచారంలో వెనుకబడిపోవడం



కేరళ, తెలంగాణల్లో బీజేపీకి
మంచి ఫలితాలు

మలయాళ సినీ హీరో, మాజీ ఎంపీ సురేశ్ గోపి ధీమా



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న లోక్‌సభ ఎన్నికల్లో కేరళతోపాటు తెలంగాణ రాష్ట్రంలో బీజేపీకి మంచి ఫలితాలు రాబోతున్నాయని ప్రముఖ మలయాళ సినీ హీరో, మాజీ ఎంపీ సురేశ్ గోపి ధీమా వ్యక్తం చేశారు. తాను పోటీ చేసిన త్రిసూర్‌లో ప్రజల దీవెనలు ఈవీఎంలలో నిక్షిప్తమయ్యాయని, ప్రజలు తనను ఆశీర్వదించారనే అనుకుంటున్నానని అన్నారు. తెలంగాణలో బీజేపీ తరఫున ప్రచారం నిర్వహించేందుకు హైదరాబాద్ వచ్చిన సందర్భంగా.. శనివారం ఆయన బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీజేపీకి సానుకూల వాతావరణ పరిస్థితులు కనిపిస్తున్నాయని సురేశ్ గోపి చెప్పారు. రాష్ట్రంలో పార్టీ అత్యధిక సీట్లను గెలుచుకుంటుందని, కేంద్ర కేబినెట్‌లో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డితోపాటు ఈటల రాజేందర్ మంత్రి కావాలని తాను కోరుకుంటున్నానని తెలిపారు. కేంద్రంలో తెలంగాణకు ప్రాధాన్యం పెరగనున్నందున అధిక సీట్లలో బీజేపీని గెలిపించాలని ప్రజలను కోరుతున్నామన్నారు. దక్షిణ భారతానికి కేంద్ర ప్రభుత్వం అన్యాయం చేస్తోందనేది రాష్ట్రంలోని అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దుష్ప్రచారమని పేర్కొన్నారు. దక్షిణాదిలోనూ కేంద్ర ప్రభుత్వం ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టిందని చెప్పారు. అందరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని.. ఇది మన బాధ్యత అని సురేశ్ గోపి అన్నారు.

మాధవీలత 2 లక్షల
మెజారిటీతో గెలుస్తారు


బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు సిద్ధిఖీ



సాక్షి, హైదరాబాద్: దేశంలోని మైనార్టీలు మార్పు కోరుకుంటున్నారని బీజేపీ మైనారిటీ మోర్చా జాతీయ అధ్యక్షుడు జనాబ్ జమాల్ సిద్ధిఖీ చెప్పారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ 'హైదరాబాద్‌లో ఏఐఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీతో మా పోరు కొనసాగుతుంది. ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో బురఖాలు వేసుకొని నకిలీ ఓట్లు వేయిస్తున్నారు. అక్కడ ముస్లింలను కావాలని బద్నాం చేస్తున్నారు. బురఖాలో వచ్చి నకిలీ ఓట్లు వేసే వారిని బూత్‌లలో గుర్తించినట్లయితే ఒవైసీ ఓడిపోవడం ఖాయం. మా పార్టీ అభ్యర్థి మాధవీలత కనీసం 2 లక్షల ఓట్ల మెజారిటీతో గెలుస్తారు. కొన్ని చోట్ల కనీసం కార్యకర్తలు కూడా లేని చోట్ల యువతతో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం. వాటిని డ్రై బూత్‌లుగా పిలిచేవారు. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి మారింది' అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్ పార్టీ ముస్లింలలో ఒక్కరికి కూడా మంత్రి పదవి ఇవ్వలేదు కానీ ఎన్నికలు, ఓట్ల విషయం వచ్చే వరకు మాత్రం ముస్లింల పార్టీ అని కబుర్లు చెబుతుందని విమర్శించారు. ఇఫ్తార్ విందు ఇస్తారు.. టోపీలు పెట్టుకుంటారు.. కానీ పదవులు మాత్రం ఇవ్వరు అని సిద్ధిఖీ మండిపడ్డారు. మోదీ సర్కార్, బీజేపీ అన్ని వర్గాల పేదల కోసం పని చేస్తున్నాయన్నారు. దేశవ్యాప్తంగా కుటుంబ, అవినీతి పాలనను తరిమికొట్టాలని ప్రజలు నిర్ణయించుకున్నారని చెప్పారు. బీజేపీకి కొత్త ఓటర్లు, యువత మద్దతు ఉందని, యావత్ తెలంగాణ మార్పు కోరుకుంటోందని సిద్ధిఖీ తెలిపారు.

రాహుల్, రేవంత్ మాటలు
ప్రజలు నమ్మరు

బీజేపీ నేత ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్



సాక్షి, హైదరాబాద్: ఇండీ కూటమి తరఫున ప్రచారం చేస్తున్న నాయకులంతా జైలుకెళ్లిన వారు, లేదా బెయిల్ మీద బయట తిరుగుతున్నవారేనని బీజేపీ మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ ఎద్దేవా చేశారు. బెయిల్‌పై ఉన్న రాహుల్, రేవంత్‌రెడ్డి మాటలను ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరని అన్నారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, భారత రాజ్యాంగాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేయడం కోసం గతంలో జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ వేశారని, కాని అది రిజర్వేషన్ల రద్దు కోసం వేసిన కమిషన్ కాదని ప్రభాకర్ పేర్కొన్నారు. అది పార్లమెంటు ఆమోదంతో వేసిన కమిషన్ అని, కమిషన్ తన నివేదికలో ఎక్కడా కూడా రిజర్వేషన్లను రద్దు చేయాలని చెప్పలేదని వివరించారు. జస్టిస్ వెంకటాచలయ్య కమిషన్ నియమ నిబంధనలు ఏమిటో రేవంత్‌రెడ్డి తెలుసుకుని మాట్లాడాలని అన్నారు.

కేసీఆర్‌ను అవమానిస్తే సహించం



దుబ్బాకలో రోడ్‌షోకు హాజరైన జనం. మాట్లాడుతున్న హరీశ్‌రావు

- హామీలు అమలు చేయకపోతే రేవంత్ క్షమాపణ చెప్పాలి
- రఘునందన్‌ను మళ్లీ మడతపెట్టి ఉతికి ఆరేయాలి
- దుబ్బాక రోడ్ షోలో హరీశ్‌రావు

దుబ్బాక: కేసీఆర్‌ను అవమానిస్తే సహించేది లేదని మాజీ మంత్రి హరీశ్‌రావు హెచ్చరించారు. 'ఏదో అడ్డిమారి గుడ్డిదెబ్బలా గెలిచిన రేవంత్‌రెడ్డీ.. నీవు ఎన్నికల్లో ఇచ్చిన హామీలు మొదట అమలు చేయి.. చేతకాకపోతే నాతో కాదు అని ప్రజలకు క్షమాపణ చెప్పు' అంటూ సవాల్ విసిరారు. శనివారం రాత్రి దుబ్బాకలో బీఆర్ఎస్ మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి హరీశ్ రోడ్ షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ జూటా మాటలతో గెలిచి ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. ఈ రివర్స్‌గేర్ కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఎందుకు అమలు చేయడం లేదో ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. 'బీడీ కట్టలపై పుర్రె గుర్తు పెట్టింది కాంగ్రెస్ కాదా?.. జీఎస్టీ విధించింది బీజేపీ కాదా?..' అని ప్రశ్నించారు. బీడీ కార్మికులకు పెన్షన్ ఇచ్చింది కేసీఆరేనని గుర్తుచేశారు. 'పెన్షన్లు ఎటు పాయే.. ఆడబిడ్డలకు రూ.2,500, తులం బంగారం ఎటు పాయే', 'కాంగ్రెస్ వచ్చింది కరువు తెచ్చింది.. మళ్లీ మోటార్లు కాలిపోయే కాలం వచ్చింది' అంటూ ఎద్దేవా చేశారు. అసెంబ్లీ ఎన్నికల్లో రఘునందన్‌రావును దుబ్బాకలో ప్రజలు మడతపెట్టి ఉతికినట్టే ఈ ఎన్నికల్లోనూ మరోసారి ఉతికి ఆరేయాలన్నారు.

ఏక్ నిరంజన్!

సొంత ఆటోతో స్వతంత్ర అభ్యర్థి ప్రచారం

బూర్గంపాడు: మహబూబాబాద్ లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తున్న పాయం సింగరాజు సొంత ఆటోతో ప్రచారం చేస్తున్నారు. భద్రాద్రి జిల్లా బూర్గంపాడు మండలం సారపాకకు చెందిన ఈయన అక్కడి ఐటీసీ పీఎస్‌పీడీలో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నారు. డ్యూటీ లేని సమయంలో ఆటో నడుపుతుంటారు. ఈనేపథ్యంలో ఎన్నికల్లో ఆయనకు కంప్యూటర్ గుర్తు కేటాయించగా.. తన ఆటోకే ఫ్లెక్సీ, మైక్‌లు ఏర్పాటు చేసుకుని ఒక్కరే ప్రచారం చేస్తున్నారు. నిరాడంబరంగా ప్రచారం చేస్తున్న సింగరాజును ఓటర్లు ఆసక్తిగా గమనిస్తున్నారు.







ఫుట్‌పాత్ బండి వద్ద హరీశ్ అల్పాహారం

సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గ పరిధిలో రోడ్‌షో కోసం శనివారం హైదరాబాద్ నుంచి ఛుంపల్లి వెళ్తూ సిద్దిపేట హౌసింగ్ బోర్డ్ కాలనీ సమీపంలో రోడ్డు పక్కనే ఉన్న ఓ బండి వద్ద టిఫిన్ చేస్తున్న మాజీమంత్రి హరీశ్‌రావు, మెదక్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి - సిద్దిపేట జోన్



'గుర్తు'ండిపోయేలా..!

ఖమ్మం అర్బన్: ఖమ్మం లోక్‌సభ స్థానం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా కుండ గుర్తుపై పోటీ చేస్తున్న తేజావత్ జోగ్రాంనాయక్ శనివారం జిల్లా కేంద్రంలో వినూత్నంగా ప్రచారం నిర్వహించారు. బంజారా సంప్రదాయ దుస్తులు ధరించిన మహిళలు తలపై కుండలతో ర్యాలీలో పాల్గొన్నారు. వారంతా మధ్యమధ్యలో సంప్రదాయ నృత్యాలు చేస్తుండగా.. కుండ గుర్తుపై ఓటు వేసి తనను గెలిపించాలని జోగ్రాం కోరారు.

ప్రధానిగా రాహుల్
ప్రమాణ స్వీకారం తథ్యం

రిజర్వేషన్లు తొలగించేందుకు బీజేపీ కుయుక్తులు: ఉత్తమ్

మఠంపల్లి/ గరిడేపల్లి: కేంద్రంలో ఇండియా కూటమి అధికారంలోకి వచ్చి జూన్ 13న భారత ప్రధాన మంత్రిగా రాహుల్‌గాంధీ ప్రమాణ స్వీకారం చేయడం ఖాయమని రాష్ట్ర భారీ నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ పార్టీ నేతృత్వంలో 'ఇండియా' కూటమి ఏర్పాటుతోనే బీజేపీ ఓటమి ఖాయమైందన్నారు. శనివారం ఆయన సూర్యాపేట జిల్లా మఠంపల్లి, గరిడేపల్లిలో జరిగిన ఎన్నికల ప్రచార సభల్లో మాట్లాడారు. పదేళ్ల మోదీ పాలనలో దేశాన్ని మతపరంగా విభజించి అల్లకల్లోలం సృష్టించారన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను తొలగించాలని బీజేపీ ప్రభుత్వం కుయుక్తులు పన్నుతోందని ఆరోపించారు. ఇండియా కూటమి అధికారంలోకి వస్తే రిజర్వేషన్లను మరింత పెంచుతామన్నారు. దేశం ఐక్యతగా ముందుకు సాగాలంటే రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపర్చి ఇండియా కూటమిని గెలిపించాలని కోరారు. కేసీఆర్ జిమ్మిక్కులను రాష్ట్ర ప్రజలు నమ్మే స్థితిలో లేరని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పని ఖతమైందని చెప్పారు. లోక్‌సభ ఎన్నికలు పూర్తికాగానే 20 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ సందర్భంగా కల్మలచెరువు గ్రామానికి చెందిన బొలగాని సైదులు, అనంత సత్యనారాయణతో పాటు పలు గ్రామాల నాయకులు ఉత్తమ్ సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సభల్లో మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి, నల్లగొండ డీసీసీ అధ్యక్షుడు శంకర్‌నాయక్ పాల్గొన్నారు.



సూర్యాపేట జిల్లా మఠంపల్లిలో మాట్లాడుతున్న మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి. చిత్రంలో జానారెడ్డి

రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారంపై
నిషేధం విధించాలి

సీఈవోకు బీజేపీ వినతిపత్రం

సాక్షి, హైదరాబాద్: సీఎం రేవంత్‌రెడ్డి లోక్‌సభ ఎన్నికల ప్రచారం నిర్వహించకుండా నిషేధం విధించాలని రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి (సీఈవో) వికాస్‌రాజ్‌కు బీజేపీ వినతిపత్రం అందించింది. శనివారం రేవంత్‌రెడ్డి ఎన్నికల ప్రచారం సందర్భంగా బీజేపీ రిజర్వేషన్లను రద్దు చేస్తుందంటూ తప్పుడు ఆరోపణలు చేయడంతో పాటు దీనిపై తమ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి దుష్యంత్ గౌతమ్ మీడియాలో చేసిన వ్యాఖ్యలను వక్రీకరించారని సీఈవోకి తెలిపింది. బీజేపీ రిజర్వేషన్లు రద్దు చేస్తుందని రేవంత్‌రెడ్డి తన ప్రసంగం, ప్రకటనల ద్వారా ప్రజల్లో వదంతులను వ్యాప్తి చేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేసింది. రాజ్యాంగబద్ధంగా దేశంలోని షెడ్యూల్డ్ కులాలకు కల్పించిన రిజర్వేషన్లను తొలగిస్తోందంటూ ఆరోపణలు చేశారని, రేవంత్‌రెడ్డి పనిగట్టుకుని చేస్తున్న దుష్ప్రచారంపై ఎలాంటి చర్యలు తీసుకోకుండా ఇలాగే కొనసాగిస్తే సామాజిక సామరస్యత దెబ్బతినే ప్రమాదంతో ప్రమాదం ఉందని వివరించింది. దుష్యంత్ చేసిన వ్యాఖ్యలు, ఎన్నికల ప్రచారంలో రేవంత్‌రెడ్డి చేసిన ప్రకటనలకు సంబంధించిన వీడియోలను ఈ వినతిపత్రంతో పాటు బీజేపీ నేతలు జతచేశారు. శనివారం ఈ మేరకు సీఈవోకు బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ లీగల్‌సెల్‌కు చెందిన నాయకులు గోకుల రామారావు, జనార్దన్‌గౌడ్ వినతిపత్రం ఇచ్చారు.

దేశం అభివృద్ధి చెందాలంటే
మోదీ తిరిగి ప్రధాని కావాలి

మాజీ గవర్నర్ తమిళిసై

మెదక్ జోన్: దేశం అభివృద్ధి చెందాలంటే నరేంద్రమోదీ మరోసారి ప్రధాని కావాలని మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని ఓ గార్డెన్‌లో ఏర్పాటు చేసిన మేధావుల ఆత్మీయ సమ్మేళనంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశానికి బలమైన ప్రధాని కావాలన్నా, పేదరికం నిర్మూలించాలన్నా మోదీని తిరిగి ప్రధాన మంత్రిని చేయాలన్నారు. మోదీ ప్రభుత్వం రిజర్వేషన్లు మారుస్తుందని ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణల్లో నిజంలేదని తమిళిసై అన్నారు.

బీఆర్ఎస్ కథ ముగిసింది..

టీఆర్ఎస్, బీఆర్ఎస్‌గా మారడంతోనే దాని కథ ముగిసిందని తమిళిసై అన్నారు. మాజీ సీఎం కేసీఆర్ మహిళలకు ప్రాధాన్యత ఇవ్వలేదని, గవర్నర్ పదవికి సైతం మర్యాద ఇవ్వలేదని విమర్శించారు. ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత చేసిన పనితో మహిళలు తలదించుకునే పరిస్థితి ఏర్పడిందన్నారు. మెదక్ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు ఓటు వేసి గెలిపిస్తే ఆయనకు కేంద్రంలో మంత్రి పదవి దక్కుతుందని, దీంతో ఈ ప్రాంతం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని ఆమె తెలిపారు.




మాట్లాడుతున్న మాజీ గవర్నర్ తమిళిసై సౌందరరాజన్

కన్నడ నాట... కమల వికాసమేనా?

14 స్థానాలకు 7న పోలింగ్ | 2019లో బీజేపీ ఏకపక్ష విజయం | ఈసారి గట్టి పోటీ ఇస్తున్న కాంగ్రెస్

2019 లోక్‌సభ ఎన్నికల్లో కన్నడనాట క్లీన్‌స్వీప్ చేసిన కమలనాథులు ఈసారి చెమటోడుస్తున్నారు. రాష్ట్రంలో 28 స్థానాలకు గాను 14 చోట్ల రెండో విడతలో పోలింగ్ ముగిసింది. మిగతా 14 స్థానాలకు ఈ నెల 7న పోలింగ్ జరగనుంది. ఇవన్నీ ఉత్తర, మధ్య కర్నాటక ప్రాంతంలోనివే. వీటిలో బీజేపీకి కాంగ్రెస్ బలమైన పోటీనిస్తోంది. కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషీ, మాజీ మంత్రి బి.శ్రీరాములు, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే అల్లుడు, బీజేపీ రాష్ట్ర దిగ్గజమైన యడ్యూరప్ప కుమారుడు బి.వై.రాఘవేంద్ర, మాజీ సీఎంలు బస్వరాజ్ బొమ్మై, జగదీశ్ శెట్టర్ వంటి ప్రముఖుల భవితవ్యాన్ని ఈ విడతలో ఓటర్లు తేల్చనున్నారు. ఈ విడతలోని కొన్ని కీలక స్థానాలపై ఫోకస్...

- సాక్షి, నేషనల్ డెస్క్



కలబురిగి



కర్నాటకలో హై ప్రొఫైల్ సీట్లలో ఇదీ ఒకటి. కాంగ్రెస్ నుంచి పార్టీ చీఫ్ మల్లికార్జున ఖర్గే అల్లుడు రాధాకృష్ణ దొడ్డమణి పోటీలో ఉన్నారు. ఒకప్పుడు ఇది ఖర్గే దుర్గం. 2019లో బీజేపీ నెగ్గింది. నాటి ఎన్నికల్లో ఖర్గేను ఆయన మాజీ శిష్యుడు డాక్టర్ ఉమేశ్ జాదవ్ (బీజేపీ) ఓడించడం విశేషం! ఈ విడత అల్లుడినైనా గెలిపించుకోలేకపోతే ఖర్గేకు ఇబ్బందికరమే. దాంతో ఆయన సర్వశక్తులూ ధారపోస్తున్నారు. ఈ లోక్‌సభ పరిధిలోని 8 అసెంబ్లీ సీట్లలో గతేడాది ఎన్నికల్లో ఏకంగా ఆరింటిని గెలుచుకోవడం కాంగ్రెస్‌కు అనుకూలాంశం. 35 శాతమున్న దళితులపైనా ఆశలు పెట్టుకుంది.

హావేరి

గతేడాది దాకా కర్నాటక ముఖ్యమంత్రిగా ఉన్న బస్వరాజ్ బొమ్మై ఇక్కడ బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగారు. దాంతో గెలుపు ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. 2019లో ఇక్కడ బీజేపీ నుంచి శివకుమార్ చనబసప్ప ఉదాసి 1.41 లక్షల మెజారిటీతో కాంగ్రెస్ నేత డీఆర్ పాటిల్‌పై నెగ్గారు. ఈసారి కాంగ్రెస్ నుంచి ఆనందస్వామి గడ్డదేవరమట్ పోటీ చేస్తున్నారు. హావేరిలో మొత్తం 14 మంది అభ్యర్థులు తుది పోటీలో నిలిచారు.

బళ్లారి

ఈ ఎస్టీ రిజర్వుడు స్థానం ఇనుప ఖనిజం గనులకు ప్రసిద్ధి. బీజేపీ నేత, మాజీ మంత్రి బి.శ్రీరాములు, సండూర్ నుంచి నాలుగుసార్లు ఎమ్మెల్యే అయిన కాంగ్రెస్ నేత ఇ.తుకారాం మధ్య పోటీ నెలకొంది. గతేడాది కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో బళ్లారి నుంచి పోటీ చేసి ఓటమి చవిచూసిన శ్రీరాములుకు ఇప్పుడు గెలుపు ప్రతిష్టాత్మకంగా మారింది. 2014లో ఇక్కడ ఆయన గెలిచారు కూడా. 2018 ఉప ఎన్నికలో ఈ స్థానం కాంగ్రెస్ చేతికి వెళ్లింది. 2019లో బీజేపీ అభ్యర్థి వై.దేవేంద్రప్ప గెలిచారు. బళ్లారిలో ఆరు లక్షలకు పైగా ఎస్టీ ఓటర్లతో పాటు లింగాయత్‌లు, మైనారిటీలు, కురుబలు కూడా పెద్ద సంఖ్యలో ఉన్నారు. 2008లో ఎస్టీలకు రిజర్వ్ చేయక ముందు 1952 నుంచి 1999 దాకా బళ్లారిలో కాంగ్రెసే గెలుస్తూ వచ్చింది. స్థానికేతరుడు కావడం తుకారాంకు ప్రతికూలం కావచ్చు.



ధార్వాడ్



కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ప్రాతినిధ్యం వహిస్తున్న స్థానం. 2004 నుంచీ ఇక్కడ ఆయన జైత్రయాత్ర సాగుతోంది. ఇక్కడ లింగాయత్ ఓటర్లు ఎక్కువ. బ్రాహ్మణ వర్గీయుడైన జోషి అభ్యర్థిత్వాన్ని లింగాయత్ మఠాధిపతి దింగలేశ్వర స్వామి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. వీరశైవ లింగాయత్‌లు, ఇతర వర్గీయులను జోషి అణచివేస్తున్నారంటూ ఆయనపై ఈసారి పోటీకి దిగారు కూడా! త్రిముఖ పోటీ జోషికే మేలు చేస్తుందన్న సీఎం సిద్ధరామయ్య హితవుతో నామినేషన్ ఉపసంహరించుకున్నారు. కాంగ్రెస్ అభ్యర్థి వినోద్ అసూతికి మద్దతిస్తున్నారు. అయినా జోషికే విజయావకాశాలున్నట్టు చెబుతున్నారు.

మారిన చిత్రం

2019 ఎన్నికల్లో కర్నాటకలో మోదీ హవా సాగింది. దాంతో 28 స్థానాలకు గాను ఏకంగా 25 బీజేపీ ఖాతాలో చేరాయి. 7న పోలింగ్ జరిగే 14 స్థానాలూ బీజేపీ కైవసం చేసుకున్నవే. కాంగ్రెస్ గట్టి పోటీ ఇస్తుండటంతో వాటిని నిలబెట్టుకోవడం కమలదళానికి ప్రతిష్టాత్మకంగా మారింది. బీజేపీ మద్దతుదారులైన లింగాయత్‌లు గతేడాది అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ వైపు మళ్లారు. ఈసారి వారు ఎవరికి ఓటేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. సంప్రదాయ ఓటు బ్యాంకైన అహింద గ్రూప్‌లు(దళితులు), మైనారిటీలపైనా హస్తం ఆశలు పెట్టుకుంది.

వీరికి ప్రతిష్టాత్మకం



కాంగ్రెస్ చీఫ్ ఖర్గేకు ఈ ఎన్నికలు ప్రతిష్టాత్మకంగా మారాయి. అల్లుణ్ని గెలిపించుకోవడంతో పాటు తన సొంత ప్రాంతమైన కల్యాణ కర్ణాటకలో ఎక్కువ స్థానాలను గెలిపించి సత్తా చూపించాలని ఆయన పట్టుదలగా ఉన్నారు. అలాగే బీజేపీ రాష్ట్ర చీఫ్ విజయేంద్ర, ఆయన తండ్రి యడ్యూరప్పకు కూడా ఈ ఎన్నికలు అత్యంత ప్రతిష్టాత్మకమే. వీరితో పాటు సీఎం సిద్ధరామయ్య, డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ కూడా ఎన్నికలను ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. కాంగ్రెస్ తరఫున అగ్రనేత రాహుల్ గాంధీ, ప్రియాంక, సిద్ధరామయ్య, బీజేపీ నుంచి మోదీ, పార్టీ చీఫ్ నడ్డా తదితరులు ప్రచారంతో హోరెత్తిస్తున్నారు.

‘గీత’ దాటినా... గీత మారేనా!

గీతా శివరాజ్‌కుమార్. కన్నడ ప్రజలకు చిరపరిచితమైన పేరు. కన్నడ కంఠీరవ రాజ్‌కుమార్ కోడలు. ప్రముఖ నటుడు శివరాజ్‌కుమార్ భార్య. అంతేనా...? కర్నాటక మాజీ ముఖ్యమంత్రి బంగారప్ప కూతురు! రాజకీయ కుటుంబంలో పుట్టి కన్నడ సినీ పరిశ్రమకు దిగ్గజాల వంటి తారలను అందించిన ఇంటికి కోడలిగా వెళ్లారు. అయినా పుట్టింటి వారసత్వం ఆమెను చివరికి రాజకీయాల వైపు నడిపించింది. 2014లోనే రాజకీయ అరంగేట్రం చేసిన గీత ఇప్పుడు శివమొగ్గ లోక్‌సభ స్థానంలో బీజేపీ దిగ్గజం యడ్యూరప్ప కుమారుడు బీవై రాఘవేంద్రతో పోటీ పడుతున్నారు...



నిషేధాన్ని ఉల్లంఘించి..

గీతకు 1986లో శివరాజ్‌కుమార్‌తో పెళ్లయ్యింది. తర్వాత కుటుంబ బాధ్యతల్లో తలమునకలయ్యారు. తల్లి మరణానంతరం ఆమె నిర్వహించిన మైసూరులోని 'శక్తిధామ్' స్వచ్ఛంద సంస్థ బాధ్యతలు చూస్తున్నారు. చాలాకాలం భర్తకు స్టయిలిస్ట్‌గా కూడా చేశారు. కొన్ని సినిమాలకు నిర్మాతగానూ వ్యవహరించారు. కుటుంబం నుంచి ఎవరూ రాజకీయాల్లోకి వెళ్లొద్దని రాజ్‌కుమార్ లక్ష్మణరేఖ గీశారు. దాంతో సినిమాల్లో ఎంత పాపులారిటీ సాధించినా ఆయన కొడుకులెవ్వరూ రాజకీయాల వైపే చూడలేదు. కానీ బాల్యం నుంచి ఇంట్లో పూర్తి రాజకీయ వాతావరణం చూసిన గీతకు రాజకీయాలంటే మహా ఆసక్తి. ఆమెకు రెండేళ్లప్పుడు తండ్రి బంగారప్ప ఎమ్మెల్యేగా గెలిచారు. ఆ స్ఫూర్తితో 2014లో గీత రాజకీయ అరంగేట్రం చేశారు. ఈ నిర్ణయాన్ని రాజ్‌కుమార్ భార్య పార్వతమ్మ వ్యతిరేకించారంటారు. తటస్థంగా ఉన్న కుటుంబాన్ని శివ రాజ్‌కుమార్, గీత వారి ఆకాంక్షల కోసం రాజకీయాల్లోకి లాగుతున్నారంటూ ఆమె ఆవేదన చెందినట్టు వార్తలొచ్చాయి. అయినా గీత పట్టించుకోలేదు. శివమొగ్గ లోక్‌సభ స్థానంలో జేడీ(ఎస్) అభ్యర్థిగా యడ్యూరప్పపై పోటీ చేశారు. ఆ ఎన్నికల్లో ఓటమితో కొంతకాలం రాజకీయాలకు దూరంగా ఉన్నారు. ఇటీవలి కర్నాటక అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్‌లో చేరారు. సోదరుడు మధు బంగారప్ప కోసం ప్రచారం చేశారు. ఇప్పుడు శివమొగ్గ నుంచి మరోసారి అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. అక్కడ రెండుసార్లు గెలిచిన సిట్టింగ్ ఎంపీ రాఘవేంద్రతో తలపడుతున్నారు. ఆయన విజయ పరంపరకు బ్రేకులు వేస్తానని ధీమాగా చెబుతున్నారు!


నీటి సమస్య పరిష్కారం తొలి ప్రాధాన్యత..

శివమొగ్గలో నీటి కొరత తీర్చడమే తన మొదటి ప్రాథమ్యమని చెబుతున్నారు గీత. ''నా సోదరుడు, ఇతర ఎమ్మెల్యేల సహకారంతో అనేక సమస్యలను పరిష్కరిస్తా. కాంగ్రెస్ పథకాలు నా విజయానికి దోహదపడతాయి. ''గెలవగానే బెంగళూరు వెళ్లిపోతానన్న బీజేపీ ఆరోపణలు అబద్ధమని నిరూపిస్తా. శివమొగ్గలో నాకు ఇల్లుంది. ఇక్కడ ఉండకుండా ఎక్కడకు పోతాను? బీజేపీ ఇకనైనా ఇలాంటి చౌకబారు ఎత్తుగడలు మాని రైతులు, వెనకబడ్డ తరగతులు, ప్రజల కష్టాలపై మాట్లాడితే బాగుంటుంది. నేనెప్పుడూ నా బాధ్యతల నుంచి వెనక్కు తగ్గలేదు. శక్తిధామ్ సంస్థను చూసుకుంటున్నట్టుగానే శివమొగ్గ ప్రజల సంక్షేమం కోసం చిత్తశుద్ధితో పని చేస్తా. క్షేత్రస్థాయిలో వారికి అందుబాటులో ఉంటా'' అని చెబుతున్నారు. భర్త శివరాజ్‌కుమార్ ప్రతిష్ట, తండ్రి బంగారప్ప మంచితనం, రాష్ట్రంలో కాంగ్రెస్ పాలన శివమొగ్గలో తనను గెలిపిస్తాయని నమ్మకముందంటున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

నేను బుద్ధదేవ్ మాట్లాడుతున్నా...!

- కమ్యూనిస్టు దిగ్గజం ఏఐ వీడియో
- ప్రచారంలో వాడుతున్న సీపీఎం



లోక్‌సభ ఎన్నికల్లో గెలవడానికి పార్టీలు ఏ చిన్న అవకాశాన్నీ వదులుకోవడం లేదు. ప్రచారం పర్వంలో కృత్రిమ మేధ (ఏఐ)తో ఇప్పటికే జోరుగా వాడుకుంటున్న విషయం తెలిసిందే. తాజాగా పశ్చిమబెంగాల్‌లో సీపీఎం కూడా ఇదే దారి పట్టింది. కొద్ది రోజుల క్రితం ఏఐ యాంకర్ 'సమత'ను ప్రచారంలోకి దింపిన ఆ పార్టీ, తాజాగా బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి, కమ్యూనిస్టు దిగ్గజం బుద్ధదేవ్ భట్టాచార్య వీడియోను కూడా అలాగే తయారు చేసింది! ఏఐ సహాయంతో సరిగ్గా మాజీ బుద్ధదేవ్ ప్రతిరూపాన్ని, వాయిస్‌ను రూపొందించింది. 2 నిమిషాల 6 సెకన్ల నిడివితో కూడిన వీడియో సందేశం సాయంతో అటు బీజేపీ, ఇటు తృణమూల్‌పై ఏకకాలంలో దాడి చేసింది. ''బెంగాల్లో ఉపాధి లేదు, మహిళలకు గౌరవం లేదు. రాష్ట్రం అవినీతికి అడ్డాగా మారుతోంది. రాష్ట్రాన్ని సుందరంగా తీర్చిదిద్దుతున్నామని, పరిశ్రమలొస్తాయని, వ్యవసాయం మెరుగుపడుతుందని, పిల్లలకు ఉద్యోగాలొస్తాయని తృణమూల్ చెప్పిన మాటలన్నీ నీటిమూటలే అయ్యాయి. అంతా అందుకు పూర్తి విరుద్ధంగా జరుగుతోంది. కేంద్రంలో బీజేపీ కూడా జనాల జీవితాలతో ఆడుకుంటోంది. నోట్ల రద్దు నుంచి మొదలుకుని కార్పొరేట్ లూటీ దాకా సర్వం కొద్ది మంది కుబేరులకు మేలు చేసే నిర్ణయాలే. తాజాగా మోదీ సర్కారు ఎన్నికల బాండ్ల అవినీతికి పాల్పడింది. దేశ ఆర్థిక వ్యవస్థ చితికిపోయింది. దేశాన్ని, రాజ్యాంగాన్ని నాశనం చేసే పనిలో పడింది. ఈ ఆటలను సాగనీయొద్దు. అందుకు మన ముందున్న మార్గం పోరాటం ఒక్కటే. ఈ పోరాటంలో గెలవాలంటే ఈ ఎన్నికల్లో లెఫ్ట్ డెమొక్రటిక్ సెక్యులర్ అభ్యర్థులనే గెలిపించండి'' అంటూ వీడియోలో బుద్ధదేవ్ విజ్ఞప్తి చేశారు!

ఇంటికే పరిమితం...

తీవ్ర శ్వాసకోశ సమస్యలతో బుద్ధదేవ్ కొంతకాలం కిందట ఆస్పత్రిలో చేరారు. కోలుకుని ఇంటికి తిరిగొచ్చిన తర్వాత బయటికి కనిపించడమే లేదు. పూర్తి విశ్రాంతిలో ఉన్నారు. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో వామపక్ష కార్యకర్తలు, మద్దతుదారుల్లో ఉత్సాహాన్ని నింపడానికి సీపీఎం ఇలా బుద్ధదేవ్‌తో కూడిన ఏఐ వీడియోను విడుదల చేయాలని నిర్ణయం తీసుకుంది. అయితే వీడియోను రూపొందించిన తరువాత బుద్ధదేవ్ కుటుంబానికి వినిపించి, వారి అనుమతితోనే సామాజిక వేదికల్లో పోస్ట్ చేసింది పార్టీ. బుద్ధదేవ్ సందేశం వామపక్ష కార్యకర్తలకు ఎంతో ఉత్తేజాన్నిస్తుందని సీపీఎం నమ్ముతోంది. అంతేకాకుండా రాష్ట్ర ఓటర్లను కూడా ఎంతగానో ప్రభావితం చేస్తుందని భావిస్తోంది.

- సాక్షి, నేషనల్ డెస్క్

పొలిటికల్ టాప్ గన్స్

రాజకీయాల్లో రాణించిన సైనికాధికారులు

వారు కదన రంగంలో శత్రువుల భరతం పట్టిన వీర సైనికులు. రెండో ఇన్నింగ్స్‌లో రాజకీయ రణరంగంలోనూ అంతే గొప్పగా రాణించారు. త్రివిధ దళాల్లో పలు హోదాల్లో దేశానికి సేవలందించిన సైనిక ఉన్నతాధికారులు ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు, ముఖ్యమంత్రులుగా చక్రం తిప్పారు. జశ్వంత్‌సింగ్, రాజేశ్ పైలట్ మొదలుకుని తాజాగా ఎయిర్ చీఫ్ మార్షల్ (రిటైర్డ్) బదౌరియా దాకా ఈ జాబితా పెద్దదే... - సాక్షి, నేషనల్ డెస్క్

జశ్వంత్ సింగ్
బహుముఖ ప్రజ్ఞాశీలి



సైనికాధికారిగా శత్రువులతో పోరాడిన జశ్వంత్ రాజకీయాల్లో చేరి రక్షణ మంత్రిగా త్రివిధ దళాలకు బాస్ అయ్యారు. 1965లో ఇండో–పాక్ యుద్ధంలో పాల్గొన్న జశ్వంత్ మేజర్ హోదాలో 1966లో పదవీ విరమణ చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. భారతీయ జనసంఘ్, ఆర్‌ఎస్‌ఎస్ సభ్యుడు. బీజేపీ ఏర్పాటులో కీలక పాత్ర పోషించారు. 1980లో బీజేపీ తరఫున తొలిసారి రాజ్యసభకు ఎన్నికయ్యారు. 2004 దాకా ఐదుసార్లు రాజ్యసభ సభ్యునిగా ఉన్నారు. 1989లో సొంత రాష్ట్రం రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ నుంచి తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో 1998 నుంచి 2004 దాకా కీలకమైన ఆర్థిక, విదేశీ వ్యవహారాలు, రక్షణ వంటి శాఖలు చూశారు. ప్రణాళిక సంఘం డిప్యూటీ చైర్మన్‌గా, రాజ్యసభలో ప్రతిపక్ష నేతగా కీలక బాధ్యతలు నిర్వర్తించారు. అత్యధిక కాలం పార్లమెంటు సభ్యునిగా కొనసాగిన కొద్దిమందిలో జశ్వంత్ ఒకరు.

రాజేశ్ ‘పైలట్’



అసలు పేరు రాజేశ్వర్ ప్రసాద్ బిధూరి. పైలట్ వృత్తినే పేరులోనే చేర్చుకుని రాజకీయాల్లో వెలుగు వెలిగారు. భారత వైమానిక దళంలో బాంబర్ పైలట్‌గా 1971 భారత్–పాక్ యుద్ధంలో పోరాడారు. స్క్వాడ్రన్ లీడర్ హోదాలో రాజీనామా చేసి రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. రాజీవ్‌కు సన్నిహితుడు. 1980లో కాంగ్రెస్ తరఫున భరత్‌పూర్ లోక్‌సభ స్థానం నుంచి ఘన విజయం సాధించారు. అప్పటి నుంచి 1999 దాకా ఎంపీగా గెలిచారు. కేంద్రంలో పలు కీలక శాఖలకు మంత్రిగా చేశారు. 2000 జూన్‌లో రోడ్డు ప్రమాదంలో దుర్మరణం పాలయ్యారు. ఆయన తనయుడు సచిన్ పైలట్ కాంగ్రెస్‌లో కీలక నేతగా కొనసాగుతున్నారు.

అమరీందర్
కెప్టెన్ టు సీఎం



కెప్టెన్ అమరీందర్ సింగ్ జవాన్ల కుటుంబం నుంచి వచ్చారు. 1965 ఇండో–పాక్ యుద్ధంలో శత్రువుకు చుక్కలు చూపించారు. కెప్టెన్ హోదాలో రిటైరైన ఆయన్ను రాజకీయాల్లోకి తీసుకొచ్చింది రాజీవ్. అమరీందర్ 1980లో తొలిసారి లోక్‌సభకు ఎన్నికయ్యారు. 1999 నుంచి 2017 దాకా మూడుసార్లు పంజాబ్ పీసీసీ చీఫ్‌గా, 2002 నుంచి 2007 దాకా సీఎంగా చేశారు. 2017లో మళ్లీ కాంగ్రెస్‌ను అధికారంలోకి తెచ్చి రెండోసారి సీఎం అయ్యారు. కాంగ్రెస్ వర్గ విభేదాలతో పార్టీకి, సీఎం పదవికి రాజీనామా చేసి సొంత పార్టీ పెట్టారు. తర్వాత దాన్ని బీజేపీలో విలీనం చేశారు.

బి.సి.ఖండూరీ
స్వర్ణ చతుర్భుజి సారథి



మిలిటరీ ఇంజనీరింగ్ కాలేజీలో ఉన్నత విద్యనభ్యసించిన భువన్ చంద్ర ఖండూరీ 1954 నుంచి 1990 దాకా భారత సైన్యంలో సేవలందించారు. ఇండియన్ ఆర్మీ చీఫ్ ఇంజనీర్ స్థాయి నుంచి ఆర్మీ ఇంజనీర్ ఇన్ చీఫ్ విభాగంలో అదనపు డైరెక్టర్ జనరల్ దాకా కీలక హోదాల్లో పని చేశారు. 1971 ఇండో–పాక్ యుద్ధంలో రెజిమెంట్ కమాండర్‌గా పోరాడారు. మేజర్ జనరల్ హోదాలో రిటైరయ్యారు. 1991లో తొలిసారి ఉత్తరాఖండ్‌లోని గఢ్వాల్ లోక్‌సభ స్థానం నుంచి నెగ్గారు. ఐదుసార్లు ఎంపీ అయ్యారు. వాజ్‌పేయి ప్రభుత్వంలో రహదారులు, హైవేల మంత్రిగా చేశారు. దేశ నలు దిక్కులను కలిపిన స్వర్ణ చతుర్భుజి హైవేల ప్రాజెక్టును దిగ్విజయంగా అమలు చేసిన ఘనత ఖండూరీదే. నిజాయితీకి మారుపేరైన ఆయన ఉత్తరాఖండ్ రాజకీయాల్లోనూ చక్రం తిప్పారు. 2007 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని విజేతగా నిలిపి సీఎం అయ్యారు.

అయూబ్ ఖాన్
వార్ హీరో




సైనికుల కుటుంబం నుంచి వచ్చిన అయూబ్ ఖాన్ 1965 ఇండో పాక్ యుద్ధంలో వీరోచితంగా పోరాడారు. భారత సైన్యంలోని 18వ సాయుధ అశ్విక దళంలో రిసాల్దార్‌గా పని చేస్తున్న అయూబ్‌ను యుద్ధంలో జమ్మూకశ్మీర్ సియాల్కోట్ సెక్టార్లో నియమించారు. పాకిస్తాన్ సైన్యం యుద్ధ ట్యాంకులతో మన జవానులను చుట్టుముడుతున్న తరుణంలో నాలుగు పాక్ యుద్ధ ట్యాంకులను ధ్వంసం చేయడంతో పాటు ఒక ట్యాంకును స్వాధీనం చేసుకుని శత్రువుకు చుక్కలు చూపించారు. ఆ యుద్ధంలో పరాక్రమానికి వీర్ చక్ర పురస్కారం అందుకున్నారు. గౌరవ కెప్టెన్ హోదా కూడా దక్కింది. 'నేను పాక్ అధ్యక్షుడు జనరల్ అయూబ్ ఖాన్‌ను కలుసుకోలేదు గానీ భారతీయ అయూబ్‌ను కలిసినందుకు గర్వంగా ఉంది' అంటూ నాటి ప్రధాని లాల్ బహదూర్ శాస్త్రి ఈ వీర సైనికున్ని హత్తుకోవడం విశేషం. 1983లో రిటైరయ్యాక అయూబ్ రాజకీయాల్లోనూ సత్తా చాటారు. నాటి ప్రధాని రాజీవ్ గాంధీ అయూబ్‌ను ఒప్పించి మరీ ఎన్నికల్లో నిలబెట్టారు. రాజస్తాన్‌లోని ఝుంఝును నుంచి ఆయన ఎంపీగా గెలిచారు. ఆ రాష్ట్రం నుంచి తొలి ముస్లిం ఎంపీగా కూడా చరిత్ర సృష్టించారు. 1991లో రెండోసారి విజయం సాధించి, పీవీ కేబినెట్లో వ్యవసాయ శాఖ సహాయ మంత్రిగా పని చేశారు.

కాండెత్
గోవా విముక్తి వీరుడు



దేశానికి 1947లో స్వాతంత్ర్యం వచ్చినా గోవాలో మాత్రం 1961 దాకా పోర్చుగీసు వలస పాలనే సాగింది. 1961లో భారత ప్రభుత్వం ఆపరేషన్ విజయ్ ద్వారా గోవాను విలీనం చేసుకుంది. ఈ కీలక సైనిక చర్యకు సారథ్యం వహించిన ధీరుడు కేరళకు చెందిన మేజర్ జనరల్ కున్హిరామన్ పాలట్ కాండెత్. తర్వాత కొంతకాలం గోవా రాష్ట్ర లెఫ్టినెంట్ గవర్నర్‌గా చేశారు. 1971 ఇండో–పాక్ యుద్ధంలో పశ్చిమ కమాండ్ సైనిక బలగాన్ని నడిపించారు. పరమ విశిష్ట సేవా మెడల్‌తో పాటు పద్మభూషణ్ పురస్కారం అందుకున్నారు. 1972లో లెఫ్టినెంట్ జనరల్‌గా రిటైరయ్యారు. 1990ల్లో బీజేపీలో చేరారు. పార్టీ ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్‌గా చేశారు.

జనరల్ వీకే సింగ్...
రాజకీయాల్లో సక్సెస్



భారత సైన్యంలో కమాండో స్థాయి నుంచి ఆర్మీ చీఫ్ అయిన తొలి వ్యక్తి జనరల్ విజయ్ కుమార్ సింగ్. 1971 ఇండో–పాక్ యుద్ధంతో సహా అనేక ఆపరేషన్లలో కీలక పాత్ర పోషించారు. 2010 నుంచి 2012 దాకా సైనిక దళాధిపతిగా చేశారు. రిటైరయ్యాక 2014లో బీజేపీలో చేరారు. స్వరాష్ట్రం యూపీలోని ఘాజియాబాద్ నుంచి ఎంపీ అయ్యారు. 2019లో రెండోసారి విజయం సాధించారు. మోదీ ప్రభుత్వంలో రెండుసార్లు మంత్రిగా చేశారు.

విష్ణు భగవత్...
గురి తప్పిన టార్పెడో



భారత నావికాదళంలో అత్యంత ప్రతిభాపాటవాలతో అత్యున్నత పదవికి చేరుకున్న అడ్మిరల్ విష్ణు భగవత్... వివాదాస్పద వ్యవహార శైలితో అపకీర్తిని కూడా మూటగట్టుకున్నారు. 1971 ఇండో–పాక్ యుద్ధంలో, పోర్చుగీస్ చెర నుంచి గోవాకు విముక్తి కల్పించిన ఆపరేషన్ విజయ్‌లో కీలక పాత్ర పోషించారు. ఎన్డీఏ ప్రభుత్వంతో విభేదాల కారణంగా 1998లో ఉద్వాసనకు గురయ్యారు. నేవీ చీఫ్‌గా ఉంటూ వేటుకు గురైన తొలి వ్యక్తి ఆయనే. క్రమశిక్షణ చర్యల్లో భాగంగా అడ్మిరల్ హోదానూ కోల్పోయారు. తర్వాత రాజకీయాల్లోకి అడుగుపెట్టి బీజేపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. బిహార్ రాజకీయాల్లో కొంతకాలం చురుగ్గా వ్యవహరించారు.

‘ఉత్తమ’ ఫైటర్



నలమాద ఉత్తమ్ కుమార్ రెడ్డి. వైమానిక దళంలో మిగ్ 21, మిగ్ 23 వంటి ఫైటర్ జెట్లు నడిపి శత్రువులపై పోరాడారు. రాజకీయాల్లోనూ రియల్ ఫైటర్‌గా కొనసాగుతున్నారు. నల్లగొండ జిల్లాకు చెందిన ఉత్తమ్ 1982 నుంచి 1991 దాకా ఎయిర్‌ఫోర్స్‌లో ఫైటర్ పైలట్‌గా చేశారు. 1994లో రాజకీయాల్లోకి అడుగుపెట్టారు. తొలి ఎన్నికల్లో కోదాడ నుంచి ఓడినా 1999లో అక్కడి నుంచే విజయఢంకా మోగించారు. మూడు దశాబ్దాల రాజకీయ జీవితంలో ఆరుసార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి నల్లగొండ ఎంపీగా, పీసీసీ అధ్యక్షునిగా, మంత్రిగా చేశారు. తాజాగా హుజూర్‌నగర్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, తెలంగాణలో తొలి కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రి అయ్యారు. ఉత్తమ్ భార్య పద్మావతి కూడా రెండుసార్లు కోదాడ ఎమ్మెల్యేగా గెలిచారు. 2016లో వచ్చిన టెర్రర్ అనే తెలుగు సినిమాలో ఆయన సీఎం పాత్ర పోషించడం విశేషం!



జేజే సింగ్...
తొలి సిక్కు ఆర్మీ చీఫ్

జోగిందర్ జశ్వంత్ సింగ్. తొలి సిక్కు ఆర్మీ జనరల్. 2005 నుంచి 2007 దాకా దేశ 21వ ఆర్మీ చీఫ్‌గా సేవలందించారు. రిటైరయ్యాక 2008లో అరుణాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా అయ్యారు. 2017లో అకాలీదళ్‌లో చేరి అసెంబ్లీ ఎన్నికల్లో కెప్టెన్ అమరీందర్ సింగ్ చేతిలో ఓడారు. 2019లో అకాలీదళ్ (తక్సలీ)లో నుంచి లోక్‌సభకు పోటీ చేసి ఓడిపోయారు. 2022లో బీజేపీలో చేరారు. వీకే సింగ్ తర్వాత కాషాయం తీర్థం పుచ్చుకున్న రెండో జనరల్‌గా నిలిచారు.

బదౌరియా...
పొలిటికల్ టేకాఫ్



రాజకీయాల్లోకి వచ్చిన తొలి వైమానిక దళపతిగా ఎయిర్ చీఫ్ మార్షల్ రాకేశ్ కుమార్ సింగ్ బదౌరియా చరిత్ర సృష్టించారు. ఎయిర్‌ఫోర్స్ ఫైటర్‌గా విధుల్లో చేరిన ఆయన 41 ఏళ్ల కెరీర్‌లో 26 రకాల ఫైటర్ జెట్స్, రవాణా విమానాలు నడిపిన విశేష ప్రతిభావంతుడు. స్వదేశీ యుద్ధ విమానం తేజస్ చీఫ్ టెస్ట్ పైలట్‌గా, ప్రాజెక్ట్ టెస్టింగ్ డైరెక్టర్‌గా కూడా వ్యవహరించారు. 2019 నుంచి 2021 దాకా ఎయిర్‌ఫోర్స్ చీఫ్‌గా చేసి రిటైరయ్యారు. ఇటీవలే బీజేపీలో చేరారు.

రాథోడ్ గురి పెడితే...
టార్గెట్ తలొంచాల్సిందే!



యుద్ధభూమి అయినా, క్రీడా మైదానమైనా ఆయన గురి పెడితే టార్గెట్ తలొంచాల్సిందే! ఆయనే కల్నల్ రాజ్యవర్ధన్ సింగ్ రాథోడ్. విశ్వ క్రీడా ప్రపంచంలో భారత్‌కు ఘన కీర్తి సాధించి పెట్టిన అభినవ అర్జునుడు. చదువులోనూ, ఆటలోనూ 'గోల్డెన్' బాయ్‌గా నిలిచిన రాథోడ్ కార్గిల్ యుద్ధంలో పోరాడారు. 2002 కామన్వెల్త్ క్రీడల్లో గోల్డ్ మెడల్ కొట్టారు. ఆ ఈవెంట్లో ఆయన నెలకొల్పిన రికార్డులు ఇప్పటికీ చెక్కుచెదరలేదు. 2004 గ్రీస్ ఒలింపిక్స్ డబుల్ ట్రాప్ ఈవెంట్లో వెండి పతకం కొట్టడంతో రాథోడ్ పేరు మారుమోగింది. ఒలింపిక్స్‌లో భారత్‌కు అదే తొలి వ్యక్తిగత వెండి పతకం! కెరీర్లో ఏకంగా 25 అంతర్జాతీయ పతకాలను సొంతం చేసుకున్నారు. 2013లో ఆర్మీ నుంచి రిటైరై బీజేపీలో చేరారు. 2014 లోక్‌సభ ఎన్నికల్లో గెలిచారు. మోదీ ప్రభుత్వంలో సమాచార, క్రీడా మంత్రిగా చేశారు. 2019లోనూ ఎంపీగా గెలిచారు. 2023లో రాజస్తాన్ ఎన్నికల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించి రాష్ట్ర క్రీడా శాఖ మంత్రిగా ఉన్నారు.

కళ్లు గద్దెపై.. బుద్ధి భూమిలో



ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్‌పై బరితెగించి అబద్ధాలు

- ➤ లేని వ్యక్తులకు అన్యాయం జరిగిందంటూ రామోజీ ఆక్రోశం
- ➤ కల్పిత పాత్రలను సృష్టించి, ఏదో జరిగిపోయిందని ఆక్రందన
- ➤ రిజిస్టరే లేనపుడు అందులో కొందరి పేర్లు లేకపోవటం సాధ్యమా?
- ➤ చట్టం దేవుడెరుగు... చట్టానికి సంబంధించిన రూల్సే రాలేదని తెలీదా?
- ➤ రూల్స్ వచ్చాక.. వాటిపై సమగ్ర చర్చ జరిగిన తరవాతే తుది రూపు
- ➤ పైపెచ్చు రీసర్వే పూర్తయ్యాకే ఈ చట్టాన్ని అమలు చేయటం సాధ్యం
- ➤ ఇప్పటికి 4 వేల గ్రామాల్లోనే రీ సర్వే పూర్తి.. ఇంకా 13 వేల గ్రామాల్లో పెండింగ్
- ➤ అది పూర్తయి.. రూల్స్ ఖరారయ్యాక కదా చట్టం అమలు గురించి మాట్లాడేది..
- ➤ అయినా అన్ని రాష్ట్రాలనూ అమలు చేయమంటున్నది కేంద్రమే కదా!
- ➤ అన్ని రాష్ట్రాలూ అమలు చేస్తేనే... ఇక్కడా చేస్తామని చెబుతున్న రాష్ట్రం
- ➤ మోదీ ముందు తల ఊపి.. బయట మాత్రం విష ప్రచారం చేస్తున్న బాబు
- ➤ బాబునెవరూ నమ్మటం లేదని గ్రహించి... మారీచుడి పాత్రలోకి రామోజీ
- ➤ జనాన్ని భయపెట్టడానికి అబద్ధాలే అస్త్రాలుగా మాయా యుద్ధం
- ➤ పోలింగ్ వరకూ ఈ ఒక్క అంశంమీదే మాట్లాడాలని 'ఎల్లో' తాఖీదు
- ➤ మిగతావన్నీ పక్కనబెట్టి విస్తృతంగా విష ప్రచారం చేస్తున్న పచ్చ మంద

సాంబశివుడు.. గోవిందరెడ్డి.. సుబ్బారావు.. ఎవరు వీళ్లంతా?

రామోజీరావు రహస్య సంతానమా? లేకపోతే చంద్రబాబు దత్తపుత్రులా? లేని పేర్లను సృష్టించి.. లేని రిజిస్టరులో వీళ్ల పేర్లు వివాదంలో చిక్కుకున్నట్లుగా రాసి పారేసి... లేని చట్టాన్ని అమల్లో ఉన్నట్టుగా చూపిస్తూ రాష్ట్ర ప్రజలను భయభ్రాంతుల్ని చేసిన 'ఈనాడు'ను ఏమనుకోవాలి? రాష్ట్రాన్ని రాచపుండులా పీడిస్తున్న రామోజీరావు తన చంద్రబాబు కోసం ఇంకెంత దిగజారుతారు? అసలు అమల్లోకే రాని 'ల్యాండ్ టైట్లింగ్ చట్టం' గురించి ఎందుకు జనాన్నింతలా భయపెడుతున్నారు? జనం గనక మాకు వద్దంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఏ చట్టాన్నయినా తెస్తుందా? అలా తెచ్చిన దాఖలా ఒక్కటయినా ఉందా?

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి : కేంద్రంలో అధికారంలో ఉన్న నరేంద్ర మోదీ ప్రభుత్వం ఖరారు చేసిన చట్టం ఈ 'ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్'. దీన్ని అన్ని రాష్ట్రాలూ అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వ నోడల్ ఏజెన్సీ 'నీతీ ఆయోగ్' అన్ని రాష్ట్రాలకూ పంపితే.. ప్రజలకు మేలు జరుగుతుందన్న ఉద్దేశంతో రాష్ట్రం కూడా ఆ దిశగా అడుగులు వేసి ముసాయిదా చట్టాన్ని చేసింది. కానీ ఈ చట్టానికి సంబంధించిన రూల్స్ ఏవీ ఇప్పటిదాకా విడుదల కాలేదు. అంటే ఈ చట్టం కింద టైటిల్ రిజిస్టరు ఎలా ఉంటుంది? టైటిల్ రిజిస్ట్రారుగా ఎవరిని నియమించాలి? రెవెన్యూ అధికారులనా... లేకపోతే న్యాయ వ్యవస్థ నుంచి జ్యుడీషియల్ అధికారులనా? ఇలా ఈ చట్టం అమలుకు సంబంధించి ఉండే సమగ్ర నియమ నిబంధనలేవీ ఇంకా రూపు దిద్దుకోనేలేదు. ఈ రూల్స్ విడుదలయ్యాక వీటిపై గ్రామ స్థాయి నుంచి సభలు నిర్వహించి.. ప్రజల అభ్యంతరాలను, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని తుది నియమాలు (రూల్స్) రూపొందిస్తారు. ఆ రూల్స్‌కు లోబడే చట్టాన్ని అమలు చేస్తారు. ఇవేవీ జరగకుండానే... చట్టం అమలయిపోతున్నట్లుగా, ప్రభుత్వం భూములు లాక్కుంటోందంటూ జనాన్ని భయభ్రాంతులకు గురిచేయటం ఎంత దుర్మార్గం రామోజీరావ్? అందుకే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతి సందర్భంలోనూ ఒక మాటంటూ ఉంటారు. తాను పోరాడుతున్నది మాయా యుద్ధం చేసే మారీచులతోనని. ఈ ఎల్లో ముఠా అధికారం కోసం ఏ స్థాయికైనా దిగజారుతుందని, ఎంతటి విపత్తులనైనా సృష్టిస్తుందని. నారా వారిని ఎలాగైనా గద్దెనెక్కించాలని మాయా యుద్ధం చేస్తున్న 'ఈనాడు' బుద్ధి... అందుకే ఇపుడు భూ మార్గం పట్టింది.

మూడేళ్ల కిందట కేంద్రం ఈ చట్టాన్ని ఆమోదించి అన్ని రాష్ట్రాలకూ పంపిన తర్వాత.. నీతీ ఆయోగ్ మార్గదర్శకాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం ముసాయిదా చట్టానికి రూపకల్పన చేయటంతో పాటు.. రాష్ట్రంలోని గ్రామాల్లో రీ సర్వే చేపట్టింది. నిజానికి వందేళ్ల కిందట ఎప్పుడో బ్రిటిష్ ప్రభుత్వం చేపట్టిన సర్వే తప్ప.. నాటి నుంచి నేటి వరకు ఏ ప్రభుత్వమూ భూముల సమగ్ర సర్వే చేపట్టలేదు. కొత్తగా సర్వేయర్లను నియమించి.. రాష్ట్ర రెవెన్యూ యంత్రాంగాన్ని మొత్తాన్ని మోహరించి రాష్ట్ర ప్రభుత్వం ఈ రీ సర్వే యజ్ఞానికి శ్రీకారం చుట్టింది. కేంద్ర ప్రభుత్వ సర్వే ఆఫ్ ఇండియాకు చెందిన సర్వే జనరల్ సైతం రాష్ట్రానికి వచ్చి రీ సర్వే చేస్తున్న తీరును ప్రశంసించారు. ఈ రీ సర్వే చేస్తూ... కింది స్థాయిలో పరిష్కారమయ్యే చిన్న చిన్న వివాదాల కోసం

చట్టం రావాలంటే సర్వే పూర్తి కావాలి..

మొబైల్ న్యాయ స్థానాలను కూడా ఏర్పాటు చేశారు. రెండేళ్లుగా సాగుతున్న ఈ ప్రయత్నం వల్ల ఇప్పటికి 4 వేల గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. మరో 2 వేల గ్రామాల్లో తుది దశలో ఉంది. కాకపోతే రాష్ట్రంలో మొత్తం 17 వేల గ్రామాలున్నాయి. ఇంకా 11 వేల గ్రామాల్లో రీసర్వే మొదలు కావాల్సి ఉంది. మొత్తం అన్ని గ్రామాల్లోనూ రీసర్వే పూర్తయ్యాక వివాదాలు లేని భూములకు సంబంధించి వాటి యజమానులకు హక్కు పత్రాలు అందజేస్తారు. ఆ హక్కు దారుల వివరాలే చివర్లో టైటిల్ రిజిస్టరులో ఉంటాయి. ప్రజలంతా అంగీకరించి.. ప్రభుత్వం గనక ముందుకు వెళితే ఈ సుదీర్ఘ ప్రక్రియ పూర్తవటానికి కొన్నేళ్లు పడుతుంది. దేశంలోని అన్ని రాష్ట్రాలూ ఈ దిశగా ప్రయత్నాలు చేస్తున్నాయి కనక... మిగతా రాష్ట్రాలు కూడా రీ సర్వేలు పూర్తి చేసి, ఈ చట్టాన్ని అమల్లోకి తెస్తే.. అప్పుడు దేశ వ్యాప్తంగా ఒకే టైటిల్ రిజిస్టరు నిర్వహించడానికి వీలవుతుంది. కేంద్రం ఆశిస్తున్నది అదే. దీనివల్ల దేశంలో ఎక్కడ నుంచి ఎక్కడి భూమినయినా కొనుగోలు చేయొచ్చు. ఢిల్లీలో భూమి కొనుగోలు చేసినా విజయవాడ రిజిస్టరు కార్యాలయంలోనే దాన్ని రిజిస్టరు చేసుకోవచ్చు. పైపెచ్చు ఒక భూమిని ఎక్కడ ఎవరు కొనుగోలు చేసినా... విక్రయించినా, లేక ఆ భూమిపై ఎక్కడ రుణం తీసుకున్నా ఆ వివరాలన్నీ టైటిల్ రిజిస్టరులో నమోదవుతాయి. కాబట్టి రుణం వంటి వివరాలు దాచి మరొకరి దగ్గర రుణాలు తీసుకునే అవకాశం ఉండదు. ఇదిగో ఇలాంటిది వ్యవస్థ ఇంకా అమల్లోకి రాలేదు కనకనే సుజనా చౌదరి లాంటి వ్యక్తులు పారిశ్రామిక వేత్తల ముసుగులో ఒకే పరిశ్రమకు సంబంధించిన భూముల్ని పలు ఆర్థిక సంస్థల దగ్గర తనఖా పెట్టి రుణాలు తీసుకున్నారు. చివరకు బ్యాంకుల్ని ముంచేశారు. ఇప్పుడేమో తాను ఆ వ్యాపారాల నుంచి తప్పుకున్నానని, తనకేమీ సంబంధం లేదని శుద్ధపూస కబుర్లు చెబుతున్నారు.

సమగ్రంగా రీ సర్వే జరిపి... వివాదాలేవీ లేవని తేల్చిన మీదట ఆ భూములకు టైటిల్ పత్రాలిస్తారు కనక.. అక్కడి నుంచి ఆ టైటిల్‌కు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది. ఒకవేళ ప్రభుత్వం టైటిల్ ఇచ్చాక కూడా ఆ భూమి అసైన్డ్ అనో, డీ పట్టా అనో వివాదం గనక తలెత్తితే ఆ టైటిల్ దారుకు ప్రభుత్వం

టైటిల్‌కు ప్రభుత్వమే గ్యారంటీ


పూర్తి నష్టపరిహారం చెల్లిస్తుంది. ఈ మేరకు ప్రభుత్వమే ఆయా భూములకు బీమా చేస్తుంది. బీమా సొమ్మును టైటిల్ దారుకు చెల్లిస్తుంది. ఈ నిబంధన వల్ల ప్రజలకు మేలు జరుగుతుంది కాబట్టే ఈ చట్టం విషయంలో ముందుకు అడుగులు వేయాలని కేంద్రం అన్ని రాష్ట్రాలకూ చెబుతోంది.

మోదీతో చెప్పించగలవా బాబూ?

ఈ చట్టం వల్ల ప్రజలకు హాని జరుగుతుందని, ఈ చట్టం ద్వారా ప్రభుత్వం భూములు లాక్కుంటుందని చంద్రబాబు ముఠా, ఎల్లో మీడియా ఉధృతంగా విష ప్రచారం చేస్తున్నాయి. పత్రికల్లో కథనాలు రాయించటంతో పాటు పనికిమాలిన వ్యక్తులకు లాయర్ల కోటు తొడిగి నిపుణుల ముసుగులో ఎల్లో చానెళ్లలో మాట్లాడిస్తోంది. సోషల్ మీడియాలో అబద్ధాలను జోరుగా వైరల్ చేస్తోంది. వీటిలో ఏ ఒక్క శాతం నిజం ఉన్నా.. ఈ చట్టం కేంద్రానిది కనుక ఆ విషయాన్ని ప్రధాని నరేంద్ర మోదీతో చెప్పగలవా చంద్రబాబూ? ఈ చట్టం వల్ల ప్రజలకు హాని జరుగుతుందని, కాబట్టి దీన్ని తాము వెనక్కి తీసుకుంటున్నామని మోదీతో చెప్పించగలవా? మరి అవేవీ చెయ్యలేనపుడు ఎందుకీ విష ప్రచారం? ఎందుకు బీజేపీతో కలిసి పోటీ చేయటం? కేంద్రంలో అధికారంలో ఉన్న పార్టీతో కూటమి గట్టడమెందుకు? వారు చేస్తున్న చట్టం ప్రజలకు మేలు చేసేది కాదని, దాన్ని తెలుగుదేశం అంగీకరించదని నేరుగా చెప్పలేని నీ బతుకెందుకు? అబద్ధాల పునాదులపై నిర్మించుకున్న నీ రాజకీయ కోట పునాదులతో సహా పేలిపోయే రోజు అతి దగ్గరలోనే కనిపించటం లేదా!




మహారాష్ట్ర ప్రభుత్వం చేసిన సూచనను పరిగణనలోకి తీసుకుంటూ... నీతి ఆయోగ్ జారీ చేసిన మరో సర్క్యులర్



ల్యాండ్ టైట్లింగ్ మార్గదర్శకాల కోసం జాతీయ స్థాయి కమిటీ వేస్తూ నీతి ఆయోగ్ 2019లో ఇచ్చిన మెమో


గుసగుస

మర్చిపోతేగా..!



మీరు మర్చిపోయినా.. గూగుల్ మర్చిపోదుగా.. ఇట్టా నొక్కితే అట్టా వచ్చేస్తది.. అంటున్నారు ఉద్యోగులు. అప్పుడు ఏం జరిగిందో.. అంటూ చంద్రబాబు రాసిన లేఖ ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీస్తోంది. బాబు పాలనలో ఉద్యోగులకు జరిగిన అవమానాలు మర్చి పోతే కదా.. అంటూ ఎదురు ప్రశ్నిస్తున్నారు. జన్మభూమి కమి టీల వేధింపులు, అప్రంటీస్ విధానం, ప్రజల వద్ద కు పాలన పేరిట ఉద్యోగులపై జరిగిన దాడులను సోషల్ మీడియా సాక్షిగా గుర్తు చేసుకుంటున్నారు. అనంతపురంలో సబ్జెక్టు టీచర్లు లేకుండా శత శాతం ఉత్తీర్ణ సాధ్యం కాదన్నందుకు హెచ్ఎంనే సస్పెండ్ చేశారు అప్పటి సీఎం చంద్రబాబు. మరుగుదొడ్లు లేక విద్యార్థులు ఇళ్లకు వెళ్లిన దౌర్భాగ్యపు రోజుల్ని మర్చిపోలేదంటూ మహిళా టీచర్లు సోషల్ మీడియాలో ఏకిపారేస్తున్నారు.

ముందే చెప్పేశారు?



పిఠాపురంలో తాను నివాసం ఉండేది లేదని జనసేన అధ్యక్షుడు పవన్‌కల్యాణ్ తేల్చిపారేశారు. కుప్పంలో చంద్రబాబు, హిందూపురంలో బాలయ్య ఆ నియోజకవర్గాల్లో ఉన్నది లేదు. వారి అనుచరులు, పీఏలే దందా నడుపుతున్నారు. వారు గెలిచాక తమ నియోజకవర్గాల్ని అనుచరులకు అప్పగిస్తే.. వారిని ఆదర్శంగా తీసుకున్న పవన్ ఒక అడుగు ముందుకేసి మరీ, పిఠాపురాన్ని ఎన్నికలకు ముందుగానే వదిలేశారు. తన సోదరుడు నాగబాబుకు అప్పగించేశారు. అందులో భాగంగానే నాగబాబు తనయుడు హీరో వరుణ్‌తేజ్ పిఠాపురం ప్రచారానికి వచ్చారు. ఇపుడు నాగబాబు వంతు. రెండు రోజులుగా వర్మను వెంటబెట్టుకుని మరీ ప్రచా రం చేస్తున్నారు. దీంతో పిఠాపురం ప్రజలు స్థానికురాలైన వైఎస్సార్ సీపీ అభ్యర్థి వంగా గీత గెలుపు ఖరారైనట్లే అంటున్నారు.

అవన్నీ అపోహలే

మేకల కళ్యాణ్ చక్రవర్తి,
సాక్షి ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్



ల్యాండ్ టైట్లింగ్ చట్టంతో భూములకు మరింత రక్షణ

- ఈ చట్టం అమల్లోకి వస్తే భూములు, ఆస్తులకు ప్రభుత్వమే గ్యారంటీ ఇస్తుంది
- అన్ని పత్రాలూ యజమానుల వద్దే ఉంటాయి.. ప్రభుత్వం వద్ద కేవలం రికార్డులే
- ఈ చట్టం కోర్టు ద్వారాలు మూసేయదు.. కోర్టులకు వెళ్లే అవసరమే లేకుండా చేస్తుంది
- హక్కుల నిరూపణకు ఇప్పుడున్న చట్టాలు అంతిమ సాక్ష్యాలు కావు
- అందుకే ఈ చట్టం అవసరమవుతోంది

మరిన్ని వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో భూచట్టాల నిపుణుడు, నల్సార్ ప్రొఫెసర్ ఎం. సునీల్‌కుమార్

రాష్ట్రంలో వ్యవసాయ భూములు, వ్యవసాయేతర ఆస్తులకు ఏపీ ల్యాండ్ టైట్లింగ్ చట్టం -2023 ద్వారా మరింత రక్షణ లభిస్తుందని భూచట్టాల నిపుణులు, నల్సార్ విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ ఎం.సునీల్ కుమార్(భూమి సునీల్) స్పష్టం చేశారు. ఈ చట్టంపై ఉన్న అపోహలు, అనుమానాలు సత్యదూరమైనవన్నారు. ఈ చట్టం వస్తే ఆంధ్రప్రదేశ్‌లోని భూములకు గ్యారంటీ లభిస్తుందన్నారు. ఈ గ్యారంటీకి ప్రభుత్వం సర్టిఫికెట్ ఇస్తుందని తెలిపారు. ఈ చట్టం భూముల రక్షణ కోసమే కానీ భక్షణ కోసం కాదని తేల్చిచెప్పారు. రాష్ట్రంలోని ప్రతి భూ యజమానికి హక్కుల గ్యారంటీ పత్రం వస్తే ఎక్కడెక్కడో ఉన్నవాళ్లు కూడా ఆంధ్రప్రదేశ్‌లో భూములు కొంటారన్నారు. దీంతో పెట్టుబడులు పెరుగుతాయని, నేరాలు తగ్గుతాయని చెప్పారు. ఈ చట్టం కోర్టు ద్వారాలు మూయడం లేదని, ఆ కోర్టులకు వెళ్లే అవసరమే లేకుండా చేస్తుందన్నారు. నలభై ఏళ్లుగా ఎలాంటి చట్టం రావాలని ఆశించామో, భూహక్కులకు ఎలాంటి భద్రత కలగాలని అనుకున్నామో అలాంటి చట్టం ల్యాండ్ టైట్లింగ్ చట్టమని తెలిపారు. ఎవరూ చేయలేకపోయిన ఈ చట్టం కేవలం సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ధైర్యం కారణంగానే అమల్లోకి వస్తోందన్నారు. ఇలాంటి చట్టాన్ని తేవాలని 1908లో రిజిస్ట్రేషన్ల చట్టం, 1971లో రికార్డ్ ఆఫ్ రైట్స్ (ఆర్ఓఆర్) చట్టం రూపొందిస్తున్నప్పుడే అనుకున్నారన్నారు. ఈ మేరకు సునీల్ కుమార్ 'సాక్షి' ప్రత్యేక ఇంటర్వ్యూలో ల్యాండ్ టైట్లింగ్ చట్టానికి సంబంధించి అనేక అనుమానాలను నివృత్తి చేశారు.

ప్రశ్న: ప్రజల ఆస్తులు లాక్కోవడానికే ప్రభుత్వం ఈ కొత్త చట్టాన్ని తెచ్చిందా?

సునీల్: ఈ చట్టం లక్ష్యమే ఆస్తులు లేదా భూములకు రక్షణ కల్పించడం, ప్రభుత్వం తరఫున గ్యారంటీ సర్టిఫికెట్ ఇవ్వడం. ఏదైనా తేడా వస్తే సదరు ఆస్తి లేదా భూమికి పరిహారం చెల్లించడం. లాక్కోవడం, లాక్కోవాలనుకోవడం ఈ చట్టం ద్వారానే కష్టమవుతుంది. అలాంటి ఆటలు ఈ చట్టంతో సాగవు.

ప్రశ్న: భూహక్కులకు సంబంధించి వందల చట్టాలు అమల్లో ఉండగా ఈ కొత్త చట్టం ఎందుకు?

సునీల్: భూరికార్డులకు సంబంధించి ఆంధ్రప్రదేశ్‌లో ఇప్పటికే 124 చట్టాలు అమల్లో ఉన్నాయి. ఈ చట్టాలేవీ ఇవ్వని భరోసా కొత్త చట్టం ఇస్తుంది. ఆర్ఓఆర్ చట్టం ద్వారా కేవలం రికార్డు మాత్రమే ఉంటుంది. ఆ రికార్డు ద్వారా సంక్రమించే హక్కులకు గ్యారంటీ ఉండదు. కానీ కొత్త చట్టం హక్కులకు గ్యారంటీ ఇస్తుంది.

ప్రశ్న: కొత్త చట్టం అమల్లోకి వస్తే భూముల యాజమాన్య పత్రాలు ప్రభుత్వం వద్దే ఉంటాయా?

సునీల్: ఇప్పటివరకు రైతుల చేతుల్లో భూమికి సంబంధించిన పాస్ పుస్తకం మాత్రమే ఉంది. ప్రభుత్వం చేతిలో ఆ భూమి రికార్డులు, సాగు వివరాలతో కూడిన అడంగల్ ఉన్నాయి. ప్రస్తుతం భూములకు సంబంధించి 40 రకాల రిజిస్టర్లు ఉన్నాయి. కొత్త చట్టం అమల్లోకి వస్తే ఒక్కటే రిజిస్టర్ ప్రభుత్వం దగ్గరే ఉంటుంది. ఈ రికార్డులుండే రిజిస్టర్‌కు అదనంగా ప్రభుత్వం యజమానులకు గ్యారంటీ సర్టిఫికెట్, యాజమాన్య పత్రం అందజేస్తుంది. భూమికి సంబంధించిన అన్ని అసలు పత్రాలను యజమానులకే ఇస్తుంది.

ప్రశ్న: కొత్త చట్టం అమల్లోకి వస్తే భూతగాదాల పరిష్కారం కోసం కోర్టులకు వెళ్లే అవకాశం ఉండదా?

సునీల్: ఇప్పుడున్న విధానం ప్రకారం రికార్డుల్లో పొరపాట్లను రెవెన్యూ అధికారులే సరిదిద్దుతారు. యాజమాన్య వివాదాల కోసం మాత్రమే సివిల్ కోర్టులకు వెళుతున్నారు. కొత్త చట్టం వచ్చాక కూడా రెవెన్యూ రికార్డుల్లో మార్పుల కోసం జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఫోరంకు వెళ్లొచ్చు. యాజమాన్య వివాదాలుంటే హైకోర్టుకెళ్లొచ్చు.

ప్రశ్న: కోర్టుల్లో కేసులు వేసేందుకు టీఆర్ఓకు సమాచారమివ్వాలా?

సునీల్: ఈ చట్టం కోర్టు ద్వారాలు మూయడం లేదు. అసలు కోర్టులకు వెళ్లే అవసరమే లేకుండా చేస్తోంది. ఒకవేళ కోర్టులకు వెళ్లినా ఏళ్లతరబడి జాప్యం జరగదు. రికార్డులన్నీ పకడ్బందీగా ఉంటాయి. యాజమాన్య హక్కులకు ప్రభుత్వం గ్యారంటీ ఇస్తుంది కాబట్టి కేసులు కూడా త్వరగా పరిష్కారమవుతాయి. ఒకవేళ ప్రభుత్వం ఇచ్చిన గ్యారంటీ తప్పయితే సదరు రైతుకు పరిహారం లభిస్తుంది.

ప్రశ్న: ప్రభుత్వం కొత్తగా జారీ చేస్తున్న పాస్ పుస్తకాలపై ముఖ్యమంత్రి బొమ్మ ముద్రించకూడదా?

సునీల్: కొత్త పాస్ పుస్తకాలను ప్రభుత్వం గ్యారంటీతో ఇస్తుంది. ఈ పుస్తకాల ద్వారా రైతు లేదా భూ యజమానికి పంట సాయం వస్తుంది. సబ్సిడీలు.. బ్యాంకుల ద్వారా రుణాలొస్తాయి. పరిహారం వస్తుంది. భూముల అమ్మకాలు, కొనుగోళ్లకు ఇదే పుస్తకం ఆధారం. చాలా ప్రభుత్వ పథకాల అమలు సందర్భంగా ముఖ్యమంత్రులు, ప్రధానమంత్రుల బొమ్మలు పెడుతుంటారు. కరోనా వ్యాక్సినేషన్ సర్టిఫికెట్ల మీద ప్రధాని బొమ్మ ముద్రించారు. ముఖ్యమంత్రి బొమ్మ ఉన్నంత మాత్రాన ఏమీ జరగదు.

ప్రశ్న: ఇది కేంద్ర చట్టమా? రాష్ట్ర ప్రభుత్వ చట్టమా?

సునీల్: ల్యాండ్ టైట్లింగ్ చట్టం కోసం 1987లో ప్రొఫెసర్ డి.సి.వాధ్వా ఏకసభ్య కమిషన్‌ను ప్రణాళికా సంఘం నియమించింది. ఈ కమిటీ 1989లో టైటిల్ గ్యారంటీ చట్టం అమలును సిఫారసు చేస్తూ నివేదిక ఇచ్చింది. ఆ తర్వాత 2008లో కేంద్రం ఈ విధానాన్ని అమల్లోకి తేవాలని నిర్ణయించింది. 2008, 2011, 2015, 2019లో నాలుగుసార్లు ఇందుకు సంబంధించిన ముసాయిదా చట్టాన్ని రాష్ట్రాలకు పంపారు. 2019లో నీతి ఆయోగ్ కమిటీ కొత్త ముసాయిదాను రాష్ట్రాలకు పంపింది. ఈ చట్టాన్నయినా లేదంటే మహారాష్ట్రలో అమల్లో ఉన్న చట్టాన్నయినా, లేదంటే ఆయా రాష్ట్రాల అవసరాలకు అనుగుణంగా ఈ చట్టాల్లో మార్పులు చేసుకుని కొత్త చట్టం చేసుకోవాలని సూచించింది.

ప్రశ్న: కొత్త చట్టం ఆంధ్రప్రదేశ్‌లో అమల్లోకి వచ్చిందా?

సునీల్: ఇంకా అమల్లోకి పూర్తిస్థాయిలో రాలేదు. చట్టం అమల్లోకి తెస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇందుకు సంబంధించిన నిబంధనలు తయారు కావాలి. ఆ తర్వాతే అమల్లోకి వస్తుంది.

ప్రశ్న: కొత్త చట్టం వల్ల రైతులకు జరిగే మేలు ఏమిటి?

సునీల్: ల్యాండ్ టైట్లింగ్ చట్టం ద్వారా భూముల హక్కులపై స్పష్టత, భద్రత, భరోసా వస్తాయి. సమస్యల పరిష్కారం, లావాదేవీల బదలాయింపు సులభమవుతుంది. ఇప్పుడు ఉన్న రికార్డులు, చట్టాలు హక్కుల నిరూపణలకు అంతిమ సాక్ష్యాలు కావు. ఇవన్నీ తెచ్చే ప్రయత్నంలో భాగంగా కొత్త చట్టం వచ్చింది. ఇది తప్పకుండా రైతులకు మేలు చేసే చట్టమే. ఈ చట్టం అమలులో ఇబ్బందులను అధిగమించగలిగితే ఏపీలోని ప్రతి రైతుకు మేలు జరుగుతుంది. ప్రతి భూమికి, ఆస్తికి రక్షణ లభిస్తుంది.

ప్రశ్న: కొత్త చట్టం అమల్లోకి వచ్చాక రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ఎలాంటి మార్పులు వస్తాయి?

సునీల్: భూ రిజిస్ట్రేషన్ల వ్యవస్థలో ఈ చట్టం ద్వారా ప్రధాన మార్పులు వస్తాయి. ఇప్పటివరకు స్టాంపు కాగితాలు మాత్రమే ఉండేవి. కానీ ఇప్పుడు అత్యంత భద్రతతో ప్రభుత్వ గ్యారంటీతో కూడిన డాక్యుమెంట్లు వస్తాయి. హక్కులను కూడా టీఆర్ఓనే బదలాయిస్తారు కాబట్టి మ్యుటేషన్ అవసరముండదు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇప్పటివరకు డీడ్స్ రిజిస్ట్రేషన్ జరగ్గా ఇక నుంచి టైటిల్ రిజిస్ట్రేషన్ జరుగుతుంది.

మానవత్వానికి మరోపేరు



- అవసానదశలో అవ్వాతాతలను ఆదుకున్న నాయకుడు
- ప్రభుత్వ పాఠశాలలు ఆధునికంగా మారింది ఇక్కడే
- ఇంగ్లిష్ మీడియం విద్యను అందిస్తున్న ఘనత మనదే
- సాక్షి ఇంటర్వ్యూలో సినీ కథా రచయిత చిన్నికృష్ణ



'వృద్ధాప్యంలో ఉన్నవారికి రవ్వంత ఆసరా కల్పించడం... రోజువారీ పనులు చేసుకునేవారి ఇంటికే రేషన్ అందివ్వడం... బీదా బిక్కిలి చదువుకునే ప్రభుత్వ పాఠశాలలు ఆధునికంగా అభివృద్ధి చేయడం... ఇలాంటి సంస్కరణలు చేయాలంటే కచ్చితంగా మానవత్వం ఉండాలి. అలాంటి లక్షణాలున్న నాయకుడు, పాలన ఏపీలో ఉంది' అని ప్రముఖ సినీ కథా రచయిత చిన్నికృష్ణ అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం తాను బీజేపీలో ఉన్నాననీ, తాను నిత్యం స్మరించేది అభిమానించేది ప్రధాని నరేంద్రమోదీనేననీ... కానీ ఏపీలో అమలవుతున్న సంక్షేమ కార్యక్రమాలు తనను ఎంతగానో ఆకట్టుకున్నాయని చెప్పారు. నర్సింహ నాయుడు, ఇంద్ర, బద్రీనాథ్, రజనీకాంత్ నటించిన నరసింహ... తదితర బ్లాక్ బస్టర్ చిత్రాలకు కథలు అందించిన స్టార్ స్టోరీ రైటర్ అయిన ఆయన సాక్షితో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

-సత్యార్థ్

ఇంటిదగ్గరకే పింఛన్ సరైన నిర్ణయం

జీవితపు చరమాంకంలోని అవ్వా తాతలకు రూ. 3వేలు పింఛన్ ఇవ్వాలి. అంతేకాదు ఆ డబ్బు కో సం వారు ఎవరి కాళ్లు పట్టుకోవాల్సిన అవసరం రాకూడదు. దర్జాగా ఇంటి దగ్గరే కూర్చునే తీసుకోవాలి. ఇలాంటి గొప్ప ఆలోచన రావాలంటే నాయకత్వం వహించడం తెలిస్తే చాలదు ఆ నేతకు మానవత్వం కూడా ఉండాలి. ఎర్రటి ఎండలో గంటల తరబడి క్యూలో నిల్చుని రేషన్ సరుకులు తీసుకునే బీదా బిక్కికి ఆ బాధ తప్పించి ఇంటికే రేషన్ పంపించాలనే ఆలోచన చే యాలంటే అది కేవలం మానవత్వం ఉన్న నా యకుడికే సాధ్యం. అలాంటి నాయకుడు జగన్.

పేదల చదువులు మారాయి

మేమూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకున్నవాళ్లమే. చెట్ల కింద కూర్చుని మట్టి అంటుకున్న బట్టలు, చేతులతోనే అన్నం తినేవాళ్లం. అప్పటి మా క్లాస్‌మేట్స్ అయిన ఆడపిల్లల బాధలైతే వర్ణనాతీతంగా ఉండేవి. సరిపడా మరుగుదొడ్లు లేక... ఉన్నా తలుపులు విరిగిపోయి... దయనీయంగా ఉండేవి. అలాంటి సర్కారు బడులను సంస్కరించాలి. కొత్త వెలుగులు అద్దాలి, పేద పిల్లలకు ప్రపంచస్థాయిలో నిలిచి గెలిచేందుకు ఇంగ్లిష్ మీడియం చదువులు అందించాలి, నిరుపేద చిన్నారులు భవిష్యత్తులో గెలవడానికి మంచి చదువుతో పాటు వర్తమానంలో బాగుండడానికి మంచి భోజనం కూడా అందించాలి అనే ఆలోచన రావాలంటే చదువు విలువ తెలిసి ఉంటే మాత్రమే చాలదు. మానవత్వంతో కూడిన మనసున్న నాయకుడై ఉండాలి.

విపత్తులోనూ విజయవంతంగా

కోవిడ్ సమయంలో ప్రపంచమే అతలాకుతలమైంది. అలాంటి విపత్కర పరిస్థితుల్లోనూ రాష్ట్రం ఎన్నో విధాలుగా ప్రజలకు అండగా నిలిచింది. పరీక్షల నుంచి వైద్యం దాకా దేశంలో మిగిలిన రాష్ట్రాల కన్నా ముందంజలో నిలిచింది. సంక్షేమ పథకాలు కొనసాగించారు. ఇలాంటి వన్నీ పాలకుడి సామర్థ్యానికి నిదర్శనాలు. ప్రజలకు మానవత్వం ఉన్న గొప్ప నేతలెవరో వేరేగా చెప్పాలా?

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
ఆదివారం ॥ 5-5-2024


ప్రజాక్తా కోలి


కుష కపిల


ప్రశస్తి సింగ్

మీ నవ్వుల చల్లదనాన్ని మంచుకొండ అప్పడిగింది...


నేడు ప్రపంచ నవ్వుల దినోత్సవం

ఒకరు జోక్ వేస్తే నవ్వడం చాలా ఈజీ. నవ్వించడం మాత్రం నవ్వినంత ఈజీ కాదు. టోటల్‌గా చెప్పొచ్చేదేమిటంటే... నవ్వించడం అనేది అత్యంత కష్టతరమైన టాస్క్. ఈ నవ్వుల మహారాణులు మాత్రం అవలీలగా నవ్వులు పూయిస్తూ సోషల్ మీడియాలో లక్షలాది మంది అభిమానులను సంపాదించుకున్నారు.

నిఫ్ట్ గ్రాడ్యుయేట్ అయిన కుష కపిల బిల్లీ మసి, సౌత్ దిల్లీ గర్ల్స్‌లాంటి క్యారెక్టర్లతో నవ్వుల వర్షం కురిపిస్తోంది. ఆమెకు 1.6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. నిత్యజీవిత సంఘటనల ఆధారంగా దిల్లీకి చెందిన డాలీసింగ్ కామెడీనీ మేడ్ ఈజీ చేసింది. ముంబైకి చెందిన ప్రజక్తా కోలి కామెడీ వీడియోలు మోస్ట్ పాపులర్ అయ్యాయి. అబ్జర్వేషనల్ కామెడీకి ఆమె వీడియోలు అద్దం పడతాయి. కోలికి యూట్యూబ్‌లో 6 మిలియన్‌ల ఫాలోవర్‌లు ఉన్నారు. స్టాండ్-అప్ కమెడియన్‌గా దేశవ్యాప్తంగా పేరు తెచ్చుకుంది ప్రశస్తి సింగ్. అమెజాన్ ప్రైమ్ వీడియో సిరీస్ 'కామిక్‌స్థాన్' సూపర్ హిట్ అయింది. ఎంబీఏ చేసిన ప్రశస్తి 'నవ్వించడం' తన ప్యాషన్ అంటోంది. వీరు మాత్రమే కాదు కనీజ్ సుర్క, శ్రిష్టి దీక్షిత్, నిహారిక ఎన్ఎం, సుప్రియ జోషి, సుముఖి సురేష్, ఐశ్వర్య మోహన్‌రాజ్, సుమైర... లాంటి ఎంతో మంది నవ్వుల ప్రపంచంలో మహారాణులుగా వెలిగిపోతున్నారు.

వైరల్

సిగ్నల్ నీడలో



బతుకు గడవాలంటే రోడ్డు మీదకు రాక తప్పదు. వస్తే భయంకరమైన ఎండ. దాంతోపాటు ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర వేచి ఉండాల్సిన బాధ. అందుకే పాండిచ్చేరి ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్ ఏర్పాటు చేసింది. వీటిని ఒక స్కూటరిస్ట్ 'ఎక్స్'లో షేర్ చేశాడు. వైరల్ అయిన ఈ పందిళ్లను చూసి చాలా మంది తమ నగరాల్లో కూడా ఇలా జరిగితే బాగుండని కోరుకుంటున్నారు.

మన దేశంలో ఎండలు విపరీతమవడం గతంలో కూడా ఉంది. సాధారణంగా మైదానప్రాంతాల్లో 40 డిగ్రీల సెల్సియెస్, కొండ ప్రాంతాల్లో 30 డిగ్రీల సెల్సియెస్ దాటితే వడగాడ్పు ఉన్నట్టు వాతావరణ శాఖ ప్రకటిస్తుంది. 2016లో జోధ్‌పూర్‌లో 51 డిగ్రీల రికార్డు టెంపరేచర్ నమోదైంది. 2019లో లాంగెస్ట్ హీట్‌వేవ్‌ను దేశం చూసింది. 32 రోజుల పాటు సాగిన వడగాడ్పులకు ఆంధ్రప్రదేశ్ అల్లాడిపోయింది విదర్భ, రాజస్థాన్ కాకుండా. అందుకే మన దేశంలో మే నెలను చూసి జనం గడగడ వొణుకుతారు. బయటికొస్తే వాహనదారులకు నిలువ నీడ ఉండదు. ఇలాంటి సమయంలో పాండిచ్చేరిలో ప్రభుత్వం ప్రతి ట్రాఫిక్ సిగ్నల్ దగ్గర గ్రీన్‌షేడ్స్ ఏర్పాటు చేసింది. దీని వల్ల ఎండలో తిరిగే వారికి నీడ కింద ఉపశమనం దొరికినట్టవుతుంది... దాంతో పాటు ట్రాఫిక్ సిగ్నల్‌ను పాటించినట్టవుతుంది. ఒక వాహనదారుడు ఇన్‌స్టాలో రిలీజ్ చేసిన పాండిచ్చేరి గ్రీన్‌షేడ్స్‌ను చూసి ప్రతి ఒక్కరూ మా నగరాల్లో కూడా ఇలాంటివి ఏర్పాటు చేస్తే బాగుండు అంటున్నారు. ప్రభుత్వాలు వింటే బాగుండు.

నీటి పిట్టలు

'స్విమింగ్ పూల్ అంటే ఎలా ఉంటుంది సార్?'
అని అడిగారా పల్లెటూరి స్కూల్ పిల్లలు.
స్కూల్ ప్రిన్సిపల్‌కి చివుక్కుమంది.
ఎండల్లో జలకాలాడే చిన్న సరదా కూడా
తన స్కూల్ పిల్లలకు లేకపోతే ఎలా అనుకున్నాడు.
ఆ తర్వాత అతడేం చేశాడు?
పిల్లలు నీటి పిట్టలు ఎలా అయ్యారు?
వైరలైన ఈ వివరం వినండి.



ఉత్తరప్రదేశ్‌లో అత్తర్ల తయారీకి వాసికెక్కిన కన్నౌజ్‌కు పక్కనే ఉండే తిర్వా అనే ఊరిలోని ఒక ప్రయివేటు స్కూల్ విద్యార్థులకు స్విమ్మింగ్ పూల్ ఎలా ఉంటుందో తెలియదు. 'వేసవి కాలంలో నగరాల్లో డబ్బున్నవాళ్లు స్విమ్మింగ్‌పూల్‌కు వెళ్లి ఈత కొడతారు' అని స్కూల్ ప్రిన్సిపాల్ వైభవ్ సింగ్ పిల్లలకు మాటవరసకు చెప్తే పిల్లలు 'అదెలా ఉంటుంది సార్' అనడిగారు. 'మేమెందుకు అలాంటి పూల్‌లో ఈత కొట్టకూడదు' అనంటే మన చుట్టుపక్కల పూల్స్ లేవు అని ప్రిన్సిపాల్ అన్నాడు. కాని అతనికి ఒక ఆలోచన వచ్చింది. ఒక క్లాస్‌రూమ్‌లో నీళ్లు నింపి ఇదే పూల్ అన్నాడు. తల్లిదండ్రుల అనుమతి అడిగి స్కూల్ అయ్యే సమయానికి అందులో కేరింతలు కొట్టే అవకాశం ఇచ్చాడు. ఇంకేముంది... పిల్లలకు హుషారే హుషారు. స్కూల్ ఎగ్గొట్టడంలో ఘనాపాఠీలైన పిల్లలు కూడా పలక తీసుకొని పరిగెత్తుకుంటూ వస్తున్నారు. ఊళ్లోని తల్లిదండ్రులు కూడా వచ్చి పిల్లలు నీళ్లల్లో కేరింతలు కొడుతుంటే చూసి సంతోషపడుతున్నారు. ఈ వీడియో వైరల్ అయ్యింది.

నేడే చూడండి... గుర్రం గారి డ్యాన్స్



'కొత్త బట్టలు కుట్టిస్తారు. గుర్రపు స్వారీ చేయిస్తారు' అని పెళ్లికుమారుడి గురించి మురిపెంగా చెబుతుంది ఓ సిన్మా పాట. ఈ పాట మాట ఎలా ఉన్నా కొన్ని పెళ్లి ఊరేగింపులలో గుర్రం పరేషాన్ చేస్తుంటుంది. లక్నోలో ఒక పెళ్లి ఊరేగింపులో బాంబుల మోత భరించలేక 'ఐ డోన్ట్ లైక్ ఇట్' అంటూ గుర్రం పరుగులు తీసింది. గుర్రంపై ఉన్న పెళ్లికుమారుడు భయంతో లబోదిబో అన్నాడు. ఇక తాజా విషయానికి ఇస్తే... ఒక పెళ్లి ఊరేగింపులో ఒక కుర్రాడు డ్యాన్స్ చేస్తున్నాడు. లెక్క ప్రకారం అయితే పెళ్లి ఊరేగింపు గుర్రం ఇట్టి దృశ్యాలను మౌనంగా చూస్తుంది. మరి మన గుర్రానికి ఏమనిపించిందో తెలియదుగానీ ఆ డ్యాన్సర్‌కు తగినట్లు స్టెప్పులు వేయడం మొదలుపెట్టింది. గుర్రంపై కూర్చున్న వరుడి గుండెల్లో మెట్రో రైళ్లు పరుగెత్తడం మాట ఎలా ఉన్నా... అక్కడ ఉన్న జనాలకు గుర్రం డ్యాన్స్ తెగ నచ్చి ఈలలు వేయించింది. మనోజ్ పటేల్ అనే యూజర్ ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేసిన ఈ వీడియో క్లిప్ 21 మిలియన్‌ల వ్యూస్‌ను సొంతం చేసుకుంది.


కూల్ మీమ్స్
















హెల్త్

• చర్మంపై వేసవి ఎండ ప్రభావం... జాగ్రత్తలు!

మనపై వేసవి ఎండల ప్రభావాలు ఎలా ఉన్నప్పటికీ... నేరుగా ప్రభావితం చేసేది చర్మాన్నే. ఎండ ప్రభావం ప్రత్యక్షంగా ఉండటంతో మేని రంగు మారడం, చర్మం కమిలిపోవడం వంటివి సహజం. ప్రధానంగా చిన్నపిల్లల్లో చెమటకాయలు వంటి సమస్యలు ఎక్కువగా కనిపిస్తాయి. వేసవి ఎండల్లో చర్మంపై చూపే దుష్ప్రభావాలూ, వాటి నివారణ, చికిత్స వంటి అనేక అంశాలపై అవగాహన కోసం...



వేసవిలో ఈ కింద పేర్కొన్న అనేక రకాల చర్మ సమస్యలు వచ్చే అవకాశముంది.

చెమటకాయలు (మిలీరియా)... చెమటకాయలు ముఖ్యంగా పిల్లల్లోనూ, కొందరు పెద్దల్లో కూడా కనిపిస్తుంటాయి. వేడి వాతావరణంలో చర్మంపైన ఉండే స్వేదగ్రంథులు మూసుకుపోయి వాపు రావడం వల్ల వేసవిలో ఇవి వస్తుంటాయి. చర్మంపైన ఎర్రటి ర్యాష్‌లాగా కొన్నిసార్లు మాడినట్లుగా నలుపురంగులో కనిపిస్తుంటాయి. పిల్లల్లో చెమట గ్రంథులు పూర్తిగా ఎదగక పోవడం, వేడిమి, ఎండలో విపరీతంగా ఆడటం చెమటకాయలు రావడానికి ప్రధాన కారణాలు.

నివారణ / చికిత్స: చెమటకాయలు వచ్చినప్పుడు పిల్లలకు గాలి బాగా ఆడేలా వదులుగా ఉండే దుస్తులు (కాటన్‌వి అయితే మరీ మంచిది) ధరింపజేయాలి.
- గాఢత తక్కువగా ఉండే మైల్డ్ సబ్బులు వాడాలి.
- కాలమైన్ లోషన్ రాసుకోవడం మంచిది.
- పిల్లలు ఎండల్లో ఎక్కువగా ఆడకుండా జాగ్రత్త పడాలి. చికిత్సలో భాగంగా ప్రిక్లీ హీట్ పౌడర్ వాడాలి. తగ్గకపోతే ఎమోలియెంట్స్ అనే క్రీముల్ని డాక్టర్ సలహా మేరకు రాయాలి.

మంగుమచ్చలు/ మెలాస్మా... చర్మానికి హానికరమైన అల్ట్రా వయొలెట్ కిరణాల ప్రభావం వల్ల చర్మంపైన ఉండే మెలనోసైట్స్ అనే కణాలు పెరిగి, చర్మం నల్లబారుతుంది. ఈ పిగ్మెంటేషన్‌ను మెలాస్మా అంటారు.

జాగ్రత్తలు/ చికిత్స: పిగ్మెంటేషన్ ఉన్నవారు రోజూ రాత్రివేళ కోజిక్ యాసిడ్, ఆర్బ్యుటిన్, విటమిన్-సి ఉన్న క్రీములు రాసుకోవాలి.
- 40 ఎస్‌పీఎఫ్ కంటే ఎక్కువగా ఉన్న సన్‌స్క్రీన్‌ను ప్రతి మూడుగంటలకోసారి రాయాలి.

మొటిమలు ఎక్కువగా రావడం.. వేసవి వేడి వాతావరణంలో తేమ (హ్యుమిడిటీ) ఎక్కువగా ఉన్నప్పుడు మన చర్మంపై ఉండే సబేషియస్ గ్రంథులు ఎక్కువగా పనిచేసి, సీబమ్ అనే నూనె లాంటి ద్రవం స్రవిస్తుంది. అలాగే ముఖంపై ఉండే 'పైలో సబేషియస్ యూనిట్' అనే వ్యవస్థ చాలా చురుగ్గా పనిచేయడంతో చర్మంపై ఎక్కువ చెమట పట్టడంతో, సీబమ్ అనే నూనె లాంటి ద్రవాల స్రావాలతోనూ ఈ గ్రంథుల రంధ్రాలు మూసుకుపోతాయి. దాంతో అక్కడ బ్యాక్టీరియా పెరిగి ఇన్‌ఫ్లమేషన్‌కు దారితీస్తుంది. ఇలా ఈ సీజన్ మొటిమల ఎక్కువగా పెరగడానికి కారణమవుతుంటుంది.

నివారణ / చికిత్స : మొటిమల్ని ప్రేరేపించే అంశాల్లో చాక్లెట్లు, కాఫీలోని కెఫీన్ ప్రధానమైనది. అందుకే టీనేజీ పిల్లలకు కొవ్వులు, చక్కెర పాళ్లు తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన ఆహారాన్నే ఇవ్వాలి. ఎవరికి వారు తాము తీసుకునే ఆహారాల్లో కొన్ని ఐటమ్స్ సెబేషియస్ గ్రంథులను ప్రేరేపించేవి అని గుర్తిస్తే వాటికి దూరంగా ఉండాలి. ఈ తరహా నివారణ చర్యల తర్వాత కూడా మొటిమలు తగ్గకపోతే అప్పుడు క్వాలిఫైడ్ డర్మటాలజిస్టును కలిసి వారి సూచన మేరకు క్లిండామైసిన్ అండ్ ఎడాపలిన్ కాంబినేషన్ ఉన్న క్రీమును ప్రతి రోజూ రాత్రివేళ రాసుకోవాలి. అప్పటికీ తగ్గకపోతే వైద్యుల సలహా మేరకు యాంటీబయాటిక్స్ కూడా వాడాల్సి ఉంటుంది.


డా. కె.ఎస్.ఎన్. రవితేజ
సీనియర్ డర్మటాలజిస్ట్ & కాస్మటాలజిస్ట్

ఈత జబ్బులతో జర భద్రం

ఒకప్పుడు వేసవి సెలవులు రాగానే ఎనిమిదీ పదేళ్ల పిల్లలంతా ఊళ్లలో బావులకు ఈతకు వెళ్లేవారు. ఇప్పుడా సంఖ్య కాస్త తగ్గినా ఇంకా అలా ఈతకెళ్లేవాళ్లు ఉండనే ఉన్నారు. పల్లెలూ, పట్టణాల పిల్లలైతే సెలవులు కాబట్టి దగ్గర్లోని సముద్ర తీరం దగ్గరికి స్నానాలకు వెళ్లడం, నదుల్లో, చెరువుల్లో ఈదులాడటం మామూలే. ఇక నగరవాసుల పిల్లలు స్విమ్మింగ్ క్లాసులంటూ ఈత నేర్చుకోడాలు ఈ సీజన్‌లోనే ఎక్కువ. దానికితోడు టబ్ బాత్‌లూ, అమ్యూజ్‌మెంట్ పార్కుల్లో స్ప్లాష్ బాత్, కృత్రిమ కెరటాల్లో ఈదులాటలూ ఉంటాయి. అయితే ఈత సంబంధమైన వినోదక్రీడల్లో, వాటర్ స్పోర్ట్స్‌లో పిల్లలకు ప్రమాదాలు తెచ్చిపెట్టే ముప్పులు ఉండనే ఉంటాయి. అవేమిటో, వాటి విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలేమిటో చూద్దాం.



ఈత రానప్పుడు... అది స్విమ్మింగ్‌పూల్‌గానీ లేదా చెరువు, వాగు, నదిలో మునిగిపోయే ప్రమాదమే అన్నిటి కంటే పెద్ద ముప్పు. ఇలాంటి సందర్భాల్లో ఈత తెలిసినవారు తప్పక పక్కనే ఉండాలి. పిల్లవాడు మునిగిపోతున్నట్లు గమనించిన వెంటనే ఒడ్డుకు తీసుకువచ్చి సమతలంగా ఉండే ప్రదేశంలో పడుకోబెట్టాలి. కోలుకునేందుకు చేయాల్సిన పరిచర్యలివి...
- ప్రమాదానికి గురైన చిన్నారి తల పక్కకు ఉండేలా, ఎడమవైపు ఒరిగి ఉండేలా చూసుకోవాలి.
- ఛాతీని గమనిస్తూ, శ్వాస ఆడుతుందో లేదో చూడాలి. శ్వాస తీసుకోలేకపోతుంటే గదమ భాగం పైకి ఉండేలా చేసి, గొంతులో ఏదైనా అడ్డుగా ఉందేమో చూడాలి... ఉంటే ఆ అడ్డును తొలగించాలి.
- తర్వాత బోర్లా పడుకోబెట్టి వీపుపై మన రెండు అరచేతులు అనించి, బలంగా నొక్కాలి. దీనివల్ల ఊపిరితిత్తుల్లో ఏమైనా నీళ్లు ఉంటే బయటకు వెళ్లిపోతాయి. శ్వాసక్రియ మళ్లీ మొదలవుతుంది.
- కొందరు నీళ్లు తాగేస్తారు. అలాంటప్పుడు కడుపుపై విడతలవారీగా నొక్కుతూ నీళ్లు బయటకు వెళ్లేలా చేయాలి. దాంతో శ్వాసక్రియ తేలిగ్గా జరుగుతుంది. నోటితో గాలి ఊదేటప్పుడు పిల్లవాడి ముక్కు మూయాలి. మన నోరు పక్కకు తీసినప్పుడు ముక్కు తెరచి ఉంచాలి. ఈ రెండింటి మధ్య కొంత వ్యవధి ఇస్తూ ఒక క్రమపద్ధతిలో చేస్తుండాలి.
- ఆ తర్వాత వాళ్లను పొడిబట్టల్లోకి మార్చాలి.

ఇతర ఆరోగ్య సమస్యలు...

నీళ్ల విరేచనాలు (డయేరియా) : ఈదుతున్న నీళ్లలో ఉండే ఈ-కొలై, షిజెల్లా, క్రిప్టోస్పోరీడియమ్, నోరో వైరస్ వంటి సూక్ష్మక్రిముల వల్ల నీళ్ల విరేచనాల సమస్య రావచ్చు. సమస్య తీవ్రతను బట్టి కొన్ని సందర్భాల్లో యాంటీబయాటిక్స్ వంటి మందులతో పాటు దేహద్రవాలను కోల్పోకుండానే, క్రిములను మాత్రం బయటకు పంపేలా చేసే విరేచనాలు కట్టుబడే మాత్రలు వాడాల్సి ఉంటుంది.

చెవిలో నొప్పి లేదా స్విమ్మర్స్ ఇయర్ : 'ఒటైటిస్ ఎక్స్‌టర్నా' అనే ఈ బ్యాక్టీరియల్ ఇన్ఫెక్షన్‌లో చెవి నొప్పి, చెవిలో దురద, నీరుకారడం, చెవి ప్రాంతంలో వాపు కనిపిస్తాయి. దీని నివారణకు ఈత పూర్తి కాగానే తువ్వాలతో చెవుల్ని, ఇయర్ కెనాల్‌నూ పొడిగా మారేలా తుడవాలి. అప్పటికీ తగ్గపోతే డాక్టర్ సలహా మీద చెవుల్లో యాంటీబయాటిక్ చుక్కల మందులు వాడాలి. ఈ ఇబ్బందులు లేకుండా ఉండాలంటే ఈత సమయంలో ఇయర్ ప్లగ్స్ వాడటం మంచిది.

హాట్ టబ్ ర్యాష్ : కలుషితమైన నీళ్లలో ఈదటం వల్ల చర్మానికి వచ్చే సమస్య ఇది. ర్యాష్ వచ్చినచోట చర్మం ఎర్రబారి దురద పెడుతుంటుంది. చర్మంపై రోమాంకురాల చివర్లలో చీముపొక్కుల్లా వస్తుంటాయి. స్విమ్‌సూట్ ధరించిన ప్రాంతాల్లో లక్షణాల తీవ్రత మరీ ఎక్కువ. ఈ సమస్య నివారణకు ఈత పూర్తయిన వెంటనే స్విమ్ సూట్ తొలగించి, సబ్బుతో శుభ్రంగా స్నానం చేయాలి.


కళ్లు ఎర్రబారడం : ఈత తర్వాత చాలామంది కళ్లు ఎర్రబారినట్టుగా ఉంటాయి. ఈదులాడే చోట అనేక రకాల మానవ కాలుష్యాలు, ఇతర రసాయనాల వల్ల నీళ్లు కలుషితం కావడమే ఇందుకు కారణం. ఒకవేళ స్విమ్మింగ్‌పూల్‌లో ఇలాంటి సమస్య వస్తే... ఆ నీటిని క్లోరినేషన్ ద్వారా డిస్-ఇన్‌ఫెక్ట్ చేయాల్సి ఉంటుంది. చెరువు, కొలను వంటి ఇతర వనరులైతే అలాంటి చోట ఈత కొట్టకపోవడమే మేలు.

సైనసైటిస్: నీటి కొలనులు, చెరువుల వంటి చోట్లలో ఈదులాడుతున్నప్పుడు మన తలలో ఉండే సైనస్ అనే ఖాళీ ప్రదేశాలలో నీరు చేరి, అక్కడ సూక్ష్మజీవులు పెరగడం వల్ల ముక్కు నుంచి స్రావాలు కారుతుండటం, ఒక్కోసారి కణతల వద్ద తలలో, చెవుల్లో నొప్పి రావడం వంటి సమస్యలు వస్తుంటాయి. ఇలాంటప్పుడు డాక్టర్ సలహా మేరకు యాంటీబయాటిక్స్, నొప్పి నివారణ మాత్రలు వాడాల్సి రావచ్చు.



ఇతర ఇన్ఫెక్షన్లు : కొన్ని రకాల ఇన్ఫెక్షన్ల వల్ల జ్వరం, ఆకలి తగ్గడం, తలనొప్పి, తీవ్రమైన నిస్సత్తువ వంటి లక్షణాలు కనిపించవచ్చు. అలాగే పిల్లల ప్రైవేట్ పార్ట్స్ దగ్గర పిన్‌వార్మ్స్ వంటి ఇన్ఫెక్షన్లూ వచ్చే ప్రమాదముంది. కొన్ని సందర్భాల్లో ఊపిరితిత్తుల్లోకి కలుషితమైన నీరు ప్రవేశించడం వల్ల తీవ్రమైన దగ్గు లేదా శ్వాస సమస్యలు రావచ్చు.

ఈత సమస్యల నివారణ కోసం...
- పిల్లలు ఈతకొడుతున్నప్పుడు సీఆర్‌పీ వంటి ఫస్ట్ ఎయిడ్ పద్ధతులు, ఈదడం తెలిసిన పెద్దలు తప్పక పక్కనే ఉండి తీరాలి.
- ఈత ఎంతో ఆరోగ్యకరమైన వ్యాయామమైనప్పటికీ దాంతో వచ్చే సమస్యలపై పిల్లలకు అవగాహన కల్పించి, ఆ మేరకు వారు జాగ్రత్తలు తీసుకునేలా వాళ్లలో అవగాహన పెంచాలి.
- పిల్లలు ఈదులాడే కొలను, నదులు, చెరువులు శుభ్రంగానే ఉన్నాయని నిర్ధారణ చేసుకున్న తర్వాతే వారిని ఈతకు అనుమతించాలి. స్విమ్మింగ్‌పూల్ అయితే నిర్ణీత వ్యవధుల్లో ఈ నీటిని క్లోరిన్‌తో ట్రీట్ చేసేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- వీలైతే పిల్లల చెవుల్లోకి నీరు పోకుండా ఇయర్ ప్లగ్స్, కళ్లకు గాగుల్స్ వంటివి ధరించేలా జాగ్రత్తలు తీసుకోవాలి.


డా. ప్రవీణ్‌కుమార్ కులకర్ణి,
సీనియర్ ఇంటర్నల్ మెడిసిన్ స్పెషలిస్ట్

మెడి టిప్

వాటర్ కూలర్‌తో ఒకింత జాగ్రత్త!



చాలారోజుల తర్వాత వాడుతున్న వాటర్ కూలర్ విషయంలో ఒక్క జాగ్రత్త తప్పనిసరిగా పాటించి తీరాలి. అదేమిటంటే... వాటర్ కూలర్‌లో ఎంతోకొంత నీరు ఉండి, దాన్ని చాలారోజుల పాటు ఆన్ చేయకుండా ఉన్నప్పుడు ఆ వాటర్ కూలర్ మెష్‌లో ఉండే బ్యాక్టీరియాతో 'లీజియొనైర్స్ డిసీజ్' అనే వ్యాధి వచ్చే ప్రమాదం ఉంటుంది. లీజియొన్నెల్లా అనే బ్యాక్టీరియా కారణంగా వచ్చే ఈ వ్యాధి వల్ల లంగ్స్ ప్రభావితమవుతాయంటున్నారు డాక్టర్లు. అప్పటికే ఆస్తమా ఉన్నవారిలో ఈ 'లీజియొనైర్స్ డిసీజ్' మరింత ప్రమాదకరం కావచ్చంటూ హెచ్చరిస్తున్నారు. అందుకే కూలర్ వాడే ముందర ఒకసారి అందులోని పాత నీరంతా డ్రై అయిపోయేలా ఆన్ చేసి ఉంచాలి. ఆ తర్వాత కూడా ఒకసారి ఫ్రెష్‌గా మరికాసిని నీళ్లు పోసి, అవి కూడా పూర్తిగా ఇగిరిపోయేలా చేయాలి. అటు తర్వాత తాజాగా నీళ్లు పోసి, అప్పుడు వాడుకోవాలంటూ డాక్టర్లు సలహా ఇస్తున్నారు.



గాయంతో ఐపీఎల్ మిగతా మ్యాచ్‌కు మయాంక్ దూరం

పదునైన పేస్ బౌలింగ్‌తో ఈ ఐపీఎల్‌లో వెలుగులోకి వచ్చిన మయాంక్ యాదవ్ మిగతా సీజన్‌కు దూరమయ్యాడు. పక్కటెముకల గాయంతో బాధపడుతున్న ఈ లక్నో సూపర్ జెయింట్స్ బౌలర్ మిగిలిన మ్యాచ్‌లు ఆడే అవకాశం లేదని జట్టు కోచ్ జస్టిన్ లాంగర్ వెల్లడించాడు. తొలిసారి ఐపీఎల్ బరిలోకి దిగిన 21 ఏళ్ల మయాంక్ తొలి రెండు మ్యాచ్‌లలో అద్భుత ప్రదర్శన కనబర్చాడు. లక్నో విజయాల్లో కీలక పాత్ర పోషించి ఐపీఎల్‌లో ఆడిన తొలి రెండు మ్యాచ్‌లలో ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్‌గా నిలిచిన తొలి ఆటగాడిగా నిలిచాడు. ప్రతీ మ్యాచ్‌లో 150 కిలోమీటర్లకు పైగా వేగంతో బౌలింగ్ చేస్తూ సత్తా చాటిన అతను గాయంతో మూడో మ్యాచ్ మధ్యలో తప్పుకున్నాడు. ఆ తర్వాత లక్నో ఆడిన ఐదు మ్యాచ్‌లకు దూరమైన అతను కోలుకొని ముంబైతో మ్యాచ్‌లో మళ్లీ బరిలోకి దిగాడు. ఈ మ్యాచ్‌లో తన నాలుగో ఓవర్‌లో ఒక బంతి వేయగానే గాయం తిరగబెట్టడంతో మైదానం వీడాడు. లక్నో ప్లే ఆఫ్స్‌కు చేరితే మయాంక్ ఆడే అవకాశాలు ఉన్నాయని భావించినా... ఇప్పుడు ఆ అవకాశం లేదని తేలిపోయింది.

చాంపియన్ ముంబై సిటీ



- రెండో సారి ఐఎస్‌ఎల్ టైటిల్ సాధించిన జట్టు
- ఫైనల్లో మోహన్‌బగాన్‌పై 3–1తో విజయం

కోల్‌కతా: ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) టోర్నీలో ముంబై సిటీ ఫుట్‌బాల్ క్లబ్ రెండో సారి విజేతగా నిలిచింది. దాదాపు 62 వేల సామర్థ్యం గల సాల్ట్‌లేక్ స్టేడియంలో జరిగిన తుది పోరులో ఆతిథ్య జట్టును మట్టికరిపించింది. శనివారం జరిగిన ఫైనల్లో ముంబై 3–1 గోల్స్ తేడాతో మోహన్‌బగాన్ సూపర్ జెయింట్స్‌ను చిత్తు చేసింది. ఆరంభంలో ఇరు జట్లూ జాగ్రత్తగా ఆడుతూ డిఫెన్స్‌పైనే దృష్టి పెట్టాయి. 44వ నిమిషంలో జేసన్ కమింగ్స్ సాధించిన గోల్‌తో ముందుగా మోహన్‌బగాన్ ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. అయితే రెండో అర్ధభాగంలో 3 గోల్స్‌తో ముంబై చెలరేగింది. ముంబై తరఫున జార్జ్ పెరీరా డియాజ్ (53వ నిమిషం), బిపిన్ సింగ్ (81వ నిమిషం), జాకబ్ వోజస్ (90+7వ నిమిషం)లో గోల్స్ కొట్టారు. 2020–21 సీజన్‌లో ముంబై విజేతగా నిలిచిన మ్యాచ్‌లో కూడా ఇదే తరహాలో మోహన్‌బగాన్ 1–0తో ఆధిక్యంలో నిలిచినా...బిపిన్ సింగ్ సాధించిన గోల్‌తోనే ముంబై గెలిచింది. అదనపు సమయంలో మోహన్‌బగాన్‌కు స్కోరు సమం చేసే అవకాశం వచ్చినా... ఫార్వర్డ్‌లు పూర్తిగా విఫలమయ్యారు. కొన్ని క్షణాల్లో ఆట ముగుస్తుందనగా ముంబై మరో గోల్‌తో తిరుగులేని విజయాన్ని అందుకుంది. ముంబైకి చెందిన పుర్బా లచెన్పాకు 'గోల్డెన్ గ్లవ్', విక్రమ్ ప్రతాప్ సింగ్‌కు 'ఎమర్జింగ్ ప్లేయర్' అవార్డు, కేరళ బ్లాస్టర్స్ ప్లేయర్ దిమిత్రియోస్ దియామంతకూస్‌కు 'గోల్డెన్ బూట్' అవార్డులు దక్కగా, మోహన్ బగాన్ ఆటగాడు పెట్రాటోస్ 'ప్లేయర్ ఆఫ్ ద లీగ్'గా నిలిచాడు.

43 పతకాలు ఖాయం

అస్తానా (కజకిస్తాన్): ఏఎస్‌బీసీ ఆసియా అండర్–22 అండ్ యూత్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్ పతకాల పంట పండిస్తోంది. అండర్–22 కేటగిరీలో శనివారం భారత్‌కు 21 పతకాలు ఖాయమయ్యాయి. భారత్‌కు చెందిన ఆకాశ్ గోర్ఖా, విశ్వనాథ్ సురేశ్, నిఖిల్, ప్రీత్ మలిక్ ఫైనల్లోకి ప్రవేశించారు. సీనియర్ నేషనల్ చాంపియన్ ఆకాశ్ 60 కేజీల కేటగిరీ సెమీఫైనల్లో 5–0తో ఇల్యాసొవ్ (ఉజ్బెకిస్తాన్)ను చిత్తు చేశాడు. ప్రస్తుత యూత్ వరల్డ్ చాంపియన్ ఆకాశ్ (48 కేజీలు) సెమీస్‌లో 5–2తో బరికువాత్రో (ఫిలిప్పీన్స్)ను, నిఖిల్ (57 కేజీలు) 5–2తో గన్‌టోల్డ్ (మంగోలియా)ను, ప్రీత్ (67 కేజీలు) 5–2తో అల్‌మాజ్ ఒరోజ్ (కిర్గిస్తాన్)ను ఓడించారు. సెమీస్‌లో ఓడిన జాదూమనీ సింగ్, అజయ్ కుమార్, అంకుశ్, ధ్రువ్ సింగ్, జుగ్నూ, యువరాజ్ కాంస్య పతకాలతో సంతృప్తి చెందారు. ఈ టోర్నీ యూత్ విభాగంలో ఇప్పటికే భారత్‌కు 22 పతకాలు ఖాయం కావడంతో ఓవరాల్‌గా మన జట్టు గెలుచుకునే పతకాల సంఖ్య 43కు చేరింది.

ఫైనల్లో చైనా, ఇండోనేసియా

థామస్ – ఉబెర్ కప్ బ్యాడ్మింటన్

చెంగ్డూ: ప్రతిష్టాత్మక బ్యాడ్మింటన్ టీమ్ ఈవెంట్‌లు థామస్ కప్, ఉబెర్ కప్‌లలో చైనా, ఇండోనేసియా జట్లు ఫైనల్లోకి ప్రవేశించాయి. పురుషుల టోర్నీ (థామస్ కప్)లో శనివారం జరిగిన తొలి సెమీ ఫైనల్లో చైనా 3–1 తేడాతో మలేసియాపై విజయం సాధించింది. రెండో సెమీస్‌లో ఇండోనేసియా 3–0తో చైనీస్ తైపీని చిత్తు చేసింది. మహిళల టోర్నీ (ఉబెర్ కప్)లో కూడా ఈ రెండు జట్లే ముందంజ వేశాయి. తొలి సెమీస్‌లో చైనా 3–0తో జపాన్‌పై ఘన విజయం సాధించింది. హోరాహోరీగా సాగిన రెండో సెమీఫైనల్ పోరులో ఇండోనేసియా 3–2 స్కోరుతో డిఫెండింగ్ చాంపియన్ కొరియాను ఓడించింది. 1998 తర్వాత థామస్ కప్, ఉబెర్ కప్ రెండింటిలోనూ ఇండోనేసియా ఫైనల్ చేరడం ఇదే తొలిసారి కావడం విశేషం. ఉబెర్ కప్‌లో ఇండోనేసియా ఫైనల్ చేరడం ఇది 11వ సారి కాగా... చైనా మాత్రమే అత్యధికంగా (20 సార్లు) ఫైనల్ సమరంలో తలపడింది. నేడు ఫైనల్ పోటీలు జరుగుతాయి.

బెంగళూరు గెలుపు 'హ్యాట్రిక్'

తొలి ఎనిమిది మ్యాచ్‌లలో ఒక విజయం, ఏడు పరాజయాలు... అంతా లెక్కలోంచి తీసేసిన వేళ రాయల్ చాలెంజర్స్ బెంగళూరు పుంజుకుంది. ప్రత్యర్థి వేదికపై గత రెండు మ్యాచ్‌లు గెలిచిన ఆర్‌సీబీ ఇప్పుడు సొంత గడ్డపై చెలరేగి విజయాల 'హ్యాట్రిక్' సాధించింది. పట్టికలో మూడు స్థానాలు ఎగబాకి పదినుంచి ఏడుకు చేరింది. అయితే తాజా విజయంలో కాస్త ఉత్కంఠను పెంచి చివరకు గెలుపుతీరం చేరింది. ముందుగా తమ పేలవ ఆటను కొనసాగిస్తూ టైటాన్స్ 147 పరుగులకే పరిమితమైంది. సులువైన లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఆర్‌సీబీ స్కోరు 92/0...ఇక మిగిలింది లాంఛనమే అనుకున్న తరుణంలో 25 పరుగుల వ్యవధిలో 6 వికెట్లు పడ్డాయి. కానీ తడబాటును అధిగమించి మరో 38 బంతులు మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది.

- వరుసగా మూడో విజయంతో ముందంజ
- 4 వికెట్లతో ఓడిన గుజరాత్ టైటాన్స్
- చెలరేగిన డుప్లెసిస్, కోహ్లి, సిరాజ్



బెంగళూరు: చిన్నస్వామి మైదానంలో అభిమానులకు ఆర్‌సీబీ ఆనందం పంచింది. శనివారం జరిగిన కీలక పోరులో బెంగళూరు 4 వికెట్ల తేడాతో గుజరాత్ టైటాన్స్‌పై విజయం సాధించింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన గుజరాత్ 19.3 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. షారుఖ్ ఖాన్ (24 బంతుల్లో 37; 5 ఫోర్లు, 1 సిక్స్), రాహుల్ తెవాటియా (21 బంతుల్లో 35; 5 ఫోర్లు, 1 సిక్స్), డేవిడ్ మిల్లర్ (20 బంతుల్లో 30; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) జట్టు స్కోరులో తలా ఓ చేయి వేశారు. అనంతరం బెంగళూరు 13.4 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 152 పరుగులు చేసింది. ఫాఫ్ డుప్లెసిస్ (23 బంతుల్లో 64; 10 ఫోర్లు, 3 సిక్స్‌లు), విరాట్ కోహ్లి (27 బంతుల్లో 42; 2 ఫోర్లు, 4 సిక్స్‌లు) తొలి వికెట్‌కు 35 బంతుల్లోనే 92 పరుగులు జోడించి విజయాన్ని సులువు చేశారు. జోష్ లిటిల్‌కు 4 వికెట్లు దక్కాయి.

టపటపా...

సిరాజ్ బౌలింగ్ ధాటికి గుజరాత్ బ్యాటింగ్ ఆరంభంలోనే తడబడింది. తన తొలి రెండు ఓవర్లలో సాహా (1), గిల్ (2)లను సిరాజ్ అవుట్ చేయగా, సుదర్శన్ (6)ను గిల్ వెనక్కి పంపించాడు. దాంతో పవర్‌ప్లేలో గుజరాత్ 23 పరుగులకే పరిమితమైంది. ఈ దశలో షారుఖ్, మిల్లర్ కలిసి జట్టును ఆదుకునే ప్రయత్నం చేశారు. కానీ మిల్లర్‌ను అవుట్ చేసి ఈ 61 పరుగుల భాగస్వామ్యానికి కరణ్ తెర దించగా...లేని పరుగు కోసం ప్రయత్నించి షారుఖ్ రనౌట్ కావడంతో పరిస్థితి మళ్లీ మారిపోయింది. ఆ తర్వాత తెవాటియా కాస్త దూకుడుగా ఆడటంతో గుజరాత్ ఈ మాత్రం స్కోరైనా సాధించగలిగింది. కరణ్ శర్మ వేసిన 16వ ఓవర్లో తెవాటియా వరుసగా 4, 6, 4, 4 బాదాడు. యశ్ దయాళ్ ఒకే ఓవర్లో రషీద్ (18), తెవాటియాను అవుట్ చేసి దెబ్బ కొట్టగా...వైశాక్ వేసిన ఆఖరి ఓవర్ తొలి మూడు బంతుల్లో ఒకే స్కోరు వద్ద గుజరాత్ మూడు వికెట్లు కోల్పోయింది.

మెరుపు భాగస్వామ్యం...

ఛేదనలో బెంగళూరు చెలరేగిపోయింది. ఓపెనర్లు కోహ్లి, డుప్లెసిస్ బౌండరీలు బాదుతూ వేగంగా లక్ష్యం దిశగా సాగిపోయారు. మోహిత్ వేసిన తొలి ఓవర్లో కోహ్లి 2 సిక్స్‌లు కొట్టగా, లిటిల్ వేసిన తర్వాతి ఓవర్లో డుప్లెసిస్ 3 ఫోర్లు, సిక్స్ కొట్టాడు. మానవ్ వేసిన తర్వాతి ఓవర్లోనూ సిక్స్, ఫోర్ కొట్టిన డుప్లెసిస్...మోహిత్ ఓవర్లో 4 ఫోర్లు బాది 18 బంతుల్లో అర్ధసెంచరీ పూర్తి చేసుకున్నాడు. మానవ్ ఓవర్లో కోహ్లి 2 సిక్స్‌లు కొట్టగా...లిటిల్ వేసిన తర్వాతి ఓవర్లో 2 ఫోర్లు, సిక్స్ బాది అదే జోరులో డుప్లెసిస్ అవుటయ్యాడు. 6 ఓవర్లు ముగిసే సరికి 92 పరుగులు సాధించిన ఆర్‌సీబీ...ఐపీఎల్‌లో తమ అత్యుత్తమ పవర్‌ప్లే స్కోరును నమోదు చేసింది. అయితే డుప్లెసిస్ వెనుదిరిగిన తర్వాత బ్యాటింగ్ బృందం తడబడింది. కొంత ఉత్కంఠ నెలకొన్నా... దినేశ్ కార్తీక్ (12 బంతుల్లో 21 నాటౌట్; 3 ఫోర్లు), స్వప్నిల్ సింగ్ (9 బంతుల్లో 15 నాటౌట్; 2 ఫోర్లు, 1 సిక్స్) ఏడో వికెట్‌కు అభేద్యంగా 35 పరుగులు జోడించి జట్టును గెలిపించారు.

స్కోరు వివరాలు

గుజరాత్ టైటాన్స్ ఇన్నింగ్స్: సాహా (సి) కార్తీక్ (బి) సిరాజ్ 1; గిల్ (సి) వైశాక్ (బి) సిరాజ్ 2; సుదర్శన్ (సి) కోహ్లి (బి) గ్రీన్ 6; షారుఖ్ (రనౌట్) 37; మిల్లర్ (సి) మ్యాక్స్‌వెల్ (బి) కరణ్ 30; తెవాటియా (సి) వైశాక్ (బి) దయాళ్ 35; రషీద్ (బి) దయాళ్ 18; విజయ్‌శంకర్ (సి) సిరాజ్ (బి) వైశాక్ 10; మానవ్ (సి) స్వప్నిల్ (బి) వైశాక్ 1; మోహిత్ (రనౌట్) 0; నూర్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 7; **మొత్తం** (19.3 ఓవర్లలో ఆలౌట్) 147. **వికెట్ల పతనం:** 1–1, 2–10, 3–19, 4–80, 5–87, 6–131, 7–136, 8–147, 9–147, 10–147. **బౌలింగ్:** స్వప్నిల్ సింగ్ 1–0–1–0, సిరాజ్ 4–0–29–2, యశ్ దయాళ్ 4–0–21–2, గ్రీన్ 4–0–28–1, విజయ్ కుమార్ వైశాక్ 3.3–0–23–2, కరణ్ శర్మ 3–0–42–1.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు: కోహ్లి (సి) సాహా (బి) నూర్ 42; డుప్లెసిస్ (సి) షారుఖ్ (బి) లిటిల్ 64; జాక్స్ (సి) షారుఖ్ (బి) నూర్ 1; పటిదార్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 2; మ్యాక్స్‌వెల్ (సి) మిల్లర్ (బి) లిటిల్ 4; గ్రీన్ (సి) షారుఖ్ (బి) లిటిల్ 1; కార్తీక్ (నాటౌట్) 21; స్వప్నిల్ (నాటౌట్) 15; ఎక్స్‌ట్రాలు 2; **మొత్తం** (13.4 ఓవర్లలో 6 వికెట్లకు) 152 **వికెట్ల పతనం:** 1–92, 2–99, 3–103, 4–107, 5–111, 6–117. **బౌలింగ్:** మోహిత్ శర్మ 2–0–32–0, జోష్ లిటిల్ 4–0–45–4, మానవ్ సుథర్ 2–0–26–0, నూర్ అహ్మద్ 4–0–23–2, రషీద్ ఖాన్ 1.4–0–25–0.



డుప్లెసిస్

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
రాజస్తాన్	10	8	2	16	0.622
కోల్‌కతా	10	7	3	14	1.098
లక్నో	10	6	4	12	0.094
హైదరాబాద్	10	6	4	12	0.072
చెన్నై	10	5	5	10	0.627
ఢిల్లీ	11	5	6	10	-0.442
బెంగళూరు	11	4	7	8	-0.049
పంజాబ్	10	4	6	8	-0.062
గుజరాత్	11	4	7	8	-1.320
ముంబై	11	3	8	6	-0.356

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.రే-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

పంజాబ్ X చెన్నై
వేదిక: ధర్మశాల
మధ్యాహ్నం 3: 30 గంటల నుంచి

లక్నో X కోల్‌కతా
వేదిక: లక్నో
రాత్రి 7: 30 గంటల నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమా యాప్‌లో ప్రత్యక్ష ప్రసారం

సినిమా



కమల్‌హాసన్

మరింత ఆలస్యంగా..?

భారతీయుడి రాక మరింత ఆలస్యం కానుందనే టాక్ కోలీవుడ్‌లో వినిపిస్తోంది. హీరో కమల్‌హాసన్, దర్శకుడు శంకర్ కాంబినేషన్‌లో 1996లో వచ్చిన బ్లాక్‌బస్టర్ ఫిల్మ్ 'ఇండియన్' (తెలుగులో 'భారతీయుడు'). పాతిక సంవత్సరాల తర్వాత కమల్‌హాసన్‌తోనే 'ఇండియన్' సినిమాకు సీక్వెల్స్‌గా 'ఇండియన్ 2', 'ఇండియన్ 3' చిత్రాలను తెరకెక్కించారు శంకర్. 'ఇండియన్ 2'ని ఈ ఏడాది జూన్‌లో రిలీజ్ చేయనున్నట్లు చిత్ర యూనిట్ ఇటీవల ప్రకటించింది. అయితే ఈ చిత్రం వాయిదా పడే అవకాశం ఉందని సమాచారం. త్వరలోనే కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ ప్రకటిస్తారనే టాక్ కోలీవుడ్‌లో ప్రచారంలోకి వచ్చింది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, రకుల్‌ప్రీత్, బాబీ సింహా, ఎస్‌జే సూర్య కీలక పాత్రల్లో నటించారు. లైకా ప్రొడక్షన్స్, రెడ్ జెయింట్ మూవీస్ పతాకాలపై సుభాస్కరన్ నిర్మించిన ఈ చిత్రానికి సంగీతం: అనిరుధ్ రవిచందర్.



విజయ్ దేవరకొండ

రూరల్ యాక్షన్‌కి సై

హీరో విజయ్ దేవరకొండ అంటే సిటీ బ్యాక్‌డ్రాప్ కథలే ఎక్కువగా ఉంటాయి. ఈసారి వినూత్నంగా ప్రయత్నించాలని ఓ రూరల్ యాక్షన్ డ్రామా మూవీ సైన్ చేశారు. ఈ సినిమా కోసం సిటీ నుంచి విలేజ్‌కి వెళ్లనున్నారు విజయ్ దేవరకొండ. అక్కడే ఫుల్ యాక్షన్ చేయనున్నారు. ఈ రూరల్ బ్యాక్‌డ్రాప్ యాక్షన్ మూవీని 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారు. 'రాజావారు రాణిగారు' సినిమాతో దర్శకుడిగా ప్రతిభ నిరూపించుకున్న రవికిరణ్ కోలా దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ నిర్మించనున్న 59వ సినిమా ఇది. ఈ చిత్రాన్ని శనివారం ప్రకటించారు.

అంతకు మించి...



రామ్

'ఇస్మార్ట్ శంకర్'లో హీరో రామ్‌ని ఫుల్ మాస్‌గా చూపించారు దర్శకుడు పూరి జగన్నాథ్. ఈ చిత్రంలో మాస్, కామెడీ, యాక్షన్, రొమాన్స్... ఇలా అన్నీ కాస్త ఎక్కువగానే ఉంటాయి. ఇప్పుడు 'డబుల్ ఇస్మార్ట్'లో అంతకు మించి ఉంటాయి. 'ఇస్మార్ట్ శంకర్'కి సీక్వెల్‌గా రామ్ హీరోగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో రూపొందుతోన్న చిత్రం 'డబుల్ ఇస్మార్ట్'. ఈ చిత్రం కోసం రామ్ పూర్తిగా మేకోవర్ అయ్యారు. తొలి భాగంలోకన్నా ఇంకా మాస్‌గా కనిపించడంతో పాటు స్టయిలిష్‌గానూ కనిపించనున్నారు. ''ఈ చిత్రంలో రెట్టింపు యాక్షన్, రెట్టింపు మాస్, ఎంటర్‌టైన్మెంట్ ఉంటాయి'' అని చిత్రబృందం పేర్కొంది. ఈ పాన్ ఇండియా చిత్రం తాజా షెడ్యూల్ ముంబైలో ఆరంభమైంది. ఈ లెంగ్తీ షెడ్యూల్‌లో చిత్రంలోని ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాలను చిత్రీకరించనున్నారు. దీంతో ఎక్కువ శాతం సినిమా పూర్తవుతుంది. సంజయ్ దత్ పవర్‌ఫుల్ రోల్‌లో నటిస్తున్న ఈ చిత్రాన్ని పూరి కనెక్ట్స్ బ్యానర్‌పై పూరి జగన్నాథ్, ఛార్మి కౌర్ నిర్మిస్తున్నారు. 'ఇస్మార్ట్ శంకర్'కి స్వరాలు అందించిన మణిశర్మ ఈ చిత్రానికి కూడా సంగీతదర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ సినిమా తెలుగు, తమిళ, కన్నడ, మలయాళం, హిందీ భాషల్లో విడుదల కానుంది.

పిచ్చిగా నచ్చేశావే...



నయన్ సారిక, ఆనంద్ దేవరకొండ

''**పి**చ్చిగా నచ్చేశావే రంగు తూనీగా.. కళ్లలో చల్లేశావే రంగులన్నీ భలేగా..' అంటూ సాగుతుంది 'గం..గం..గణేశా..' సినిమాలోని 'పిచ్చిగా నచ్చేశావే' పాట. ఆనంద్ దేవరకొండ హీరోగా, ప్రగతి శ్రీవాస్తవ, నయన్ సారిక హీరోయిన్లుగా నటించిన చిత్రం ఇది. ఉదయ్ శెట్టి దర్శకత్వంలో కేదార్ సెలగంశెట్టి, వంశీ కారుమంచి నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31న రిలీజ్ కానుంది. శనివారం ఈ చిత్రంలోని 'పిచ్చిగా నచ్చేశావే..' పాట లిరికల్ వీడియోను హైదరాబాద్‌లోని మల్లారెడ్డి కాలేజీ విద్యార్థుల సమక్షంలో రిలీజ్ చేసింది యూనిట్. చేతన్ భరద్వాజ్ స్వరపరచిన ఈ పాటకు సురేష్ బనిశెట్టి సాహిత్యం అందించగా అనురాగ్ కులకర్ణి పాడారు.



అనుపమా పరమేశ్వరన్

నాన్‌స్టాప్‌గా...

హీరోయిన్ అనుపమా పరమేశ్వరన్ కెరీర్ ప్రస్తుతం నాన్‌స్టాప్‌గా జెట్ స్పీడ్‌లో దూసుకెళ్తోంది. మలయాళంలో 'ది పెట్ డిటెక్టివ్, జానకి వర్సెస్ స్టేట్ ఆఫ్ కేరళ', తెలుగులో 'పరదా', తమిళంలో మారి సెల్వరాజ్ దర్శకత్వంలో ఓ సినిమా కమిటయ్యారు అనుపమ. ఈ సినిమాలకు సంబంధించిన అధికారిక ప్రకటనలు వెల్లడయ్యాయి. అలాగే 'హను–మాన్' దర్శకుడు ప్రశాంత్ వర్మ తెరకెక్కిస్తున్న 'ఆక్టోపస్' (ప్రచారంలో ఉన్న టైటిల్), కౌశిక్ తెరకెక్కిస్తున్న 'కిష్కిందపురి' (ప్రచారంలో ఉన్న టైటిల్) చిత్రాల్లోనూ అనుపమ పరమేశ్వరన్ హీరోయిన్‌గా నటిస్తున్నారనే టాక్ తెరపైకి వచ్చింది. అనుపమ మెయిన్ లీడ్ రోల్‌లో నటించనున్న మరో కొత్త సినిమా ప్రకటన శనివారం వెల్లడైంది. సుభాస్కరన్ నిర్మించనున్న ఈ సినిమాతో ఏఆర్ జీవా దర్శకుడిగా పరిచయం అవుతారు. ఇది ఉమెన్ సెంట్రిక్ ఫిల్మ్ అని కోలీవుడ్ సమాచారం. ఈ సంగతి ఇలా ఉంచితే... అనుపమ పరమేశ్వరన్ నటించిన 'ఈగల్', 'టిల్లు స్క్వేర్', 'సైరన్' చిత్రాలు ఈ ఏడాది విడుదలయ్యాయి. ఇలా ఇప్పటికే అనుపమ మూడుసార్లు థియేటర్స్‌లో కనిపించారు. ఆమె నటించిన మరో రెండు సినిమాలు విడుదలకు సిద్ధం అవుతున్నాయి.

ది డెత్ ఆఫ్ రాబిన్‌హుడ్‌లో...

హగ్ జాక్‌మేన్, జోడీ కమర్ కాంబినేషన్‌లో 'ది డెత్ ఆఫ్ రాబిన్ హుడ్' చిత్రం రూపొందనుంది. రాబిన్ హుడ్ పాత్ర నేపథ్యంలో ఇప్పటివరకూ పలు హాలీవుడ్ చిత్రాలు వచ్చాయి. వాటిలోని పాత్ర దాదాపు హ్యాపీ మూడ్‌లో ఉంటుంది. అయితే 'ది డెత్ ఆఫ్ రాబిన్‌హుడ్'లో రాబిన్ హుడ్ పాత్ర అప్పటివరకూ తాను చేసిన నేరాలు, హత్యలు.. ఇలా గతాన్ని ఆలోచించుకునేలా ఉంటుందట. అతను తీవ్రంగా గాయపడి, ఒక మహిళ చేతిలో చిక్కుకుని ఉంటాడని, ఆ తర్వాత అతను, ఆ మహిళ నేపథ్యంలో కథనం ఉంటుందని హాలీవుడ్ సమాచారం. రాబిన్ హుడ్‌గా హగ్ జాక్‌మేన్, ఆ మహిళగా జోడీ కమర్ కనిపిస్తారు. 'పిగ్' చిత్రంతో పాపులార్టీ తెచ్చుకున్న మైఖేల్ సర్నోస్కీ దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందనుంది. మైఖేల్ సర్నోస్కీ దర్శకత్వం వహించిన తాజా చిత్రం 'ఏ క్వైట్ ప్లేస్: డే వన్' త్వరలో రిలీజ్ కానుంది. దీంతో తన పూర్తి దృష్టిని 'ది డెత్ ఆఫ్ రాబిన్‌హుడ్'పై పెట్టారట మైఖేల్.



హగ్ జాక్‌మేన్



జోడీ కమర్

ప్రేమకథ ఆరంభం

వరుణ్ ధావన్, జాన్వీ కపూర్‌ల కొత్త ప్రేమకథ మొదలైంది. 'బవాల్' సినిమా తర్వాత వరుణ్ ధావన్, జాన్వీ కపూర్ కలిసి 'సన్నీ సంస్కారీకి తులసీ కుమారి' అనే ప్రేమకథా చిత్రంలో జోడీగా నటిస్తున్నారు. సన్నీ పాత్రలో వరుణ్, తులసీ కుమారి పాత్రలో జాన్వీ కపూర్ కనిపిస్తారని ఊహించవచ్చు. శశాంక్ కేతన్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ శనివారం మొదలైంది. ఈ విషయాన్ని అధికారికంగా ప్రకటించారు. వరుణ్ ధావన్‌తో పాటు ఈ సినిమా కీలక తారాగణంపై ముఖ్య సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమా వచ్చే ఏడాది ఏప్రిల్ 18న విడుదల కానుంది.



వరుణ్



జాన్వీ

వేరు కుంపట్లతో దాసరిగారి పేరు చెడగొట్టొద్దు

– దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ




దాసరి జయంతి సందర్భంగా కేక్ కట్ చేస్తున్న దృశ్యం

''**న**రసింహారావుగారు (దర్శకుడు) మాట్లాడి, దాసరిగారి పేరిట రామ సత్యనారాయణ ఓ ఈవెంట్ చేశారు. రేపు మేం చేయబోతున్నాం అన్నారు. నేనేం అంటున్నానంటే... వచ్చే ఏడాది నుంచి సినిమా ఇండస్ట్రీ తరఫున దాసరిగారి జయంతిని అందరూ ఒక్కటై, ఒకే వేడుకలా జరుపుకునేలా ప్లాన్ చేద్దాం. బయటివాళ్లు కావాలంటే ఎవరి ఇష్టం వచ్చినట్లు వారు చేసుకుంటారు. ఇండస్ట్రీలో వేరు వేరు కుంపట్లు పెట్టి, గురువు (దాసరి నారాయణరావు) గారి పేరుని మనం చెడగొట్టొద్దు. గురువుగారి పేరును నిలబెట్టడానికి ప్రయత్నం చేద్దాం'' అన్నారు దర్శక-నిర్మాత తమ్మారెడ్డి భరద్వాజ. దర్శకరత్న దాసరి నారాయణరావు జయంతి (మే 4)ని 'డైరెక్టర్స్ డే'గా తెలుగు పరిశ్రమ సెలబ్రేట్ చేసుకుంటోంది. తెలుగు దర్శకుల సంఘం ఆధ్వర్యంలో మే 4న హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో ఈ వేడుక జరగాల్సింది. కానీ ఎన్నికల సమయంలో ఇలాంటి పెద్ద ఈవెంట్ నిర్వహిస్తే లా అండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తే అవకాశాలు ఉన్నాయని పోలీస్ శాఖ చెప్పిన నేపథ్యంలో ఈవెంట్ తేదీని ఈ నెల 19కి మార్చామని తెలుగు దర్శకుల సంఘం అధ్యక్షుడు వీరశంకర్ శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో తెలిపారు. ఈ వేడుక కొత్త తేదీ పోస్టర్‌ను తమ్మారెడ్డి భరద్వాజ, సి. కల్యాణ్, దామోదర ప్రసాద్ విడుదల చేశారు. ''దేశవ్యాప్తంగా సినీ కార్మికుల సంక్షేమంలో టాలీవుడ్ నంబర్ వన్‌గా ఉందంటే కారణం దాసరిగారే'' అన్నారు సి. కల్యాణ్. ''డైరెక్టర్స్ డే ఈవెంట్ సక్సెస్ కావడానికి శ్రమిస్తున్న యువ దర్శకులకు ధన్యవాదాలు'' అన్నారు వీరశంకర్. ''దాసరిగారి పేరిట రామసత్యనారాయణ ఈవెంట్ చేశారు. మే 5న మేం చేస్తున్నాం. దర్శకుల సంఘం చేయనున్న ఈవెంట్ కూడా సక్సెస్ కావాలి'' అన్నారు రేలంగి నరసింహారావు. నిర్మాతలు దామోదర ప్రసాద్, ప్రసన్న కుమార్, దర్శకులు ఎన్. శంకర్, సముద్ర, మెహర్ రమేష్, గోపీచంద్ మలినేని, అనిల్ రావిపూడి, వశిష్ఠ, తెలుగు ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడు అనిల్ కుమార్ వల్లభనేని తదితరులు పాల్గొన్నారు.

లగ్గం నేపథ్యంలో...

''**పె**ళ్లి, లగ్గం, వివాహం... పేరు ఏదైనా రెండు మనసులను కలిపే బంధం ఇది'' అంటున్నారు దర్శకుడు రమేష్ చెప్పాల. సాయి రోనక్, ప్రగ్యా నగ్రా, రాజేంద్రప్రసాద్, ఎల్బీ శ్రీరామ్, రఘుబాబు, రోహిణి, సప్తగిరి ముఖ్య తారలుగా రమేష్ చెప్పాల దర్శకత్వంలో వేణుగోపాల్ రెడ్డి నిర్మిస్తున్న చిత్రం 'లగ్గం'. ఈ చిత్రం టాకీ పార్ట్ పూర్తయింది. ''తెలుగు పెళ్లిళ్లలో ఉండే మజా, మర్యాదలు, ఆట, పాటలతో రూపొందిన ఈ 'లగ్గం' చిత్రం ప్రతి ఒక్కరికీ వాళ్ళ లగ్గమో, బంధువుల లగ్గమో గుర్తొచ్చేలా చేస్తుంది'' అన్నారు నిర్మాత. ''ఈ చిత్రంలో మనసుకు హత్తుకునే భావోద్వేగాలు ఉన్నాయి'' అన్నారు రాజేంద్ర ప్రసాద్.



ఎల్బీ శ్రీరామ్, రాజేంద్రప్రసాద్

గమనిక

సాక్షి పెళ్ళిచూపులు ఒక వివాహ వేదిక మాత్రమే. ప్రకటనదారులకు సంబంధించి ఎట్టి హామీలకు పత్రిక సాక్ష్యం కాదు. ఈ వేదికలో వచ్చే ప్రకటనల సాధ్యాసాధ్యాలు, వధూవరుల వివరాలను పెండ్లి పెద్దలు స్వయముగా వెళ్ళి పరిశీలించిన తరువాత నిర్ణయాలు తీసుకోవాలి. **బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు.** కావున పాఠకులు ఈ విషయాన్ని గమనించి మీకు తగిన సంబంధాన్ని నిర్ణయించుకోండి.

వధువు కావలెను

కమ్మ / 45y/5'7" / ప్రైవేట్ జాబ్/ 40,000/-PM/ ద్వితీయ వివాహ వరునికి కమ్మ, రెడ్డి, కాపు పిల్లలు లేని అందమైన వధువు కావలెను. Cell: 6301410589 [H-1027251]

రజక/కట్నప్రసక్తిలేదు/B.Tech/C.Govt. బ్యాంక్ మేనేజర్/SB I/80,000/-PM/5'9" ఎత్తు/29 సం॥ల అందమైన వరునికి వధువు కావలెను. Ph: 8341650195 [HA-14317]

క్రిస్టియన్ మాల/కట్నప్రసక్తి లేదు / 29/ 5'9"/ M.Tech/ Govt.Asst.మేనేజర్/ HPCL/1 Lakh.PM అందమైన వరునికి వధువు కావలెను. Ph: 6309258463 [HA-14317]

SC మాల&క్రిస్టియన్/M.Tech/ C. Govt. కస్టమ్స్ ఇన్స్‌పెక్టర్/80,000/-PM / 5'8"ఎత్తు /28 సం॥ల వరునికి వధువు కావలెను. కట్న ప్రసక్తి లేదు. Ph: 9676995093 [HA-14317]

యాదవ/కట్న ప్రసక్తి లేదు/B.Tech,IIT/ C.Govt. మేనేజర్/IOCL/ 1.50Lakh PM / 6'ఎత్తు/29 సం॥ల అందమైన వరుడికి వధువు కావలెను. Ph: 9966760501 [HA-14317]

SC మాల క్రిస్టియన్/28Yrs/5'10"/ B.Tech, MBA, IIM/ సాఫ్ట్‌వేర్ ఇంజినీర్/ 18 Lakhs. PA/వెల్ సెటిల్డ్ ఫ్యామిలీ గల వరుడికి వధువు కావలెను. వాట్సాప్. 7416007606 [HA-14322]

కాపు/61Yrs/బిజినెస్/Hyd/వెల్ సెటిల్డ్ వరుడికి ఉన్నత కుటుంబానికి చెందిన 40–50 సం॥లోపు వధువు కావలెను. Ph: 6281550588 [HA-14322]

SC మాల/ 32/ 5'9"/ B.Tech/IIT/ SWE Job/30-L PA/Well Settled వరుడికి తగిన వధువు కావలెను. Ph 7702195227 [HA-13664]

గంపుపుత్ర (బిస్త)/32 సం॥/5'9"/ సెంట్రల్ Govt Job B.Tech,MBA, 15-L PA/ only Son బాగా స్థిరపడిన వరుడికి తగిన వధువు కావలెను. కుల పట్టింపు లేదు. Ph : 6301621607 [HA-13664]

డైరెక్ట్ కాంటాక్ట్: వైశ్య, 46Yrs/5'.5"/ బిజినెస్, జాబ్, 30Cr. స్థిరాస్తి గల ఏకైక అబ్బాయికి అందమైన అమ్మాయి కావలెను. కట్నం పట్టింపులేదు. (నో బ్రోకర్స్). 7680872085, 9182161015. [T-2641]

కమ్మ 56/5'10"/ Fair / NRI Doctor అక్కడే స్థిరపడిన వరుడుకు ఏ బాదర బంది లేని అందమైన చదువుకున్న 45 సం॥లోపు ఇంట్లో ఉండిపోయే వధువు కావలెను. ఫోన్: 80746 87749 [V- 786904]

BC, యాదవ్ Age: 35 సం॥ 5.5 Fair కలర్ వరునికి తగిన BC, OC, FC వధువు కావలెను. ఆస్తి 1 కోటి రూ॥ నెలకు 20 వేల ఆదాయం, అర్జెంటుగా కావలెను. వరంగల్. 9440187048, 7989380219 [W-1264949]

★

రెడ్డి/లేట్ మ్యారేజ్/34y/నెలకు లక్ష రూపాయల ఆదాయం. Hydలో సొంత ఇల్లు, కోట్ల ప్రాపర్టీ గల హైదరాబాద్ వరుడికి ఓన్లీ తెలంగాణ వధువు కావలెను. డైవర్సీ /విడో OK కుల, కట్న ప్రసక్తి లేదు. డైరెక్ట్. Ph: 7989079290 [H-801605]

మున్నూరుకాపు/31/5.8/ Bhmet/ మంచి జీతం/ హైదరాబాదులో జాబు/ ఇల్లు ఆస్తి కలిగిన వరునికి జాబు ఉండి కుల, కట్నం ప్రసక్తి లేని వధువు కావలెను. డైరెక్ట్: 94401 22661 [L-795779]

ఆర్యవైశ్య అమ్మాయి కావలెను. ఆర్యవైశ్య అబ్బాయి 35 M.Sc., M.Ed ప్రైవేట్ లెక్చరర్ 30–40 వేలు, ఆస్తి 90 లక్షలు, నల్లగొండ, M9HB మునుగోడ్ రోడ్, వీరయ్య సంప్ర॥ 9121325068 [Y-798323]

★★

డైరెక్ట్/5'5"/55Yrs/కాపు. కుల పట్టింపు లేదు. నెలకు రూ. నల్లై యాభై వేల ఆదాయం కలిగి, సుమారు రూ. 40 లక్షల స్థిరాస్తి గల వ్యక్తికి మంచి మనసున్న వధువు కావలెను. పిల్లలు ఉన్నా, లేకున్నా ఓకే. Ph : 8341482731 [H-1177632]

M.Sc B.Ed, గవర్నమెంట్ జాబ్ చేయుచు ఆదర్శభావం గల వరునకు కులమతం పట్టింపు లేని వధువు కావలెను. డైరెక్ట్ 9160248588 [C-800226]

36yrడైవర్సీ/కులపట్టింపులేదు/Govt. ఎంప్లాయ్ / 2,50,000/-లక్షలు (PM) వెల్ సెటిల్డ్ అందమైన వధువుకి సాంప్రదాయమైన వరుడు కావలెను (పిల్లలు ఉన్నా OK) సంప్ర : 9032445378 [H-778770]

బ్రాహ్మణ/33yrs/5'2"/ఇంటర్. "29yrs/5'4" డిగ్రీ. "25yrs/5'2"MBA వధువులకు వరులు కావలెను/రిక్రూట్‌మెంట్ Pvt.Govt జాబ్ & పురోహితం అయినా OK Ph: 8074770878 [H-778770]

కమ్మ/కుల పట్టింపు లేదు/ఏజ్ 57yrs/2nd మ్యారేజ్ & లేట్ మ్యారేజ్ అయినా ఓకే/5'4"/ ఫెయిర్ /Govt. జాబ్ 95K (PM)/ ఒంటరి/ ప్రాపర్టీస్ కలవు/ఇల్లరికం కావలెను. #9581120134 [H-778770]

రెడ్డి/Age: 30, ఎత్తు : 5'4", పెళ్ళి లేక స్నేహ పూర్వకంగా కలసి ఉండుటకు ఆర్థికంగా స్థిరపడిన వరుడు కావలెను. Ph: 9346025488 [H-778770]

మాల/25/5'4"/B.Tech/C.Govt.Asst. మేనేజర్/ఇండియన్ బ్యాంక్/ 60,000/-PM/ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 6309258463 [HA-14317]

వడ్డెర/B.Tech/C.Govt.Asst మేనేజర్ /కెనరా బ్యాంక్/ 55000/-PM / 5'4" ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8341650195 [HA-14317]

హిందూ మాల/B.Tech, NIT/C.Govt. ఇన్స్‌పెక్టర్/ఎక్సైజ్ Dept/80,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9908222406 [HA-14317]

బెస్త, గంగపుత్ర, అగ్నికుల క్షత్రియ/ M.Sc/ Govt.Jr.Asst/రెవెన్యూ Dept / 45000/-PM/ 5'5"ఎత్తు/25 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9966760501 [HA-14317]

వాల్మీకి బోయ/B.Tech/Govt. ఇంజినీర్/ఎలక్ట్రికల్ Dept/60,000/-PM/ 5'5" ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9618008271 [HA-14317]

క్రిస్టియన్ మాదిగ/B.Tech, IIT/C.Govt. డిప్యూటీ మేనేజర్/ SBI/85000/-PM/ 5'4"ఎత్తు/26 సం॥ల అందమైన వధువుకు తగిన వరుడు కావలెను. Ph: 6305007091 [HA-14317]

వరుడు కావలెను

రెడ్డి/విడో, కుల, మత, ఆస్తి ప్రసక్తి లేదు/Age: 29, Qly: డిగ్రీ/సొంత వ్యాపారం కలిగిన అందమైన వధువుకి వరుడు కావలెను. 1st (or) 2nd (ఇల్లరికం OK). Ph: 9515673252 [HA-14318]

అవినాష్ రెడ్డి మ్యారేజెస్ (D.V. కోటి రెడ్డి)

రెడ్డిలకు మాత్రమే. D.V. కోటిరెడ్డి, 690, Road No:-3, Banjara Hills (TV-9, Opp: Colony) (IOC Petrol Bunk Side Road) Hyd. +91 9848011818 / +91 9393311818 (Tuesday Holiday) Timings : 10 am - 6 pm. www.avinashreddy.com, e-mail: avinash11818@gmail.com

వధువు కావలెను

రెడ్డి Chicago, Citizen, BS, 27, 6' 1", Engineer, 100 Crores. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 33, 5' 11", SWE, 295 K, H1, USA, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No. 3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 30, 6', Software Developer, 140 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Seattle, Citizen, BS, 28, 6', Sr SWE, 200 K, Rich Family. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

వరుడు కావలెను

రెడ్డి Chicago, Citizen, BS, 24, 5' 5", SWE, 20 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, 27, 5' 5", SWE, 130 K, H1, Fair & Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, 27, 5' 4", SWE, 20 L P/A, 20 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Dallas, BE, MS, 26, 5' 3, SWE, 60 K, 30 Crores, Fair. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.



రెడ్డి Atlanta, BE, MS, 31, 6' 1", Systems Engineer, 110 K, H1. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 30, 5' 8", Lead Analyst, 61 L P/A, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 30, 5' 7", PG Doctor, 30 Crores, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 26, 5' 9", Engineer, 110 K, 40 Crores, USA. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి Seattle, BE (NIT), MS, 25, 5' 6", SWE, 100 K, H1, Rich. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MBA, 32, 5' 8", Manager, 40 L P/A, 20 Crores, Hyd. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి MBBS, MD, 27, 5' 5", PG Doctor, Rich Family, Hyderabad. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

రెడ్డి BE, MS, 29, 5' 6", Developer, USA, 10 Crores, Fair& Slim. Avinash Reddy Marriages, 690, Road No.3, Banjara Hills, Hyd. 9393311818, 9848011818.

LETTER

రెండో పెళ్లి/విడో/52y/Fair/వైజాగ్/ లెక్చరర్/ వెల్ సెటిల్ పిల్లలు లేని ఏ బాదర బందీలేని అందమైన ఏకైక వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 8519803423 [HA-14322]

రెండో పెళ్లి/63y&61y&59y&57y& 55y& 53y &51y& 50y&48y&47y& 46y&44y& 43y&42y& 40y & 39y&37y& 35y& 33y&31y&30y& 28y&26y & 24y/"మా సేవ" (Since 1998): PH/WA: 9291503949 [HA-14318]

రెడ్డి/ కుల పట్టింపు లేదు/26yB.Tech/ 5'4"/పెద్ద స్థిరాస్తి కలిగి తండ్రి లేని ఏకైక వధువుకు మిడిల్ క్లాస్ వరుడు కావలెను. మీ ఫోటోలు వాట్సాప్‌లో సెండ్ చేయండి. Ph: 9885492498 [HA-14318]

రెడ్డి/2nd మ్యారేజ్/Age: 31, H:5'5", డిగ్రీ, Rental Shops, Land Well Settled గల అందమైన వధువుకి వరుడు కావలెను (ఇల్లరికం ఓకే) (కుల, ఆస్తి ప్రసక్తి లేదు) 1st/2nd OK. Ph: 9030062353 [HA-14318]

FC/విడో/58y/ కుల పట్టింపు లేదు/ ప్రభుత్వ రిటైర్డ్/Own House/మంచి ఆర్థిక స్తోమత గల ఒంటరి వధువుకు స్నేహ పూర్వకమైన వరుడు కావలెను. Ph: 9618862631 [H-800480]

కుల పట్టింపు లేదు/విడో/45Medical Health Dept (DCHS) Doctor/సొంత హస్పిటల్/3L PM/సొంత విల్లా/25 ఎ॥ ల్యాండ్స్/కోట్ల ఆస్తులు గల వెల్ సెటిల్ అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9959006282 [H-800480]

కమ్మ/48y/విడో/Govt. Job / సొంత ఇల్లు/సొంత బిజినెస్/5Lac Income/ 38Acres Land గల వధువుకు FC/BC వరుడు కావలెను. Ph: 7702576930 [H-800480]

ఆస్తి, కుల పట్టింపు లేని/వధువుకి వరుడు కావలెను/ 60y/విడో/ 5'4"/ సొంత బిజినెస్/1 L/PM/2 సొంత ఇల్లులు /పిల్లలు లేరు. Ph: 9381147915 [H-800480]

SC మాల హిందూ/B.Tech/ 25y/ 5'4"/సాఫ్ట్‌వేర్ ఇన్ఫోసిస్ (Hyd)/60K per Month చాలా అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9705960270 [H-800480]

కాపు/CNB/ 32/5'4"/ B.Tech/MBA/ 18L PA/SWE Job వెల్ సెటిల్డ్ in Hyd అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 8897091964 [HA-13664]

SC మాల/25/5'4"/M.Sc/Govt Job/ 9-LPA/ Well Settled (అగ్రికల్చర్) Ofco అందమైన వధువుకు వరుడు కావలెను. Ph: 9390933661 [HA-13664]

గౌడ / 27/ 5'4" / B.Tech/ MBA/ Govt.Job (AE) 12-L PA/ Well Settled వధువుకు వరుడు కావలెను. Ph: 6281925716 [HA-13664]

బ్రాహ్మణ/24/5'3"/B.Sc "27/5'4"/ MBA "30/ 5'3"/B.Sc "27/5'2"/ ఇంటర్/32/5'2"/ఇంటర్ వధువులకు వరులు కావలెను. జాబ్/ బిజినెస్/ పురోహితులకు త్వరగా కుదుర్చబడును. Ph: 7842635086 [HA-14318]

వేదికలు

1వ / 2వ /లేట్ విడో/విడోయర్/పెన్షనర్స్ స్త్రీలకు మరియు పురుషులకు కుల పట్టింపు లేని అన్ని కులాల వారికి వ॥ 21–80 సం॥ పెళ్లి సంబంధాలు త్వరగా చూడబడును. సంప్ర : 8374802803 [H-778770]

మాల, మాదిగ స్పెషల్, IAS, IPS, IFS, IRS, గ్రూప్-I, II, PG, డాక్టర్స్, బ్యాంక్ PO, Govt. ఆఫీసర్స్ USA, UK. Ph: 7396915712 [HA-14322]

రెడ్డి – పరిచయ వేదిక– 26/05/24న 10.00AM నుండి రెడ్డి వధూవరుల పరిచయ వేదిక (India/USA) కొత్తపేట, Hyd. సంప్ర: P. Prabhakar Reddy. Ph: 9391198332 [HA-14322]

తెలుగు రాష్ట్రాల్లోని ప్రతి మండల, జిల్లా కేంద్రాల్లో క్రిస్టియన్ హెవెన్ మాట్రిమోనికి కోఆర్డినేటర్లు (ఫ్రాంచైజీలు) కావలెను. బయోడేటాను 7330957771 కు వాట్సాప్ చేయండి. ఆకర్షణీయమైన వేతనం. [HA-97068]

"శుభమస్తు" మ్యారేజ్ బ్యూరో TM Estd: 1995 గౌడ, ఈడిగ, శెట్టిబలిజ, 1st/2nd, దేశ/విదేశీ సంబంధాలకై సం॥ లింగాల కాంప్లెక్స్ DSNR, HYD వ్యవస్థాపకులు :Late S.నారదా గౌడ్. సం॥ S.నాముల గౌడ్. 8790690309 [H-800467]

ఫ్రీ రిజిస్ట్రేషన్ అన్ని కులములవారికి Govt/ సాఫ్ట్‌వేర్/ గెజిటెడ్/ MBBS/ PG/ NRI/Pvt/బిజినెస్/1వ/2వ/లేట్ AP/TS 15 సం॥ Exp. Ph: 9100474440 [HA-32115]

Brahmin, Padmashali పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14318]

Christian పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14318]

Kamma, Kapu పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8522047149 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14318]

Madiga - Mala పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Shyam, Ph: 9949233422 / Blue Trend Matrimonial (P) Ltd. [HA-14318]

Reddy పెళ్ళి సంబంధాలకై సంప్ర: Verified Profilesతో నమ్మకమైన సంస్థ. Srinivas, Ph: 8522047149/ Blue Trend Matrimonial (P) Ltd. [HA-14318]

Personal Service- అన్ని కులాలు, అన్ని జిల్లాలు సాఫ్ట్‌వేర్స్, డాక్టర్స్,అబ్రాడ్ మొదటి, రెండవ, లేట్ మ్యాచ్‌లు తొందరగా చూడబడును. పూర్ణ మాట్రిమని, తిరుపతి, 7093722724. [T-2925]

SC మాల, మాదిగ, క్రిస్టియన్స్ మాత్రమే, 1st మ్యారేజ్ పెళ్లి సంబంధాలకై సంప్రదించండి, సత్యనారాయణ. Verified All Govt Jobs Profiles కలవు. ఫ్రీ రిజిస్ట్రేషన్ వాట్సాప్ - 7989021063. [B-1251791]

★

Free Registration బ్రాహ్మణ మరియు అన్ని కులాల SWE, Govt., Doctors, MNC Matches, Late & 2nd Matches కై సంప్రదించండి. 9704656103, 9533608887 (Watsapp) [HA-759]

★★

మాల (క్రైస్తవ, హిందు) B.Tech, M.Tech, M.S, MBA, MBBS చదువులతో డాక్టర్స్, S.W బ్యాంక్ జాబ్ చేస్తున్న వధూవరుల వివరాలకు kalyanamala.org ✆ 94405 45049 [B-1264379]

2nd మ్యాచ్ క్రిస్టియన్, సంబంధాలు వధూవరులకి గవర్నమెంట్ / ప్రైవేట్ ఎంప్లాయిస్‌కి, ఇంజనీర్స్‌కి చూడబడును. ✆ : 77949 11019 [R-1151750]

బీఆర్ఎస్‌కు రాపోలు రాజీనామా

సాక్షి, న్యూఢిల్లీ: మాజీ ఎంపీ రాపోలు ఆనంద భాస్కర్ బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేశారు. ఈ మేరకు శనివారం ఢిల్లీలో మీడియాతో ఆయన మాట్లాడుతూ...బీఆర్ఎస్ పార్టీ కండువాను హైదరాబాద్ కార్యాలయానికి కొరియర్ చేస్తున్నానన్నారు. తన సేవలను బీఆర్ఎస్ సమర్థంగా వినియోగించుకోలేకపోయిందని చెప్పారు. రూ.లక్షల కోట్ల సంపదకు నెలవైన హైదరాబాద్‌ను కేంద్రపాలిత ప్రాంతంగా చేయాలని బీజేపీ భావిస్తోందని ఆరోపించారు. జాతీయస్థాయిలో కులగణనకు తన వంతు పోరాటం చేస్తానని తెలిపారు.

బలరాంనాయక్‌కు మాతృవియోగం



తల్లి లక్ష్మీబాయితో బలరాం నాయక్ (ఫైల్)

సాక్షి, మహబూబాబాద్: కాంగ్రెస్ పార్టీ మహబూబాబాద్ పార్లమెంట్ అభ్యర్థి, కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్ తల్లి పోరిక లక్ష్మీబాయి(100) మృతి చెందారు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ హనుమకొండలోని ఒక ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె శనివారం ఉదయం కన్నుమూశారు. లక్ష్మీబాయి మృతిపై సీఎం రేవంత్ రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

రామడుగు(చొప్పదండి): అప్పుల బాధతో కరీంనగర్ జిల్లా రామడుగు మండలం దేశరాజ్‌పల్లికి చెందిన కంకణాల రమేశ్ (55) అనే రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ సురేందర్ తెలిపిన వివరాలివి. రమేశ్ తండ్రి పేరిట 20 గుంటల వ్యవసాయ భూమి ఉంది. దీంతోపాటు మరో రెండెకరాలు కౌలుకు తీసుకొని సాగు చేస్తున్నాడు. దిగుబడి సరిగా రాకపోవడం, పంటల సాగు, కుటుంబ పోషణకు రూ.5 లక్షల వరకు అప్పులు చేశాడు. వాటినెలా తీర్చాలోనని నిత్యం మనోవేదనకు గురయ్యేవాడు. ఈ క్రమంలో శుక్రవారం ఇంటి వద్దే క్రిమిసంహారక మందు తాగాడు. కుటుంబసభ్యులు వెంటనే కరీంనగర్ ప్రభుత్వ వైద్యశాలకు తీసుకెళ్లారు. పరిస్థితి విషమించడంతో వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎంకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ అదేరోజు రాత్రి మృతి చెందాడు. శనివారం మృతుని భార్య సమత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ పేర్కొన్నారు. కాగా, మృతునికి ఒక కూతురు, కుమారుడు ఉన్నారు.

ఆర్టీసీలో జీతాలకూ కటకట

- డ్రైవర్లు, కండక్టర్లకు మాత్రమే చెల్లింపు
- మిగిలిన పదివేల మంది ఎదురుచూపు
- ఒకటో తేదీనే చెల్లింపు పద్ధతికి రెండేళ్ల తర్వాత ఇబ్బంది
- 'మహాలక్ష్మి'తో పడిపోయిన రోజువారీ ఆదాయం
- ఆ వచ్చే మొత్తం చమురుకే సరి

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీలో రెండేళ్ల తర్వాత మరోసారి వేతనాలకు కటకట ఏర్పడింది. ఎండీగా సజ్జనార్ బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆర్టీసీలో వేతన సమస్య తీరింది. ఒకటో తేదీనే కార్మికులకు వేతనాలు అందించే పాత సంప్రదాయాన్ని ఆయన పునరుద్ధరించారు. అయితే ఇప్పుడు మళ్లీ సమస్య ఏర్పడింది. ఏప్రిల్ నెలకు సంబంధించి కొంతమందికే వేతనాలు అందాయి. వేతనాలకు సరిపడా నిధులు లేకపోవటంతో, గురు, శుక్రవారాల్లో రెండు విడతలుగా డ్రైవర్లు, కండక్టర్లకు సర్దుబాటు చేశారు. గ్యారేజీ సిబ్బంది సహా మిగతా ఉద్యోగులకు అందలేదు. శుక్రవారం సాయంత్రం బ్యాంకు పనివేళలు ముగిసేసరికి కూడా వారి ఖాతాల్లో జమ కాలేదు. కొద్ది రోజుల క్రితం, 2015 వేతన సవరణ బకాయిలకు సంబంధించిన బాండు డబ్బుల చెల్లింపులో కూడా ఇదే తరహా గందరగోళం నెలకొన్న సంగతి తెలిసిందే. ముందుగా డ్రైవర్లకు మాత్రమే చెల్లించి మిగతావారికి చెల్లించలేదు. ఇప్పుడు వేతనాల విషయంలోనూ అదే తరహా పరిస్థితి ఉత్పన్నం కావటంతో కార్మికుల్లో ఆందోళన



వ్యక్తమవుతోంది.

రోజువారీ ఆదాయం సరిపోకనే...

ఆర్టీసీలో ప్రతినెలా దాదాపు రూ.225 కోట్ల వరకు వేతన పద్దు నమోదవుతుంది. రోజువారీ ఆదాయం నుంచి ఈ మొత్తాన్ని చెల్లిస్తారు. మహాలక్ష్మి పథకంలో భాగంగా ఎక్స్‌ప్రెస్, ఆర్డినరీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణ వసతి ప్రారంభించాక, ఆర్టీసీ రోజువారీ టికెట్ ఆదాయం భారీగా పడిపోయింది. గతంలో నిత్యం రూ.16 కోట్లకుపైగా ఆదాయం నమోదవుతూ రాగా, ఉచిత ప్రయాణ వసతి అందుబాటులోకి వచ్చిన తర్వాత అది రూ.10 కోట్లకు పడిపోయింది. దీంతో ఒక్కసారిగా ఆర్టీసీకి ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. ఆర్టీసీకి నిత్యం రూ.ఆరున్నర కోట్లకుపైగా డీజిల్ ఖర్చు ఉంటుంది. చమురు సరఫరా సంస్థలు 48 గంటల ఉద్దెరకు మాత్రమే అవకాశం ఇస్తాయి. రోజువారీ ఆదాయం నుంచి ఆ మొత్తాన్ని ఆర్టీసీ చెల్లిస్తుంది. కొద్ది రోజుల క్రితమే హైకోర్టు ఆదేశంతో, ఆర్టీసీ సహకార పరపతి సంఘానికి రూ.150 కోట్ల బకాయిలను చెల్లించింది. దీంతో ఒక్కసారిగా నిధులు నిండుకున్నాయి. ఫలితంగా కొద్దిరోజులుగా చమురు సరఫరా సంస్థలకు రూ.20 కోట్ల వరకు బకాయిలు పేరుకుపోయినట్టు తెలిసింది. ఆ సంస్థలు ఒత్తిడి చేయటంతో నాలుగైదు రోజులుగా రోజువారీ ఆదాయాన్ని పోగు చేసి చెల్లించారు. దీంతో వేతనాలకు ఇబ్బంది ఏర్పడినట్టు తెలుస్తోంది.

ప్రభుత్వం నుంచి ఆగిన నిధులు!

ప్రభుత్వం నుంచి రావాల్సిన నిధులు పూర్తిగా రాకపోవటంతో ఆర్టీసీలో ఆర్థిక ఇబ్బందులు మొదలయ్యాయి. గతేడాది బడ్జెట్‌లో ప్రకటించిన రూ.1500 కోట్లకు సంబంధించిన బకాయిలు, మహిళల ఉచిత ప్రయాణానికి సంబంధించిన రీయింబర్స్‌మెంట్ మొత్తం.. రెండూ కలిపి రూ.2 వేల కోట్లకు పైగా ఉంటుంది. ఇందులో కొంతమొత్తమే విడుదలైనట్టు తెలిసింది.

వెంటనే చెల్లించాలి: కార్మిక సంఘాలు

డ్రైవర్లు, కండక్టర్లకు వేతనాలు చెల్లించి మిగతా పది వేల మంది ఉద్యోగుల ఖాతాల్లో జమ చేయకపోవటం ఉద్యోగుల్లో గందరగోళానికి కారణమవుతోందని ఆర్టీసీ బోర్డు మాజీ డైరెక్టర్ నాగేశ్వరరావు అన్నారు. వెంటనే ఉద్యోగులందరికీ చెల్లించాలని కోరారు. ఇక పదేళ్ల క్రితం నాటి వేతన సవరణ బాండు బకాయిలతో పాటు ఇప్పుడు ఏప్రిల్ నెలకు సంబంధించి అందరికీ ఒకేసారి వేతనాలు చెల్లించకపోవటం సరికాదని ఎస్ఎంయూ నేత నరేందర్ అభిప్రాయపడ్డారు.

రోహిత్ ఆత్మహత్యపై విచారణ జరిపించండి

సీఎం రేవంత్‌కు రోహిత్ తల్లి విజ్ఞప్తి

సాక్షి, హైదరాబాద్/రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి రోహిత్ వేముల తల్లి రాధిక శనివారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆయన నివాసంలో కలిశారు. రోహిత్ ఆత్మహత్యపై సమగ్ర విచారణ జరిపించి తమకు న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆమె సీఎంకు వినతిపత్రం సమర్పించారు. రోహిత్ ఆత్మహత్యకు ఎవరూ కారణం కాదని, ఆయన ఎస్సీ కూడా కాదని విచారణలో తేలిందని పేర్కొంటూ కేసు విచారణ అధికారి న్యాయ స్థానంలో కేసు మూసివేతకు అనుమతి కోరుతూ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. దీనిపై రోహిత్ తల్లితో పాటు దళిత సంఘాలు, ప్రజాసంఘాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తం కావడంతో కేసు పునర్విచారణకు ఆదేశిస్తూ డీజీపీ నిర్ణయం తీసుకున్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే కేసును మూసివేయాలని నిర్ణయం తీసుకుని ప్రతిపాదనలను సిద్ధం చేసినట్టు కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపించింది.

న్యాయం జరిగేంత వరకు పోరాటం..

రోహిత్ వేముల కేసును రీఓపెన్ చేస్తున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డి తనకు హామీ ఇచ్చారని రోహిత్ తల్లి



విచారణ జరిపించాలని సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న రోహిత్ తల్లి వేముల రాధిక

వెల్లడించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ ప్రధాన గేటు వద్ద ఆమె హెచ్‌సీ యూలోని వివిధ విద్యార్థి సంఘాల ప్రతినిధులతో కలిసి శనివారం సాయంత్రం విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ, రాష్ట్రంలో కొంత మంది పోలీసులు బీజేపీకి అనుకూలంగా విచారణ చేపట్టారని ఆరోపించారు. పోలీసుల నివేదికను ఖండిస్తున్నామని, రోహిత్ వేముల ఎస్సీ కాదని పోలీసులు ఎలా ధ్రువీకరిస్తారని ఆమె ప్రశ్నించారు. ఈ కేసులో అప్పటి హెచ్‌సీయూ వైస్‌చాన్స్‌లర్ పొదిలి అప్పారావు, బీజేపీ నాయకులు బండారు దత్తాత్రేయ, మాజీ ఎంఎల్‌సీ రామచంద్రారావు, యూనివర్సిటీ ఏబీవీపీ నాయకుడు సుశీల్ కుమార్‌పై చర్యలు తీసుకోవాలని ఆమె డిమాండ్ చేశారు. సీఎం ఈ కేసును రీఓపెన్ చేస్తామని చెప్పడం పట్ల సంతృప్తి వ్యక్తం చేశారు.

దోషులను కఠినంగా శిక్షించాలి

- సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని

సాక్షి, హైదరాబాద్: రోహిత్ వేముల ఆత్మహత్య కేసుపై సమగ్ర విచారణ జరపాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం డిమాండ్ చేశారు. ఆయన ఆత్మహత్యకు కారుకులను కఠినంగా శిక్షించాలని శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రోహిత్ కులంపై జిల్లా కలెక్టర్ తన నిర్ణయాన్ని ప్రకటించక ముందే పోలీసులు హడావుడిగా అత్యుత్సాహంతో తప్పుడు నివేదికను హైకోర్టుకు సమర్పించారని ఆరోపించారు. దీని వెనకాల బీజేపీ నేతలు, హెచ్‌సీయూ వైస్ చాన్స్‌లర్‌పై ఉన్న కేసులు ఎత్తేయడానికే ఇలా చేశారని సీపీఎం భావిస్తోందన్నారు.

న్యాయవాద వృత్తికి గుర్తింపు తీసుకురావాలి

హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె. సురేందర్

పాలమూరు: న్యాయవాదులు వృత్తికి గుర్తింపు తీసుకురావడంతో పాటు కక్షిదారులకు న్యాయం జరిగేలా చూడాల్సిన బాధ్యత ఉందని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేందర్ అన్నారు. జిల్లా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శనివారం రాత్రి మహబూబ్‌నగర్‌లోని అన్నపూర్ణ గార్డెన్‌లో నిర్వహించిన వార్షికోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాట్లాడుతూ జిల్లా కోర్టు నూతన భవనంపై త్వరలో స్పష్టత వస్తుందన్నారు. దీంతోపాటు బార్ అసోసియేషన్ పెట్టిన డిమాండ్లపై కూడా దృష్టి పెడతామని చెప్పారు. అంతకుముందు మరో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీదేవి మాట్లాడుతూ న్యాయవ్యవస్థలో కొత్తగా ఎంతో మందిని తయారు చేసుకోవాల్సిన అవసరం ఉందని, కొత్త వారిని న్యాయ వ్యవస్థలోకి తీసుకురావడానికి న్యాయవాదులు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు జిల్లాలో సీనియర్ న్యాయవాదులు కొత్త జనరేషన్ యువతను న్యాయ వ్యవస్థలో ప్రోత్సహించాలన్నారు. జిల్లాలో యువ న్యాయవాదులకు శిక్షణ సెంటర్ ఏర్పాటు చేసి



మాట్లాడుతున్న జస్టిస్ కె.సురేందర్

వారిలో నైపుణ్యం పెరిగే విధంగా చొరవ తీసుకోవాలని సూచించారు. జిల్లా నూతన కోర్టు అంశంపై హైకోర్టులో తన వంతు కృషి చేస్తానని చెప్పారు. అనంతరం హైకోర్టు న్యాయమూర్తులను ఘనంగా సన్మానించారు. అలాగే సివిల్స్‌లో ఆలిండియా మూడో ర్యాంకు సాధించిన అనన్యరెడ్డిని న్యాయమూర్తులు సన్మానించారు. కార్యక్రమంలో జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.పాపిరెడ్డి, రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యుడు హన్మంతురెడ్డి, మనోహర్‌రెడ్డి, జిల్లా బార్ అసోసియేషన్ అధ్యక్షుడు సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శి రామ్‌నాథ్‌గౌడ్ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

మోదీనే రాజ్యాంగానికి రక్షణ కవచం

- కాంగ్రెస్ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కులేదు
- ఎంఆర్‌పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ
- రేవంత్‌రెడ్డి అహంకారి: మోత్కుపల్లి నర్సింహులు



ధర్నాలో అభివాదం చేస్తున్న మంద కృష్ణమాదిగ, మోత్కుపల్లి నర్సింహులు, ఎంపీ వెంకటేశ్ నేతకాని, దాసు సురేశ్

కవాడిగూడ (హైదరాబాద్): కేంద్రంలో బీజేపీ మారోసారి అధికారంలోకి వస్తే రాజ్యాంగం, రిజర్వేషన్లు రద్దు అవుతాయంటూ కాంగ్రెస్ పార్టీదు ష్ప్రచారం చేస్తోందని, అయితే ఆ పార్టీకి రాజ్యాంగం గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని ఎంఆర్ పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ అన్నారు. భారత రాజ్యాంగానికి, రిజర్వేషన్లకు దేశ ప్రధాని నరేంద్ర మోదీయే రక్షణ కవచంగా నిలుస్తున్నారని ఆయన పేర్కొన్నారు. శనివారం ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో ఎంఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ మాదిగలకు తగిన సీట్లు కేటా యించకపోవడాన్ని నిరసిస్తూ మహాధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా మంద కృష్ణమాదిగ, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని హాజరయ్యారు. ఈ సందర్భంగా మందకృష్ణ మాదిగ మాట్లాడుతూ.. మాదిగల రాజకీయ అస్తిత్వాన్ని కాలరాస్తున్న కాంగ్రెస్ పార్టీని ఈ ఎన్నికల్లో సమాధి చేయాలని పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం అనంతరం ఏనాడు లేని అవమానం మాదిగలకు రేవంత్‌రెడ్డి పాలనలో జరిగిందన్నారు. రాబోయే ఎన్నికల్లో మోదీ నాయకత్వాన్ని బలపరుస్తూ, జనాభా దామాషా ప్రకారం పార్లమెంటు సీట్లు ప్రకటించిన బీజేపీని గెలిపించాలని కోరారు.

మోత్కుపల్లి నర్సింహులు మాట్లాడుతూ.. రేవంత్‌రెడ్డి చెడ్డీ తొడగక ముందే తాను ఎమ్మెల్యేగా గెలిచానని, రాష్ట్రంలో రాజకీయంగా మాదిగలకు తీరని అన్యాయం చేస్తున్నారనే అంశాన్ని వివరించేందుకు సీఎం అపాయింట్‌మెంట్ కోరి తే ఇవ్వకుండా తన అహంకారాన్ని ప్రదర్శించారని విమర్శించారు. తన రాజకీయ జీవితంలో అనేక మంది ముఖ్యమంత్రులను చూశానని, కానీ రేవంత్ రెడ్డి వంటి అహంకారిని ఎన్నడూ చూడలేదని ఆవే ద వ్యక్తం చేశారు. 40 సంవత్సరాలు ఆత్మగౌరవంతో రాజకీయాలు చేశానని, మాదిగలు కాంగ్రెస్ పార్టీ కి ఓట్లు వేస్తే మోత్కుపల్లి నర్సింహులును చంపివేసినట్లేనని ఆయన కన్నీటి పర్యంతం అయ్యారు. వెంకటేశ్ నేతకాని మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ పాలనలో రెడ్డి సామాజిక వర్గానికి తప్ప ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గాలకు సముచిత న్యాయం దక్కడం లేదన్నారు. ఎంఆర్‌పీ ఎస్ తెలంగాణ అధ్యక్షుడు గోవింద్‌నరేశ్ మాదిగ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంఆర్‌పీఎస్ జా తీయ నాయకులు తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, బీసీ రాజ్యాధికార సమితి అధ్యక్షులు దాసు సురేశ్ పాల్గొన్నారు.



ఉరిమింది వేసవి.. ఉరికింది గోదారి

దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద ఉప్పొంగుతున్న నది

అశ్వాపురం: మండువేసవిలోనూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం కుమ్మరిగూడెంలో గోదావరి నదిపై ఉన్న దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద గోదావరి ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఇటీవల ఆనకట్ట వద్ద నీరు తగ్గగా.. తాగునీటి ప్రాజెక్టులకు సరఫరాలో సమస్య ఎదురవుతుందని భావించారు. దీంతో నీటిపారుదల శాఖ, మిషన్ భగీరథ అధికారులు ములుగు జిల్లా తుపాకులగూడెం వద్ద సమ్మక్కసాగర్ బ్యారేజీ నుంచి నీటిని వదలడంతో దుమ్ముగూడెం ఆనకట్ట వద్ద నీటిమట్టం పెరిగింది. దుమ్ముగూడెం ఆనకట్ట పైనుంచి శనివారం నీరు పరవళ్లు తొక్కడం విశేషం. ఈమేరకు మిషన్ భగీరథ ద్వారా తాగునీరు, అశ్వాపురంలోని భారజల కర్మాగారం, ఇతర ప్రాజెక్టులు, పరిశ్రమలకు సరఫరాలో ఇక్కట్లు తీరినట్లేనని అధికారులు చెబుతున్నారు.

క్లుప్తంగా...

11 ఏళ్లకే గౌరవ డాక్టరేట్

నగరానికి చెందిన చిన్నారి కలశ నాయుడికి అరుదైన గౌరవం



డాక్టరేట్ అందుకుంటున్న కలశ నాయుడు

సనత్‌నగర్: నగరానికి చెందిన తెలుగు తేజం చిన్నారి కలశ నాయుడు అరుదైన గౌరవాన్ని దక్కించుకుంది. 11 ఏళ్లకే గౌరవ డాక్టరేట్‌కు ఎంపికైంది. కలశ సామాజిక సేవా కార్యక్రమాలను గుర్తించిన యునైటెడ్ నేషన్స్ గ్లోబల్ పీస్ కౌన్సిల్ ఇటీవలే గౌరవ డాక్టరేట్ ప్రకటించింది. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కురాలిగా, సమాజ సేవకురాలిగా కలశ గుర్తింపు తెచ్చుకుంది. అక్షర కలశ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు, మహిళలకు అవార్డులు ఇవ్వడంతో పాటు గ్రీనరీని నిర్వహించింది.

టీఎస్‌సెట్-2024 నోటిఫికేషన్ విడుదల

14 నుంచి దరఖాస్తుల స్వీకరణ

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): అసిస్టెంట్ ప్రొఫెసర్లు, లెక్చరర్ల అర్హత పరీక్ష తెలంగాణ స్టేట్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టీఎస్ సెట్)-2024 నోటిఫికేషన్ విడుదలైంది. శనివారం ఓయూలోని టీఎస్‌సెట్ కార్యాలయంలో రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి, ముఖ్యకార్యదర్శి బుర్రా వెంకటేశం, సభ్య కార్యదర్శి నరేశ్‌రెడ్డితో పాటు పలు వర్సిటీల వీసీల చేతుల మీదుగా టీఎస్‌సెట్-2024 ప్రకటనను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నరేశ్‌రెడ్డి మాట్లాడుతూ పీజీ కోర్సులు పూర్తి చేసిన ఆసక్తి గల అభ్యర్థులు ఈనెల 14 నుంచి జూలై 2 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు. రూ.1,500 అపరాధ రుసుముతో జూలై 8, రూ.2,000తో జూలై 16, రూ.3,000 అపరాధ రుసుముతో జూలై 26 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఆగస్టు 28, 29, 30, 31 తేదీల్లో పరీక్షలు జరుగుతాయని, ఆగస్టు 20 నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చని తెలిపారు. తెలంగాణలోని ఉమ్మడి 10 జిల్లాల్లో పరీక్ష కేంద్రాలుంటాయని, ఏపీలో పరీక్షా కేంద్రాలను రద్దు చేసినట్లు చెప్పారు.

వరి పొలంలో చిరుత మృతి



మద్దూరు: వరి పొలంలో అనుమానాస్పద స్థితిలో ఓ చిరుత మృతిచెందిన సంఘటన శనివారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. నారాయణపేట జిల్లా మద్దూరు మండలంలోని మల్కిజాధరామ్‌పల్లి రెవెన్యూ శివారు గుబ్బడిగుట్ట సమీపంలో నందిపాడ్ గ్రామానికి చెందిన హన్మంతురావు తన వరి పొలం కోత కోయడానికి శనివారం ఉదయం హార్వెస్టర్‌తో వెళ్లాడు. ఈ క్రమంలో అక్కడ పొలంలో మృతిచెందిన చిరుతను గమనించి వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు. దీంతో వారు వచ్చి చిరుత కళేబరాన్ని పోస్టుమార్టం నిమిత్తం మహబూబ్‌నగర్‌కు తరలించారు. అయితే చిరుత ఎలా మృతిచెందింది అన్న విషయమై అధికారులు వివరాలు వెల్లడించలేదు. చిరుత మృతిచెంది ఐదు రోజులు అయి ఉంటుందని భావిస్తున్నారు.

నిమ్స్ డైరెక్టర్‌కు ఫెలోషిప్

- ఎఫ్ఆర్‌సీఎస్‌కు ఎంపిక చేసిన యూకేలోని రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్
- నవంబర్ లేదా డిసెంబర్‌లో జరిగే సదస్సులో డాక్టర్ బీరప్పకు ప్రదానం

లక్డీకాపూల్: నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ నగరి బీరప్పకు ప్రఖ్యాత సంస్థ ఫెలోషిప్‌తో గౌరవించింది. దేశంలో సీనియర్ సర్జన్‌గా పలు విభాగాల్లో సేవలు అందిస్తున్నందుకుగాను యూకేలోని గ్లాస్గోలో ఉన్న రాయల్ కాలేజ్ ఆఫ్ ఫిజీషియన్స్ అండ్ సర్జన్స్.. ఎఫ్ఆర్‌సీఎస్ (ఫెలోషిప్ ఆఫ్ రాయల్ కాలేజ్ ఆఫ్ సర్జన్స్)కు ఎంపిక చేసింది. ఆ కళాశాల 486 ఏళ్ల చరిత్రలో ప్రభుత్వరంగ ఆస్పత్రి సర్జన్‌కు ఎఫ్ఆర్‌సీఎస్ కేటాయించడం ఇదే తొలిసారి కావడం విశేషం. వైద్య వృత్తిలో అత్యంత సంక్లిష్టమైన శస్త్రచికిత్సలు చేయడంతోపాటు ఆస్పత్రిలో పేద రోగులకు నాణ్యమైన సేవలు వేగంగా అందించేలా డాక్టర్ బీరప్ప చొరవతీసుకున్నారని ఆ సంస్థ కొనియాడింది. ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్‌లో గ్లాస్గోలో నిర్వహించే సదస్సులో డాక్టర్ బీరప్పకు ఎఫ్ఆర్‌సీఎస్‌ను ఆ సంస్థ ప్రదానం చేయనున్నట్లు నిమ్స్ మీడియా ఇన్‌చార్జి సత్యగౌడ్ ఓ ప్రకటనలో తెలిపారు.

నెల ముందే గరిష్టానికి..!

మే నెలాఖరులో ఉండే స్థాయి ఉష్ణోగ్రతలు ఇప్పుడే నమోదు

- పలుచోట్ల ఏకంగా 46.8 డిగ్రీల సెల్సియస్ వరకు నమోదు
- రాష్ట్రవ్యాప్తంగా 26 ప్రాంతాల్లో 45 డిగ్రీలపైనే ఎండల మంటలు
- అన్నిచోట్లా సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీల మేర పెరుగుదల
- తొమ్మిది జిల్లాల్లో తీవ్రంగా వడగాడ్పులు వీచే అవకాశం
- మరో మూడు రోజులు ఇదే తరహా పరిస్థితి ఉంటుందన్న వాతావరణ శాఖ



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రతలు అత్యధిక స్థాయికి చేరాయి. సాధారణంగా మే నెల చివరివారంలో ఉండే స్థాయిలోని గరిష్ట ఉష్ణోగ్రతలు.. మే తొలివారంలోనే నమోదవుతుండటం గమనార్హం. శనివారం రాష్ట్రంలో అత్యధికంగా జగిత్యాల జిల్లా అల్లీపూర్, కరీంనగర్ జిల్లా వీణవంకలలో గరిష్ట ఉష్ణోగ్రత 46.8 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. అంతేకాదు రాష్ట్రవ్యాప్తంగా 26 ప్రాంతాల్లో 45 డిగ్రీలకుపైన ఉష్ణోగ్రతలు నమోదవడం గమనార్హం. దాదాపు అన్ని ప్రాంతాల్లో సాధారణం కంటే మూడు నుంచి ఐదు డిగ్రీల వరకు అధికంగా నమోదవుతున్నాయి. ప్రధాన పట్టణాల్లో చూస్తే.. మహబూబ్‌నగర్‌లో సాధారణం కంటే 4.5 డిగ్రీలు, హైదరాబాద్, ఖమ్మంలలో 4 డిగ్రీలు అధికంగా ఉన్నాయి. మరో మూడు రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా ఇలాగే అధిక స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

వడగాడ్పుల తీవ్రత పెరిగే చాన్స్

శనివారం రాష్ట్రంలోని చాలా ప్రాంతాల్లో వడగాడ్పులు వీచాయని.. ఆది, సోమవారాల్లో వడగాడ్పుల తీవ్రత మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ మేరకు పెద్దపల్లి, జయశంకర్ భూపాలపల్లి, ములుగు, నాగర్‌కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగుళాంబ గద్వాల, కరీంనగర్, ఖమ్మం జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాష్ట్రంలోని మిగతా జిల్లాలకు ఎల్లో అలర్ట్‌ను జారీ చేసింది. రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల కలెక్టర్లు అప్రమత్తంగా ఉండాలని, తక్షణ సహాయక చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించింది.

ఉరుములు, మెరుపుల వానలకు చాన్స్

మరాఠ్వాడ, దాని పరిసర ప్రాంతాల్లో ఉపరితల ఆవర్తనం కొనసాగుతోందని.. దాని ప్రభావంతో ఆది, సోమవారాల్లో అక్కడక్కడా వానలు పడవచ్చని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులు, గంటకు 40 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులతో కూడిన మోస్తారు వానలు పడే అవకాశం ఉందని వివరించింది.

అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన ప్రాంతాలివీ..

ప్రాంతం	గరిష్టం
అల్లీపూర్	46.8
వీణవంక	46.8
తెల్దేవరపల్లి	46.7
ఉట్కూరు	46.4
జకొర	46.4
నస్పూర్	46.3
ఈసల తక్కలపల్లి	46.1
ఎలుపుగొండ	45.9
వడ్డేపల్లి	45.9
వడ్డెమన్	45.9
మామిళ్లగూడెం	45.8
నర్సాపూర్	45.7
శ్రీరంగపూర్	45.7

ప్రధాన కేంద్రాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలివీ..

కేంద్రం	ఉష్ణోగ్రత
మహబూబ్‌నగర్	45.0
నిజామాబాద్	44.6
మెదక్	44.2
భద్రాచలం	44.0
నల్లగొండ	43.8
ఖమ్మం	43.8
రామగుండం	43.4
ఆదిలాబాద్	43.3
హైదరాబాద్	43.1
దుండిగల్	43.0
హకీంపేట్	43.0
హనుమకొండ	42.0

మండే ఎండలు ✗ మధుమేహం!

- అధిక ఉష్ణోగ్రతలతో దయాబెటిస్ బాధితులకు ఇబ్బందులు
- శరీరంలో నీటి నిల్వలు తగ్గి గుండె, కిడ్నీల పనితీరుపై తీవ్ర ప్రభావం
- జాగ్రత్తలు పాటించాలని వైద్య నిపుణుల సూచనలు



సాక్షి, హైదరాబాద్: ఎండలు మండిపోతున్నాయి. 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదవుతుండటంతో జనం ఇంట్లోంచి బయటికి రావడానికి జంకుతున్నారు. ఇళ్లలో ఉన్నా వేడి తీవ్రతను తట్టుకోలేక అల్లాడుతున్నారు. సాధారణ వ్యక్తులకే ఇంత ఇబ్బంది ఉంటే.. మధుమేహ బాధితులకు మరిన్ని సమస్యలకు కారణమవుతుందని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వారికి సాధారణ ఆరోగ్య సమస్యలతోపాటు కిడ్నీ, గుండె సంబంధ వ్యాధుల ఇబ్బంది పెరుగుతుందని, జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. సాధారణంగానే మధుమేహం ఉన్నవారికి రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుందని.. వారికి వైరల్, ఇతర ఉష్ణమండల వ్యాధులు త్వరగా సంక్రమించే అవకాశం ఉంటుందని చెప్తున్నారు. సాధారణ వ్యక్తులతో పోలిస్తే మధుమేహులు డీహైడ్రేషన్‌కు ఎక్కువగా గురవుతారని అంటున్నారు.

ఎన్నో సమస్యలకు చాన్స్..

- వైద్య నిపుణులు చెప్తున్న మేరకు.. సాధారణ వ్యక్తులతో పోలిస్తే మధుమేహ బాధితులకు అధిక ఉష్ణోగ్రతల వల్ల అలసట ఎక్కువగా ఉంటుంది. శరీరంలో నీటి శాతం తగ్గి, మూత్ర విసర్జన తగ్గుతుంది. తల తిరగడం, తలనొప్పి, నోరు, కళ్లు పొడిబారడం వంటివి ఉంటాయి. గుండె కొట్టుకునే వేగం పెరుగుతుంది. ఇవన్నీ కిడ్నీలు, గుండె సమస్యలకు దారితీసే ప్రమాదం ఉంటుంది.
- డయాబెటిస్ బాధితులు కాస్త ఎక్కువగా, కనీసం రోజుకు 4 నుంచి ఐదు లీటర్ల నీటిని తీసుకోవాలి. కూల్‌డ్రింక్స్, రోడ్లపై దొరికే చల్లటి పానీయాలకు దూరంగా ఉండటం మంచిది.
- రక్తంలో చక్కెర స్థాయిలు పెరగకుండా ఉండేలా తృణధాన్యాలతో కూడిన ఆహారం తీసుకోవాలి. సాధారణ అన్నం, టిఫిన్లు, మైదాతో కూడిన తినుబండారాలను బాగా తగ్గించాలి. ఆకుకూరలు, కూరగాయలు తీసుకోవాలి.
- వదులుగా ఉన్న దుస్తులు ధరించాలి. ఎండ వేళల్లో బయటికి వెళ్లొద్దు.
- ఆల్కాహాలిక్ పానీయాలకు దూరంగా ఉండాలి. ఆల్కహాల్ వల్ల మూత్ర విసర్జన ఎక్కువవుతుంది. శరీరంలోని నీటి శాతం వేగంగా తగ్గి, డీహైడ్రేషన్‌కు, కిడ్నీల సమస్యకు దారితీస్తుంది.
- అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్న సమయంలో.. చురుకుగా ఉండటానికి తేలికపాటి వ్యాయామాలు తప్పనిసరి. చల్లని ప్రదేశాలలో, ఇంటి లోపల ఈ వ్యాయామాలు చేయాలి.

సీతమ్మకు అరుదైన చీర

- రంగులు మార్చే బంగారు చీర
- సిరిసిల్ల చేనేత శిల్పి నల్ల విజయ్ బహూకరణ



సిరిసిల్ల టౌన్: భద్రాద్రి సీతమ్మకు రంగులు మార్చే బంగారు చీరను సిరిసిల్ల చేనేత శిల్పి నల్ల విజయ్ బహూకరించారు. చేనేత మగ్గంపై ప్రత్యేక డిజైన్‌తో పద్దెనిమిది రోజులు కష్టపడి దీన్ని రూపొందించారు. ఐదున్నర మీటర్ల నలభై ఎనిమిది అంగుళాల పొడవు, 600 గ్రాముల బరువుతో విజయ్ తన నైపుణ్యాన్ని రంగరించి నేశారు. బంగారు, వెండి కలయికతో జరీ, రెడ్‌బ్లడ్ పట్టుపూలతో చీరను రూపొందించినట్టు వివరించారు. త్రీడీ డిజైన్‌లో మూడు రంగులు మారడం చీర ప్రత్యేకత అన్నారు. మంగళవారం భద్రాద్రి రామయ్యను దర్శించుకున్న సందర్భంగా ఆలయ ఈవో రమాదేవి చేతుల మీదుగా సీతమ్మకు చీర బహూకరించినట్లు నల్ల విజయ్ తెలిపారు.

ప్రధానోపాధ్యాయులకు టెట్ అక్కర్లేదు

స్పష్టం చేసిన ఎన్సీటీఈ.. ఎమ్మెల్సీ నర్సిరెడ్డికి ఉత్తర్వుల కాపీ అందజేత

సాక్షి, న్యూఢిల్లీ: ప్రాథమిక, ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి టెట్ ఉత్తీర్ణత నిబంధన వర్తించదని ఎన్సీటీఈ సభ్య కార్యదర్శి కెషాంగ్ వై శర్పా స్పష్టం చేశారు. ఢిల్లీలో శర్పా, ఎన్సీటీఈ అధికారులతో ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి, యూఎస్‌పీసీ, జాక్టో ప్రతినిధులు భేటీఅయ్యారు. రాష్ట్రంలో టెట్ వివాదం, పరీక్ష కరిక్యులమ్, సిలబస్ మార్పుపై చర్చించారు. ఈ సందర్భంగా పీఎస్, హైస్కూల్ ప్రధానోపాధ్యాయుల పదోన్నతికి టెట్ అక్కర్లేదని రాతపూర్వకంగా ఇచ్చిన వివరణ ఉత్తర్వుల కాపీని అందజేశారు. 2010 ఆగస్టు 23కి ముందే నియామకమైన ఉపాధ్యాయులు అదే లెవల్లో పదోన్నతి పొందటానికి టెట్ అవసరం లేదని యుఎస్‌పీసీ, జాక్టో నాయకులు ప్రస్తావించగా తెలంగాణ పాఠశాల విద్యాశాఖ ఆ విషయమై వివరణ అడగలేదన్నారు.

వడదెబ్బతో 16 మంది మృతి

- ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఆరుగురు..
- మృతుల్లో ఎంఈవో, ఒక ఉపాధ్యాయుడు
- ఇద్దరు మహిళలు, ఓ శతాధిక వృద్ధుడు



బత్తుల భూమయ్య (ఫైల్)



కొమురం సోము (ఫైల్)



లకావత్ రామన్న (ఫైల్)



వనమాల (ఫైల్)



మృతుడు నాగరాజు



శక్రునాయక్ (ఫైల్)

సాక్షి నెట్‌వర్క్: రాష్ట్రంలో తీవ్రంగా ఉన్న ఎండల కారణంగా వడదెబ్బ తగిలి శనివారం వివిధ ప్రాంతాల్లో 16 మంది మృతిచెందారు. జగిత్యాల జిల్లాలో ఎంఈవోగా పనిచేస్తున్న కరీంనగర్ జిల్లా చొప్పదండికి చెందిన బత్తుల భూమయ్య వడదెబ్బతో హఠాన్మరణానికి గురయ్యారు. ప్రస్తుతం ఆయన ఎన్నికల విజిలెన్స్ బృందంలో పనిచేస్తున్నారు. దీంతో ప్రతిరోజూ ఎండలోనే ఆయన పనిచేయాల్సి వస్తోంది. తీవ్రమైన ఎండవేడికి వడదెబ్బకు గురైన ఆయన చొప్పదండిలోని స్వగృహంలో వేకువజామున కుప్పకూలిపోయారు. అలాగే జగిత్యాల జిల్లా బీర్‌పూర్ మండలం మంగేళ శివారు గొండుగూడెంకు చెందిన కొమురం సోము (58) ఎండకు తాళలేక మృతిచెందారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మండలం భల్లునాయక్‌తండాకు చెందిన ఉపాధ్యాయుడు లకావత్ రామన్న (45) శుక్రవారం గజ్వేల్‌లో జరిగిన ఎన్నికల శిక్షణకు వెళ్లారు. అక్కడ అస్వస్థతకు గురికావడంతో ప్రథమ చికిత్స అనంతరం ఇంటికి తీసుకువచ్చారు. కాగా, రాత్రి ఆయన ఆరోగ్య క్షీణించడంతో వరంగల్ ఎంజీఎంకు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఉదయం మృతిచెందారు. నాగర్‌కర్నూల్ జిల్లా కొల్లాపూర్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్న నాగరాజు (56) మధ్యాహ్నం ఎండకు తాళలేక ఇంటి సమీపంలో కింద పడిపోయారు. ఆయనను 108 అంబులెన్స్‌లో ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. కొల్లాపూర్ మండలంలోనే ముక్కిడిగుండం గ్రామానికి చెందిన శక్రు నాయక్ (80) కొల్లాపూర్ వెళ్లి మధ్యాహ్నం తిరిగి గ్రామానికి చేరుకున్నారు. సాయంత్రం వాంతులు, విరేచనాలు కావడంతో ఆస్పత్రికి తరలించేలోపే మరణించినట్లు కుటుంబసభ్యులు తెలిపారు. మరో ఘటనలో మహబూబాబాద్ జిల్లా దంతాలపల్లి మండలం పెద్దముప్పారం గ్రామానికి చెందిన గొడిశాల దేవయ్య(70) ఎండ తీవ్రతకు మృతిచెందారు. సిద్దిపేట జిల్లా తొగుట మండలం వెంకట్రావుపేటలో వడ్డె యాదయ్య (72) పత్తికట్టె తొలగించే పనులు చేస్తుండగా సొమ్మసిల్లి మృతి చెందారు. అలాగే గజ్వేల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పక్కన స్పృహ తప్పి పడిపోయిన వర్గల్ మండలం వేలూరుకు చెందిన దార నాగయ్య(45)ను పోలీసులు ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ మృతి చెందారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో..

ఉమ్మడి వరంగల్ జిల్లాలో వడదెబ్బ కారణంగా శనివారం ఆరుగురు మృతిచెందారు. వరంగల్ జిల్లా చెన్నారావుపేట మండలం అక్కల్‌చెడ గ్రామానికి చెందిన ఆకుల భాస్కర్ (25), హరియా తండాకు చెందిన శతాధిక వృద్ధుడు బాదావత్ నర్సింహ(100) ఎండ వేడికి తాళలేక చనిపోయారు. నర్సంపేట మండలం ఇప్పల్‌తండాకు చెందిన అజ్మీర మంగ్యా (45) అనే రైతు ఎండ తీవ్రతకు మృతిచెందారు. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం రంగాపూర్ గ్రామానికి చెందిన వంక లక్ష్మి(67) వడదెబ్బతో తనువు చాలించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం గాంధీనగర్‌కు చెందిన ఆవుల కనకయ్య(75) ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలం రేగులగూడేనికి చెందిన మేకల లస్మయ్య (56) అనే రైతు ప్రాణాలు కోల్పోయారు.




పనిచేస్తున్న చోటే వడదెబ్బ తగిలి మృతి చెందిన ఉపాధి కూలీ రాములు

పనిచేస్తున్న చోటే..

కామారెడ్డి జిల్లా నాగిరెడ్డిపేట మండలం జప్తిజాన్కంపల్లి గ్రామంలో భూమిని రాములు (71) ఉపాధిహామీ పనుల్లో భాగంగా పలుగుతో మట్టిని తీస్తుండగా ఒక్కసారిగా కుప్పకూలిపోయారు. తోటి కూలీలు ఇచ్చిన సమాచారంతో అక్కడి చేరుకున్న వైద్యులు రాములును పరీక్షించి చనిపోయినట్లు నిర్ధారించారు. వారం రోజులుగా వరుసగా ఉపాధి పనులకు హాజరు కావడంతో రాములుకు వడదెబ్బ తగిలిందని కుటుంబ సభ్యులు తెలిపారు. కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ మండలం కందుగుల గ్రామానికి చెందిన మహిళా కూలీ బోల్లబోయిన వనమాల (45) ధాన్యం ఆరబెట్టేందుకు వెళ్లి వడదెబ్బతో మృతిచెందారు.

టుడేస్ గ్రాఫిక్



- ఆయా సినిమాల వసూళ్లను ప్రస్తుత ధరలకు అనుగుణంగా సవరించలేదు.



డాక్టర్ రకస్.. గాయానికి ఒరాంగుటాన్ ట్రీట్‌మెంట్!

ఏదైనా దెబ్బ తగిలితే ఏం చేస్తాం? ఏ ఆయింట్‌మెంటో పెట్టుకుంటాం. గాయం తగ్గేదాకా జాగ్రత్తగా ఉంటాం. అదే గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లో అయితే.. గాయాలను తగ్గించగల ఆకు పసర్లు రాసుకుంటుంటారు. మరి ఏదైనా జంతువుకు గాయమైతే..? దానంతట అది తగ్గేదాకా తంటాలు పడుతూనే ఉంటుంది. లేదా ఆ గాయం తాలూకు నష్టం దాని జీవితాంతం ఉంటుంది. అయితే జంతువులు ఔషధ గుణాలున్న మొక్కలను తినడం, వాటి ఆకులను వినియోగించడం ద్వారా గాయాలను, రోగాలను తగ్గించుకుంటాయనే వాదన ఉన్నా.. పక్కా ఆధారం మాత్రం ఇప్పటిదాకా లేదు. కానీ తాజాగా శాస్త్రవేత్తలు ఓ ఒరాంగుటాన్ (చింపాంజీ, గొరిల్లాల జాతి జీవి).. ఇలా గాయాన్ని తగ్గించుకోవడాన్ని ఆధారాలతో సహా గుర్తించారు.

ప్రత్యేకంగా స్టడీ చేపట్టి..



జర్మనీ, ఇండోనేసియాలకు చెందిన కొందరు పరిశోధకులు ఇండోనేసియాలోని గునుంగ్ లాజర్ నేషనల్ పార్క్‌లో జీవశాస్త్ర ప్రయోగాలు చేస్తున్నారు. వారి పరిశోధనలో భాగంగా ఒక మగ ఒరాంగుటాన్ తీరు వారిని ఆకర్షించింది. దానికి 'రకస్'అని పేరుపెట్టారు. ఒకసారి దానికి కంటి దిగువ భాగంలో తీవ్రంగా గాయమైంది. దీనితో ఆ ఒరాంగుటాన్.. 'అకార్ కునింగ్'గా పిలిచే ఓ ఔషధ మొక్క ఆకులను తెచ్చుకుంది. వాటిని నోట్లో పెట్టుకుని నమిలింది. రసాన్ని, ఆకుల గుజ్జును తన చేత్తో తీసుకుని.. గాయంపై పెట్టుకుంది. ఇలా ఒకట్రెండు సార్లు చేసింది. కొన్నిరోజులకే ఆ గాయం తగ్గడం మొదలైంది. సుమారు నెలన్నర తర్వాత ఆ గాయం తగిలిన గుర్తులు కూడా సరిగా కనిపించనంతగా మారింది.

వేల ఏళ్లుగా వాడుతున్న ఔషధ మొక్క అది..

ఇండోనేసియాలోని స్థానికులు వేల ఏళ్లుగా వివిధ వ్యాధులు, ఆరోగ్య సమస్యల నివారణకు 'అకార్ కునింగ్'మొక్కను వాడుతున్నట్టు శాస్త్రవేత్తలు చెప్తున్నారు. ఆ మొక్క ఆకుల్లో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్ లక్షణాలు ఉన్నట్టు గతంలోనే తేలిందని అంటున్నారు. రకస్ ఒరాంగుటాన్ స్వయంగా.. ఆ మొక్కను గుర్తించి, ఆకులతో వైద్యం చేసుకోవడం గొప్ప విషయమని స్పష్టం చేస్తున్నారు. చాలా రకాల జీవులకు ప్రకృతిపై అవగాహన ఉంటుందని.. తమకు వచ్చిన ఆరోగ్య సమస్యను ఎలా తగ్గించుకుంటాయనే దానికి ఇది ఉదాహరణ అని పరిశోధనలో భాగం పంచుకున్న జర్మనీ శాస్త్రవేత్త ఇసబెల్లే లామర్ తెలిపారు. ఈ పరిశోధన వివరాలు తాజాగా సైంటిఫిక్ రిపోర్ట్స్ జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

- సాక్షి, సెంట్రల్ డెస్క్

మట్టిలో మహాలక్ష్మి!!

- మట్టికుప్పలో కూరుకుపోయిన నవజాత శిశువు
- రక్షించి, ఆస్పత్రికి తరలింపు.. హనుమకొండ జిల్లాలో ఘటన



దామెర: ఆడపిల్ల పుట్టిందని భావించారో...ఆర్థిక సమస్యో.. లేక అవాంఛిత గర్భం వల్ల జనిృంచిందో తెలియదుగానీ.. పుట్టగానే తల్లి పొత్తిళ్లలో ఉండాల్సిన ఓ నవజాత శిశువు బొడ్డుకు తాడుతో రోడ్డు పక్కన మట్టిలో కూరుకుపోయి కనిపించింది. స్థానికులు గమనించి పోలీసుల సాయంతో ఆస్పత్రికి తరలించడంతో ప్రస్తుతం చికిత్స పొందుతోంది. ఈ అమానవీయ ఘటన హనుమకొండ జిల్లా దామెర మండలంలోని ఊరుగొండ పొలిమేరలో శనివారం చోటుచేసుకుంది. ఊరుగొండ సమీపంలో జాతీయ రహదారి పక్కన ఉన్న నీటి తొట్టిలోంచి డ్రైవర్ రాందినయ్ ట్యాంకులోకి నీటిని ఎక్కిస్తున్నాడు. ఈ క్రమంలో అక్కడే మట్టి కుప్పలో నవజాత శిశువు కొంత మేరకు కూరుకుపోయి, చేతులు కాళ్లు ఆడిస్తూ కనిపించింది. దీంతో వెంటనే ఆయన కండువాను పరిచి శిశువును పడుకోబెట్టాడు. అక్కడే ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీలు అక్కడకు చేరుకొని శిశువుకు అంటిన మట్టిని తొలగించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో ఎస్సై కొంక అశోక్ వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని శిశువుకు అంటుకున్న మట్టిని పూర్తిగా తుడిచారు. తన వాహనంలోనే ఎస్ఎస్ఆర్ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అందించారు. అనంతరం అక్కడి నుంచి పరకాల రూరల్ సీఐ రంజిత్‌రావు, ఎస్సై అశోక్ శిశువును ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. శిశువు ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు తెలిసింది. శిశువును ఎవరు వదిలి వెళ్లారనే కోణంలో పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. సకాలంలో శిశువును ఆస్పత్రికి తరలించిన ఎస్సై అశోక్, డ్రైవర్ కుమారస్వామిని స్థానికులు అభినందించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.